

'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 208

శనివారం 19-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



స్కిల్స్ వర్సిటీకి రూ. 100 కోట్లు

అదానీ గ్రూప్ భారీ విరాళం.. సీఎం రేవంత్‌కు చెక్కు ఇచ్చిన అదానీ -5లో



చాంపియన్ అర్జున్

మాస్టర్స్ కప్ చెస్ టోర్నీలో టైటిల్ నెగ్గిన తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ -17లో



ఇజ్రాయెల్ వ్యూహం బ్యాక్‌ఫైర్!

పాలస్తీనా మిలిటెంట్ సంస్థ 'హమాస్' అధినేత యాహ్యా సిన్వర్ హత్య విషయంలో ఇజ్రాయెల్ వ్యూహం వికటిస్తోంది.

వివరాలు 6లో ▸



మియాపూర్‌లో చిరుత..

మియాపూర్ మెట్రో స్టేషన్ వెనుక వైపు ఫ్రేమ్ నిర్మాణం సమీపంలో చిరుత సంచారం కలకలం రేపింది.

వివరాలు 14లో ▸



మద్యం ధరలు పెంపు!

రాష్ట్రంలో మద్యం ధరలు పెరిగే అవకాశాలున్నాయి. క్వార్టర్‌పై రూ. 20, బీర్‌పై రూ.10 పెంచాలని ఎక్సైజ్‌శాఖ భావిస్తోంది.

వివరాలు 7లో ▸



9 వర్సిటీలకు వీసీలు

రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సుతో 9 వర్సిటీలకు ఉపకులపతులను నియమించినట్లు గవర్నర్ కార్యాలయం వెల్లడించింది.

వివరాలు 5లో ▸



ఇది మాఫియా సామ్రాజ్యం

దోచుకో.. పంచుకో.. తినుకో.. అనేది వీళ్ల విధానం.. ఏపీలో కూటమి ప్రభుత్వ పాలనపై వైఎస్ జగన్ కన్నెర్ర

- పూర్తిస్థాయి బడ్జెట్ కూడా ప్రవేశపెట్టలేని అసమర్థ సర్కారిది
- ఏపీలో ఐదు నెలలుగా డీబీటీ మచ్చుకైనా లేదు
- ఏ నియోజకవర్గంలో చూసినా.. ఇసుక, మద్యం నుంచి పేకాట క్లబ్‌ల వరకు మాఫియా రాజ్యమేలుతోంది
- ఎవరు ఏం చేయాలన్నా ముడుపులు ముట్టజెప్పాల్సిందే
- అందులో ఎమ్మెల్యే, సీఎం పంచుకుంటున్నారు
- తప్పుడు కేసులు బనాయించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.. ఎన్నికలప్పుడు నాసిరకం లిక్కర్.. ధరలు ఎక్కువ అంటూ బాబు దుష్ప్రచారం

14 లో

ఆర్నెల్లు ఏం చేశారు?

గ్రూప్-1 మెయిన్స్ వాయిదాకు హైకోర్టు ససేమిరా

- ప్రిలిమ్స్ రాసి ఫలితాలు వచ్చాక నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తారా?
- 90% మంది పరీక్షల హాల్ టికెట్లు కూడా డౌన్‌లోడ్ చేసుకున్నారు
- పరీక్షలకు అధికారులు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు
- ఇప్పుడు వాయిదా వేస్తే గ్రూప్-1 ప్రహసనంలా మారుతుంది
- వేలాదిమంది ఆశలపై నీళ్లు చల్లలేం.. మెయిన్స్ వాయిదా వేయలేం
- సింగిల్ జడ్జి తీర్పులో జోక్యం చేసుకోలేమన్న ధర్మాసనం
- అప్పీళ్లలో మెరిట్స్ లేనందున కొట్టివేస్తున్నట్లు స్పష్టీకరణ



గ్రూప్-1 వాయిదా, జీవో 29ను రద్దు చేయాలంటూ శుక్రవారం హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో అభ్యర్థుల ర్యాలీ

సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష వాయిదాకు హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం నిరాకరించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఇందులో జోక్యం చేసుకోవడానికి అప్పీళ్లలో ఎలాంటి మెరిట్స్ లేవని వ్యాఖ్యానించింది. అప్పిలెంట్ల (పిటిషన్ వేసిన అభ్యర్థులు) తీరును తప్పుబట్టింది. 'ఫిబ్రవరిలో రీ నోటిఫికేషన్ ఇస్తే ఆగస్టులో సవాల్ చేస్తారా? ప్రిలిమ్స్ కూడా రాసి, ఫలితాలు విడుదల చేసిన తర్వాత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తారా?' అని ప్రశ్నించింది. మెయిన్స్‌కు అర్హత సాధించిన 31,383 మందిలో 90 శాతం పరీక్షల హాల్ టికెట్లు కూడా డౌన్‌లోడ్ చేసుకున్నారు. వారి ఆశలపై నీళ్లు చల్లలేం. అధికారులు కూడా సెంటర్లలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మరో రెండురోజుల్లో పరీక్ష అనగా ఇప్పుడు వాయిదా వేయడం సరికాదు. సింగిల్ జడ్జి అన్ని అంశాలు పరిశీలించిన తర్వాతే తీర్పునిచ్చారు. ఈ అప్పీళ్లను కొట్టివేస్తున్నాం..' అని జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి ధర్మాసనం శుక్రవారం తీర్పునిచ్చింది.

సింగిల్ జడ్జి తీర్పుపై అప్పీళ్లు

గ్రూప్-1 ప్రిలిమినరీ 'కీ'లో తప్పులను, ఎస్టీ రిజర్వేషన్ల పెంపును, రీ నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దామోదర్‌రెడ్డితో పాటు మరో ఏడుగురు హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. టీఎస్‌పీఎస్సీ వాదనలతో ఏకీభవిస్తూ పిటిషన్లను కొట్టివేశారు. సాంకేతిక అంశాలను నిపుణుల కమిటీలకే వదిలేయాలని కోర్టుల జోక్యం కూడదని తీర్పునిచ్చారు. అయితే ఈ తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్లు రెండు అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి ధర్మాసనం విచారణ చేపట్టింది.

రీ నోటిఫికేషన్‌తో అర్హులు పెరిగారు..

పిటిషనర్ల తరఫు న్యాయవాదులు శివ, సుధీర్ వాదనలు వినిపిస్తూ.. 'రీ నోటిఫికేషన్ ఇచ్చేందుకు కమిషన్‌కు అధికారం లేదు. ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి. 2022లో ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేసి 2024లో మళ్లీ ఇవ్వడంతో రెండేళ్లలో అర్హులు పెరిగారు. దరఖాస్తుల గడువు ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచం అని చెప్పిన కమిషన్ రెండురోజులు పెంచింది. దీంతో దాదాపు 20 వేల

మిగతా 2వ పేజీలో ▶

రోడ్డెక్కిన గ్రూప్–1 అభ్యర్థులు

హైదరాబాద్‌లో భారీ ఆందోళన

ర్యాలీలను అడ్డుకొని లాఠీలు ఝుళిపించిన పోలీసులు 2 లో

వాయిదా వేసేలా చూడండి

- కిషన్‌రెడ్డికి అభ్యర్థుల వినతి
- అభ్యర్థులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర మంత్రి డిమాండ్

2 లో

జీవో 29ని రద్దు చేయండి

సుప్రీంకోర్టును ఆశ్రయించిన గ్రూప్–1 అభ్యర్థి.. సోమవారం విచారణకు వచ్చే అవకాశం 2 లో



మూసీపై రేవంత్‌వి పచ్చి అబద్ధాలు

మూసీ సుందరీకరణపై సీఎం రేవంత్, మంత్రి జూపల్లి వేర్వేరు సందర్భాల్లో చేసిన ప్రసంగాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో చూపుతున్న కేటీఆర్

రూ. 25 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టుకు రూ. లక్షన్నర కోట్లు ఎందుకు?

- గతంలోనే రూ.16 వేల కోట్లతో మూసీ పునరుజ్జీవ ప్రణాళికలు
- కేసులకు భయపడే దామగుండంలో రాడార్ స్టేషన్‌కు అనుమతి
- 'మూసీ'పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అంచనా వ్యయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గజినీలా మారి పచ్చి అబద్ధాలు చెబుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మూసీ సుందరీకరణ పేరిట రూ. లక్షన్నర కోట్ల ప్రజాధనం దోపిడీ ప్రయత్నాన్ని తెలంగాణ సమాజం అర్థం చేసుకోవడంతో తప్పులను కప్పిపుచ్చుకునేందుకు సీఎం తంటాలు పడుతున్నాడన్నారు. కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంలా మారిందని, రాహుల్‌గాంధీకి డబ్బు కావాల్సినప్పుడల్లా తెలంగాణ గుర్తుకు వస్తోందన్నారు. ప్రాజెక్టు అంచనాలను రెట్టింపు చేయడంలో దిట్ట అయినందునే నిషేధిత కంపెనీ మెయిన్‌హార్ట్‌కు మూసీ డిజైన్ బాధ్యతలు అప్పగించారని చెప్పారు. మూసీ

మిగతా 2వ పేజీలో ▶

చాలెంజ్ చేస్తున్నా.. వస్తా పద



సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌ను స్వీకరించిన హరీశ్‌రావు

- నేటి ఉదయం 9 గంటలకు స్వయంగా మీ ఇంటికి వస్తా
- మూసీ, ప్రాజెక్టుల నిర్వాసితుల వద్దకు వెళ్లి మాట్లాడదాం
- రూ. లక్షన్నర కోట్లతో సుందరీకరణ, పునరుజ్జీవం చేస్తామని ప్రజల మధ్య ప్రకటించి ఇప్పుడేమో ఎవరన్నారంటూ మాట మారుస్తున్నాడు
- పేదల ఇళ్ల కూల్చివేతలను ప్రశ్నిస్తే మల్లన్నసాగర్ నిర్వాసితుల గురించి మాట్లాడుతున్నాడు
- 2013 చట్టానికి మించిన ప్రయోజనాలు మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఇచ్చాం

2 లో

క్లుప్తంగా...

పదేళ్ల పాలన, పది నెలల పాలనకు మధ్య యుద్ధం

- బీజేపీలోకి వెళ్లాక ఈటల కలుషితమయ్యారు
- మూసీ పునరుజ్జీవంపై నియోజకవర్గాల వారీగా ఆత్మీయ సమావేశాలు: ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన, పది నెలల ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు మధ్య యుద్ధం జరుగుతోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మూసీ నదిని పునరుజ్జీవింపజేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తుంటే ప్రతిపక్షాలు చిల్లర మాటలు మాట్లాడుతున్నాయని మండిపడ్డారు. గాంధీభవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలసి మాట్లాడుతూ తెలంగాణను లూటీ చేసి సంపాదించిన సొమ్ముతో ఏదైనా చేయొచ్చని కేటీఆర్, హరీశ్‌రావులు భావిస్తున్నారని, కేవలం ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే లక్ష్యంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ ఒడ్డున నివసించే వారిని మురికికూపం నుంచి బయటకు తెచ్చి వారికో దారి చూపాలన్న రేవంత్ ప్రయత్నాలను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ బీజేపీలో చేరి కలుషితమై పోయారని, పేదల పక్షాన పోరాడే స్వభావం నుంచి దొరల బాట పట్టేంతవరకు ఆయన వెళ్లిపోయారని ఆరోపించారు. మూసీ ప్రక్షాళన అవసరం లేదనుకుంటే ఆ నీళ్లతో స్నానం చేయాలని, ఆ నీళ్ల వాసన రాకపోతే ప్రక్షాళన అవసరం లేదన్నారు. మూసీ పునరుజ్జీవంపై తమ అభిప్రాయం చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష పార్టీలను కోరారని, ఆ మేరకు వారు సూచనలేంటో చెప్పాలని కోరారు. మూసీ పునరుజ్జీవంపై తన పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో త్వరలోనే ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

23, 24 తేదీల్లో హైడ్రా, మూసీ ప్రాంతాల్లో బీజేపీ నేతల పర్యటన

సాక్షి, హైదరాబాద్: హైడ్రా పేరిట కూల్చివేతలు, మూసీ ప్రక్షాళన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న విధ్వంసాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 23, 24 తేదీల్లో వివిధ ప్రాంతాల్లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పర్యటించి క్షేత్ర స్థాయి పరిశీలన నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీర్మానించింది. దీనికి కొనసాగింపుగా 25న పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. శుక్రవారం రాత్రి బీజేపీ కార్యాలయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో.. జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి సునీల్ బన్సల్, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎం.రఘునందన్‌రావు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, పైడి రాకేశ్‌రెడ్డి, ధనపాల్ సూర్యనారాయణ గుప్తా, పాల్వాయి హరీశ్‌బాబు, రామారావు పటేల్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు ధర్నాలకు వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ పిలుపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై దాడులు పెరిగిపోతున్నాయని.. వాటిని అదుపు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతోందని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ), బజరంగ్‌దళ్ విమర్శించాయి. దేవాలయాలకు రక్షణ కల్పించాలని.. హిందువుల మనోభావాలను గౌరవించాలని.. విగ్రహాలను ధ్వంసం చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం రాష్ట్రవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ అధ్యక్షుడు నరసింహమూర్తి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ధర్నా అనంతరం రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాలపై జరుగుతున్న దాడుల వివరాలను జిల్లా కలెక్టర్లకు అందజేస్తామన్నారు. భాగ్యనగరంలో వరుసగా హిందూ దేవాలయాలపై, దేవతామూర్తులపై దాడులు జరుగుతున్నా ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.



అలా 'బుర్ర' లేకుండా ఎలా మాట్లాడవయ్యా!!

చాలెంజ్ చేస్తున్నా.. వస్తా పద

సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌ను స్వీకరించిన హరీశ్‌రావు

- నేటి ఉదయం 9 గంటలకు స్వయంగా మీ ఇంటికి వస్తా
- మూసీ, ప్రాజెక్టుల నిర్వాసితుల వద్దకు వెళ్లేందుకు సిద్ధం
- ఫోర్త్ సిటీ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం



శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో బీఆర్ఎస్ నేతలు వేముల ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్

సాక్షి, హైదరాబాద్: 'రేవంత్.. నేను చాలెంజ్ చేస్తున్నా. సెక్యూరిటీ లేకుండా వస్తా అన్నావు కదా. పోదాం పదా..డేట్, టైమ్ మీరే చెప్పండి. నేను కారు డ్రైవ్ చేస్తా. మీరు నేను పోదాం. లేదంటే నేను రేపు 9 గంటలకు మీ ఇంటికి వస్తా. ముందు మూసీ బాధితులను కలిసిన తర్వాత మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్ కట్ట మీదకు వెళ్లి నిర్వాసితులతో మాట్లాడుదాం. సిగ్గు లేకుండా మాట్లాడుతున్నావు. 2013 చట్టానికి మించిన ప్రయోజనాలు మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఇచ్చాం 'అంటూ సీఎం రేవంత్‌రెడ్డి గురువారం చేసిన సవాల్‌పై మాజీమంత్రి టి.హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. 'మూసీ ఫ్రంట్ పేరిట రూ.లక్షన్నర కోట్లతో సుందరీకరణ, పునరుజ్జీవం చేస్తామని ప్రజల మధ్య ప్రకటించిన సీఎం రేవంత్ అలా ఎవరు అన్నారంటూ మాట మారుస్తున్నాడు. మెగాస్టార్లు సూపర్‌స్టార్లను మించి నటిస్తున్నాడు. శత్రుదేశాల మీద దాడి చేసినట్టుగా పేదల ఇళ్లపై జరుగుతున్న కూల్చివేతలను ప్రశ్నిస్తే మల్లన్నసాగర్ నిర్వాసితుల గురించి మాట్లాడుతున్నాడు' అని చెప్పారు. తెలంగాణభవన్‌లో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, నాయకులు పి.కార్తీక్‌రెడ్డి, దేవీప్రసాద్‌తో కలిసి హరీశ్‌రావు శుక్రవారం మీడియాతో మాట్లాడారు.

సీఎం పదవిని దిగజార్చేలా..

'ఎన్నికల హామీలను విస్మరించి సీఎం పదవి స్థాయిని దిగజార్చేలా రేవంత్ మాట్లాడుతున్నారు. హైదరాబాద్‌తోపాటు అనేక నగరాల మీదుగా అనేక నదులు ప్రవహిస్తున్నాయనే జ్ఞానం లేదు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు 4వేల ఇళ్లు ఇవ్వడంతోపాటు 2013 భూసేకరణ చట్టంలో పేర్కొన్న పరిహారం కంటే ఎక్కువే ఇచ్చాం. (పునరావాస కాలనీ ఫొటో చూపిస్తూ).. మూసీ తలంలో ఉన్న ఇళ్లు కూల్చి బాధితులకు పరిహారం ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోంది. డీపీఆర్, పర్యావరణ అనుమతులు లేకుండానే ప్రాజెక్టు పేరిట ఇల్లు కూల్చే అధికారం లేదు. నదితలంలో ఉన్న నిర్వాసితులకు కూడా 2013 భూ సేకరణ చట్టాన్ని వర్తింపచేయాలి.

ఏఐ టెక్నాలజీ వీడియోలతో స్టంట్లు

మూసీ రివర్‌ఫ్రంట్ పేరిట ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీతో తయారు చేసిన వీడియోలు చూపుతూ రేవంత్ స్టంట్లు చేస్తున్నాడు. బీఆర్ఎస్ పాలనలో 31 ఎస్టీపీలతో మూసీ పునరుజ్జీవంకు ప్రయత్నాలు చేశాం. కొండపోచమ్మ సాగర్ నుంచి గోదావరి జలాలను మూసీకి తరలించేలా వ్యాప్కోస్ సంస్థ డీపీఆర్ కూడా ఇచ్చింది. కానీ మల్లన్నసాగర్‌కు ప్లాన్ మార్చి కాంట్రాక్టర్లకు రూ.4వేలు లాభం చేసేలా రేవంత్ కుట్ర పన్నాడు. ఫార్మాసిటీ కోసం సేకరించిన 13 వేల ఎకరాల భూమిలో ఫోర్త్‌సిటీ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని అనుకుంటున్నాడు. ఫార్మాసిటీతో కాలుష్యాన్ని తగ్గించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచడంతోపాటు మూసీ పునరుజ్జీవం కూడా సాధ్యమవుతుంది. సబర్మతి నది తరహాలో గైడ్‌వాల్ నిర్మించి వరదలు నివారించొచ్చు.

అఖిలపక్ష భేటీకి పిలవలేదు

'నేను ఉద్యమకారుడిని, ప్రజల కోసం పోరాడేవాడిని. పది వేల కుటుంబాల్లో సంతోషం చూసేందుకు మూసీలో ఉండడానికి నేను సిద్ధం. 15 రోజుల క్రితమే మూసీ ప్రక్షాళనపై అఖిలపక్ష సమావేశం పెట్టాలని డిమాండ్ చేసినా స్పందన లేదు. నాకు ఎమ్మెల్యే పదవి లేకుండానే నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి పదవి ఇచ్చిందని రేవంత్ చేసిన ఆరోపణ అర్థరహితం. నేను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు నా శిష్యుడిగా కారు ముందు డ్యాన్స్ చేసిండు. మంత్రి పదవికి రాజీనామా చేసి గన్‌పార్కు వద్ద మీడియాతో మాట్లాడుతున్నప్పుడు నా వెనక ఉండి నక్కి చూసిండు' అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.

రోడ్డెక్కిన గ్రూప్-1 అభ్యర్థులు

హైదరాబాద్ నగరంలో పెద్దఎత్తున ఆందోళన



అశోక్‌నగర్‌లో గ్రూప్-1 అభ్యర్థులపై లాఠీచార్జ్ చేస్తున్న పోలీసులు

చిక్కడపల్లి (హైదరాబాద్)/కరీంనగర్ టౌన్: మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాలని, జీఓ నంబర్ 29 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రూప్-1 అభ్యర్థులు శుక్రవారం మరోసారి నిరసనలకు దిగారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో ర్యాలీలు నిర్వహిస్తూ రావడంతో నగరంలోని అశోక్‌నగర్, గాంధీనగర్, ఆంధ్రా కేఫ్, జవహర్‌నగర్‌లలో రోడ్లు కిక్కిరిసిపోయాయి. భారీగా మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. అయితే అభ్యర్థులను అదుపు చేయడం వారికి కష్టతరంగా మారింది. చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు సీతయ్య, రాంబాబు, ఎస్‌ఐలు, సిబ్బంది లాఠీలకు పనిచెప్పారు. దీంతో విద్యార్థులు వీధుల్లోకి పరుగెత్తారు. పోలీసులు వారిని తరుముతూ వెళ్లి చెదరగొట్టారు. ఈ క్రమంలో కొందరికి గాయాలయ్యాయి. కొందరు అభ్యర్థులు సమీపంలోని దుకాణాలు, బేకరీల్లోకి, చాయ్ దుకాణాల్లోకి వెళ్లగా, పోలీసులు వాటిల్లోకి సైతం వెళ్లి బయటకు లాక్కొచ్చి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. పరుగెత్తకుండా మొండికేసి బైఠాయించిన వారిని కూడా పోలీసులు అరెస్టు చేసి బేగంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. లాఠీచార్జిపై గాంధీనగర్‌లోని ఎస్‌బీఐ బ్యాంకు, ఆంధ్రాకేఫ్ సమీపంలో, ఆర్టీసీక్రాస్‌రోడ్డు, ఇందిరాపార్కు, రోడ్డులో నిరుద్యోగ అభ్యర్థులు నిరసనకు దిగగా.. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ ఇతర నేతలు మద్దతు పలికారు. అయితే పోలీసులు వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు.

న్యాయం జరిగేవరకు పోరాడతా: బండి సంజయ్

గ్రూప్-1 పరీక్షల రీ షెడ్యూల్‌కు పట్టుపడుతున్న అభ్యర్థులకు కేంద్రమంత్రి బండిసంజయ్ మద్దతు ప్రకటించారు. శుక్రవారం పలువురు గ్రూప్-1 అభ్యర్థులు కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో బండిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవో నంబర్ 29 ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగుల పాలిట శాపంగా మారిందని మండిపడ్డారు. తక్షణమే ఆ జీవోను ఉపసంహరించుకోవడంతో పాటు గ్రూప్-1 పరీక్షల్లో జరిగిన తప్పిదాలను సవరించాలని కోరారు. లేనిపక్షంలో నిరుద్యోగులకు న్యాయం జరిగేవరకు పోరాడతానని హెచ్చరించారు.

పరీక్ష రీషెడ్యూల్ చేయాలి: డా.కె.లక్ష్మణ్

రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళనను పరిగణనలోకి తీసుకుని జీవో నంబర్ 29ని రద్దు చేయడంతో పాటు గ్రూప్-1 పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరుద్యోగుల పక్షాన బీజేపీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని ఒక ప్రకటనలో హెచ్చరించారు.

వాయిదా వేసేలా చూడండి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి అభ్యర్థుల వినతి



గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను వాయిదా వేసేలా, జీవో నంబర్ 29ను రద్దు చేసేలా చూడాలని పలువురు అభ్యర్థులు శుక్రవారం గాంధీనగర్‌లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి మొరపెట్టుకున్నారు. తమకు న్యాయంచేయా లని విజ్ఞప్తి చేశారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 ప్రశ్నపత్రాల లీకేజీల కారణంగా అభ్యర్థులకు అన్యాయం జరిగిందని విమర్శించారు. అభ్యర్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

లాఠీచార్జ్ దారుణం: కేటీఆర్

గ్రూప్- 1 అభ్యర్థులపై పోలీసుల లాఠీచార్జ్ దారుణమని, అరెస్ట్ చేసిన విద్యార్థులు, గ్రూప్ -1 అభ్యర్థులను వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే నిరుద్యోగులపై పోలీసులు జులుం చేశారని శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అశోక్‌నగర్‌కు వచ్చి అడ్డగోలు హామీలు ఇచ్చిన రాహుల్‌గాంధీ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పత్తా లేకుండా పోవడం దుర్మార్గమన్నారు.

ఆర్నెల్లు ఏం చేశారు?

▶ మొదటి పేజీ తరువాయి

దరఖాస్తులు పెరిగాయి. ఎస్టీ రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచారు. తొలి నోటిఫికేషన్ నాటికి ఈ రిజర్వేషన్లు 6 శాతమే. ఇది ఎస్టీలకు లబ్ధి చేకూర్చినా.. మిగతావారు పోస్టులు కోల్పోయే అవకాశం ఉంది. అప్పిలెంట్లు ప్రిలిమ్స్ ప్రాథమిక 'కీ' లోని 15 ప్రశ్నలపై అభ్యంతరాలు తెలిపారు. అయినా వాటిని నిపుణుల కమిటీ పరిగణనలోకి తీసుకోలేదు. 6 ప్రశ్నలు (41, 66, 79, 112, 114, 119) పూర్తిగా తప్పుల తడకగా ఉన్నాయి. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని మెయిన్స్ వాయిదా వేయాలి. స్వతంత్ర నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి 'కీ' రూపొందించాలి..' అని కోరారు.

ఇలానే ప్రశ్నలు అడగాలని టీజీపీఎస్సీని కోరలేరు..

టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది వాదిస్తూ.. 'పిటిషనర్లు 8 మందిలో ఇద్దరు మెయిన్స్‌కు అర్హత సాధించారు. అయితే 'కీ'పై ఒక్కరు మాత్రమే అభ్యంతరం తెలిపారు. అతను కూడా సరైన సమాధానమే ఇచ్చారు. ప్రశ్నలు ఎలా అడగాలి అనేది నియామక సంస్థ పరిధిలోని అంశం. రాజ్యాంగబద్ధమైన సంస్థను ఇలానే ప్రశ్నలు అడగాలని ఎవరూ కోరలేరు. 'కీ' ఇలానే ఉండాలని కూడా నిర్ణయించలేరు. 6,175 అభ్యంతరాలను స్వీకరించాం. ఉన్నత స్థాయి నిపుణుల కమిటీ నిర్ణయం మేరకే 2 ప్రశ్నలు తొలగించాం. మెయిన్స్‌కు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. 90 శాతం మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. సాంకేతిక కారణాలతో దరఖాస్తులకు 2 రోజులు సమయం ఇచ్చాం. అప్పీళ్లలో మెరిట్ లేదు కొట్టివేయాలి..' అని విజ్ఞప్తి చేశారు. ఇరుపక్షాల వాదనల అనంతరం ధర్మాసనం తీర్పు వెలువరించింది.

ఏ ప్రశ్న సరైందో న్యాయస్థానాలు తేల్చలేవు

'8 మంది అప్పిలెంట్లలో ఇద్దరు మాత్రమే 'కీ'పై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. 15 ప్రశ్నలకు అభ్యంతరాలు తెలుపగా, నిపుణుల కమిటీ వాటిని పరిశీలించింది. ఇలా 6,147 అభ్యంతరాలను పరిశీలించిన తర్వాతే తుది 'కీ' విడుదల చేసింది. ఏ ప్రశ్న సరైంది.. ఏది కాదో.. న్యాయస్థానాలు తేల్చలేవు. నిపుణుల కమిటీనే నిర్ణయం తీసుకోవాలి. నోటిఫికేషన్‌లోనే ప్రిలిమ్స్, మెయిన్స్‌పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) చెప్పింది. అక్టోబర్‌లో మెయిన్స్ అని తెలిసినా పిటిషనర్‌లు ఆలస్యంగా కోర్టును ఆశ్రయించారు. రెండేళ్లలో రెండుసార్లు ప్రిలిమ్స్ రద్దయ్యింది. ఇటీవల జరిగింది మూడోది. ఇప్పుడు మెయిన్స్ కూడా వాయిదా వేస్తే అభ్యర్థుల్లో నైరాశ్యం నెలకొంటుంది. గ్రూప్-1 ఒక ప్రహసనంలా మారుతుంది..' అని ధర్మాసనం తన తీర్పులో స్పష్టం చేసింది.


నిరుద్యోగుల్లో నైరాశ్యం ఏర్పడుతోంది

మానవ తప్పిదం కారణంగా కొన్ని పొరపాట్లు జరిగి ఉండవచ్చు. తొలిసారి గ్రూప్-1 ప్రిలిమ్స్ 5 లక్షల మంది రాశారు. రెండుసార్లు రద్దు తర్వాత 3 లక్షలే రాశారు. అభ్యర్థుల్లో నిరాసక్తత పెరిగిపోతోంది. నిరుద్యోగుల్లో తీవ్ర నైరాశ్యం ఏర్పడుతోంది. కొందరు ఆత్మహత్యాయత్నాలకు కూడా పాల్పడుతున్నారు. ఇవన్నీ కూడా పరిగణనలోకి తీసుకోవాలి. లక్షల మంది మనోభావాలను అర్థం చేసుకోవాలి. ఆరుగురి కోసం వేలాది మందిని అసహనానికి గురిచేయడం సరికాదు. మెయిన్స్ వాయిదా వేయడం సాధ్యం కాదు. 2011లో మాదిరిగా ఆదేశాలిస్తే.. ఇక టీఎస్‌పీఎస్సీ ఈ గ్రూప్-1 పరీక్ష ఎప్పటికి పూర్తి చేస్తుందో తెలియదు. రీ నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తున్నప్పుడు ప్రిలిమ్స్ ఎలా రాశారు? పోస్టులను పెంచే, తగ్గించే అధికారం కమిషన్‌కు ఉంటుంది. రీ నోటిఫికేషన్‌తో వచ్చిన నష్టం ఏంటి? రద్దు చేసి అదేరోజు మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చారు కదా?

\- జస్టిస్ షావిలి

ఆలయ భూముల్లోని పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు

మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: కబ్జాల్లో ఉన్న దేవాలయ భూములను స్వాధీనం చేసుకునే క్రమంలో ఆ భూముల ఆక్రమణలో ఉన్న పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఆలయాల భూములు స్వాధీనం చేసుకుని దేవుడి పేరుతో పాస్ పుస్తకాలు జారీ చేయనున్నట్టు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం ఆమె సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటికే 34,092 ఎకరాల ఆలయ భూముల జియోట్యాగింగ్ ప్రక్రియ పూర్తయిందని, రాష్ట్రవ్యాప్తంగా సర్వే చేసి ఆలయ భూముల హద్దులు నిర్ధారిస్తామని చెప్పారు. ప్రస్తుతం నాలుగు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా సర్వే నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

ఎకో-టెంపుల్ టూరిజం..

రాష్ట్రంలో విస్తారంగా ఉన్న అటవీ భూముల్లో సుందర ప్రాంతాలను గుర్తించి పర్యాటకులను ఆకట్టుకునేలా ఎకో టూరిజం ప్రాజెక్టును చేపడుతున్నట్టు మంత్రి సురేఖ తెలిపారు. అలాగే దీనిని ఇప్పుడు ఆధ్యాత్మికతకు జోడించి ఆయా ప్రాంతాల్లోని ఆలయాలను అద్భుత పర్యాటక కేంద్రాలుగా మార్చేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.

దేవాలయాల్లో ఫిర్యాదుల పుస్తకం..

రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ఫిర్యాదులు నమోదు చేసేందుకు పుస్తకాలను ఏర్పాటు చేస్తామని, వాటిల్లో నమోదయ్యే ఫిర్యాదుల ఆధారంగా పరిష్కార చర్యలు తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. వేములవాడ దేవాలయ గోపురానికి కూడా స్వర్ణ తాపడం చేయిస్తామని, ఇందుకు 65 కిలోల ఆలయ బంగారాన్ని వాడతామని ఆమె చెప్పారు. ఆలయంలోని వెండితో పల్లకీ చేయిస్తామన్నారు. అలాగే బాసర దేవాలయాన్ని రూ.110 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంతో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డోబ్రియాల్‌లు పాల్గొన్నారు.

మూసీపై రేవంత్‌వి పచ్చి అబద్ధాలు

▶ మొదటి పేజీ తరువాయి

మూసీ పునరుజ్జీవానికి తాము వ్యతిరేకం కాదని, వేలాది మందిని నిరాశ్రయులను చేయడానికి అంగీకరించబోమన్నారు. గరిష్టంగా రూ.25 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టుకు పేదల కడుపు కొట్టి వేల కోట్ల రూపాయలు దోచుకునేలా రూ.లక్షన్నర కోట్లు వెచ్చిస్తే తాము వ్యతిరేకిస్తామని చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ నేతల సమక్షంలో శుక్రవారం తెలంగాణభవన్ వేదికగా 'మూసీ ప్రాజెక్టు'పై గంటకు పైగా కేటీఆర్ పవర్ పాయింట్‌ప్రజెంటేషన్ ఇచ్చారు. పూర్తి వివరాలు కేటీఆర్ మాటల్లోనే...'మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుపైనా పునరుజ్జీవం, సుందరీకరణ, ప్రక్షాళన, నల్లగొండకు శుద్ధమైన నీరు అంటూ సీఎం రేవంత్ పూటకో మాట చెబుతున్నాడు. రెండు వేల కిలోమీటర్ల పొడవైన నమామి గంగే ప్రాజెక్టుకు రూ.40 వేల కోట్లు ఖర్చయింది. 56 కిలోమీటర్ల పొడవైన మూసీ ప్రాజెక్టుకు కిలోమీటరుకు రూ.2,700 కోట్లు ఖర్చు చేస్తామని సీఎం చెబుతున్నాడు. ప్రపంచంలో ఇంతకంటే పెద్ద కుంభకోణం మరొకటి ఉండదు. తనపై ఉన్న కేసులకు భయపడి వికారాబాద్ అడవుల్లో నేవీ రాడార్ నిర్మాణానికి రేవంత్ అనుమతి ఇచ్చారు. గతంలో మోదీ ప్రభుత్వం మెడమీద కత్తి పెట్టినా పర్యావరణవేత్తల సూచనతో దామగుండం భూఅప్పగింత జీఓను అమలు చేయలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్ ద్వారా మూసీ ప్రక్షాళన, సుందరీకరణ, పునరుజ్జీవం కోసం రూ.16 వేల కోట్లతో పేదలను నిరాశ్రయులను చేయకుండా 9 ప్రపంచ స్థాయి కన్సల్టెంట్లతో ప్రణాళికలు సిద్ధం చేశాం. మేము చేసిన పనులు చూపేందుకు శనివారం సిటీ ఎమ్మెల్యేలతో కలిసి నాగోల్‌కు వెళతాం. 31 ఎస్టీపీలు పూర్తయితే నల్లగొండకు స్వచ్ఛమైన నీరు వెళ్తుందనే విషయాన్ని గావుకేకలు, పెడబొబ్బలు పెడుతున్న నల్లగొండ మంత్రులు తెలుసుకోవాలి.



గూగుల్ ఫొటోలతో ప్రజెంటేషన్

గూగుల్ నుంచి కాపీ కొట్టిన ఫొటోలతో రూ.లక్షన్నర కోట్ల ప్రాజెక్టు అంటూ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎన్నికల అఫిడవిట్‌లో రూ.30 కోట్లు ఆస్తులు చూపించిన రేవంత్ డిజైన్లు వద్దంటే కన్సల్టెంట్లకు రూ.140 కోట్లు ఆస్తులు అమ్మి ఇస్తా అంటున్నాడు. నోటికొచ్చింది వాగి దొరికిపోవడం సీఎంకు అలవాటు. మూసీ ఒడ్డున బహుళ అంతస్తుల భవనాలు వస్తే మళ్లీ ఫోర్త్ సిటీ ఎందుకు. రీజువెనేషన్ స్పెల్లింగ్‌ను చూడకుండా రాస్తే ఆయనకు రూ.50 లక్షలు పట్టే బ్యాగ్‌ను బహుమానంగా ఇస్తా. మాపై అనేక ఆరోపణలు చేసిన సీఎం ఎందుకు విచారణ జరిపించడం లేదు. మూసీ సహా అన్ని అంశాలపై అసెంబ్లీలో మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నా, మూక మాదిరిగా అధికార పక్షం మా గొంతు నొక్కుతోంది. ముఖ్యమంత్రి మానసిక పరిస్థితి మీద అనుమానం ఉంది. ఆయన్ను ఆవిధంగా వదిలిపెట్టవద్దని వారి కుటుంబ సభ్యులకు విజ్ఞప్తి'అని కేటీఆర్ తన ప్రజెంటేషన్ ముగించారు.

మూసీని రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం వాడుకోం

- బీఆర్ఎస్‌పై మంత్రి సీతక్క ధ్వజం
- మూసీ పునరావాస మహిళా సంఘాలకు రూ.3.44 కోట్ల రుణాలు పంపిణీ



స్వయం సహాయక సంఘాల మహిళల కుటుంబాల పిల్లలకు దుస్తులు అందిస్తున్న మంత్రి సీతక్క

లక్డీకాపూల్: బీఆర్ఎస్ ప్రభుత్వంలా మూసీనదిని రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం వాడుకోబోమని, దానిని పూర్తిస్థాయిలో పునరుజ్జీవింపజేస్తామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి పునరావాసం కల్పించి, వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుందని హామీనిచ్చారు. ప్రగతిభవన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మూసీ పరీవాహక ప్రాంతాల స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. 17 మూసీ పునరావాస మహిళా సంఘాలకు రూ.3.33 కోట్ల ఆర్థిక సహాయాన్ని మలక్‌పేట్, కార్వాన్ ఎమ్మెల్యేలు అహ్మద్ బిన్ బలాల, కౌసర్ మొహియుద్దీన్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డిలతో కలసి మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ...ఇటీవల ఖమ్మం, మహబూబాబాద్ వంటి ప్రాంతాలు వరదల వల్ల నష్టపోయాయని, మూసీ మురికి నీటి కారణంగా అనారోగ్య సమస్యలు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ నీటిని తాగే స్థాయికి తీసుకురావడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ ప్రక్షాళనలో జీహెచ్ఎంసీ పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజ్, మూసీ జేడీఎం గౌతమి, శ్రీనివాస్‌రెడ్డి, మూసీ ఈడీ, ఎస్సీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్య భట్టు తదితరులు పాల్గొన్నారు.

మూసీ నిర్వాసితులకు అన్యాయం చేయం

మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: మూసీ నది పక్కన జీవించే ఏ ఒక్క పేదవాడికీ అన్యాయం చేయమని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ భరోసా ఇచ్చారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందుకు గ్యారంటీ అని హామీయిచ్చారు. ప్రతిపక్షం మూసీ పునరుజ్జీవ అంశాన్ని రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. శుక్రవారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ, మూసీని కాపాడుకోవడం మనందరి బాధ్యతని అన్నారు. మూసీ నిర్వాసితులకు ఎలాంటి నష్టం జరగనివ్వబోమని స్పష్టం చేశారు. 2016లోనే అప్పటి ప్రభుత్వం మూసీ రివర్ డెవలప్‌మెంట్ బోర్డును తీసుకువచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. మూసీ నది హద్దులను కూడా గత ప్రభుత్వమే నిర్ణయించిందన్నారు. ఇవి గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్ శాఖ తీసుకున్న నిర్ణయాలేనని పేర్కొన్నారు. అప్పుడు నిర్ణయాలు తీసుకుని, ఇప్పుడు రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. కాగా, మల్లన్నసాగర్ భూ నిర్వాసితులకు అప్పటి ప్రభుత్వ పెద్దలు ఏం న్యాయం చేశారని మంత్రి ప్రశ్నించారు. అప్పటి ప్రభుత్వం తెచ్చిన భూసేకరణ చట్టాలను రెండింటినీ కోర్టు కొట్టివేసిందన్నారు. యూపీఏ సర్కార్ 2013లో సమగ్ర భూసేకరణ చట్టం తెస్తే అమలు చేయలేదని ధ్వజమెత్తారు. మూసీ విషయంలో ప్రతిపక్షాల మాటలను పూర్తిగా ఖండిస్తున్నామన్నారు.

జీవో 29ని రద్దు చేయండి

సుప్రీంను ఆశ్రయించిన గ్రూప్-1 అభ్యర్థి... సోమవారం విచారణకు వచ్చే అవకాశం

సాక్షి, న్యూఢిల్లీ: జీవో 29ని రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలయ్యింది. గ్రూప్-1 అభ్యర్థి రాంబాబు శుక్రవారం ఈ పిటిషన్ దాఖలు చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో55తో రిజర్వేషన్లు అమల్లోకొచ్చాయని, ప్రస్తుతం ఆ రిజర్వేషన్లను తుంగలో తొక్కేందుకే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జీవో 29ను తెచ్చిందని ఆయన పేర్కొన్నారు. కాగా ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారణ జరపాలంటూ చీఫ్ జస్టిస్ కోర్టులో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌తో పాటు మరో న్యాయవాది మోహిత్‌రావు స్పెషల్ మెన్షన్ చేశారు. దీంతో సోమవారం మొదటి కేసుగా ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టే అవకాశం ఉంది. మరోవైపు తెలంగాణ భవన్‌లో గ్రూప్-1 అభ్యర్థులు కూరపాటి శ్రీనివాస్, ఇందిరా నాయక్, అర్జున్, రామ్‌లు మీడియాతో మాట్లాడారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు నష్టం: గ్రూప్-1 అభ్యర్థులు

గ్రూప్-1 ఉద్యోగాల ప్రక్రియలో కీలకంగా మారిన జీవో 29 వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని గ్రూప్-1 అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 55 ప్రకారం అన్ని కేటగిరీల్లో రిజర్వేషన్లు పాటించి మెయిన్స్ పరీక్షలకు అభ్యర్థులను ఎంపిక చేశారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 29తో రిజర్వేషన్లకు ప్రాధాన్యం ఇవ్వకుండా టీఎస్‌పీఎస్సీ అభ్యర్థులను ఎంపిక చేసిందని విమర్శించారు. సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌లో ఈ అంశాలన్నీ చేర్చినట్లు తెలిపారు.

మరో తెలంగాణ ఉద్యమాన్ని చూస్తారు

సోమవారం నుంచి గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష జరగనున్నప్పటికీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం స్పందించి జీవో 29ను రద్దు చేయకపోతే రానున్న రోజుల్లో నిరుద్యోగులం అందరం కలిసి తెలంగాణ ఉద్యమం తరహా ఉద్యమాన్ని చేపడతామని, రేవంత్ సర్కార్‌కు గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

ఆ ఆరోపణలు అవాస్తవం

సాక్షి, హైదరాబాద్: ఈషా ఫౌండేషన్ సంస్థ పాఠశాల మాజీ ఉపాధ్యాయిని యామిని రాగాని, ఆమె భర్త సత్య ఎస్ రాగాని చేసిన ఆరోపణలను సంస్థ శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించింది. తాము అన్ని చట్టపరమైన నియమాలను పాటిస్తామని, పూర్తి నిజాయితీగా ఉంటామని స్పష్టం చేసింది. యామిని దంపతుల నిరాధారమైన ఆరోపణలను ఖండిస్తున్నట్టు పేర్కొంది. యామినిని వివిధ కారణాలతో ఇంతకుముందే పాఠశాల విధుల నుంచి తొలగించామని, ఈషా ఎల్లప్పుడూ పారదర్శకత, నిజాయితీలకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేసింది. పదేపదే నిరాధారమైన ఆరోపణలు చేసేవారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

క్లుప్తంగా...

తెలంగాణలో ఐఐఎం ఏర్పాటు చేయండి

- కేంద్ర విద్యాశాఖ మంత్రికి ఎంపీ రవిచంద్ర వినతి



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో శుక్రవారం భేటీ అయిన సందర్భంగా ఈ విజ్ఞప్తి చేశారు. జిల్లాకొక నవోదయ పాఠశాలను నెలకొల్పడంలో భాగంగా.. తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన 23 జిల్లాలలో నవోదయ పాఠశాలలను ప్రారంభించాలని కోరారు. తాను చేసిన విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి ప్రధాన్ సానుకూలంగా స్పందించారని ఎంపీ వద్దిరాజు తెలిపారు.

విద్యా కమిషన్‌కు ముగ్గురు సభ్యుల నియామకం

సాక్షి, హైదరాబాద్: కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర విద్యా కమిషన్‌కు ముగ్గురు సభ్యులను ప్రభుత్వం నియమించింది. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ విద్యార్థి నేత చరగొండ వెంకటేశ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసి, ప్రస్తుతం క్రియాశీల రాజకీయాల్లో ఉన్న కె.జ్యోత్స్న శివారెడ్డిని సభ్యులుగా నియమించారు.

28 నుంచి బీసీ కమిషన్ జిల్లాల పర్యటన

- ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్లలో ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల పెంపు అంశంపై రాష్ట్ర బీసీ కమిషన్ క్షేత్రస్థాయి పర్యటనలకు ఉపక్రమించింది. ఈనెల 28వ తేదీ నుంచి జిల్లాల వారీగా పర్యటనలు చేపట్టనుంది. ఉమ్మడి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ల ప్రాంగణంలో బహిరంగ విచారణ చేపట్టనున్నట్లు కమిషన్ వెల్లడించింది. ఈ నెల 28న ఆదిలాబాద్, 29న నిజామాబాద్, 30న సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, నవంబర్ 1న కరీంనగర్, 2న వరంగల్, 4న నల్లగొండ, 5న ఖమ్మం, 7న రంగారెడ్డి, 8న మహబూబ్‌నగర్, 11న హైదరాబాద్ జిల్లాల్లోని సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల సముదాయంలో బహిరంగ విచారణలను నిర్వహించనుంది. నవంబర్ 12న ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో ప్రత్యేకంగా స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాలు, సంక్షేమ సంఘాల కోసం బహిరంగ విచారణ చేపట్టనుంది. ఆ తర్వాత సాధారణ ప్రజల నుంచి వినతులు, విజ్ఞాపనలు స్వీకరించేందుకు నవంబర్ 13న కమిషన్ కార్యాలయంలో బహిరంగ విచారణలను నిర్వహించనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. బహిరంగ విచారణ షెడ్యూల్, ధ్రువ పత్రం, ఇతర సమాచారం కమిషన్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచినట్లు వివరించింది.

టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనం

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా సంస్థాగత నిర్మాణం కోసం ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్(ఐఎఫ్‌టీయూ)ను ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ)లో విలీనం చేయాలని తెలంగాణ రాష్ట్ర కమిటీ, ఏపీ ప్రతినిధులు తీర్మానించారని ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి కె.సూర్యం తెలిపారు. విలీనం తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లపై పోరాటం చేస్తామన్నారు. అదే విధంగా సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనాల జీవో సవరణ కోసం దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని తెలిపారు. కార్మికుల భద్రత కోసం తెచ్చిన బీమా చట్టం ఎలాంటి బీమా ఇవ్వడంలేదని ఆయన ఆరోపించారు.

ఉదయమే 'కసరత్తు'... రాత్రి వరకు విధ్వంస తర్ఫీదు

పీఎఫ్ఐలో ప్రత్యేక టైమ్‌టేబుల్
- ఏ గంటలో ఏం చేయాలో కరికులమ్
- ప్రాణాయామంతో మొదలు పంచ్‌లు, కిక్‌లు
- కత్తులతో పొడవడం..కర్రలతో కొట్టడానికి ప్రత్యేక శిక్షణ
- ఎన్ఐఏ దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి



సాక్షి, హైదరాబాద్: విధ్వంసం ఎలా సృష్టించాలి..ఎదుటివారి మక్కెలెలా విరగ్గొట్టాలి. వారు దాడిచేస్తే ఎలా తప్పించుకోవాలి. ఇలా ప్రతిదానికి పీఎఫ్ఐ (పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా) శిక్షణలో ఓ ప్రత్యేక ప్రణాళిక ఉంది. ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు మొదలయ్యే ఈ శిక్షణలో ప్రతి అర్ధగంటకు ఏఏ పనులు చేయాలి. ఏ విషయాల్లో శిక్షణ ఇవ్వాలన్న టైమ్‌టేబుల్ సైతం పీఎఫ్ఐ నాయకులు తయారు చేసినట్టు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) వెల్లడించింది. తెలంగాణలో తొలిసారి వెలుగుచూసిన పీఎఫ్ఐ మూలాలు కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, రాజస్తాన్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమబెంగాల్, అస్సాం, జమ్మూ, కశ్మీర్, మణిపూర్‌తోపాటు సింగపూర్, కువైట్, కతార్, ఓమన్, సౌదీఅరేబియా, యూఏఈ వంటి దేశాల్లోనూ విస్తరించినట్టు ఎన్ఐఏ అధికారులు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా ఎన్ఐఏ అధికారులు పీఎఫ్ఐ శిక్షణకు టైం టేబుల్‌ను గుర్తించారు. అందులో పలు విస్తుపోయే అంశాలున్నాయి.

ప్రాణాయామంతో మొదలు

పీఎఫ్ఐలోకి కొత్తగా వచ్చే ఓ వర్గం యువతను విధ్వంసకర శక్తులుగా మార్చేందుకు నిర్వాహకులు ఒక రోజులోని సమయాన్ని మొత్తం ఆరు సబ్జెక్టులు విడగొట్టి టైమ్‌టేబుల్ రూపొందించారు. ఉదయాన్నే మొదట ప్రాణాయామం చేయిస్తారు. ఆ తర్వాత ఉదయం 11 నుంచి శారీరక దృఢత్వాన్ని పెంచేలా వ్యాయామం ఉంటుంది. మధ్యాహ్నం 4 గంటల నుంచి రాత్రి వరకు ప్రతి గంటకు, అర గంటకు ఒకటి చొప్పున విధ్వంసకరమైన దాడులపై శిక్షణ కొనసాగుతుంది. ఇందులో చేతిలో ఏ ఆయుధం లేకుండానే ఎదుటి వ్యక్తిని పిడిగుద్దులు, తన్నులతో, తలపై కొట్టి రక్తస్రావం వచ్చిపడేలా చేయడంపై శిక్షణ ఇస్తున్నారు. చిన్నకత్తితో ఎదుటి వ్యక్తి పొట్టలో, తొడలపై పొడవడం ఇలా చేసి కదలకుండా చేయడంపై శిక్షణ ఇస్తున్నారు. కర్రతో మోకాళ్లపై దాడి చేయడం.. మొహంపై కొట్టడం, మెడ పట్టుకొని కిందపడేసి కర్రతో విచక్షణారహితంగా కొట్టడం, పక్కటెముకలపై తన్నడం, కర్రతో దాడి చేయడానికి తర్ఫీదు ఇస్తున్నారని ఎన్ఐఏ పేర్కొంది.

తొలి రోజు నుంచే విద్వేషం నూరిపోస్తారు

పీఎఫ్ఐలో కొత్తగా చేరిన వారికి మొదటి రోజు నుంచే నిత్యం భగవంతుడిని ప్రార్థన చేయడం అతి ముఖ్యమైన అంశంగా బోధిస్తున్నారు. ఇక్కడి నుంచే వారిలో మత ఛాందస వాదాన్ని నూరిపోస్తున్నారు. మధ్యాహ్నం 2 నుంచి 2.45 గంటల మధ్య మతపరంగా రెచ్చగొట్టే వీడియోలు చూపించడం, వాటితో ఉద్రేకపూర్వకంగా మార్చేలా ప్రసంగాలు ఇవ్వడం... ప్రతి రోజూ వార్తలు చదవడం, బృందంగా ఏర్పడి ఒక అంశంపై చర్చ, రైటింగ్ స్కిల్స్ సైతం నేర్పేందుకు ప్రత్యేక సమయం కేటాయించారని ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారు.

ముగిసిన సాహితీ ఎండీ కస్టడీ

కీలక అంశాలపై వివరాలు సేకరించిన ఈడీ అధికారులు!

సాక్షి, హైదరాబాద్: సాహితీ ఇన్‌ఫ్రా వెంచర్స్ ప్రీలాంచ్ స్కాంలో సంస్థ ఎండీ లక్ష్మీనారాయణ ఈడీ కస్టడీ శుక్రవారంతో ముగిసింది. కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు లక్ష్మీనారాయణను సోమవారం నుంచి కస్టడీకి తీసుకొని విచారిస్తున్న విషయం తెలిసిందే. రూ. 2 వేల కోట్ల కుంభకోణంలో కస్టమర్ల నుంచి సేకరించిన సొమ్మును ఏయే డొల్ల కంపెనీల్లోకి తరలించారు? ఆయా కంపెనీల్లో తెర వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు? వారి వాటాలు ఎంత? డొల్ల కంపెనీల్లోకి మళ్లించిన సొమ్ముతో మనీలాండరింగ్ ఎలా చేశారు? కుంభకోణంలో ఇతర పాత్రధారులు ఎవరు? అన్న కోణంలో లక్ష్మీనారాయణ నుంచి ఈడీ అధికారులు విచారణలో కీలక సమాచారం సేకరించినట్టు తెలిసింది. ఈ సందర్భంగా సాహితీ ఇన్‌ఫ్రాలో భాగస్వాములుగా ఉంటూ, కుంభకోణంలో కీలకంగా వ్యవహరించిన మరికొందరు డైరెక్టర్ల పాత్రకు సంబంధించిన ఆధారాలు లభించినట్టు తెలిసింది. సాహితీ ఇన్‌ఫ్రా కంపెనీలో లక్ష్మీనారాయణ సోదరుడు హరిబాబు, గోలమారి ఆంథోనిరెడ్డి, అతడి కుమారుడు అక్షయ్‌రెడ్డి, సతీశ్ చుక్కపల్లి, లక్ష్మీనారాయణ భార్య పార్వతి, లక్ష్మీనారాయణ కుమారుడు సాత్విక్, పూర్ణచందర్‌రావు సందులు డైరెక్టర్లుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. వీరందరి పాత్రపైనా ఈడీ లోతుగా దర్యాప్తు చేయనున్నట్టు సమాచారం. ఇందుకు అవసరమైన ప్రాథమిక సమాచారాన్ని లక్ష్మీనారాయణ నుంచి ఈడీ అధికారులు ఇప్పటికే సేకరించారని తెలిసింది. లక్ష్మీనారాయణ నాలుగు రోజుల కస్టడీలో తెరపైకి వచ్చిన విషయాలు, సోదాల్లో భాగంగా సేకరించిన డాక్యుమెంట్ల ఆధారంగా ఈడీ ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేపట్టనున్నట్లు సమాచారం.

సైబరాబాద్‌లో కొత్త జైలు?

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపే యోచనలో జైళ్ల శాఖ

సాక్షి, హైదరాబాద్: ఏటా పెరుగుతున్న కోర్టు కేసులతోపాటు పెరుగుతున్న ఖైదీల రద్దీని తట్టుకునేలా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో (ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో) కొత్తగా ఒక జిల్లా జైలు ఏర్పాటు చేయాలని జైళ్ల శాఖ అధికారులు యోచిస్తున్నారు. ఇందుకు సంబంధించి స్థలం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కేసులలో అరెస్టు అయిన అండర్ ట్రయల్ ఖైదీలను చంచల్‌గూడ సెంట్రల్ జైలుకే తరలిస్తున్నారు. దీంతో ఈ జైలులో సామర్థ్యానికి మించి ఖైదీలను ఉంచాల్సిన పరిస్థితి ఉంది. 1,250 మంది ఖైదీలను ఉంచాల్సిన చంచల్‌గూడ సెంట్రల్ జైలులో ఒక్కోసారి 2 వేలకు పైగా కూడా ఖైదీలను పెట్టాల్సి వస్తోంది. సుప్రీంకోర్టు సూచనల మేరకు జైళ్లపై భారం తగ్గించేందుకు కొత్త జిల్లా జైలు ఏర్పాటు అనివార్యం అన్న భావనలో జైళ్ల శాఖ అధికారులు ఉన్నారు. ఇప్పటికే సిద్దిపేటలో కూడా 34 ఎకరాల్లో రూ.78 కోట్లతో నూతన జిల్లా జైలు ఏర్పాటుకు చర్యలు ప్రారంభమయ్యాయి. గతేడాది జూన్‌లోనే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ నూతన జిల్లా జైలును మొత్తం 425 మంది ఖైదీలను ఉంచేలా నిర్మిస్తున్నారు. అదేవిధంగా వికారాబాద్‌లో నేషనల్ ప్రిజన్స్ అకాడమీ నిర్మాణం కోసం గతంలో జైళ్లశాఖకు కేటాయించిన 130 ఎకరాల స్థలాన్ని ఇచ్చారు. ఆ స్థలం అందుబాటులో ఉండడంతో అక్కడ సైతం మరో జైలు నిర్మించాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ప్రధాన జైళ్లపై భారం తగ్గించేందుకు నూతన జైళ్ల నిర్మాణం అనివార్యం అని అధికారులు భావిస్తున్నారు.

ఐటీ ఎగుమతులు, ఆర్థికవృద్ధిలో జీసీసీ కీలకం

- టీహబ్‌లో జరిగిన జీసీసీ ఇన్నోవేషన్ సమ్మిట్-2024లో మంత్రి శ్రీధర్‌బాబు



జీసీసీ ఇన్నోవేషన్ సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్‌బాబు, ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్/రాయదుర్గం: రాష్ట్ర ఐటీ ఎగుమతులు, ఆర్థికవృద్ధిని నడపడానికి మిడ్ మార్కెట్ గ్లోబల్ కేపబులిటీ సెంటర్(జీసీసీ) కీలకమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో జీసీసీ ఇన్నోవేషన్ సమ్మిట్-2024ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఏఐ, డేటా అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్‌లో హైదరాబాద్‌కు ఉన్న అసాధారణ ప్రతిభతోపాటు, సహాయక విధానాలు, బలమైన మౌలిక సదుపాయాలతో మేము ఈ కీలక ప్లేయర్స్‌ను ఆకర్షించడానికి ప్రాధాన్యతనిచ్చామన్నారు. టీహబ్ తాత్కాలిక సీఈఓ సుజిత్ జాగిర్దార్ మాట్లాడుతూ జీసీసీలకు తెలంగాణ కీలక కేంద్రంగా మారుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, తెలంగాణ రాష్ట్ర చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ శ్రీకాంత్‌లంక, ఏఎస్ఎస్ఆర్ సహ వ్యవస్థాపకుడు విక్రమ్ ఆహూజా ప్రసంగించారు. టీహబ్ ఐఈఈఈ -టోరంటో, బిజినెస్ డెవలప్‌మెంట్ సెంటర్- కెనడా, మెడ్‌ట్రానిక్‌తో సహా కీలకమైన ఎనిమిది వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలను చేసుకున్నట్లు ప్రకటించింది.

టీజీటీఎస్ వ్యాపార పరిధిని పెంచుకోవాలి

ప్రభుత్వ విభాగాలకు కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లను సరఫరా చేసే నోడల్ ఏజెన్సీ తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్(టీజీటీఎస్) తన పరిధిని మరింత పెంచుకోవాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. టీజీటీఎస్ పనితీరును సైఫాబాద్ హాకా భవన్‌లోని కార్యాలయంలో సమీక్షించారు. ప్రభుత్వ విభాగాలన్నీ సంస్థ ద్వారా కంప్యూటర్ సంబంధిత పరికరాలు, సాఫ్ట్‌వేర్‌ను సేకరించుకునేలా సమన్వయం చేసుకోవాలన్నారు. దీనిపై జయేశ్ రంజన్‌తో చర్చించాలన్నారు. ప్రస్తుతం 44 ప్రభుత్వ విభాగాలు, 140 విభాగాలకు టీజీటీఎస్ సేవలు అందిస్తోందని సంస్థ ఎండీ శంకరయ్య మంత్రికి వివరించారు. వీటిలో కొన్ని సొంతంగా కొనుగోళ్లు జరుపుతున్నాయన్నారు. దీనిపై స్పందించిన మంత్రి కొద్ది మొత్తంలో కొనుగోళ్ల కంటే భారీ ఆర్డర్ల ద్వారా రాయితీలు, తక్కువ ధరకే ఎలక్ట్రానిక్ పరికరాలు సేకరించవచ్చని ఆయా శాఖాధిపతులకు వివరించాలన్నారు.

కొడంగల్‌కు రూ.43.75 కోట్లు... ప్రణాళిక శాఖ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా) పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.43.75 కోట్లు కేటాయించారు. ఈ నిధులకు పరిపాలనాపరమైన ఆమోదంతో పాటు.. వికారాబాద్ జిల్లా కలెక్టర్‌కు నిధులను విడుదల చేస్తూ ప్రణాళిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

ఉద్యోగుల సమస్యలపై సీఎం స్పందించాలి

- వచ్చే మంత్రివర్గ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకోవాలి
- ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకుంటే క్షేత్రస్థాయిలో నిరసన కార్యక్రమాలు
- మీడియా సమావేశంలో టీజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించాలని తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటై పది నెలలు గడిచినా, ఉద్యోగుల సమస్యల పట్ల సర్కారు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండడం ఇదే మొదటిసారి అని, ఉద్యోగులు తీవ్ర నిరాశ, నిస్పృహల్లో ఉన్నారని వ్యాఖ్యానించారు. శుక్రవారం టీఎన్‌జీఓ కార్యాలయంలో టీజేఏసీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వానికి వినతులు సమర్పిస్తున్నా, స్పందన మాత్రం రావడం లేదన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని డీఏలు మంజూరు చేస్తుందని ప్రభుత్వ ఉద్యోగులంతా ఆశగా ఎదురుచూశారని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి తీపికబురు రాలేదని చెప్పారు. ఆర్థిక సంబంధిత అంశాలే కాకుండా ఎలాంటి ఖర్చు లేకుండా పరిష్కరించాల్సిన సమస్యలు కూడా ఉన్నాయని, కనీసం వాటి పట్ల అయినా సీఎం చొరవ తీసుకొని ఉంటే బాగుండేదన్నారు. ఉద్యోగుల సమస్యలు వినే తీరిక ప్రభుత్వానికి లేనట్టు కనిపిస్తోందని తెలిపారు. సీఎస్ శాంతికుమారిని కలిసేందుకు జేఏసీ తరఫున ప్రయత్నాలు చేసినా, ఆమె సమయం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఈ నెల 23న మంత్రివర్గ సమావేశమున్నట్టు వార్తలు వస్తున్నాయని, ఆ రోజు ఉద్యోగుల సమస్యల పట్ల నిర్ణయాన్ని ప్రకటించాలన్నారు. లేకుంటే దశల వారీగా ఉద్యమానికి సిద్ధమవుతామని, వారం రోజుల్లో జేఏసీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి అన్ని వర్గాల అభిప్రాయాలు స్వీకరించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు.

సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలన్నీ ఏకతాటిపైకి రావాలని సీఎం సూచించడంతో జేఏసీ ఏర్పాటు చేసి ఉద్యోగ సంఘాల తరఫున వినతులు ఇచ్చామన్నారు. ఉద్యోగ జేఏసీతో కనీసం ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదని, ఉద్యోగులతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలను సైతం ప్రభుత్వం నిర్వహించకపోవడం సరికాదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు ఇవ్వడం శుభపరిణామమే అయినా, సప్లిమెంటరీ, మెడికల్ తదితర బిల్లులన్నీ పెండింగ్‌లో నెలల తరబడి ఉంటున్నాయని, హెల్త్ కార్డుల అంశం తేలలేదన్నారు. ఇప్పుడు సంఘాల మాటలు కూడా ఉద్యోగులు వినే పరిస్థితి లేకుండా పోతోందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల సమస్యలపై జోక్యం చేసుకొని పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జేఏసీ నేత సదానంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సచివాలయంలో సీఎంఓ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రిని కలిసి ఉద్యోగుల సమస్యలపై తెలంగాణ ఉద్యోగుల జేఏసీ తరఫున వినతిపత్రాన్ని అందచేశారు.

ఎవడు జ్ఞానేంద్రియములతో మనస్సును నియమించి, కర్మేంద్రియములతో పని చేయుచున్నాడో వానిని కర్మయోగి అందురు. అట్టివాడు అందరికంటే ఉత్తముడు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 19 అక్టోబర్ 2024

పరువుచేటు పనులు!

అంతర్జాతీయంగా సంచలనం సృష్టించే హత్యలూ, హత్యాయత్నాలూ ఒక్కోసారి ఉలిక్కిపడేలా చేస్తాయి. వాటి వెనక ప్రభుత్వాల ప్రమేయం ఉన్నదన్న అనుమానాలు తలెత్తితే అవి మరింత ఆసక్తిని రేకెత్తిస్తాయి. చాలా సందర్భాల్లో అవి దేశాలమధ్య చిచ్చు రేపుతాయి. ఇలాంటి ఆపరేషన్లను గుట్టుచప్పుడు కాకుండా చేయడంలో ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్ ఆరితేరింది. చేతికి నెత్తురంటకుండా, సాక్ష్యాధారాలేమీ మిగలకుండా ప్రత్యర్థులను మట్టుబెట్టడంలో ఆ సంస్థ తర్వాతే ఎవరినైనా చెప్పుకోవాలి. అలాంటి ఉదంతంలో ఇప్పుడు మన దేశం పేరు వినబడటం ఆశ్చర్యకరమే. అమెరికాలో స్థిరపడిన ఖలిస్తాన్ వేర్పాటువాద నాయకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూపై హత్యాయత్నం కేసులో అమెరికాలో దాఖలైన తాజా నేరారోపణ పత్రం ప్రస్తుతం ప్రకంపనలు సృష్టిస్తోంది. నిజానికి ఏడాదికాలంగా ఆ పంచాయతీ నడుస్తోంది. నేరుగా భారత్‌ను నిందించక పోయినా నిరుడు మే నెలలో దాఖలు చేసిన నేరారోపణ పత్రం తమ గడ్డపై తమ పౌరుడిని హత్య చేసేందుకు జరిగిన ప్రయత్నం వెనక 'భారత ప్రభుత్వంలో పనిచేసే ఒక ఉద్యోగి ప్రమేయం ఉన్నద'ంటూ ఆరోపించింది. అప్పట్లో ఆ ఉద్యోగి పేరు వెల్లడించకుండా 'సీసీ 1'గా మాత్రమే ప్రస్తావించింది. కానీ శుక్రవారం అమెరికా న్యాయశాఖ అతని పేరు వికాస్ యాదవ్ అనీ, భారత గూఢచార సంస్థ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా)లో ఇంతక్రితం పనిచేశాడనీ వెల్లడించింది. వికాస్ యాదవ్ ప్రస్తుతం భారత ప్రభుత్వ ఉద్యోగి కాదని నేరారోపణ పత్రం చెప్పటం... భారత ప్రభుత్వం ఈ కేసులో తమకు సహకరిస్తున్నదని విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ అనటం ఉన్నంతలో ఊరట. తమ దేశంలో స్థిరపడిన ఖలిస్తాన్ వేర్పాటువాద నాయకుడు హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయం ఉన్నదని ఒకపక్క కెనడా ఆరోపిస్తున్న తరుణంలో అమెరికా సైతం ఇదే తరహా ఆరోపణ చేయటం గమనించదగ్గది. ఎన్నికల్లో సిక్కు ఓటు బ్యాంకును దృష్టిలో ఉంచుకుని కెనడా ప్రధాని ట్రూడో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కొట్టిపారేసిన మన దేశానికి తాజా పరిణామం ఇబ్బంది కలిగిస్తుందనటంలో సందేహం లేదు. ఎందుకంటే గురుపత్వంత్‌ను హతమార్చటానికి ఏమేం చేయాలో నిందితులు చర్చించుకున్న సందర్భంలోనే నిజ్జర్ హత్యను జయప్రదంగా పూర్తిచేయటం గురించిన ప్రస్తావన వచ్చింది.

ఇలాంటి వ్యవహారాలు చక్కబెట్టే వారికి వేయి కళ్లుండాలి. తాము ఎవరిని సంప్రదిస్తున్నామో క్షుణ్ణంగా తెలిసివుండాలి. కానీ ఆ సమయంలో రా సీనియర్ అధికారిగా ఉన్న వికాస్ యాదవ్ మాదకద్రవ్య ముఠాలతో సంబంధాలుండే నిఖిల్ గుప్తాకు గురుపత్వంత్‌ను అంతంచేసే బాధ్యత అప్పగించటం, గుప్తా దాన్ని కాస్తా కిరాయి హంతకుడనుకున్న మరో వ్యక్తికి ఇవ్వటంతో కథ అడ్డం తిరిగింది. నిఖిల్ గుప్తా చెక్ రిపబ్లిక్‌లో దొరికిపోవటం, అతన్ని ఆ దేశం అమెరికాకు అప్పగించటం పర్యవసానంగా మొత్తం పథకం బట్టబయలైంది. కిరాయి హంతకుడనుకున్న వ్యక్తి కాస్తా అమెరికా మాదకద్రవ్య నిరోధక విభాగం ఏజెంటు. ఆ సంగతి తెలియక హత్య కోసం అతనితో లక్ష డాలర్లకు కాంట్రాక్టు కుదుర్చుకోవటం, అందులో 15 వేల డాలర్లు చెల్లించటం నిఖిల్ గుప్తాతోపాటు వికాస్ మెడకు చుట్టుకుంది. అది మన దేశ ప్రతిష్ఠకు కూడా మచ్చ తెచ్చింది. వికాస్ సాధారణ అధికారి కాదు. రా సంస్థకు ముందు ఆయన సీఆర్‌పీఎఫ్‌లో పనిచేశాడు. వికాస్‌ను సర్వీసునుంచి తొలగించి అతనికోసం గాలిస్తున్నామని మన ప్రభుత్వం ఇచ్చిన వివరణకు అమెరికా సంతృప్తి చెందింది. 'రా'లో ఉన్నతాధికారులకు చెప్పకుండా వికాస్ యాదవ్ ఇలాంటి పెడధోరణులకు పాల్పడ్డాడని మన ప్రభుత్వం చెబుతోంది.

విదేశాల్లో గూఢచర్యం ఆషామాషీ కాదు. అలాంటి పనిలో నిమగ్నమైవుండేవారు ఉన్నతాధికారులకు తమ కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు వర్తమానం అందిస్తే వేరే విషయం. చెప్పినా చెప్పకున్నా అంతా సవ్యంగా జరిగితే రివార్డులు దక్కవచ్చేమో. కానీ వికటిస్తే ఆ అధికారితోపాటు దేశం పరువు కూడా పోతుంది. గురుపత్వంత్ ఖలిస్తాన్ వేర్పాటువాదే కావొచ్చు. ఆ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న వ్యక్తే అయివుండొచ్చు. మన దేశంలో కేసులుంటే తమకు అప్పగించాలని అమెరికాను కోరాలి. ఆ దేశ పౌరుడిగా అక్కడే స్థిరపడిన వ్యక్తిపై అంతకుమించి ఏదో సాధించాలనుకోవటం తెలివితక్కువతనం. అసలు ఒక వ్యక్తిని భౌతికంగా లేకుండా చేసినంత మాత్రాన ఉద్యమం ఆగిపోతుందా? అతని సహచరులు భయకంపితులై ఉద్యమానికి దూరమవుతారా? ఏం సాధిద్దామని వికాస్ ఇలాంటి పనికి సిద్ధపడ్డాడో తేల్చటం అవసరం.

వికాస్ యాదవ్ విషయంలో ఇంత పట్టుదలగా పనిచేస్తున్న అమెరికా చరిత్ర కూడా తక్కువేమీ కాదు. 2003 నాటి రవీందర్ సింగ్ వ్యవహారమే ఇందుకు ఉదాహరణ. 'రా'లో సంయుక్త కార్యదర్శిగా ఉన్న రవీందర్ అమెరికా గూఢచార సంస్థ సీఐఏకు డబుల్ ఏజెంటుగా పనిచేసి పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ వగైరా దేశాల్లో రా కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం అందజేశాడు. తన సంగతి బయటపడిందని గ్రహించగానే కుటుంబంతో సహా మాయమై అమెరికాలో తేలాడు. వారికి అక్కడ మారు పేర్లతో పాస్‌పోర్టులు కూడా మంజూరయ్యాయి. విచిత్రంగా మన దేశం అతన్ని అప్పగించాలని పట్టుబట్టలేదు. ఉద్యోగంనుంచి తొలగించి అధికార రహస్యాల చట్టం కింద కేసు పెట్టడంతో సరిపెట్టింది. 2016లో ఒక రోడ్డు ప్రమాదంలో రవీందర్ మరణించాడని అంటున్నా దాన్ని ధ్రువీకరించే సమాచారం మన ప్రభుత్వం దగ్గరలేదు. మొత్తానికి గూఢచర్యం వికటిస్తే ఏమవుతుందో వికాస్ యాదవ్ ఉదంతం తెలియజెబుతోంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, తిథి: బ.విదియ ప.12.47 వరకు
తదుపరి తదియ, నక్షత్రం: భరణి ప.2.31 వరకు
తదుపరి కృత్తిక, వర్జ్యం: రా.1.54 నుండి 3.22 వరకు,
దుర్ముహూర్తం: ఉ.5.46 నుండి 7.32 వరకు,
అమృతఘడియలు: ఉ.10.01 నుండి 12.28 వరకు, అట్లతదియ.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం: 5.34
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

పత్రికల హక్కులేమిటో తెలుసా?

విశ్లేషణ



పి. విజయబాబు

ఔషధం చేదుగా ఉంటుంది. కానీ ఆరోగ్యం కోసం తీసుకోక తప్పదు. నిజం కూడా చేదుగా ఉంటుంది. కానీ సమాజ ఆరోగ్యం కోసం భరించక తప్పదు. నిజంలో ఉన్న చేదును విస్మరించి, ఆ నిజం చెప్పడమే తప్పంటే? నిజం చెప్పేవాళ్ల మీద పగబడితే? నిజాలు వినడం చాలామందికి అసౌకర్యం కలిగిస్తుంది. మరీ ముఖ్యంగా పాలకులకు, అధికార పీఠాల్లో ఉన్నవాళ్లకు, నిజాలు బయటికి రావొద్దనుకునేవాళ్లకు. కానీ నిజాలు చెప్పడం పత్రికల ముఖ్య కర్తవ్యమనీ, నిజాల మీద మాత్రమే సమాజం పురోగమిస్తుందనీ చాలాసార్లు మరిచిపోతుంటారు. కేసులు వేస్తామని బెదిరిస్తుంటారు. కానీ పత్రికలకు ప్రచురించే హక్కు, సమాచారాన్ని పొందే హక్కు, ప్రకటన హక్కు, అసమ్మతి తెలిపే హక్కు ఉన్నాయని గుర్తుంచుకోవాలి.

భారతదేశంలో పత్రికా హక్కులు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం వాక్ స్వాతంత్ర్యం నుండి ఉద్భవించాయి. మే 3 లేదా 'ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం'... పత్రికల స్వేచ్ఛను గౌరవించాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలకు గుర్తు చేస్తుంది.

సాంకేతిక విప్లవపు పురోగతి రాతపూర్వక, మౌఖిక, దృశ్య మాధ్యమాల ద్వారా లక్షలాది మందికి సమాచార వ్యాప్తిని సులభతరం చేసింది. ఇది ఒక వ్యక్తి పరువునష్టం ప్రమాదాన్ని పెంచుతుంది. ఒక వ్యక్తి ప్రతిష్ఠకు హాని కలిగించే విధంగా మాట్లాడటం లేదా రాయడం పరువు నష్టం. భారతీయ శిక్షాస్మృతి, 1860 లోని సెక్షన్ 499 ప్రకారం అది నేరం. ఉద్దేశపూర్వకంగా ఒకరి ప్రతిష్ఠకు భంగం కలిగించడం; టెక్స్ట్, ఇమేజ్, కార్టూన్లు, క్యారికేచర్లు లేదా దిష్టిబొమ్మల ద్వారా వారిని ద్వేషించడం లేదా అవమానించడం చట్ట విరుద్ధం. సాధారణంగా వ్యక్తులను విమర్శించినందుకు వార్తాపత్రికలు, పత్రికా సభ్యులపై ఈ చట్టం కింద కేసులు నమోదు చేస్తారు. విమర్శ సదుద్దేశంతో చేసినా, తీవ్రమైన ప్రజాప్రయోజనాలకు సంబంధించినదైనా అది పరువునష్టం దావా కాదు.

భావ ప్రకటనా స్వేచ్ఛ

పత్రికలు, మీడియాకు ఒకే హక్కులు ఉన్నాయి. సమాచారాన్ని రాయడానికి, ప్రచురించడానికి, ప్రసారం చేయడానికి మరియు ప్రసారం చేయడానికి ఏ వ్యక్తి కంటే ఎక్కువ లేదా తక్కువ కాదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ)లో వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ నుంచి పత్రికలకు ఈ హక్కు లభించింది. ఈ స్వేచ్ఛలో నోటి మాట, రాత, ముద్రణ, చిత్రాలు లేదా మరేదైనా మార్గం ద్వారా వ్యక్తీకరించే హక్కు ఉంటుంది.

భారత సార్వభౌమాధికారం, సమగ్రత, దేశ భద్రత, విదేశాలతో స్నేహపూర్వక సంబంధాలు, పబ్లిక్ ఆర్డర్, హుందాతనం, నైతికత, లేదా కోర్టు ధిక్కారానికి సంబంధించి సహేతుకమైన ఆంక్షలను కలిగి ఉన్న ఆర్టికల్ 19(2) కింద రాజ్యాంగం ప్రకారం ఈ హక్కుపై విధించగల పరిమితులు మాత్రమే ఉన్నాయి.

'రొమేశ్ థాపర్ వర్సెస్ మద్రాస్ రాష్ట్రం' (1950) సహా అనేక కేసుల్లోని తీర్పులు ప్రచురణ స్వేచ్ఛ ఎంత అవసరమో, చలామణి స్వేచ్ఛ కూడా అంతే అవసరమని అభిప్రాయపడ్డాయి. 'బెన్నెట్ కోల్మన్ అండ్ కో వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' (1972) కేసులో వార్తాపత్రికలు, వాటి పేజీలు, వాటి సర్క్యులేషన్ నిర్ణయాధికారాన్ని వాటికే వదిలేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇదే సూత్రాన్ని 'సకాల్ పేపర్స్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' (1962) కేసులోనూ సమర్థించింది. రాజ్యాంగం ప్రసాదించిన వాక్, భావ ప్రకటనా స్వేచ్ఛను నేరుగా ఉల్లంఘించే చట్టాలను రాష్ట్రాలు చేయలేవని పేర్కొంది. పత్రికల చలామణి హక్కులో చలామణి పరిమాణాన్ని



నిర్ణయించే స్వేచ్ఛ కూడా ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(2)లో రాష్ట్ర భద్రత, ప్రజాభద్రత తదితర అంశాల్లో ఇచ్చిన సహేతుకమైన ఆంక్షలకు విరుద్ధంగా ఉంటేనే ఈ హక్కును పరిమితం చేయవచ్చు.

అసమ్మతి హక్కు

రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ)... వాక్ స్వాతంత్ర్యం, ప్రభుత్వాన్ని విమర్శించే హక్కుతో పాటు ప్రజాదరణ లేని లేదా అసాధారణ అభిప్రాయాలను కలిగి ఉండే హక్కును కూడా కవర్ చేస్తుంది. ఇటువంటి విమర్శలను తగ్గించడానికి సాధారణంగా ఉపయోగించే చట్టాన్ని భారత శిక్షాస్మృతి, 1860లోని సెక్షన్ 124–ఎ ప్రకారం రాజద్రోహ చట్టం అంటారు.

సాధారణంగా పత్రికలపై రాజద్రోహ చట్టాన్ని ఉపయోగించి ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేసినప్పటికీ, ప్రభుత్వ చర్యలపై లేదా దాని సంస్థలపై బలమైన పదజాలంతో వ్యాఖ్యానించడం ప్రభుత్వ నమ్మక ద్రోహంతో సమానం కాదని న్యాయస్థానాలు అభిప్రాయపడ్డాయి. ఒక వ్యక్తి వాడిన పదాలు ప్రభుత్వం పట్ల శత్రుత్వానికి, నమ్మకద్రోహానికి, ప్రజా అశాంతికి లేదా హింసకు ఉపయోగించడానికి దారితీయ నంత కాలం, అది రాజద్రోహ చర్య కాదు.

వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛలో సమాచారాన్ని వ్యక్తీకరించే, ప్రచురించే, ప్రచారం చేసే హక్కు మాత్రమే కాదు, సమాచారాన్ని స్వీకరించే హక్కు కూడా ఉంటుంది. సమాచార హక్కు చట్టం, 2005 ద్వారా పత్రికలతో సహా భారతీయ పౌరులకు ప్రజా సంస్థల నుండి సమాచారాన్ని అడిగే హక్కు ఉంది. పత్రికలతో సహా ఏ పౌరుడైనా సమాచారం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రాజెక్ట్ బడ్జెట్ల వివరాలు, అమలు స్థితి, ఏదైనా ప్రభుత్వ సంస్థకు చేసిన ఫిర్యాదు / దరఖాస్తు స్థితి వంటి సమాచారాన్ని పొందవచ్చు. ఇటువంటి దరఖాస్తును సాధారణంగా ఆర్టీఐ లేదా ఆర్టీఐ దరఖాస్తుగా సూచిస్తారు. ఎన్నికల అభ్యర్థుల పూర్వాపరాలు తెలుసుకునే ఓటర్ల హక్కు, క్రికెట్ చూసే క్రీడాభిమానుల హక్కు, ప్రాణాలను కాపాడే మాదకద్రవ్యాలకు సంబంధించిన కీలక సమాచారాన్ని పొందే హక్కు తదితర అంశాలపై సుప్రీంకోర్టు వివిధ కేసుల ద్వారా చర్చించింది.

ఇంటర్వ్యూలు నిర్వహించే హక్కు పత్రికల పరిమిత హక్కు. ఇంటర్వ్యూ చేయబడుతున్న వ్యక్తి నుండి ఇష్టపూర్వక సమ్మతి ఉంటేనే దీనిని ఉపయోగించవచ్చు. దోషులను లేదా విచారణ ఖైదీలను ఇంటర్వ్యూ చేసే మీడియా హక్కును పరిశీలించిన అనేక కేసులు సుప్రీంకోర్టులో ఉన్నాయి. 'ప్రభాదత్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' (1982) కేసులో, పత్రికలకు సంపూర్ణమైన లేదా అపరిమితమైన సమాచార హక్కు లేదనీ, ఖైదీలు సమ్మతి తెలిపితేనే ఇంటర్వ్యూ నిర్వహించవచ్చనీ సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. 'స్టేట్ వర్సెస్ చారులతా జోషి' (1999) కేసులో సుప్రీంకోర్టు తీహార్ జైలులో బబ్లూ శ్రీవాస్తవను ఇంటర్వ్యూ చేయడానికి అనుమతి ఇచ్చింది. అయితే అండర్ ట్రయల్ ఖైదీ ఇంటర్వ్యూ చేయడానికి సుముఖత వ్యక్తం చేస్తేనే ఇంటర్వ్యూ చేయవచ్చు, ఫోటో తీయవచ్చు అని పేర్కొంది.

కోర్టు ప్రొసీడింగ్స్ రిపోర్ట్ చేసే హక్కు

పాత్రికేయులు కోర్టులో విచారణకు హాజరయ్యే హక్కును కలిగి ఉంటారు. న్యాయస్థానంలో చూసిన, విన్న ప్రొసీడింగ్స్‌ను ప్రచురించే హక్కును కలిగి ఉంటారు. అయితే న్యాయప్రయోజనాల దృష్ట్యా విచారణల ప్రచారాన్ని పరిమితం చేసే అధికారం న్యాయస్థానాలకు ఉంటుంది. సుప్రీంకోర్టు 'నరేష్ శ్రీధర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర' (1967) కేసులో దీనిని మరింత స్పష్టం చేసింది. 'సహారా రియల్ ఎస్టేట్ వర్సెస్ సెబీ' (2012) కేసులో న్యాయ ప్రయోజనాల దృష్ట్యా పత్రికలు ప్రచురించే కథనాలను పరిమిత కాలానికి వాయిదా వేసే అధికారం న్యాయస్థానాలకు ఉందని పేర్కొంది. ప్రచురణలో దురుద్దేశం లేనంత కాలం పార్లమెంటు, రాష్ట్రాల శాసనసభల శాసన కార్యకలాపాలను నివేదించే హక్కు కూడా పత్రికలకు ఉంది. పార్లమెంటరీ ప్రొసీడింగ్స్ (ప్రచురణ పరిరక్షణ) చట్టం 1977లోనూ ఈ హక్కుంది.

వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛలో ప్రకటనలు చేసే హక్కు లేదా వాణిజ్య వాక్ హక్కు కూడా ఉన్నాయి. 'టాటా ప్రెస్ లిమిటెడ్ వర్సెస్ ఎంటీఎన్ఎల్' (1995) కేసు విషయంలో ఈ హక్కును సమర్థించారు. 'హిందుస్థాన్ టైమ్స్ వర్సెస్ స్టేట్ ఆఫ్ యూపీ'(2003) కేసులో ఆదాయాన్ని సృష్టించడంలో ప్రకటనలు పోషించే ముఖ్యమైన పాత్ర, అవి చలామణిపై ప్రత్యక్ష ప్రభావాన్ని ఎలా చూపుతాయో సుప్రీంకోర్టు చర్చించింది. తద్వారా వార్తాపత్రికలలో ప్రకటనల హక్కును పునరుద్ఘాటించింది. ప్రకటనలను కుదించడం భావ ప్రకటనా స్వేచ్ఛను ఉల్లంఘించడమేననీ, ఇది వార్తాపత్రికల సర్క్యులేషన్‌పై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందనీ 'సకాల్ పేపర్స్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో (1962) అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

ఇంటి వంటలే సింగారం



కావాల్సిందల్లా గట్టి ఆలింగనం అనుకోవడం రొమాంటిక్‌గానే ఉంటుంది. కానీ వాస్తవంలో మనకు కావాల్సింది వేడి వేడి ఖిచిడీ. జనాలు ఇవ్వాల్సినంత గుర్తింపు ఇవ్వని ప్రేమ భాష: ఇంటి వంట.

– రుజుతా దివేకర్, పోషణ నిపుణురాలు

అక్కడివాళ్లే!



ఒకప్పుడు నేను ఆరాధించిన, తెలివైన వాళ్లు అనుకున్నవాళ్లతో జరుపుతున్న సంభాషణలు నిరాశను పుట్టిస్తున్నాయి. 'యూదులు ఎక్కడి నుంచి వచ్చారో అక్కడికి పోవాలి' అని వాళ్లు చెబ్తుంటే, లక్షో సారి గుర్తుచేస్తున్నా: యూదులు ఇజ్రాయెల్ నుంచి వచ్చారు.

– లుయీ అహ్మద్, యాక్టివిస్ట్

మనకు మాత్రమేనా?



నియమాల ఆధారిత ప్రపంచ నడతకు ఇండియా కట్టుబడి ఉండాలని అనుకునేవాళ్లకు: బాంబులు పడే, పేజర్లు పేలిపోయే, అధ్యక్ష అభ్యర్థుల మీద హత్యాయత్నాలు జరిగే, అణ్వాయుధ బెదిరింపులు సాధారణమైన ఈ ప్రపంచంలో ఏ నియమాలూ లేవని గుర్తుంచుకోండి.

– దీప్ హల్దర్, రచయిత

ప్రేమంటే...



ప్రేమించబడటం అనేది ఉద్వేగపరంగా సురక్షిత భావన ఇస్తుంది, అదే సమయంలో ఆచరణాత్మకంగా కూడా! యూఎస్‌లో ఉన్నాను, నా కార్డ్ పనిచేయడం మానేసింది, క్యాబ్స్‌ను బుక్ చేసుకోలేకపోతున్నా, ఆ సమస్యను పరిష్కరించేందుకు ఇండియాలో ఐదుగురు నా కోసం ఉదయం మూడింటికి నిద్రలేచారు.

– రియా చోప్రా, యూత్ అడ్వైజర్

ప్రధానికి విన్నపం



చెన్నై దూరదర్శన్ స్వర్ణోత్సవాలతో హిందీ మాసపు వీడ్కోలు కార్యక్రమాలను కలిపి నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. రాజ్యాంగం ఏ భాషకూ జాతీయ భాష హోదా ఇవ్వలేదు. భిన్న భాషలు గల దేశంలో, హిందీ మాట్లాడని రాష్ట్రాల్లో హిందీ నెల ఉత్సవం చేయడం ఇతర భాషలను అవమానించడం అవుతుంది.

– ఎం.కె. స్టాలిన్, తమిళనాడు ముఖ్యమంత్రి

రెండు హోటళ్ల కథ



ఇటీవల నా చెన్నై పర్యటనలో నేను తాజ్‌లో దిగాను. నా స్నేహితుడు మరో పెద్ద హోటళ్ల చైన్‌లో దిగాడు. వాతావరణం ఉన్నట్టుండి మారిపోవడంతో రెండ్రోజులు అనుకున్నది, పర్యటనను ఒక్క రోజుకే కుదించుకున్నాం. నా ఆశ్చర్యం కొద్దీ, ఈ మార్పును అర్థం చేసుకోగలమని చెబుతూ తాజ్‌లో ఒక్కరోజుకే వసూలు చేశారు. నా స్నేహితుడికి మాత్రం రెండ్రోజులకు తీసుకున్నారు. అదీ టాటాల సంస్కృతి.

– ప్రశాంత్ నాయర్, వ్యాపారవేత్త

శహీద్



62 ఏళ్ల వయసులో హమాస్ నేత యాహ్యా సిన్వర్ చురుగ్గా యుద్ధక్షేత్రంలో పాల్గొన్నారు. ఆయన స్వాతంత్ర్యాన్నీ, అమరత్వాన్నీ కోరుకున్నారు. అల్లా ఆయనకు అత్యుత్తమ మరణాన్ని ప్రసాదించారు. ఈ శతాబ్దపు అత్యంత గొప్ప స్వేచ్ఛా యోధుడిగా ఆయన గుర్తుండి పోతారు. ప్రపంచవ్యాప్త ప్రతిఘటన పోరాటాలకు స్ఫూర్తిగా నిలుస్తారు.

– పర్వీల్ ఉస్మానీ, పాత్రికేయుడు

ఇన్ బాక్స్

రైతుకు నిజంగా నేస్తం!

తెలుగులో అనేక వ్యవసాయ మాస పత్రికలు వచ్చాయి. కాలనుగుణంగా వాటి ప్రభావం చూపాయి. అన్నిటికీ భిన్నంగా ఉంది 'రైతునేస్తం' ప్రయాణం. గత రెండు దశాబ్దాల కాలంగా పత్రిక నడిచిన, నడిపిన తీరు చూసి విశ్లేషిస్తే సులువుగా అర్థమవుతుంది. రైతుల అనుభవాలకు పెద్దపీట వేసింది. ఇందులో రైతు మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడం మరో ముఖ్యాంశం. క్షేత్రస్థాయి కథనాలకు విలువ ఇచ్చి, తోటి వారికి స్ఫూర్తిదాయకంగా మలిచారు. మరోవైపు గతంలో ఏ పత్రిక చేయని విధంగా రైతులలో ఆధునిక సాగు పద్ధతుల గురించి అవగాహనా కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలు నిర్వహించడం విశేషం.

అంతే కాకుండా వ్యవసాయానికి అవసరమైన సాంకేతిక సమాచారాన్ని సంబంధిత నిపుణుల సహకారంతో వందకు పైగా పుస్తకాల రూపంలో అదుబాటులోకి తెచ్చారు. వీటిలో 'పూదోట' పుస్తకం నియంత్రిత పూల సాగుకు బైబిల్ అయింది. 'కలుపు యాజమాన్యం' ప్రతి రైతుకు కరదీపికగా నిలిచింది. 'గో సంజీవని', 'స్వేద వేదం', 'సిరిధాన్యాలు', 'మిద్దెతోట' పుస్తకాలు... ఇటు రైతులు, అటు శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులను సైతం ఆశ్చర్యంలో పడేశాయి. ఇంకా చెప్పాలంటే రైతుల కోసం పరితపిస్తూ ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించి చరిత్ర కెక్కింది రైతునేస్తం. అన్నిటికీ మించి రైతులు, శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులు, వ్యవసాయ పాత్రికేయులను ప్రతి సంవత్సరం పద్మశ్రీ డా॥ ఐవీ సుబ్బారావు రైతునేస్తం పురస్కారాలతో సత్కరిస్తూ సమాజంలో రైతు లోకానికి గౌరవ ప్రతిష్ఠలు తీసుకు వచ్చిందని చెప్పవచ్చు. ఈ పత్రిక పలు ప్రయోగాలు చేసి రైతుల గౌరవం, జీవన ప్రమాణాల అభివృద్ధి కోసం పరితపించింది. ఉన్నంతలో అటు సమాచారం అందిస్తూ... ఇటు రైతు సంక్షేమం కోసం పరితపిస్తూ మరింతకాలం కొనసాగాలని కోరుకుందాం.

– వలేటి గోపీచంద్ | 94412 76770

(గన్నవరం స్వర్ణ భారతి ట్రస్టులో రేపు 'రైతు నేస్తం' ద్వి దశాబ్ది వేడుకలు)

అధికార కేంద్రీకరణకు మార్గంగా...

అభిప్రాయం



వి.వి.కె. సురేష్

'ఒకే దేశం – ఒకే సంస్కృతి – ఒకే పన్ను' అంటూ నిరంతరం ప్రచారం చేసే అధికార బీజేపీ ఇప్పుడు 'జమిలి ఎన్నికల'కు సన్నద్ధమవుతోంది. కేంద్ర మంత్రి వర్గం ఇటీవల జమిలి ఎన్నికలకు ఆమోదాన్ని తెలిపింది. దేశంలో సవివరమైన చర్చ జరగకుండానే మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పడిన ఉన్నత స్థాయి కమిటీ చేసిన సూచనలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. జమిలి ఎన్నికలను పూర్తిగా సమర్థించేవారే కమిటీలో ఉన్నప్పుడు అది నిపుణుల కమిటీ ఎలా అవుతుంది? జమిలి ఎన్నికలు ఆచరణ సాధ్యం కాదనీ, ఇది అధికార కేంద్రీ కరణకు మార్గాన్ని సుగమం చేయడమేననీ, మన దేశ సమాఖ్య వ్యవస్థ, రాజ్యాంగ మౌలిక సూత్రాలపైన దాడి చేయడమేననీ ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

దేశంలో తరచూ ఏదో ఒక ఎన్నిక జరుగుతున్నందు వల్ల అభివృద్ధికి ఆటంకమేర్పడుతుందనేది ఒక అభిప్రాయం. ప్రపంచంలోనే మన ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడుతోందనీ, దీనికి మన జీడీపీ గణాంకాలే రుజువనీ ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. మరి ప్రభుత్వం చెబుతున్న లెక్కలు నిజంగా సరైనవనుకుంటే అభివృద్ధికి తరచూ జరిగే ఎన్నికలు ఎలా ఆటంకమవుతాయి? దేశం ముందున్న మౌలిక సవాళ్ల నుండి జనం దృష్టిని ప్రక్కదారి పట్టించేందుకే జమిలి ఎన్నికలను ప్రస్తావిస్తున్నారనేది ఒక విమర్శ. జమిలి ఎన్నికల వల్ల ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చనేది సమర్థకుల మరో వాదన. ఈ వాదనను సరిగ్గా విశ్లేషిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. 2023–24 సంవత్సరానికి ఎన్నికల కోసం కేంద్రం కేటాయించింది కేవలం రూ. 466 కోట్లు మాత్రమే. పైగా అది ఎన్నికల సంవత్సరం కాబట్టి. అదే 2022–23 సంవత్సరానికి కేటాయించినది రూ. 320 కోట్లు మాత్రమే. రాష్ట్రాలు కూడా ఎన్నికల ఖర్చును భరిస్తాయి. లక్షలాది కోట్ల



రూపాయల బడ్జెట్‌ను ప్రతిపాదిస్తున్న కేంద్రానికి ఈ ఎన్నికల ఖర్చు నిజంగా పట్టించుకోవలసినది కాదు. నిజానికి జమిలి ఎన్నికలు జరిపితేనే ఖర్చు పెరుగుతుంది. ఈ ఎన్నికల కోసం పెద్ద సంఖ్యలో ఈవీఎమ్‌లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. లక్షలాది మంది ఎన్నికల సిబ్బందిని, రక్షణ సిబ్బందిని కేటాయించాలి. వారి శిక్షణ కోసం కూడా ఖర్చు పెట్టాలి.

ఎన్నికలు తరచూ జరగడం వల్ల ఇప్పటి వరకూ విధానపర నిర్ణయాలు చేయడంలో ఏనాడూ ఆటంకమేర్పడలేదు. ప్రజల ప్రయోజనాలకు, వారి స్వేచ్ఛకు జమిలి ఎన్నికలు విఘాతమే. ప్రభుత్వాల దూకుడుకు, ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు కళ్లెం వేసేది ప్రజలు మాత్రమే.

జమిలి ఎన్నికల వల్ల పలు సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముంది. పార్లమెంట్ లేదా అసెంబ్లీకి ఎన్నికైన ప్రజాప్రతినిధి వెంటనే మరణిస్తే ఏం చేస్తారు? అధికార పార్టీ మధ్యలో మెజారిటీ కోల్పోయి ప్రభుత్వం కూలిపోతే ప్రత్యామ్నాయమేమిటి? అటువంటి ప్రత్యామ్నాయం ప్రజాస్వామ్యయుతం అవుతుందా?

అందుకే జమిలి ఎన్నికలకు బదులు, ఎన్నికల సంస్కరణలను తక్షణమే చేపట్టి దామాషా ఎన్నికల పద్ధతిని ప్రవేశపెట్టాలి. పార్టీల మ్యానిఫెస్టోలను, వారి విధానాలను సమగ్రంగా విశ్లేషించుకుని రాజకీయ పార్టీలకు ప్రజలు ఓటు వేయడం న్యాయసమ్మతమైన, ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య ప్రక్రియ. ప్రస్తుత పద్ధతిలో రాజకీయ పార్టీలకు లభించిన ఓట్ల శాతం, ఆయా పార్టీలు గెలిచిన సీట్లకు ఉన్న తేడా అసంబద్ధంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో జమిలి ఎన్నికల ప్రక్రియను అమలు చేసే ఆలోచనను విరమించి ప్రజాస్వామ్య పటిష్ఠతకు, పరిరక్షణకు అవసరమైన అన్ని మార్పులను మన రాజకీయ వ్యవస్థ చేపట్టాలి. అధికార బీజేపీ దీనికి ముందుగా చొరవ చూపాలి.

వ్యాసకర్త ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, మచిలీపట్నం డివిజన్ డివిజనల్ సంయుక్త కార్యదర్శి | 94403 45850

విశ్వవ్యాప్త సందేశం

ప్రభువు బోధనలు విశ్వజన హృదయ చేతనలు. సగటు మనిషి సముద్ధరణలు. అవి అందరికీ సంబంధించినవి. సార్వ జనీనం. కాబట్టే ఎల్లలు దాటి ఇంకా బ్రతికే ఉన్నాయి. అందుకే తన సందేశాన్ని లోకమంతటికీ అందించ మన్నాడు ప్రభువు. 'నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను' (మత్తయి 28:19).

ఈ నేపథ్యంలో క్రైస్తవ పీఠాధిపత్యం ప్రభు సువార్తను విశ్వవ్యాప్తం చేయడానికై పూనుకొంది. దాన్నే 'వేద వ్యాపక ఆదివారం'గా పోప్ ప్రకటించారు. సందేశం, దాంతో పాటు వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేపట్టా లనీ, అందుకు తగు చేయూత ఇవ్వడమూ సేవలో భాగమే అనీ వివరించారు. ఆ వాక్యం జ్ఞాన జ్యోతియైన వాక్యం. సత్య జ్యోతియైన వాక్యం. వాక్యం జ్ఞానానికి చిహ్నం. వాక్యం చైతన్యానికి గుర్తు. దైవానికి చిహ్నం. ఇంకా చెప్పాలంటే విశ్వానికే అది తుల్యం. మూలం. ఆ వాక్యమే విశ్వమైనప్పుడు మళ్ళీ విశ్వానికి పరివ్యాప్తం కావడ మేమిటీ అనేదే ప్రశ్న. ఇదే అంతుపట్టని మర్మం. మనకు ఆచరణీయ మైన ధర్మం. ఈ మధ్యలో, ఎంతో ప్రక్రియ జరగాలి. ఈ నడుమ అడ్డొచ్చిన అజ్ఞానాన్ని తొలగించుకోవాలి. అవరోధించే చీకట్లను మటుమాయం చేసుకోవాలి. అదే వేద వ్యాపకం. జ్ఞాన వ్యాపకం.

ప్రభువు, తోటివారిని ప్రేమించమన్నాడు. ఆ తోటి సోదర ప్రేమ కేవలం పెదవుల ద్వారా వ్యక్తమైతే సరిపోదు. చేతల్లో చూయించాలి. ప్రభు బోధనలకు తగు నివాసాలై దేవాలయాలు కట్టించాలి. దిక్కూ – దివాణం లేని అభాగ్యులూ, నిర్భాగ్యులూ చాలా మంది ఉన్నారు. వారికి ఆశ్రయం కల్పించాలి. ఆ ప్రజల ఆయురారోగ్యాలు కాపాడడానికి వైద్య శాలలు నిర్మించాలి. మారుమూల పేద పిల్లలు చదవడానికి విద్యాలయాలు ఏర్పాటు చేయాలి. అందుకు స్వయంగా వెళ్ళి, పాల్గొనే అవకాశం లేనోళ్ళు ఆర్థిక, వస్తు రూపాల్లో సాయ పడాలి. ప్రభువు సందేశాన్నీ సేవా భావాన్నీ విశ్వవ్యాప్తం చేయడమే వేద వ్యాపకం. మరో మాటలో చెప్పాలంటే, ప్రభువునే సాక్షాత్తూ తమద్వారా సమాజంలో ప్రత్యక్ష పరచాలి.


– డా॥ డి. బెర్నార్డ్ రాజు | 98667 55024

(రేపు 'వేద వ్యాపక ఆదివారం')

క్లుప్తంగా...

పూర్తిస్థాయి నీటిమట్టానికి శ్రీశైలం ప్రాజెక్టు

- ఒక గేటు ద్వారా నీటి విడుదల



దోమలపెంట: ఎగువ కృష్ణానది నుంచి శుక్రవారం 1,26,217 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తుండటంతో శ్రీశైలం జలాశయం నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకుంది. దీంతో ఒక క్రస్ట్‌గేటు పది అడుగుల మేర పైకెత్తి దిగువన ఉన్న సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 884.6 అడుగుల వద్ద 213 టీఎంసీల నీటినిల్వ ఉంది.

రౌడీషీటర్ మహ్మద్ కైసర్ ఆస్తుల జప్తు

- రూ.1.01 కోట్ల ఆస్తి జప్తు చేసిన ఈడీ అధికారులు

సాక్షి,హైదరాబాద్: హైదరాబాద్‌లోని హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ మహ్మద్ కైసర్ అలియాస్ పెహల్వాన్ కైసర్‌కు చెందిన రూ.1.01 కోటి విలువైన (ప్రభుత్వ లెక్కల ప్రకారం) ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు జప్తు చేశారు. మనీలాండరింగ్ చట్టాల కింద ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు ఈడీ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ పోలీసులు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. మహ్మద్ కైసర్‌ను హత్య, హత్యాయత్నం, బెదిరింపులకు పాల్పడటం, దోపిడీ వంటి అనేక నేరాల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. జూదం, క్రికెట్ బెట్టింగ్, ల్యాండ్ సెటిల్మెంట్ వంటి నేరాలతో ఆస్తులు కూడబెట్టినట్లు ఈడీ అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. అక్రమ సంపాదనతో 2007 నుంచి 2020 వరకు పలు స్థిరాస్తులను తన భార్య షాహెదాబేగం పేరిట కూడబెట్టినట్లు ఈడీ అధికారులు ఆధారాలు సేకరించారు. దీంతో మహమ్మద్ కైసర్‌కు చెందిన ఆస్తులను అటాచ్ చేసినట్లు ఈడీ అధికారులు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు పురోగతిలో ఉన్నట్లు ఈడీ అధికారులు వెల్లడించారు.

హీరాగోల్డ్ ఎండీ నౌహీరా షేక్ బెయిల్ రద్దు



సాక్షి, న్యూఢిల్లీ: స్కీమ్‌లను ఎర వేసి రూ.కోట్లలో డిపాజిట్లు సేకరించి వేలకోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడిన 'హీరా గోల్డ్' కేసులో హీరా గోల్డ్ మేనేజింగ్ డైరెక్టర్ నౌహీరాషేక్ బెయిల్‌ను దేశ సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసింది. బాధితులకు నిర్ణీత గడువులోగా డబ్బులు చెల్లిస్తామని గతంలో సుప్రీంకోర్టు సాక్షిగా చెప్పిన నౌహీరాషేక్ మాట తప్పారని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. డిపాజిట్లు తిరిగి చెల్లిస్తామంటేనే కదా..తాము బెయిల్ మంజూరు చేస్తామని గతంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను శుక్రవారం జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం గుర్తు చేసింది. ధర్మాసనం సాక్షిగా మాట తప్పినందుకు బెయిల్ రద్దు చేస్తున్నట్లు పేర్కొంది.

తుల్‌తులీ ఎన్‌కౌంటర్ మృతులు 38 మంది

- తొలిరోజు 31 మృతదేహాలు స్వాధీనం
- 35మంది చనిపోయినట్లు మావోయిస్టుల ప్రకటన
- 38మందితో తాజాగా జాబితా విడుదల చేసిన పోలీసులు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఛత్తీస్‌గఢ్ చరిత్రలోనే అతి పెద్దదిగా పరిగణిస్తున్న తుల్‌తులీ ఎన్‌కౌంటర్‌లో రోజులు గడిచేకొద్దీ మృతుల సంఖ్య పెరుగుతోంది. ఆ రాష్ట్రంలోని అబూజ్‌మడ్ అడవుల్లో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య ఈనెల 4న నారాయణపూర్ జిల్లా పరిధిలోని తుల్‌తులీ, గవాడీ గ్రామాల మధ్య ఎన్‌కౌంటర్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్‌లో తొలి రోజు 31మంది చనిపోయినట్లు పోలీసులు ప్రకటించారు. అందులో 22మందిని గుర్తించగా మిగిలిన వారిని గుర్తించలేకపోయారు. ఘటన జరిగిన 10 రోజుల తర్వాత మావో యిస్టులు లేఖ విడుదల చేస్తూ ఈ ఎదురు కాల్పుల్లో మొత్తం 35మంది చనిపోయినట్లు వెల్లడించారు. ఇక్కడితోనే మృతుల సంఖ్య ఆగిపోతుందని అంతా అనుకున్నారు. అయితే దంతెవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్ శుక్రవారం ఈ ఎన్‌కౌంటర్‌పై మరిన్ని వివరాలు వెల్లడించారు. దీని ప్రకారం తుల్‌తులీ ఎన్‌కౌంటర్‌లో మొత్తం 38మంది చనిపోయారని వెల్లడించారు. మృతులపై ఉన్న రివార్డు మొత్తం రూ.2.60 కోట్లుగా ఉంది.

9 వర్సిటీలకు వీసీల నియామకం

- గవర్నర్ కార్యాలయం వెల్లడి
- జేఎన్‌టీయూహెచ్, జేఎన్ఏఎఫ్, అంబేడ్కర్ వర్సిటీలు పెండింగ్‌లో
- మహిళా వర్సిటీకి ఇప్పటికే ఉప కులపతి నియామకం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 9 విశ్వవిద్యాలయాలకు ఉప కులపతులు నియమితులయ్యారు. ప్రభుత్వ సిఫారసుతో వర్సిటీలకు వీసీలను ఖరారు చేసినట్టు గవర్నర్ కార్యాలయం శుక్రవారం వెల్లడించింది. వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల వీసీల పేర్లు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. రాష్ట్రానికి సంబంధించి 13 వర్సిటీలు ఉండగా.. మహిళా వర్సిటీకి ముందే వీసీని నియమించారు. జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూహెచ్), డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ)లకు ఇంకా వీసీలను నియమించాల్సి ఉంది.

అంబేడ్కర్ వర్సిటీకి అత్యధిక దరఖాస్తులు

రాష్ట్రంలోని వర్సిటీలకు చెందిన వీసీల పదవీ కాలం ఈ ఏడాది మే 23 తోనే ముగిసింది. ఈ నేపథ్యంలో తొలుత ఐఏఎస్ అధికారులకు వీసీలుగా బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం, మరోవైపు ఖాళీగా ఉన్న వీసీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. అలాగే సెర్చ్ కమిటీలను కూడా ఏర్పాటు చేసింది. ఈ పోస్టుల కోసం 312 మంది 1,382 దరఖాస్తులు సమర్పించారు. చాలామంది అన్ని వర్సిటీలకు దరఖాస్తు చేశారు. అత్యధికంగా బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయానికి 208 దరఖాస్తులు వస్తే, ఉస్మానియాకు 193, పాలమూరుకు 159, శాతవాహనకు 158, మహాత్మాగాంధీ వర్సిటీకి 157 వచ్చాయి. జేఎన్‌టీయూహెచ్‌కు 106 దరఖాస్తులు అందాయి. వీటన్నింటినీ సెర్చ్ కమిటీ పరిశీలించి మూడు పేర్ల చొప్పున ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీంతో వీసీలను ఎంపిక చేసిన ప్రభుత్వం దసరా ముందు ఫైల్‌ను గవర్నర్ కార్యాలయానికి పంపింది. తాజాగా గవర్నర్ కార్యాలయం వీసీల పేర్లను ఖరారు చేసింది.

వివాదంలో జేఎన్‌టీయూహెచ్

జేఎన్‌టీయూహెచ్‌కు వీసీ నియామకం ఆఖరి దశలో ఆగిపోయింది. అంతర్గత వివాదం, వీసీ నియామకం కోసం ఏర్పాటు చేసిన సెర్చ్ కమిటీపై విమర్శలు వచ్చిన నేపథ్యంలో వీసీ ఖరారును వాయిదా వేశారని తెలిసింది. ఈ వర్సిటీకి సెర్చ్ కమిటీ ముగ్గురు పేర్లను సిఫారసు చేయగా.. ఇందులో ఓ మాజీ వీసీ పేరు ఉండటం వివాదాస్పదమైంది. గతంలో ఆయనపై పలు ఆరోపణలున్నాయని, అయినప్పటికీ ఆయన పేరును సెర్చ్ కమిటీ సూచించిందంటూ పలువురు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. దీని వెనుక ఏదో మతలబు ఉందనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ కారణంగానే ప్రభుత్వం ఆయనకు సంబంధించిన ఫైల్‌ను గవర్నర్‌కు పంపలేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. అంతేగాకుండా ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణకు ప్రభుత్వం ఆదేశించినట్టు సమాచారం.

జేఎన్ఏఎఫ్, 'అంబేడ్కర్'పై భేటీకాని సెర్చ్ కమిటీలు

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ పోస్టు కోసం అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు రాగా, ఈ పోస్టును దక్కించుకునేందుకు పెద్ద ఎత్తున పైరవీలు సైతం జరిగినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధిష్టానం నుంచే నాలుగు సిఫారసులు వచ్చినట్టు తెలిసింది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని సెర్చ్ కమిటీ ఇంతవరకూ ఈ వర్సిటీ విషయమై భేటీ అవ్వలేదని తెలుస్తోంది. అలాగే జేఎన్ఏఎఫ్ఏపై కూడా సెర్చ్ కమిటీ సమావేశం నిర్వహించలేదు. ఈ భేటీ త్వరలో జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

కొత్త వీసీలు వీరే..

యూనివర్సిటీ	వీసీ
పాలమూరు, మహబూబ్‌నగర్	ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్‌రావు
కాకతీయ, వరంగల్	ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి
ఉస్మానియా, హైదరాబాద్	ప్రొఫెసర్ కుమార్ మొలుగరం
శాతవాహన, కరీంనగర్	ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్
తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్	ప్రొఫెసర్ నిత్యానందరావు
మహాత్మాగాంధీ, నల్లగొండ	ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్
తెలంగాణ, నిజామాబాద్	ప్రొఫెసర్ యాదగిరిరావు
ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ	ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య
శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన	ప్రొఫెసర్ రాజిరెడ్డి

ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య



జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీగా నియమితులైన ప్రొ.అల్దాస్ జానయ్య నల్లగొండ జిల్లా, తిప్పర్తి మండలం, మామిడాల గ్రామంలో జన్మించారు. వ్యవసాయ ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం జగిత్యాల వ్యవసాయ కాలేజీ అసోసియేట్ డీన్‌గా సేవలందిస్తున్నారు. 2002లో అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు అందుకున్నారు.

ప్రొ.రాజిరెడ్డి దండ



కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీగా నియమితులైన దండ రాజిరెడ్డి మహారాష్ట్రలోని పంజాబ్‌రావు కృషి విద్యాపీఠ్‌లో అగ్రికల్చర్‌లో బీఎస్సీ, ఎంఎస్సీ చేశారు. గుజరాత్ అగ్రికల్చర్ వర్సిటీలో అగ్రో మెటియోరాలజీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. అఫ్గానిస్తాన్ అగ్రోమెట్ సర్వీసెస్ ప్రాజెక్టుకు వరల్డ్ బ్యాంకు కన్సల్టెంటుగా కొంతకాలం పనిచేశారు. చాలాకాలం పాటు జయశంకర్ అగ్రికల్చర్ వర్సిటీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

ప్రొ.వెలుదండ నిత్యానందరావు



తెలుగు వర్సిటీ వీసీగా నియమితులైన ప్రొ.వెలుదండ నిత్యానందరావు స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా మంగనూరు గ్రామం. పాలెం ఓరియంటల్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. ఓయూలో ఎంఏ తెలుగు, ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆ తర్వాత ఉస్మానియా వర్సిటీ తెలుగు విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, అదే శాఖ హెచ్‌వోడీగా పనిచేశారు. 2022లో పదవీ విరమణ చేశారు. ఆయన రచించిన 'విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన' అనే గ్రంథం అన్ని వర్సిటీల తెలుగు విభాగాల్లో ప్రామాణిక గ్రంథంగా ఇప్పటికీ బోధిస్తున్నారు.

ప్రొ.టి.యాదగిరిరావు



తెలంగాణ యూనివర్సిటీ వీసీగా నియమితులైన ప్రొ.యాదగిరిరావు వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో జన్మించారు. పీజీ, పీహెచ్‌డీ కాకతీయ యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఇప్పుడు అదే వర్సిటీలో సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ బీవోఎస్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో కేయూలో యూజీసీ కో–ఆర్డినేటింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2021లో రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడి అవార్డు అందుకున్నారు. తెలంగాణ వర్సిటీ సోషల్ సైన్సెస్ డీన్‌గా కూడా కొంతకాలం పనిచేశారు.

ప్రొ.జీఎన్ శ్రీనివాస్



పాలమూరు యూనివర్సిటీ వీసీగా నియమితులైన ప్రొ.జీఎన్ శ్రీనివాస్ సిరిసిల్ల జిల్లా కొత్తపల్లి గ్రామంలో జన్మించారు. ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఓయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ప్రస్థానం మొదలు పెట్టిన శ్రీనివాస్.. 2003లో ఏపీలోని అనంతపురం జేఎన్టీయూలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన శ్రీనివాస్.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలంగా పనిచేశారు.

ప్రొ.కుమార్ మొలుగరం



ఉస్మానియా వీసీగా నియమితులైన కుమార్ మొలుగరం రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్ మండలం కొండాపురం గ్రామంలో జన్మించారు. ఓయూలో బీటెక్, జేఎన్‌టీయూలో ఎంటెక్, ఐఐటీ బాంబే నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. సివిల్ ఇంజనీరింగ్ రంగంలో ఆయన అపార అనుభవశాలి. ప్రస్తుతం ఓయూ ఇంజనీరింగ్ కాలేజీలో సీనియర్ ప్రొఫెసర్‌గా, రీజనల్ సెంటర్ ఫర్ అర్బన్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్నారు. 2018లో రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడి పురస్కారం, ఇంజనీర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకున్నారు. ఓయూ 107 సంవత్సరాల చరిత్రలో వీసీగా నియమితులైన తొలి ఎస్సీ (మాదిగ) సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా ఘనత సాధించారు.

ప్రొ.అల్తాఫ్ హుస్సేన్



నల్లగొండ మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీగా నియమితులైన ఖాజా అల్తాఫ్ హుస్సేన్.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో జన్మించారు. ఆత్మకూరులోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి, వరంగల్ సీకేఎం కాలేజీలో ఇంటర్, డిగ్రీ.. కాకతీయ యూనివర్సిటీలో ఫిజిక్స్‌లో పీజీ, పీహెచ్‌డీ పూర్తిచేశారు. కేయూ ఫిజిక్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా, హెచ్‌వోడీగా, రిజిస్ట్రార్‌గా సేవలందించారు. 2016–19 మధ్యకాలంలో కూడా మహాత్మాగాంధీ వర్సిటీ వీసీగా పనిచేశారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దుతామని ఎంజీయూ వీసీగా నియమితులైన అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. వర్సిటీలో కొత్త కోర్సులు ప్రారంభిస్తామని 'సాక్షి'కి తెలిపారు.

ప్రొ.ప్రతాప్‌రెడ్డి



కాకతీయ యూనివర్సిటీ వీసీగా నియమితులైన ప్రొ.ప్రతాప్‌రెడ్డిది రంగారెడ్డి జిల్లా యాచారం. ఓయూలో పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన ప్రతాప్‌రెడ్డి.. ఓయూలో జువాలజీ విభాగం హెచ్‌వోడీగా, రిజిస్ట్రార్‌గా, పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్‌గా సేవలందించి రిటైర్ అయ్యారు.

ప్రొ.ఉమేష్‌కుమార్



శాతవాహన యూనివర్సిటీ వీసీగా నియమితులైన ఉమేష్‌కుమార్.. మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట గ్రామంలో జన్మించారు. కెమిస్ట్రీ విభాగంలో ఆయనకు అపారమైన అనుభవం ఉంది. గతంలో మహాత్మాగాంధీ వర్సిటీ వీసీగా, రిజిస్ట్రార్‌గా పనిచేశారు. ఇందిరాగాంధీ జాతీయ స్థాయి ఎన్ఎస్ఎస్ ట్రోఫీని 2015లో రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. ఎంజీ యూనివర్సిటీని అభివృద్ధి చేసేందుకు, బోధనా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేశారు.

స్కిల్స్ వర్సిటీకి అదానీ గ్రూపు రూ.100 కోట్ల విరాళం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీ గ్రూపు సంస్థల చైర్మన్ గౌతమ్ అదానీ రూ.100 కోట్ల విరాళం ఇచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి చెక్‌ను అందచేశారు. ఈ యూనివర్సిటీకి ఆనంద్ మహీంద్రా చైర్మన్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే.

లెన్స్‌కార్ట్ ఒప్పందం

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో ప్రముఖ కళ్లజోళ్ల విక్రయించే చైన్‌మార్కెట్ సంస్థ 'లెన్స్‌కార్ట్' అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్–చాన్స్‌లర్ వీఎల్‌వీఎస్ఎస్.సుబ్బారావు మాట్లాడుతూ... లెన్స్‌కార్ట్ సంస్థ నెలరోజుల కోర్సును యూనివర్సిటీలో నిర్వహిస్తుందని, ప్రస్తుత బ్యాచ్‌లో 30 మందిని చేర్చుకుంటారని తెలిపారు. ఈ కోర్సులో ఉత్తీర్ణులైన వారికి లెన్స్‌కార్ట్ చైన్ స్టోర్స్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని వివరించారు. ప్రతీ రెండు నెలలకోమారు వారు ఈ శిక్షణను ఇస్తారని తెలిపారు.

రేవంత్ దార్శనికతకు దోహదపడటం గౌరవం: గౌతమ్ అదానీ

సాక్షి, హైదరాబాద్: స్కిల్స్ వర్సిటీ విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతకు, నాయకత్వానికి దోహదపడటాన్ని ఒక గౌరవంగా భావిస్తున్నట్టు పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ ఏర్పాటుకు రూ.100 కోట్ల విరాళాన్ని సీఎం రేవంత్‌కు అందజేసిన ఆయన.. 'మన యువత భవిష్యత్తును తీర్చిదిద్దడమే కాక మరింత సుసంపన్నమైన భారత్‌ను సృష్టించేందుకు అవసరమైన సామర్థ్యాలను మేం వెలికి తీస్తున్నాం.. తరతరాలను ఉద్ధరించనున్నాం..'అని 'ఎక్స్'లో పోస్టు చేశారు.

'డిసెంబర్ 9కల్లా అందరికీ రుణమాఫీ'



మర్పల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ పంట రుణ మాఫీ చేసి తీరుతామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం నిర్వహించిన వికారాబాద్ జిల్లా మర్పల్లి మార్కెట్ యార్డు పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ.. డిసెంబర్ 9నాటికి రూ.2 లక్షల వరకు ఉన్న పంట రుణాలను సంపూర్ణంగా మాఫీ చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. త్వరలోనే రైతు భరోసా అందజేస్తామన్నారు. రైతు బీమా పథకం యథావిధిగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

భార్య కాపురానికి రావడంలేదని..

పోలీస్‌స్టేషన్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం

- కాపాడేందుకు యత్నించిన ఎస్సై, కానిస్టేబుల్‌కు గాయాలు

పాలకుర్తి టౌన్: భార్య కాపురానికి రాకపోవడమే కాకుండా దాడికి పాల్పడిన అత్తమామలపై ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోవడంలేదని ఓ యువకుడు పోలీస్‌స్టేషన్‌లోనే ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడు కాలిపోతుండగా కాపాడేందుకు యత్నించిన పోలీసులకు మంటలు అంటుకుని గాయపడ్డారు. శుక్రవారం జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పాలకుర్తి మండలం కొండాపురం శివారు మేకల తండాకు చెందిన లకావత్ శ్రీనివాస్‌కు ఇదే మండలంలోని నర్సింగాపురం తండాకు చెందిన భూక్య యాకూబ్, శాంతి దంపతుల కుమార్తె రాధికతో ఆర్నెల్ల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో రాధిక గర్భం దాల్చింది. అయితే మూడు నెలల నుంచి దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన రాధిక పుట్టింటికి వెళ్లిపోయింది.

పెద్దల వద్ద పంచాయితీ...

పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టినా కాపురానికి వచ్చేందుకు రాధిక విముఖత చూపింది. ఇటీవల రాధికను తల్లిదండ్రులు వైద్య పరీక్షల నిమిత్తం జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా విషయం తెలుసుకున్న శ్రీనివాస్ అక్కడికి చేరుకుని రాధికపై దాడి చేసి అత్తమామలను దూషించాడు. దీంతో వారు ఈనెల 16న పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో శ్రీనివాస్ అత్తమామలు అతడిపై కేసు పెట్టారు. ఈ కేసు విషయమై ఈనెల గురువారం పోలీసు స్టేషన్‌కు వచ్చిన శ్రీనివాస్‌ను అతడి అత్తామామలు దాడి చేశారు. దీంతో అత్తమామపై శ్రీనివాస్ కేసు పెట్టాడు. శుక్రవారం మళ్లీ స్టేషన్‌కు వెళ్లి తనకు న్యాయం చేయాలని కోరుతూ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని మంటలు అంటించుకున్నాడు. అక్కడే ఉన్న ఎస్సై సాయిప్రసన్న కుమార్, కానిస్టేబుల్ రవీందర్ చేతులకు సైతం మంటలు అంటుకుని గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు. శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఎస్సై సాయిప్రసన్న కుమార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పీఎస్ ఎదుట ధర్నా చేపట్టారు. కాగా, ఘటనకు సంబంధించి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.



పోలీసు స్టేషన్ వద్ద కాలిన గాయాలతో శ్రీనివాస్

మొదలైన యాదాద్రి బంగారు తాపడం పనులు



విమానగోపురం ఊహా చిత్రం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ విమాన గోపురానికి బంగారు తాపడం పనులు చెన్నైలో మొదలయ్యాయి. ఇందుకోసం మొదటి విడతగా 12 కిలోల బంగారాన్ని ఇప్పటికే దేవస్థానం ఈవో భాస్కర్‌రావు చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్ సంస్థకు అప్ప గించడం తెలిసిందే. రెండో విడతగా బంగారాన్ని నవంబర్ 1న అందజేయనున్నారు. బంగారు తాపడం పనులను వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తి చేసి, మార్చిలో జరిగే బ్రహ్మోత్సవాలకు స్వర్ణ విమాన గోపురం భక్తులకు కనువిందు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానాలయంలోని ధ్వజస్తంభం, గర్భాలయ ముఖద్వారా నికి బంగారు తాపడం పనులు కూడా స్మార్ట్ క్రియేషన్ సంస్థే చేపట్టింది. విమాన గోపురానికి అచ్చులు వేసిన రాగి రేకులు, గోపురంపై వచ్చే వివిధ దేవతామూర్తుల విగ్రహాలను ఈనెల 9న చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్ సంస్థకు దేవస్థానం అధికారులు పంపించారు. బంగారు తాపడానికి అవసర మయ్యే నిధుల కోసం భక్తులు విరాళాలివ్వాలని ఈవో భాస్కర్‌రావు విజ్ఞప్తి చేశారు.

పత్తి విక్రయానికి స్లాట్ బుకింగ్

రైతుల సౌలభ్యం కోసం వాట్సాప్ యాప్ అందుబాటులోకి

- ప్రస్తుతం నిర్మల్ మార్కెట్లో పైలట్ ప్రాజెక్టుగా అమలుకు నిర్ణయం
- అనంతరం ఇతర మార్కెట్లలో అమలులోకి
- రైతులు తమకు అనువైన సమయంలో పంట తెచ్చేందుకు వెసులుబాటు
- 8897281111 నంబర్ వాట్సాప్ ద్వారా సమగ్ర సమాచారం

సాక్షి, హైదరాబాద్: ఈ సీజన్‌కు సంబంధించి పత్తి పంట మార్కెట్లోకి వస్తోంది. రైతులు పత్తిని విక్రయించాలంటే గతంలో భారత పత్తి సంస్థ (సీసీఐ) కేంద్రాల వద్ద రోజుల తరబడి నిరీక్షించేవారు. అయితే ఈ విషయంలో రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా సీసీఐ అధికారులు తాజాగా 'వాట్సాప్ టాప్ యాప్'ను రూపొందించారు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖకు దీనిని అనుసంధానించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సీసీఐ కేంద్రాల కొనుగోళ్ల తాజా వివరాలను యాప్‌లో అందుబాటులో ఉంచుతారు. దీంతో రైతు ఎప్పుడు సరుకు తీసుకెళ్లాలనే సమాచారం నుంచి నగదు జమ వరకు సకల వివరాలు తెలుసుకోవచ్చు. ఏ రోజు, ఎప్పుడు మార్కెట్‌కు వెళ్లాలో నిర్ణయించుకుని, రైతులు దీని ద్వారానే స్లాట్ బుక్ చేసుకునే సదుపాయం కల్పించింది. మార్కెట్, తేదీ, సమయం నిర్దేశించుకొని స్లాట్‌ను బుక్ చేసుకొని ఆ ప్రకారం మార్కెట్‌కు వెళితే సరిపోతుంది. కాగా, స్లాట్ బుకింగ్ సదుపాయాన్ని మాత్రం తొలుత పైలట్ ప్రాజెక్టుగా నిర్మల్ మార్కెట్లో అమలు చేయనున్నారు. అనంతరం ఇతర మార్కెట్లకు విస్తరించనున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం స్లాట్ బుకింగ్ సదుపాయం లేని జిల్లాల్లోని మార్కెట్లలో కొనుగోలు ప్రక్రియ, రద్దీ తదితర వివరాలను రైతులు తెలుసుకునేందుకు వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. 8897281111 నంబర్ వాట్సాప్ ద్వారా సమగ్ర సమాచారం తెలుసుకోవచ్చు. హాయ్ అని వాట్సాప్‌లో మెసేజ్ పెడితే సమగ్ర సమాచారం మనముందు ఉంటుంది. అలాగే అత్యంత ముఖ్యమైనది.. ఆయా కొనుగోలు కేంద్రాల్లో వేచి ఉండే సమయాన్ని వాట్సాప్ ద్వారా తెలుసుకోవచ్చు. అమ్మిన పంట మొత్తం రైతు ఖాతాలో జమ అయ్యేవరకు దీని ద్వారా వివరాలు తెలుసుకునే సదుపాయం కల్పించారు.



21.46 లక్షల మంది రైతుల వివరాలు నిక్షిప్తం

వాట్సాప్ యాప్‌లో రైతులకు అవసరమైన సమగ్ర సమాచారాన్ని నిక్షిప్తం చేశారు. ఆ యాప్‌లో 21,46,263 మంది పత్తి రైతుల వివరాలు ఉన్నాయి. కాగా, వ్యవసాయ శాఖ వద్ద వివరాలు నమోదు చేసుకున్న రైతులకే ఈ యాప్ అందుబాటులో ఉంటుంది. రైతులు తమ వద్ద ఎంత పత్తి నిల్వ ఉంది? అనే వివరాలను తొలుత యాప్‌లో నమోదు చేయాలి. అప్పుడు స్థానిక సీసీఐ/జిన్నింగు మిల్లు పరిధిలో కొనుగోలుకు ఎంత సమయం పడుతుందో సమాచారం అందుతుంది. సీరియల్లో ఉన్న వాహనాల సంఖ్య, లోడింగ్, అన్‌లోడింగ్ వివరాలు కనిపిస్తాయి. పంటను విక్రయించిన తర్వాత తక్పట్టీ వివరాలు, ధరల వివరాలు, నగదు ఎన్ని రోజుల్లో జమ అవుతుందో కూడా తెలుసుకోవచ్చు. 'యాప్'లో వివరాలు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో అందుబాటులో ఉంటాయి. దీంతో రైతు తన పంటను ఇంటి దగ్గర్నుంచి తెచ్చుకుని వెంటనే అమ్ముకునే సౌలభ్యం కలుగుతుంది.

వాట్సాప్ యాప్‌తో రైతులకు ప్రయోజనం

వాట్సాప్ యాప్ ద్వారా పత్తి రైతులకు మరింత ప్రయోజనం ఉంటుంది. దీనిని ఈ ఏడాదే అందుబాటులోకి తీసుకువచ్చాం. నిర్మల్ మార్కెట్‌లోనైతే స్లాట్ బుకింగ్ సదుపాయం కూడా కల్పించాం. దీనిని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తాం. రైతులు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలి.

– లక్ష్మణుడు, అడిషనల్ డైరెక్టర్, మార్కెటింగ్‌శాఖ

అమెరికాలో భారతీయం

అగ్రరాజ్యంలో మనోళ్ల హవా • రాజకీయాల్లో ప్రబల శక్తి • వారి మద్దతు పార్టీలకు కీలకం



అమెరికా మొత్తం ఓటర్లు 16.1 కోట్ల పై చిలుకు. అందులో భారతీయ అమెరికన్ల సంఖ్య మహా అయితే 21 లక్షలు. కానీ ఆ దేశ రాజకీయాల్లో మనవాళ్లు నానాటికీ ప్రబల శక్తిగా ఎదుగుతున్నారు. ప్రధాన పార్టీలైన రిపబ్లికన్లు, డెమొక్రాట్లు ఇప్పుడు వారి రాజకీయ శక్తిని ఏ మాత్రమూ విస్మరించే పరిస్థితి లేదు. అందులోనూ భారత మూలాలున్న ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ఈసారి ఏకంగా డెమొక్రాట్ల అధ్యక్ష అభ్యర్థిగా దూసుకుపోతున్నారు. దాంతో భారతీయ అమెరికన్ల ఉత్సాహానికి పట్టపగ్గాల్లేకుండా పోతోంది. భారతీయ అమెరికన్లలో అత్యధికులు విద్యాధికులే. కేవలం ఓటర్లుగానే గాక అభ్యర్థులుగా, ఓటర్లను సమీకరించే శక్తిగా, నిధుల సేకర్తలుగా కొన్నేళ్లుగా వారి హవా బహుముఖంగా విస్తరిస్తోంది. దాంతో సహజంగానే అధికార సాధనలో వారి మద్దతు నానాటికీ కీలకంగా మారుతోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

స్వింగ్ స్టేట్లలోనూ హవా

అధ్యక్ష ఎన్నికల్లో విజేతను తేల్చడంలో అతి కీలకంగా మారే మిషిగన్, జార్జియా వంటి స్వింగ్ స్టేట్లలో భారతీయుల జనాభా చాలా ఎక్కువ. దాంతో వారి ఓట్లు, మద్దతు రెండు పార్టీలకూ మరింత కీలకంగా మారాయి. 2020లో బైడెన్ విజయంలో జార్జియా ఫలితమే నిర్ణాయకంగా మారడం తెలిసిందే. అక్కడ భారతీయ ఓటర్ల సంఖ్య చాలా ఎక్కువ. గత రెండు మూడు అధ్యక్ష ఎన్నికలు అత్యంత హోరాహోరీగా జరుగుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో హారిస్, ట్రంప్ భాగ్యరేఖలు స్వింగ్ స్టేట్లలోని ఇండియన్ ఓటర్ల మనోగతంపై గట్టిగానే ఆధారపడ్డాయంటే అతిశయోక్తి కాదంటారు డాక్టర్ మిశ్రా.

- స్వింగ్ స్టేట్లుగా పేరుబడ్డ 10 రాష్ట్రాల్లో ఉన్న దక్షిణాసియా ఓటర్లలో ఇండియన్లే మెజారిటీ.
- స్వింగ్ స్టేట్లలో పెన్సిల్వేనియాను అత్యంత కీలకమైనదిగా చెప్తారు. అలాంటి రాష్ట్రంలో అధ్యక్ష ఎన్నికల ఫలితాన్ని తేల్చడంలో బక్స్ కౌంటీది నిర్ణయాక పాత్ర. అక్కడ ఆధిపత్యం పూర్తిగా ఇండియన్లదే!
- దక్షిణాసియాకు చెందిన 48 లక్షల మంది పై చిలుకు యువ ఓటర్లను ప్రభావితం చేయడంలో భారతీయులు కీలకంగా వ్యవహరిస్తున్నట్టు మిశ్రా వివరించారు.
- గత రెండు అధ్యక్ష ఎన్నికల్లోనూ భారతీయ అమెరికన్లు భారీ సంఖ్యలో ఓటేశారు. 2020లో 71 శాతం మంది ఓటేశారు. తాజా ఆసియన్ అమెరికన్ ఓటర్ సర్వేలో ఏకంగా 91 శాతానికి పైగా ఈసారి ఓటేస్తామని చెప్పారు!

పార్టీలకు నిధుల వెల్లువ

భారతీయ అమెరికన్ల సగటు వార్షిక ఆదాయం 1.45 లక్షల డాలర్లు. అమెరికన్లతో పోలిస్తే ఇది 21 శాతం ఎక్కువ. కొన్నేళ్లుగా ప్రధాన పార్టీలకు వారినుంచి నిధులు పోటెత్తుతున్నట్టు డెమొక్రటిక్ పార్టీ నేషనల్ ఫైనాన్స్ కమిటీ (డీఎన్ఎఫ్సీ) సభ్యుడు అజయ్ భుటోరియా చెబుతున్నారు. ''నేను 20 ఏళ్లకు పైగా నిధుల సేకర్తగా వ్యవహరిస్తున్నా. మనవాళ్లు ఈ స్థాయిలో రాజకీయ విరాళాలివ్వడం గతంలో ఎన్నడూ లేదు'' అంటూ విస్మయం వెలిబుచ్చారు. రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఇండియన్ అమెరికన్ల సంఖ్య కూడా బాగా పెరుగుతోందని ఆయన చెప్పుకొచ్చారు. డీఎన్ఎఫ్సీలో 5 శాతానికి పైగా భారతీయులే ఉండటం విశేషం. భారీ విరాళాలిస్తున్న వారితో పాటు పార్టీలకు, వాటి ఎన్నికల ప్రచార కార్యకలాపాలకు చిన్న మొత్తాలు అందజేస్తున్న అమెరికన్ల సంఖ్య కూడా భారీగా పెరుగుతోందని ఆసియన్ అమెరికన్ డయాస్పోరాలో అతి పెద్దదైన రాజకీయ కార్యాచరణ కమిటీ ఏఏపీఐ విక్టరీ ఫండ్ చైర్మన్ శేఖర్ నరసింహన్ చెప్పుకొచ్చారు. 2012 నుంచీ ఇండియన్ అమెరికన్లలో ఈ ధోరణి బాగా పెరుగుతోందని డ్రూ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సంగయ్ మిశ్రా వెల్లడించారు. అమెరికా అధ్యక్ష పీఠానికి దారి సిలికాన్ వ్యాలీ గుండా వెళ్తుందన్నది నానుడి. కీలకమైన ఆ టెక్ రాజధానిలో భారతీయులదే హవా. హారిస్కు కాలిఫోర్నియాలో ఇటీవల ఒక్క వారంలోనే ఏకంగా 5.5 కోట్ల డాలర్ల విరాళాలు పోగయ్యాయి! వాటిలో మనవారి నుంచి వసూలైనవే ఎక్కువ. డెమొక్రాట్ పార్టీకి భారీ విరాళాలిచ్చిన జాబితాలో 60 మందికి పైగా ఇండియన్ అమెరికన్లు న్నారు. వీరిలో పారిశ్రామిక దిగ్గజం ఇంద్రా నూయీ మొదలుకుని ఏఐ ఇన్వెస్టర్ వినోద్ ఖోస్లా దాకా పలువురి పేర్లున్నాయి.

రిపబ్లికన్లకూ...

రిపబ్లికన్ పార్టీకి మద్దతిస్తున్న ఇండియన్ అమెరికన్ల సంఖ్య కూడా తక్కువేమీ కాదు. సంపత్ శివాంగి, హోటల్ పరిశ్రమ దిగ్గజం డానీ గైక్వాడ్ వంటి పలువురు ఎన్నారైలు ట్రంప్ ప్రచార కార్యకలాపాలకు భారీ విరాళాలిస్తున్నారు. అయితే 2020 నుంచీ ఇండియన్ అమెరికన్లు, ముఖ్యంగా హిందువులు రిపబ్లికన్ పార్టీకి క్రమంగా దూరమవుతున్న వైనం స్పష్టంగా కన్పిస్తోంది.

అధికార పదవుల్లోనూ...

అమెరికాలో అన్ని స్థాయిల్లోనూ అధికార పదవుల్లో కూడా భారతీయుల హవా సాగుతోంది. సెనేట్, ప్రతినిధుల సభతో పాటు రాష్ట్రాల సెనేట్లు, అసెంబ్లీలు మొదలుకుని సిటీ కౌన్సిళ్లు, స్కూలు బోర్డుల దాకా, జిల్లా అటార్నీలుగా నియమితులవుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది.

- యూఎస్ కాంగ్రెస్లో ఐదుగురు భారతీయ అమెరికన్లున్నారు. వచ్చే ఎన్నికల్లో ఇది ఏడుకు పెరుగుతుందని భావిస్తున్నారు.
- అమెరికా యువజనుల్లో భారతీయులు కేవలం 0.6 శాతమే. కానీ 4.4 శాతం మంది ప్రభుత్వంలో ఉన్నత స్థానాల్లో ఉన్నారు.
- బైడెన్-హారిస్ పాలన యంత్రాంగంలో 150 మందికి పైగా భారతీయ అమెరికన్లు కీలక స్థానాల్లో ఉన్నారు.
- హారిస్ అధ్యక్షురాలిగా నెగ్గితే ఈ సంఖ్య 200 దాటుతుందని అంచనా.
- అమెరికా జనాభాలో యూదులు 2 శాతమే అయినా కాంగ్రెస్లో వారి సంఖ్య 10 శాతం. కొన్నేళ్లలో భారతీయులు అమెరికా సమాజంపై ఆ స్థాయిలో ప్రభావం చూపుతున్నారన్నది ఒక అంచనా.

సగానికి పైగా డెమొక్రాట్లే!

- తాజా సర్వే ప్రకారం భారతీయ అమెరికన్లలో ఏకంగా 55 శాతం మంది డెమొక్రటిక్ పార్టీ మద్దతుదారులమని ప్రకటించుకున్నారు.
- 25 శాతం మంది రిపబ్లికన్ పార్టీకి మద్దతిస్తున్నారు.
- స్వతంత్రులు, తటస్థులు 15 శాతం మందిగా లెక్క తేలారు. మిగతావాళ్లు తమ రాజకీయ మొగ్గుదలపై మాట్లాడేందుకు ఇష్టపడలేదు.

సల్మాన్కు మళ్లీ బెదిరింపులు

- రూ.5 కోట్లు ఇవ్వకపోతే ప్రాణాలతో ఉండవు
- గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ముంబై ట్రాఫిక్ పోలీసులకు సందేశం
- బెదిరింపులను తేలికగా తీసుకోవద్దని సల్మాన్కు హెచ్చరిక
- బాంద్రాలో సల్మాన్ ఇంటి వద్ద భద్రత మరింత కట్టుదిట్టం



ముంబై: బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్కు మరోసారి బెదిరింపులు వచ్చాయి. రూ.5 కోట్లు ఇవ్వాలని ఆయనను డిమాండ్ చేస్తూ గుర్తు తెలియని వ్యక్తులు ముంబై ట్రాఫిక్ పోలీసుల ఫోన్ నెంబర్కు సందేశం పంపించారు. ''ఈ బెదిరింపులను తేలికగా తీసుకోవద్దు. సల్మాన్ ఖాన్ ప్రాణాలతో మిగిలి ఉండాలన్నా, లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్తో శత్రుత్వానికి ముగింపు పలకాలన్నా మాకు రూ.5 కోట్లు చెల్లించాలి. అడిగినంత సొమ్ము ఇవ్వకపోతే ఇటీవల హత్యకు గురైన మాజీ మంత్రి బాబా సిద్దిఖీ కంటే దారుణమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుంది'' అని దుండగులు సల్మాన్కు హెచ్చరికలు జారీ చేశారు. ఈ బెదిరింపుల వ్యవహారంపై దర్యాప్తు ప్రారంభించినట్లు ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు శుక్రవారం వెల్లడించారు. సల్మాన్కు బెదిరింపుల ఘటనపై ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) కింద వర్లీ పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్ పోలీసుల వాట్సాప్ హెల్ప్లైన్ నెంబర్కు గురువారం మధ్యాహ్నం ఈ సందేశం వచ్చిందన్నారు. ఇది ఎవరి నుంచి వచ్చిందో తెలుసుకొనేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. మరోవైపు తాజా బెదిరింపుల నేపథ్యంలో బాంద్రాలోని సల్మాన్ ఖాన్ ఇంటివద్ద పోలీసులు భద్రతను మరింత పటిష్టం చేశారు. లారెన్స్ బిష్ణోయ్ ముఠా నుంచి గతంలో సల్మాన్ ఖాన్కు బెదిరింపులు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఏప్రిల్లో ముంబై బాంద్రాలోని సల్మాన్ నివాసం ఎదుట బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యులు కాల్పులు జరిపారు. ఈ ఏడాది జూన్లో సల్మాన్ హత్యకు కుట్ర పన్నిన కేసులో మరో నిందితుడు సుఖ్బీర్ సింగ్ను పోలీసులు హరియాణాలోని పానిపట్లో గురువారం అరెస్ట్ చేశారు. అతడు బిష్ణోయ్ గ్యాంగ్ షూటర్ అని చెప్పారు.

పన్నూ హత్యకు కుట్ర కేసులో 'రా' మాజీ అధికారిపై
అమెరికా కోర్టులో అభియోగాలు

వాషింగ్టన్: ఖలిస్తాన్ ఉగ్రవాది గురు పత్వంత్సింగ్ పన్నూను హత్య చేయడానికి కుట్ర పన్నిన కేసులో భారత నిఘా సంస్థ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్(రా) మాజీ అధికారి వికాస్ యాదవ్పై అమెరికా అధికారులు అభియోగాలు మోపారు. పన్నూను అంతం చేయడానికి జరిగిన కుట్రలో వికాస్ యాదవ్ పాత్ర ఉందని ఆరోపించారు. ఈ మేరకు గురువారం న్యూయార్క్ కోర్టులో అభియోగ పత్రాలు సమర్పించారు. ఆయనను సీసీ-1(సహ కుట్రదారుడిగా) నిర్ధారించారు. పన్నూను హత్య చేయడానికి కిరాయి మనుషులను నియమించడం, మనీ లాండరింగ్కు పాల్పడడం అనే అభియోగాలు మోపారు. ప్రస్తుతం వికాస్ యాదవ్ ఆచూకీ తెలియడం లేదని పేర్కొన్నారు. 39 ఏళ్ల వికాస్ యాదవ్ గతంలో భారతదేశ విదేశీ ఇంటెలిజెన్స్ సేవలు, 'రా' వ్యవహారాలను పర్యవేక్షించే కేబినెట్ సెక్రటేరియట్లో పనిచేశారు. పన్నూ హత్యకు కుట్ర కేసులో భారతీయుడు నిఖిల్ గుప్తాను అమెరికా పోలీసులు గత ఏడాది చెక్ రిపబ్లిక్ దేశంలో అరెస్టు చేశారు. నిఖిల్ గుప్తా ప్రస్తుతం అమెరికాలో జైలులో ఉన్నాడు. అమెరికా గడ్డపై పన్నూను హత్య చేయడానికి భారత ఏజెంట్లు కుట్ర పన్నారని, ఈ కుట్రను తాము భగ్నం చేశామని అమెరికా దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. అయితే, అమెరికా అధికారుల ఆరోపణలను భారత ప్రభుత్వం ఇప్పటికే ఖండించింది. పత్వంత్సింగ్ పన్నూ ఇండియాలోని పంజాబ్ రాష్ట్రంలో జన్మించాడు. కెనడాకు వలస వెళ్లాడు. అక్కడి నుంచే భారత వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు. అతడికి కెనడాతోపా టు అమెరికా పౌరసత్వం కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

నిజ్జర్ హత్య కేసులో కెనడాలోనూ



వాషింగ్టన్: మరోవైపు కెనడాలో జరిగిన ఖలిస్తాన్ ఉగ్రవాది హరిదీప్ సింగ్ నిజ్జర్ అలియాస్ నిజ్జర్ హత్యతోనూ వికాస్ యాదవ్ పేరును ముడిపెట్టే పరిస్థితి కనిపిస్తోంది. నిజ్జర్ హత్య వెనుక భారత ఏజెంట్ల పాత్ర ఉందని కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. కెనడాలో 2023 జూన్ 18న నిజ్జర్ హత్య తర్వాత మృతదేహం తాలూకు రియల్-టైమ్ వీడియోను వికాస్ యాదవ్.. నిఖిల్ గుప్తాకు షేర్ చేశాడని అమెరికా అధికారులు చెబుతున్నారు. ఇదే సమాచారాన్ని అమెరికా ప్రభుత్వం కెనడాతో పంచుకొనే వీలుంది. దీన్నిబట్టి నిజ్జర్ హత్య కేసులో వికాస్ యాదవ్పై కెనడా ప్రభుత్వం కూడా అభియోగాలు నమోదు చేసే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

వయనాడ్లో బీజేపీ అభ్యర్థి ఖుష్బూ!

సాక్షి, న్యూఢిల్లీ: వయనాడ్ లోక్సభ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికలో తమ పార్టీ తరఫున సినీనటి ఖుష్బూ సుందర్ను బరిలోకి దింపాలని బీజేపీ అధిష్టానం యోచిస్తోందని తెలుస్తోంది. పార్టీ తరఫున పోటీలో నిలిపే అభ్యర్థుల షార్ట్లిస్ట్లో ఖుష్బూ పేరును సైతం చేర్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంకగాంధీకి ఖుష్బూ అయితేనే గట్టిపోటీ ఇవ్వగలరనే భావన వ్యక్తమవుతోంది. వయనాడ్లో వచ్చే నెల 13న పోలింగ్ జరగనుంది. పార్టీ సీనియర్లయిన ఎంటీ రమేశ్, శోభా సురేంద్రన్, ఏపీ అబ్దుల్లా కుట్టి, షాన్ జార్జ్ పేర్లను బీజేపీ తీవ్రంగా పరిశీలిస్తోంది. ఈ కసరత్తు కొలిక్కి వస్తున్న వేళ ఖుష్బూ పేరు తెరపైకి వచ్చింది. నిజానికి ఖుష్బూ 2010లో డీఎంకేలో చేరి, అనంతరం 2014లో కాంగ్రెస్లో చేరారు. పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా పనిచేశారు. అనంతరం 2021లో కాంగ్రెస్ను వీడి తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు. ఆమె ప్రస్తుతం బీజేపీ తమిళనాడు యూనిట్లో భాగంగా ఉన్నారు. తమిళనాడు నేపథ్యం ఉన్న ఆమెను వయనాడ్లో పోటీకి నిలిపే విషయమై బీజేపీ అగ్ర నాయకత్వం రాష్ట్ర పార్టీ నేతల అభిప్రాయాలను సేకరిస్తోంది. రాష్ట్ర శాఖ తెలిపే అభిప్రాయం మేరకు అభ్యర్థిత్వంపై పార్టీ తుది నిర్ణయం తీసుకోనుంది. ఒకట్రెండు రోజుల్లోనే పార్టీ అభ్యర్థిని ప్రకటించనుంది.



ఇజ్రాయెల్ వ్యూహం బ్యాక్ఫైర్!

- హమాస్ చీఫ్ యాహ్యా సిన్వర్ మృతి వీడియోతో పాలస్తీనా కట్టలు తెగిన ఆగ్రహం
- హమాస్ సభ్యులను భయకంపితులను చేయజూసిన ఇజ్రాయెల్కు ఎదురుదెబ్బ

పాలస్తీనా మిలిటెంట్ సంస్థ 'హమాస్' అధినేత యాహ్యా సిన్వర్(61) హత్య విషయంలో ఇజ్రాయెల్ వ్యూహం వికటిస్తోంది. హమాస్ సభ్యులను భయకంపితులను చేసి ఆత్మస్థైర్యం దెబ్బతీయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం విడుదల చేసిన డ్రోన్ వీడియో దృశ్యం నిజానికి వారిలో మరింత స్ఫూర్తిని రగిలిస్తోంది. ఇజ్రాయెల్పై భీకర పోరాటానికి పురికొల్పుతోంది. ఈ వీడియోను విడుదల చేయడం ద్వారా ఇజ్రాయెల్ పెద్ద తప్పు చేసిందని విశ్లేషకులు చెబుతున్నారు. గాజాలోని ఓ ఇంటిపై ఇజ్రాయెల్ జవాన్లు చేసిన దాడిలో సిన్వర్ మరణించిన సంగతి తెలిసిందే. ఈ దాడికి సంబంధించిన ఇజ్రాయెల్ సైన్యం విడుదల చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్గా మారింది. ఇజ్రాయెల్ దాడిలో తీవ్రంగా గాయపడిన సిన్వర్ చివరి క్షణాలు ఇందులో కనిపిస్తున్నాయి. సిన్వర్ కుడి చెయ్యి చాలావరకు నుజ్జునుజ్జుగా మారింది. బాంబుల దాడితో తీవ్రంగా దెబ్బతిన్న ఓ భవనంలో ఒక సోఫాలో ఆయన కూర్చొని ఉన్నారు. చుట్టూ దుమ్మూ ధూళి దట్టంగా పేరుకుపోయి ఉంది. తనపై దాడి చేస్తున్న డ్రోన్పై ఆయన ఎడమ చెయ్యితో కర్ర లాంటిది విసురుతూ కనిపించారు. ఒకవైపు ప్రాణాలు పోయే పరిస్థితి కనిపిస్తున్నా, మరోవైపు శత్రువుపై పోరాటం ఆపలేదంటూ సోషల్ మీడియాలో పోస్టుల వర్షం కురిసింది.

రక్షణ వలయం లేదు.. కవచం లేదు

గాజా భూభాగంలోని భారీ సొరంగంలో సిన్వర్ తలదాచుకుంటున్నాడని, చుట్టూ బాడీగార్డులతో దుర్భేద్యమైన రక్షణ వలయం ఏర్పాటు చేసుకున్నాడని, అంతేకాకుండా ఇజ్రాయెల్ నుంచి బందీలుగా పట్టుకొచ్చిన వారిని రక్షణ కవచంగా వాడుకుంటున్నాడని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ పలు సందర్భాల్లో చెప్పారు. ఇజ్రాయెల్ అధికారులు సైతం ఇదే విషయం పదేపదే వెల్లడించారు. కానీ, వీడియో దృశ్యం చూస్తే సిన్వర్ సొరంగంలో లేడు. బహుళ అంతస్తుల భవనంలో ఉన్నాడు. ఆయన చుట్టూ రక్షణ వలయం గానీ, రక్షణ కవచం గానీ లేదు. ఇజ్రాయెల్ చెప్పిందంతా అబద్ధమేనని ఈ దృశ్యాలు రుజువు చేశాయి.

మద్దతుదారుల కంటతడి

మృత్యువుకు చేరువవుతూ కూడా సిన్వర్ సాగించిన పోరాటాన్ని చూసి పాలస్తీనావాసులు, హమాస్ మద్దతుదారులు కంటతడి పెడుతున్నారు. వారిలో పెల్లుబుకుతున్న ఆగ్రహం ఇజ్రాయెల్పై కసిగా మారుతోంది. సిన్వర్ హత్యకు ప్రతీకారం తప్పదని కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. డ్రోన్ వీడియో దృశ్యం పాలస్తీనా పౌరులకు స్ఫూర్తిదాయకంగా మారడం గమనార్హం. వారంతా ఇజ్రాయెల్పై దుమ్మెత్తిపోస్తున్నారు. సిన్వర్ త్యాగాన్ని కొనియాడుతున్నారు. ఈ వీడియో ద్వారా ఇజ్రాయెల్ ఆశించింది ఒకటి కాగా, జరుగుతున్నది మరొకటి కావడం గమనార్హం

- సాక్షి, నేషనల్ డెస్క్



తనపై దాడి నిమిత్తం వస్తున్న డ్రోన్పైకి కర్ర విసురుతున్న యాహ్యా సిన్వర్. ఇజ్రాయెల్ విడుదల చేసిన ఈ వీడియో పాలస్తీనావాసుల్లో ఆగ్రహం జ్వాలలు రగుల్చుతోంది.

ఇదీ జరిగింది

సిన్వర్ హత్య ఆపరేషన్ గురించి ఇజ్రాయెల్ సైనికాధికారులు కొన్ని వివరాలు వెల్లడించారు. ఇజ్రాయెల్ సైన్యానికి చెందిన 828వ బిస్లామాచ్ బ్రిగేడ్ తాల్ అల్-సుల్తాన్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. సైనికుల కంట పడకుండా సందులు గొందులు తిరుగుతూ తప్పించుకొనేందుకు ప్రయత్నించారు. వారిలో ఒక వ్యక్తి ఒంటరిగా ఓ ఇంట్లోకి ప్రవేశించినట్లు ఇజ్రాయెల్ డ్రోన్లు గుర్తించాయి. దాంతో జవాన్లు ఆ ఇంటిని చుట్టుముట్టారు. యుద్ధట్యాంకుతో పేల్చివేశారు. ఈ ఘటనలో సిన్వర్ మరణించాడు. మిగిలిన ఇద్దరు వ్యక్తులను కూడా సైన్యం అంతం చేసింది. అయితే, తొలుత చనిపోయిన వ్యక్తి సిన్వర్ అని ఇజ్రాయెల్ సైన్యానికి తెలియదు. అనుమానంతో మృతదేహం వేలిని కత్తిరించి, ఇజ్రాయెల్కు పంపించి డీఎన్ఏ టెస్టు చేశారు. సిన్వర్ డీఎన్ఏతో అది సరిగ్గా సరిపోయింది. దాంతో చనిపోయింది సిన్వర్ అని తేల్చారు.

ఆప్ నేత సత్యేందర్ జైన్కు బెయిల్




న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసులో 2022 నుంచి నిర్బంధంలో ఉన్న ఆప్ నేత, ఢిల్లీ మాజీ మంత్రి సత్యేందర్ జైన్కు ఎట్టకేలకు బెయిల్ లభించింది. సత్యేందర్ జైన్కున్న నాలుగు కంపెనీల ద్వారా మనీ లాండరింగ్ జరిగిందన్న 2017 నాటి కేసులో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్(ఈడీ) 2022 మే 30వ తేదీన అరెస్ట్ చేసింది. అప్పటి నుంచి ఆయన జ్యుడీషియల్ కస్టడీలోనే ఉన్నారు. జైన్ బెయిల్ పిటిషన్ను శుక్రవారం విచారించిన ఢిల్లీ ప్రత్యేక కోర్టు జడ్జి విశాల్ గోగ్నె..'విచారణలో జాప్యాన్ని, ఇప్పటికే ఏడాదిన్నరగా జైన్ జైలులో ఉన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నాం. కేసు విచారణకు ఇంకా చాలా సమయం పట్టే అవకాశం ఉన్నందున, అప్పటి వరకు నిందితుడికి బెయిల్ ఇవ్వొచ్చని భావిస్తున్నాం'అని తీర్పులో పేర్కొన్నారు. రూ.50 వేల బెయిల్ బాండును, అంతే మొత్తంలో రెండు ష్యూరిటీలను సమర్పించాలని ఆదేశించారు.

అన్ని బెంచ్ల నుంచి ప్రత్యక్షప్రసారం!

న్యూఢిల్లీ: అన్ని బెంచ్ల నుంచి కేసుల విచారణను ప్రత్యక్షప్రసారం చేయడానికి సుప్రీంకోర్టు సిద్ధమవుతోంది. అందులోభాగంగా శుక్రవారం అన్ని బెంచ్ల విచారణల ప్రత్యక్షప్రసారాన్ని ట్రయల్రన్ నిర్వహించింది. యూట్యూబ్లో ప్రత్యక్షప్రసారం చేసింది. ఇప్పటిదాకా రాజ్యాంగ బెంచ్ల విచారణను, ఆర్.జి.కర్ వైద్యురాలి హత్యాచారంపై సుమోటో కేసు లాంటి ప్రజాప్రయోజనాలు ఇమిడి ఉన్న కేసులను ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. 2018 ఇచ్చిన చారిత్రక తీర్పు మేరకు వీటిని ప్రత్యక్షప్రసారం చేస్తోంది. మాజీ సీజేఐ యు.యు.లలిత్ నేతృత్వంలో ఫుల్కోర్టు రాజ్యాంగ ధర్మాసనాల విచారణను ప్రత్యక్షప్రసారం చేయాలని నిర్ణయించింది.

బ్రిక్స్ శిఖరాగ్రం కోసం 22న రష్యాకు మోదీ



న్యూఢిల్లీ: బ్రిక్స్ శిఖరాగ్ర భేటీలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ఈ నెల 22న రష్యా వెళ్లనున్నారు. రష్యాలోని కజాన్లో ఈ నెల 22, 23వ తేదీల్లో జరిగే శిఖరాగ్రంలో పాల్గొనాల్సిందిగా ప్రధాని మోదీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆహ్వానం పంపారని విదేశాంగ శాఖ శుక్రవారం తెలిపింది. పర్యటన సమయంలో ప్రధాని మోదీ బ్రిక్స్ సభ్య దేశాలు, ఆహ్వానిత దేశాల నేతలతో సమావేశమై ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరుపుతారని వివరించింది. ఈ సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్తో మోదీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. దీంతోపాటు చైనా అధ్యక్షుడు జిన్ పింగ్తోనూ ఆయన సమావేశమయ్యే అవకాశాలున్నాయని అంటున్నారు. అయితే, దీనిపై ఎటువంటి అధికార ప్రకటన వెలువడలేదు. బ్రిక్స్ శిఖరాగ్రం ఈ ఏడాది ఇతివృత్తం 'స్ట్రెంథెనింగ్ మల్టీలేటరలిజం ఫర్ జస్ట్ గ్లోబల్ డెవలప్మెంట్ అండ్ సెక్యూరిటీ'. బ్రిక్స్ వేదిక ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటికి పరిష్కారాలను కనుగొనే ప్రయత్నం చేయనుంది.

సీట్ల పంపకాల్లో 'మహా' ప్రతిష్టంభన!

28 సీట్లపై ఎంవీఏలో పీటముడి

సాక్షి, న్యూఢిల్లీ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మహావికాస్ అఘాడీలో టికెట్ల పంపిణీపై విభేదాలు మొదలయ్యాయి. 288 స్థానాల్లో 260 స్థానాలపై మధ్య ఏకాభిప్రాయం కుదరగా, 28 సీట్లపై పీటముడి పడినట్లు సమాచారం. అఘాడీ భాగస్వాములు కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పి) శుక్రవారం 9 గంటల పాటు జరిగిన మారథాన్ సమావేశం జరిపాయి. . విదర్భలో ఐదు సీట్లు కావాలని కాంగ్రెస్ను ఉద్ధవ్ ఠాక్రే డిమాండ్ చేశారు.

ఆ సీట్లనే కోరుతున్న శివసేన

విదర్భ ప్రాంతంలో 62 అసెంబ్లీ స్థానాలున్నాయి. గత ఎన్నికల్లో ఇక్కడ ఉమ్మడి శివసేన, బీజేపీ కూటమి 27 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 15, శివసేన 12 స్థానాలు నెగ్గాయి. కాంగ్రెస్ ఒంటరిగా 29, ఎన్సీపీ ఐదు సీట్లు గెలిచాయి. అజిత్ పవార్ తిరుగుబాటు తర్వాత కూడా విదర్భ ఎమ్మెల్యేలు శరద్ పవార్ వెంటే ఉన్నారు. శివసేనలో తిరుగుబాటు తర్వాత నలుగురు ఎమ్మెల్యేలు సీఎం ఏకనాథ్ షిండే వైపు, 8 మంది ఉద్ధవ్ వైపు నిలిచారు. ఇప్పుడు పాత ఫలితాలపైనే సమస్య నెలకొంది. సీట్ల పంపిణీ ఫార్ములా ప్రకారం 2019లో గెలిచిన 12 సీట్లు తమకే దక్కాలని ఉద్ధవ్ వాదిస్తున్నారు. కాంగ్రెస్ అందుకు సిద్ధంగా లేదని సమాచారం. ముంబైలోని 20-25 స్థానాల్లో స్థానాల పంపకాలు కూడా సమస్యగా మారింది. ముంబై శివసేన కంచుకోట గనుక అక్కడ ఎక్కువ సీట్లు రావాలని ఉద్ధవ్ డిమాండ్ చేస్తున్నారు. గత ఎన్నికల్లో ముంబైలోని 36 అసెంబ్లీ స్థానాలకు గాను 31 స్థానాలను బీజేపీ-సేన కూటమి కై వసం చేసుకుంది. శివసేన 22, బీజేపీ 9 సీట్లు గెలిచాయి. కాంగ్రెస్ ఐదు సీట్లు గెలుచుకుంది.

జార్ఖండ్లో ఎన్డీఏ పక్షాల సీట్ల పంపకాలు ఖరారు

బీజేపీ 68, ఏజేఎస్యూ 10, జేడీయూ 2, ఎల్జేపీ(ఆర్)కు ఒక స్థానం

సాక్షి, న్యూఢిల్లీ: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఎన్డీఏ మధ్య సీట్ల పంపకాలు ఖరారయ్యాయి. బీజేపీ 68, ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజేఎస్యూ) 10, జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ) 2, లోక్జనశక్తి పార్టీ (రామ్విలాస్) 1 స్థానంలో పోటీ చేయాలని శుక్రవారం నిర్ణయించాయి. ఏజేఎస్యూ- సిల్లి, రామ్గఢ్, గోమియా, ఇచాగఢ్, మాండు, జుగ్సాలియా, డుమ్రి, పాకూర్, లోహర్దగా, మనోహర్పూర్, జేడీయూ- జంషెడ్పూర్ వెస్ట్, తమర్ స్థానాల నుంచి, ఎల్జేపీ (ఆర్) ఛత్రా అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. జార్ఖండ్లో నవంబర్ 13, 20ల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. 23న ఫలితాలు ప్రకటించనున్నారు.

తూచా తప్పకుండా అమలవాల్సిందే

బాల్య వివాహ నిషేధ చట్టంపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ
వ్యక్తిగత చట్టాలు అడ్డుకావని వ్యాఖ్య

న్యూఢిల్లీ: బాల్య వివాహాల నిషేధ చట్టాన్ని తూచా తప్పకుండా అమలు చేయాల్సిందేనని సుప్రీంకోర్టు పేర్కొంది. దాని అమలులో వ్యక్తిగత వివాహ చట్టాలతో పాటు మరే ఇతర చట్టాలూ అడ్డంకి కాజాలవని స్పష్టం చేసింది. వాటిలో ఏది ముందనే ప్రశ్న తలెత్తే సందర్భంలో బాల్య వివాహాల నిషేధ చట్టమే అమలవుతుందని పేర్కొంది. సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు 141 పేజీల తీర్పు వెలువరించింది. బాల్య వివాహాల కట్టడికి మరింత సమర్థమైన విధానాలను అమలు చేయాలంటూ దాఖలైన పిల్పై ధర్మాసనం విచారణ జరిపింది. ''బాల్య వివాహాలు ఒక సామాజిక రుగ్మత. బాలలకు, ముఖ్యంగా బాలికలకు ఆరోగ్యం, విద్య, ఉపాధితో పాటు జీవించే అవకాశాలనే ప్రశ్నార్థకం చేస్తుంది. కానీ భారత్లో బాల్య వివాహాలు ఇంకా ప్రబలంగా ఉండటం దురదృష్టకరం'' అంటూ ఆవేదన వెలిబుచ్చింది. వాటి కట్టడికి జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా బాల్య వివాహాల నిషేధ అధికారులను నియమించాల్సిందిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది. చట్టం అమలు తీరుతెన్నులపై మహిళా, శిశు సంక్షేమ, హోం శాఖలు మూడు నెలలకు ఓసారి సమీక్ష జరపాలని సూచించింది. బాల్య వివాహాలు తప్పని, వాటికి కఠిన శిక్షలు తప్పవని విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. ''వాటిని అడ్డుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లు, ఎస్పీలపై ఉంటుంది. ఇందుకోసం పోలీసు శాఖలో జువనైల్ విభాగాన్ని ఏర్పాటు చేయాలి'' అని పేర్కొంది.

యూఏఈ వీసా ఆన్ అరైవల్.. షరతులు వర్తిస్తాయి

అబుదాబి: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)సందర్శించాలనుకునే భారతీయులకు శుభవార్త. యూఏఈ ప్రభుత్వం భారత జాతీయుల కోసం నూతనంగా వీసా ఆన్ అరైవల్ విధానాన్ని ప్రకటించింది. అయితే, ఇందుకు ఓ షరతు విధించింది. అమెరికా, యూకే, ఇతర ఏదైనా యూరోపియన్ యూనియన్ దేశం శాశ్వత నివాస కార్డు లేదా వీసా ఉన్న వ్యక్తులే వీసా ఆన్ అరైవల్కు అర్హులు. ఈ విధానం ద్వారా యూఏఈలో అడుగు పెట్టిన వెంటనే వీరికి 14 రోజుల వీసా లభిస్తుంది. అవసరమైన ఫీజు చెల్లించిన పక్షంలో మరో 60 రోజుల వరకు దీనిని పొడిగించుకునే వెసులుబాటు కూడా ఉంది. ఇందుకుగాను..అమెరికా వీసా, నివాస కార్డు లేక గ్రీన్ కార్డు ఉన్న వారు.. ఏదేని యూరోపియన్ యూనియన్ దేశం లేక యునైటెడ్ కింగ్డమ్ వీసా లేక నివాస ధ్రువీకరణ కార్డు ఉన్నవారు అర్హులు. కనీసం ఆరు నెలల వ్యాలిడిటీ ఉన్న పాస్పోర్టు కూడా వీరు చూపాల్సి ఉంటుంది. భారత్-యూఏఈల బంధం బలపడుతున్న వేళ ఈ నూతన విధానం అమల్లోకి రావడం విశేషం. యూఏఈలో ప్రస్తుతం 35 లక్షల మంది భారతీయులు ఉంటున్నారు.

లలిత ప్రియ కమలం విరిసినది..



కలువకు చంద్రుడు ఎంతో దూరం.. కమలానికి సూర్యుడు మరీ దూరం.. అన్నాడొక సినీ కవి.

ఎంత దూరంలో ఉంటేనేం.. సూరీడి స్పర్శతోనే ఆ కమలాలు మేలుకున్నాయి.. మంచు తుంపరల అభిషేకంతో మెరిసిపోయాయి. తేనెవాగును సృష్టించి తేనెటీగల ఆకలి తీర్చాయి. వేకువ వేళ విశ్వానికి ఆహ్లాదం పంచాయి. పెద్దపల్లి ఎల్లమ్మ చెరువులో శుక్రవారం ఉదయం కనిపించిన మనోహర దృశ్యమిది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

మద్యం ధరలు పెంపు!



క్వార్టర్‌కు రూ.20, బీరుకు రూ.10 పెంచే యోచన

- గత ఏడాది మేలో తగ్గించిన రూ.10తో పాటు మరో రూ.10 అదనంగా పెంచే అవకాశం
- ఈ ఏడాది 6 నెలల్లో రూ.2500 కోట్ల లోటులో ఎక్సైజ్ శాఖ
- లోటు పూడ్చుకునేందుకు ధరలు పెంచుతామని సీఎం వద్ద ప్రతిపాదన.. ఎలైట్ బార్ల స్థానంలో ఎలైట్ వైన్స్..రాష్ట్రవ్యాప్తంగా 20–25 షాపులిచ్చే చాన్స్

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో మద్యం ధరలు పెరిగే అవకాశాలున్నాయి. ఎప్పటి నుంచి పెరిగేది ఖరారు కాకపోయినా కచ్చితంగా మద్యం ధరలు పెంచాల్సిన పరిస్థితి ఎక్సైజ్ శాఖకు ఏర్పడింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది రాబడి తగ్గిపోవడం, గత ఏడాదిలో మద్యం ధరలు తగ్గించిన కారణంగా ఏర్పడిన లోటును ఇప్పుడు పూడ్చుకునే యోచనలో ఎక్సైజ్ యంత్రాంగం ఉంది. ఈ మేరకు మద్యం ధరల పెంపు ద్వారా రూ.2వేల కోట్ల మేర అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని యోచిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మద్యం ధరల పెంపుపై ప్రతిపాదన పెట్టినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడమే తరువాయి క్వార్టర్ లిక్కర్‌కు రూ.20, బీరు సీసాపై రూ.10 పెంచేందుకు ఎక్సైజ్‌శాఖ సర్వం సిద్ధం చేసుకుంది.

ఎన్నికల షెడ్యూల్ వస్తుందనే ఆలోచనతో గత ఏడాది ముందస్తుగానే వైన్‌షాపుల టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. లైసెన్సు ఫీజులు, దరఖాస్తు రుసుం రూపేణా రూ.2వేల కోట్ల వరకు అదనపు ఆదాయం వచ్చింది. దీంతో ఇప్పుడు రూ.2,500 కోట్లు లోటు చూపెడుతోందని, అమ్మకాల వారీగా చూస్తే గత ఏడాదితో పోలిస్తే తగ్గలేదని ఎక్సైజ్ శాఖ వర్గాలంటున్నాయి. మరోవైపు గత ఏడాది మేలో ప్రతి క్వార్టర్ బాటిల్‌పై రూ.10 తగ్గించడంతో రూ.800 కోట్లు లోటు వచ్చిందని చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో గత మేలో తగ్గించిన రూ.10తో పాటు మరో రూ.10 పెంచితే రూ.1600 కోట్లు, బీర్ల రేటు రూ.10 పెంచడం ద్వారా రూ.300 కలిపి మొత్తం రూ.1900 కోట్ల వరకు నష్టాన్ని పూడ్చుకోవచ్చని భావిస్తోంది. ఇటీవల సీఎం సమక్షంలో రాబడి శాఖలపై జరిగిన సమీక్షలో మద్యం ధరల పెంపు గురించి ఎక్సైజ్ శాఖ ప్రతిపాదించినట్టు తెలిసింది. అయితే, సీఎం రేవంత్ ఇందుకు అంగీకరించలేదని, ఈ ప్రతిపాదనపై మరోమారు చర్చిద్దామని వాయిదా వేసినట్టు సమాచారం.

గత ఏడాది రూ.2వేల కోట్ల వరకు అదనపు ఆదాయం

ఎలైట్ బార్లకు 'నో'...

గత ప్రభుత్వ హయాంలో అమల్లోకి వచ్చిన ఎలైట్ బార్ల విధానానికి రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి పలకబోతోంది. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న సాధారణ బార్‌అండ్ రెస్టారెంట్లకు తోడు గత మూడు, నాలుగేళ్ల కాలంలో 89 ఎలైట్ బార్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. లైసెన్స్ ఫీజు 10 శాతం అదనంగా ఉండే ఈ షాపుల కోసం మరో 50 వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పుడు ఈ దరఖాస్తులన్నింటిని రద్దు చేయాలని, ఇప్పటివరకు అనుమతి వచ్చిన ఎలైట్ బార్లు మినహా భవిష్యత్‌లో అనుమతులు ఇవ్వొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. వీటి స్థానంలో ఎలైట్ వైన్‌షాపుల విధానాన్ని తీసుకురావాలని యోచిస్తోంది. నగరపాలికలతో పాటు కీలకమైన మున్సిపాలిటీల్లో కలిపి రాష్ట్ర వ్యాప్తంగా 25 వరకు ఎలైట్ వైన్‌షాపులకు అనుమతిచ్చే విషయాన్ని పరిశీలిస్తోంది. త్వరలోనే దీనిపై నిర్ణయం వెలువడుతుందని, ఈ మేరకు న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా ఎలైట్ వైన్‌షాపులకు త్వరలోనే టెండర్లు పిలుస్తామని ఎక్సైజ్‌శాఖ వర్గాలు చెబుతున్నాయి.

నగ్నంగా జడ్జి ముందుకు..

- మంచంపై పడుకుని ఆన్‌లైన్ లైవ్‌లోకి వచ్చిన వ్యక్తి..
- పోలీసులకు ఫిర్యాదు చేసిన హైకోర్టు రిజిస్ట్రార్

సాక్షి , అమరావతి : ప్రజలకు న్యాయాన్ని మరింత చేరువ చేయాలన్న సదుద్దేశంతో తీసుకొచ్చిన కోర్టు లైవ్ ప్రొసీడింగును కొందరు వ్యక్తులు అపహాస్యం చేస్తున్నారు . కోర్టు కార్యకలాపాలు ప్రత్యక్ష ప్రసారం అవుతున్న సమయంలో లాగిన్ అయి అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఇలా ఓ వ్యక్తి నాలుగు రోజుల క్రితం హైకోర్టు ఆన్‌లైన్ విచారణలో నగ్నంగా ప్రత్యక్షమయ్యాడు. ఇది హైకోర్టులో కలకలం రేపింది. ఈ నెల 15న కిట్టు అనే పేరుతో ఓ వ్యక్తి మైక్రోసాఫ్ట్ టీమ్స్ యాప్ ద్వారా 17వ కోర్టులోకి లాగిన్ అయ్యాడు . బట్టలు లేకుండా మంచంపై పడుకుని మాట్లాడుతూ కోర్టు కార్యకలాపాలకు విఘాతం కలిగించాడు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆ వ్యక్తిని బ్లాక్ చేశారు. ఘటనపై హైకోర్టు ఐటీ రిజిస్ట్రార్ ఏడుకొండలు తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటా'





ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని నినదిస్తున్న దిలావర్‌పూర్, గుండంపెల్లి గ్రామాల మహిళలు. (ఇన్‌సెట్లో) ప్రసంగిస్తున్న కోదండరాం

దిలావర్‌పూర్: ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపేలా ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా శుక్రవారం నిర్వహించిన ప్రజాగళం సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన బతుకుదెరువే పంట పొలాలన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే అని పేర్కొన్నారు. శాంతియుతంగా తెలంగాణ సాధించినట్లుగా, సమస్యలను కూడా శాంతిమార్గంలో పరిష్కరించుకుందామన్నారు. స్థానిక రైతుల కష్టాలు తనకు తెలుసని చెప్పారు. రైతులు తాము నమ్ముకున్న భూములు, తమ పల్లెలను కాపాడుకునేందుకు చేసిన సంకల్పం బలమైందని తెలిపారు. ఇథనాల్ ఫ్యాక్టరీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సభలో పీవోడబ్ల్యూ జాతీయ నాయకురాలు వి.సంధ్య, వివిధ ప్రజా సంఘాల నేతలు, ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి నాయకులు పాల్గొన్నారు.

మీ వివరణేంటో చెప్పండి

- రాధాకిషన్‌రావు బెయిల్‌పై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు (ఏ–5) రిటైర్డ్ పోలీస్ అధికారి పి.రాధాకిషన్ రావు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై ప్రభుత్వ వివరణేంటో తెలుసుకొని చెప్పాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 23కి వాయిదా వేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రాధాకిషన్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. ఇతర నిందితులు ఇచ్చిన తప్పుడు వాంగ్మూలం మేరకు తనను అరెస్టు చేశారని, సీనియర్ సిటిజన్ అయిన తాను మార్చి నుంచి జైలులో ఉంటున్నానని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ అంశంపై పూర్తి వివరాలు తెలుసుకొని, నివేదించాలని పీపీని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేశారు.

కొత్తగా 60 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు

- ప్రతి నియోజకవర్గంలో ఒక ఏటీసీ ఉండేలా ప్రణాళిక
- ఈ దిశగా చర్యలు వేగవంతం చేసిన కార్మిక ఉపాధి కల్పన, శిక్షణ విభాగం
- ఇప్పటికే పలు జిల్లాల నుంచి ప్రతిపాదనలు పంపిన కలెక్టర్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని యువతకు స్కిల్ కోర్సులు అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలని నిర్ణయించింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఐటీఐ (పారిశ్రామిక శిక్షణ సంస్థ)లను ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్)లుగా అప్‌గ్రేడ్ చేసింది. ప్రస్తుతం ఈ ఏటీసీలు పరిమిత సంఖ్యలో ఉండగా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం ఒకటి చొప్పున ఉండేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఏటీసీలు లేని సెగ్మెంట్లను గుర్తిస్తూ... అక్కడ కొత్తగా వాటి ఏర్పాటుకు సంబంధించిన కార్యాచరణ వేగవంతం చేసింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 59 నియోజకవర్గాల్లో 65 ఏటీసీలున్నాయి. ఒకట్రెండు చోట్ల రెండేసి ఏటీసీలు ఉండగా, 60 నియోజకవర్గాల్లో మాత్రం వీటి ఊసే లేదు. ఈ నేపథ్యంలో ఏటీసీలు లేని చోట కొత్తగా నెలకొల్పేందుకు కార్మిక ఉపాధి కల్పన శాఖ కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు స్థల లభ్యత, ఇతర వసతులను పరిగణనలోకి తీసుకొని ప్రతిపాదనలు పంపాలని కోరింది. ప్రస్తుతం వరంగల్ రీజియన్ పరిధిలో 35, హైదరాబాద్ రీజియన్ పరిధిలో 30 ఏటీసీలు ఉన్నాయి. హైదరాబాద్ రీజియన్‌లో ఉన్న వాటిల్లో అత్యాధునిక ట్రేడ్‌లను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చారు. హైదరాబాద్ జిల్లాలోని ఆరు ఏటీసీలను ఇప్పటికే మారుతి, హ్యుందాయ్, ఏషియన్ పెయింట్స్ లాంటి సంస్థలు దత్తత తీసుకున్నాయి. దీంతో ఆయా సంస్థల్లోని ట్రేడ్‌లలో చేరేందుకు అభ్యర్థులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. తాజాగా అన్ని చోట్ల అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ట్రేడ్‌లను అందుబాటులోకి తేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం... 2వేల కోట్లకు పైగా బడ్జెట్‌తో ఆధునీకరణ పనులు చేపట్టడంతో ఐటీఐ ట్రేడ్‌లకు ఇప్పుడిప్పుడే డిమాండ్ పెరుగుతోంది. ఈ క్రమంలో అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేయడంతో క్షేత్రస్థాయి నుంచి జిల్లా కలెక్టర్లు ప్రతిపాదనలు పంపుతున్నారు. ఇప్పటికే 20కి పైగా కొత్త ఏటీసీల ఏర్పాటు కోసం ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతిపాదనలు రూపొందించగా, అవి కార్మిక ఉపాధి కల్పన, శిక్షణ విభాగానికి చేరాయి. అతి త్వరలో పూర్తిస్థాయిలో ప్రతిపాదనలు వస్తాయని అధికారులు చెబుతున్నారు.



భారీ గుమ్మడికాయతో గింగెర్

వీరీ వీరీ గుమ్మడిపండు.. వీటి బరువెంత?

సాధారణంగా గుమ్మడికాయలు ఎంత బరువుంటాయి? చిన్నవైతే 3 కిలోల నుంచి 8 కిలోల వరకు ఉంటాయి. కాస్త భారీగా ఉంటే మహా అయితే 20 నుంచి 30 కిలోలలోపు తూగుతాయి..



రెండో స్థానం పొందిన గుమ్మడికాయ

కానీ అమెరికాలో మాత్రం వందల కేజీల బరువుంటాయి. మనదగ్గర పందెం కోళ్లను పెంచినట్టు అమెరికాలో గుమ్మడికాయలను ప్రత్యేక శ్రద్ధతో పెంచుతారు. ఎందుకంటే వీటికి పోటీలు నిర్వహిస్తారు. దీంతో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి గుమ్మడికాయలను భారీగా పండిస్తుంటారు. ఇటీవల ఉత్తర కాలిఫోర్నియాలోని హాఫ్‌మూన్ బేలో జరిగిన 51వ వార్షిక గుమ్మడికాయల పోటీలో మిన్నెసోటాలోని అనోకాకు చెందిన ట్రావిస్ గింగెర్ అనే హార్టీకల్చర్ ఉపాధ్యాయుడు 2,471 పౌండ్ల (దాదాపు 1,121 కిలోల) బరువున్న గుమ్మడికాయతో విజేతగా నిలిచాడు. వరుసగా నాలుగేళ్ల నుంచి ఈ పోటీలో అతడిదే విజయం.

సోనామా కౌంటీకి చెందిన బ్రాండన్ డాసన్ 2,465 పౌండ్ల (దాదాపు 1,118 కిలోల) గుమ్మడికాయ పండించి రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. అన్నట్టు.. గతేడాది నిర్వహించిన పోటీల్లో గింగెర్ 1,247 కిలోల గుమ్మడికాయతో ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఈసారి దానికి మించింది పండిద్దామని కృషి చేసినా కాస్త వెనకబడ్డానని చెప్పాడు. ఈ గుమ్మడికాయను మిన్నెసోటా నుంచి జాగ్రత్తగా తీసుకురావడానికి 35 గంటల సమయం పట్టిందట.



సైకో కిల్లరే హతమార్చాడా?

- వృద్ధ దంపతుల హత్య కేసులో పురోగతి
- ఫోన్‌కాల్ డేటా, వేలిముద్రల ఆధారంగా దర్యాప్తు
- పోలీసుల అదుపులో నిందితుడు

కందుకూరు: రంగారెడ్డి జిల్లాలో ఇటీవల కలకలం రేపిన వృద్ధ దంపతుల హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించినట్టు తెలిసింది. ఓ సైకో కిల్లర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం. కందుకూరు మండల పరిధిలోని కొత్తగూడ సమీపాన ఉన్న ఓ వ్యవసాయ క్షేత్రంలో పనులు చేసుకుంటున్న నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు శాంతమ్మ–హోసయ్య దారుణంగా హత్యకు గురైన విషయం తెలిసిందే. వీరు ఉంటున్న వ్యవసాయ క్షేత్రంలోని మామిడి తోటను కందుకూరు మండలానికే చెందిన ఓ వ్యక్తి కాత సీజన్‌లో లీజుకు తీసుకునేవాడు. అతని స్నేహితుడు రెండు మూడుసార్లు ఈ క్షేత్రానికి వచ్చి వెళ్లాడు. అదే వ్యక్తి ఈ నెల 15వ తేదీన రాత్రి సమయంలో ఇక్కడకు వచ్చి వృద్ధ దంపతుల్ని కడతేర్చినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంటి నుంచి హత్యాస్థలికి వచ్చే సమయంలో సదరు నిందితుడు తన సెల్‌ఫోన్‌ను ఇంట్లోనే పెట్టి, స్విచ్ఛాఫ్ చేసి వచ్చాడు. వృద్ధ దంపతుల్ని హత్య చేసిన తర్వాత తన ఫోన్‌ను ఎవరైనా ఆన్ చేశారా అనే అనుమానంతో హోసయ్య సెల్ నుంచి తన నంబర్‌కు ఫోన్ చేసుకున్నాడు. మృతుడి కాల్ డేటా ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా, విస్తుగొలిపే వాస్తవాలు చెప్పినట్టు సమాచారం.

శైలజారెడ్డి హత్య కేసులో కూడా అతడే..

కందుకూరు మండల పరిధిలోని దాసర్లపల్లి సమీప వ్యవసాయ క్షేత్రంలో శైలజారెడ్డి 2023 మార్చి 3న రాత్రి హత్యకు గురైంది. ఇది కూడా తానే చేసినట్టు నిందితుడు అంగీకరించాడని తెలుస్తోంది. ఆ హత్య కేసుకు సంబంధించి పోలీసులకు ఇప్పటి వరకూ ఎలాంటి ఆధారాలు దొరకలేదు. శైలజారెడ్డిని హత్య చేసిన అనంతరం విదేశీ మద్యం బాటిల్‌ను తీసుకెళ్లే క్రమంలో పైన ఉన్న అట్టపెట్టెను అక్కడే పడేసి వెళ్లాడు. అప్పట్లో అట్టపెట్టెపై సేకరించిన వేలిముద్రలు... ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న నిందితుడి ఫింగర్ ప్రింట్స్‌తో సరిపోలినట్టు సమాచారం.

మర్డర్ చేసి.. ఆపై అందరితో వెళ్లి

మర్డర్ చేసిన అనంతరం ఏమీ తెలియనట్టే ఉదయాన్నే నిందితుడు అందరితో వచ్చి హడావుడి చేసేవాడని, అతని పరిచయస్తులు చెబుతున్నారు. కాగా పోలీసులు డాగ్ స్క్వాడ్‌ను పిలిపించే సమయంలో మాత్రం అక్కడి నుంచి తప్పించుకునేవాడని తెలుస్తోంది. రెండు ఘటనల్లోనూ నిందితుడు ఇలాగే వ్యవహరించినట్టు స్థానికులు చెబుతున్నారు. అయితే నిందితుడిపై ఇప్పటి వరకూ ఒక్క ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాలేదు. మద్యం, గంజాయికి బానిసైన నిందితుడు సైకోగా మారి హత్యలు చేస్తున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. స్థానికుల జోలికి వెళ్లకుండా బయటి వ్యక్తులు, ముఖ్యంగా ఫాంహౌస్‌లలో నివసిస్తున్న వారినే లక్ష్యంగా చేసుకొని హత్యలకు పాల్పడుతున్నట్టు తెలిసింది.

పీసీబీని వెంటనే ప్రక్షాళించాలి

- సామాజిక కార్యకర్త పీఎల్ఎన్.రావు, న్యాయవాది రాజేశ్‌కుమార్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మూసీనది పునరుజ్జీవానికి చర్యలు చేపట్టడానికి ముందే తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ)ని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని పర్యావరణ సామాజిక కార్యకర్త పీఎల్ఎన్.రావు, న్యాయవాది రాజేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. మూసీ ప్రక్షాళన, సుందరీకరణ చేసినా హైదరాబాద్‌కు చుట్టుపక్కల ఉన్న జిల్లాల్లోని వివిధ పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు, కాలుష్యాలు హుస్సేన్ సాగర్, మూసీలలో కలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవినీతిలో కూరుకుపోయిన పీసీబీ అధికారుల పనితీరుపై ప్రభుత్వం ఉన్నతస్థాయిలో సమీక్షించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టడానికి ముందే పీసీబీని ప్రక్షాళన చేయాలని కోరుతూ ఇటీవల సీఎస్‌కు వినతిపత్రం సమర్పించినట్టు పీఎల్ఎన్.రావు తెలిపారు. పీసీబీ పొల్యూషన్ కరప్షన్ బోర్డుగా మారిందని రాజేశ్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ పీసీబీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై చర్యలు చేపట్టాలని కోరారు. పీసీబీ అవసరాల మేరకు నూతన ప్రాంతీయ, జోనల్ కార్యాలయాలు, అప్పిలేట్ అథారిటీ వంటి వాటిని ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి మాజీ సర్పంచ్ ఠాకూర్ రాజారాంసింగ్, చౌటుప్పల్ మండలం ఆరెగూడెం మాజీ సర్పంచ్ జాల మల్లేశ్ యాదవ్, బాధిత రైతు చప్పిడి రంగారెడ్డి తమ ప్రాంతాల్లో పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యం కారణంగా ఎదురవుతున్న సమస్యల గురించి వివరించారు.

సామాజిక బాధ్యత పెంపులో కీలక పాత్ర

కంపెనీ సెక్రటరీల పాత్రపై గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

సాక్షి, హైదరాబాద్: సామాజిక బాధ్యతను పెంపొందించడంలో కంపెనీ సెక్రటరీల పాత్ర కీలకమని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. రెండు రోజుల పాటు 'ఇండల్జెన్స్ ఆఫ్ ఇంటెలిజెన్స్' అంశంపై ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీల 16వ దక్షిణ ప్రాంతీయ సదస్సును సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్)లో శుక్రవారం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రారంభించారు. ఈ సదస్సుకు ఐసీఎస్ఐ జాతీయ అధ్యక్షుడు నరసింహన్, వైస్ ప్రెసిడెంట్ ధనుంజయ్ శుక్లా, ఎస్ఐఆర్‌సీ చైర్మన్ ప్రదీప్ కులకర్ణి, కార్యదర్శి మహేందర్ తిరునగరి, హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ జీఎస్ఎన్ఎన్ గుప్తా, దక్షిణ భారతదేశంలోని 200లకుపైగా కంపెనీ సెక్రటరీలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ వృత్తిలోకి ప్రవేశించే యువ నిపుణులు తప్పనిసరిగా విషయపరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పెంచుకోవాలని సూచించారు. ఐసీ



ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు నరసింహన్ మాట్లాడుతూ..2047 నాటికి జీడీపీ 30 ట్రిలియన్‌గా మారుతుందని, అప్పుడు దేశానికి దాదాపు 2 లక్షల మంది కంపెనీ సెక్రటరీలు అవసరమవుతారన్నారు.

కృష్ణ అగర్వాల్‌కు దివంగత మదినీడి రామకృష్ణ సుభద్ర స్మారక అవార్డు

కంపెనీ సెక్రటరీల ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ ఎగ్జామినేషన్‌లో మొదటి ప్రయత్నంలోనే అన్ని పేపర్లలో ఉత్తీర్ణత సాధించిన కృష్ణ అగర్వాల్‌కు దివంగత మదినీడి రామకృష్ణ సుభద్ర స్మారక అవార్డును గవర్నర్ అందజేశారు. కృష్ణ అగర్వాల్‌కు దివంగత అహల్యా పుట్టీ స్మారక అవార్డు కూడా లభించింది.

ప్రైవేట్ సెక్రటరీలు, స్టెనోగ్రాఫర్లే వెన్నెముక

- ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శశాంక్ గోయెల్



సాక్షి, హైదరాబాద్: పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ప్రైవేట్ కార్యదర్శులు, స్టెనోగ్రాఫర్లే వెన్నెముకని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శశాంక్ గోయెల్ పేర్కొన్నారు. గత కొద్ది రోజులుగా జరుగుతున్న హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ)లో జరుగుతున్న లోక్‌సభకు చెందిన ప్రైవేట్ కార్యదర్శులు, స్టెనోగ్రాఫర్లకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఐఏఎస్ అధికారి శశాంక్ గోయెల్ మాట్లాడుతూ...ఈ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలు విధుల నిర్వహణలోను, సవాళ్లను అధిగమించడంలోనూ ఉపయోగపడతాయన్నారు.

కేటీఆర్ పరువు నష్టం కేసు 23కు వాయిదా

సిటీ కోర్టులు (హైదరాబాద్): మంత్రి కొండా సురేఖ తనపై అసత్య వ్యాఖ్యలు చేస్తూ.. పరువుకు భంగం కలిగించారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వేసిన పరువు నష్టం కేసు విచారణ ఈ నెల 23కు వాయిదా పడింది. ఈ కేసు విచారణ శుక్రవారం నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్, ఎక్సైజ్ కోర్టులో జరిగింది. కేటీఆర్ హాజరై వాంగ్మూలం ఇవ్వాలని గత విచారణ సందర్భంగా జడ్జి ఎస్.శ్రీదేవి ఆదేశించారు. కేటీఆర్ హైడ్రా, మూసీ ప్రజెంటేషన్ కార్యక్రమం వల్ల కోర్టుకు రాలేకపోతున్నందున వాయిదా వేయాలని ఆయన తరఫు న్యాయవాదులు అరవింద్, సిద్ధార్థ, బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాది జక్కుల లక్ష్మణ్ కోర్టుకు విన్నవించారు. తదుపరి విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించింది.

సాక్షి హైదరాబాద్

శనివారం । 19 । అక్టోబర్ । 2024



కలెక్టర్.. ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు?
ఓ సివిల్ కేసులో అప్పీల్ దాఖలు చేయడంలో ప్రభుత్వ ఆలస్యానికి కారణం ఎన్నికలని చెప్పడం పై హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. -10లో



ఫుల్ ట్రెండ్.. వేగన్ డైట్
వేగనిజం కాన్సెప్ట్‌కు చాలామంది ఆకర్షితులవుతున్నారు. పర్యావరణ పరిరక్షణ, జీవహింసకు దూరంగా ఉండాలని పేర్కొంటున్నారు.
- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం
నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. శనివారం కొన్నిచోట్ల ఉరుములు మెరుపులతో కూడిన తేలిక పాటి వర్షం కురిసే అవకాశముంది. సాయంత్రం గాలులు వీస్తాయి.



మేయర్ విజయలక్ష్మితో కమిషనర్ ఇలంబర్తి

సమన్వయంతో సాగుదాం

లక్డీకాపూల్: జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.ఇలంబర్తి శుక్రవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన మేయర్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. ఇలంబర్తికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఇరు విభాగాలు సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



ఇలంబర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

ఉన్నతాధికారులతో కమిషనర్ ఇలంబర్తి



సాక్షి, సిటీబ్యూరో: అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సూచించారు. శుక్రవారం ఆయన అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాలు నిర్వహిస్తున్న పనులు, కార్యక్రమాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా ఆయా విభాగాల అధికారులు సమర్థంగా, సమన్వయంతో పని చేయాలని కోరారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నగరవ్యాప్తంగా చెత్త సేకరణ ప్రక్రియ మరింత సమర్థంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయా విభాగాల ఉన్నతాధికారులు తమ అనుబంధ శాఖలతో సమీక్షలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, స్నేహ శబరీష్, నళినీ పద్మావతి, గీతా రాధిక, పంకజ, రఘు ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, సామ్రాట్ అశోక్, యాదగిరిరావు, అలివేలు మంగతాయారు, సత్యనారాయణ, సరోజ, చీఫ్ ఇంజినీర్లు దేవానంద్, భాస్కర్ రెడ్డి, ఎస్ఈ కోటేశ్వర్ రావు, సీసీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

20న 'సీఎం కప్ -2024 టార్చ్ రిలే'

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'సీఎం కప్ టార్చ్ రిలే' ఈ నెల 20న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఇ.వెంకటేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీఫ్ మినిస్టర్స్- 2024ను ప్రమోట్ చేయడానికి 33 జిల్లాలను కవర్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా టార్చ్ ర్యాలీ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం 4 గంటలకు టీకేఆర్ కమాన్ నుంచి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వరకు టార్చ్ రిలే నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 3న ప్రారంభమైన టార్చ్ రిలే కార్యక్రమం ఆదివారంతో ముగియనుంది. ముగింపు కార్యక్రమానికి జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, కోచ్‌లు సహా 500 మంది క్రీడాకారులు, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొంటారని చెప్పారు. క్రీడాభిమానులు హాజరై విజయవంతం చేయాలని వెంకటేశ్వర్‌రావు కోరారు.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



లక్డీకాపూల్ : గ్రూప్- 1 మెయిన్స్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రూప్ -1 మెయిన్స్ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో నిర్వహించిన కోఆర్డినేషన్ సమావేశంలో ఆయన పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి 27 వరకు జరిగే గ్రూప్-1 మెయిన్ పరీక్షలకు నగరంలోని 8 కేంద్రాలలో 5,613 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. 261 మంది పీడబ్ల్యూడీ అభ్యర్థుల కోసం బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు పరీక్షించాలని చీఫ్ సూపరింటెండెంట్‌లను ఆయన ఆదేశించారు.

షాకింగ్ బిల్స్!

మీటర్ రీడింగ్ నమోదు చేయకుండానే బిల్లుల జారీ

సాక్షి, సిటీబ్యూరో:

- మేడ్చల్ సర్కిల్ జీడిమెట్ల డివిజన్ ప్రగతినగర్ సెక్షన్ బాచుపల్లిలోని ఓ అపార్ట్‌మెంటులో విద్యుత్ లైన్‌మన్ మీటర్ రీడింగ్ నమోదు చేయకుండానే డోర్‌లాక్ పేరుతో మినిమం బిల్లు జారీ చేశారు. ఆగస్టులో 5 యూనిట్లకు బిల్లు ఇచ్చారు. సెప్టెంబర్‌లో ఇవ్వలేదు. అక్టోబర్‌లో మాత్రం ఏకంగా రూ.3,667 బిల్లు జారీ చేశారు. సదరు వినియోగదారుడు బాచుపల్లి ఏఈని ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా ఆయన స్పందించకపోవడంతో బాధితుడు కార్పొరేట్ కార్యాలయంలోని ఉన్నతాధికారులను ఆశ్రయించాల్సి వచ్చింది.
- హబ్సిగూడ సర్కిల్ కీసర డివిజన్ నారపల్లి సెక్షన్ పరిధిలోని ఓ వినియోగదారుడి ఇంట్లోని విద్యుత్ మీటర్‌కు ఒక నెలలో బిల్ కన్‌జమ్షన్, మరో నెలలో మీటర్ స్టకప్ అని నమోదు చేశారు. ఫలితంగా ఆయన ఇంటి నెలవారీ బిల్లు రూ.2 వేలు దాటింది. ఒక వైపు కరెంట్ వినియోగం జరగలేదంటూనే..మరో వైపు మినిమం బిల్లు పేరుతో అధిక బిల్లు జారీ చేశారు. కనీసం బిల్ స్టేటస్‌ను కూడా పట్టించుకోలేదు. వినియోగదారుడు ఈ లోపాన్ని గుర్తించి సంబంధిత సెక్షన్ అధికారులకు ఫిర్యాదు చేసినా కనీస స్పందన కూడా లేదు.



- ఆజామాబాద్ డివిజన్‌లోని రామాలయం సెక్షన్ పరిధిలో ఓ వినియోగదారుడి ఇంట్లో కరెంట్ మీటర్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. గత నాలుగు నెలలుగా స్టకప్‌లోనే ఉంది. రీడింగ్ నమోదు కావడంలేదు. వెంటనే ఆ మీటర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆపరేషన్స్ విభాగం డీఈ, ఏడీఈ, ఏఈలు ప్రతినెలా బిల్‌స్టేటస్‌పై రివ్యూలు నిర్వహించాల్సి ఉంది. కానీ ఇక్కడి అధికారులు అవేవీ పట్టించుకోకపోవడం, క్షేత్రస్థాయి లైన్‌మెన్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో సదరు వినియోగదారుడు నెలకు రూ.1,500కు పైగా బిల్లు చెల్లించాల్సి వస్తోంది.

..ఇలా మేడ్చల్, హబ్సిగూడ సర్కిళ్ల పరిధిలోనే కాదు శివారులోని సరూర్‌నగర్, సైబర్‌సిటీ, రాజేంద్రనగర్ సర్కిళ్లలోనూ ఇదే తంతు కొనసాగుతోంది. ఆపరేషన్ విభాగంలోని ఇంజినీర్ల నిర్లక్ష్యంతో వినియోగదారులు నష్టపోతున్నారు.

నెలకు రాబడి రూ.1,800 కోట్లు


- గ్రేటర్ పరిధిలో 60 లక్షలకుపైగా విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. వీరిలో 52 లక్షల మంది గృహ విద్యుత్ వినియోగదారులు, మరో 8లక్షల మంది వాణిజ్య వినియోగదారులు ఉన్నారు. పారిశ్రామిక, ఇతర కనెక్షన్లు మరో 2 లక్షల వరకు ఉన్నట్లు సమాచారం. వీరి ద్వారా సంస్థకు ప్రతి నెలా రూ.1,600 కోట్ల నుంచి రూ.1,800 కోట్లకుపైగా ఆదాయం సమకూరుతోంది.
- వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు డిస్కం.. అన్ని డివిజన్ల పరిధిలోనూ రెండు బృందాలను ఏర్పాటు చేసింది. విపత్తుల నిర్వహణ, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, సాంకేతిక సమస్యల పునరుద్ధరణ కోసం సెంట్రల్ బ్రేక్ డౌన్ (సీబీడీ) గ్యాంగ్‌ను ఏర్పాటు చేసింది. అదేవిధంగా కొత్త కనెక్షన్ల జారీ, లైన్లకు అంచనాలు రూపొందించడం, మీటర్ రీడింగ్, రెవెన్యూ వసూళ్ల కోసం ఆపరేషన్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. అత్యవసర పరిస్థితుల్లో సీబీడీ గ్యాంగ్‌లు చురుగ్గా పని చేస్తున్నాయి.

ఆపరేషన్ విభాగం పనితీరు అధ్వానం

- భారీ వర్షాలు, వరదలు, ఈదురు గాలులతో చోటు చేసుకున్న నష్టాలను గంటల వ్యవధిలోనే సీబీడీ గ్యాంగ్‌లు పునరుద్ధరిస్తున్నాయి. కానీ ఆపరేషన్ విభాగంలోని డీఈలు, ఏడీఈలు, ఏఈలు, లైన్‌మెన్లు మాత్రం ఆఫీసు దాటి బయటికి రావడం లేదు. ముఖ్యమైన మీటర్ రీడింగ్‌కు ఒక నెలలో రెగ్యులర్ లైన్‌మెన్లు, ఏఈలు, ఏడీఈలు వెళ్లాల్సి ఉంది. మరో నెలలో కాంట్రాక్టు కార్మికులతో రీడింగ్ నమోదు చేయాల్సి ఉంది. కానీ ప్రతి నెలా కాంట్రాక్ట్ మీటర్ రీడర్లు మినహా ఆపరేషన్ విభాగంలోని జేఎల్ఎంలు, ఏఈలు, ఏడీఈలు మాత్రం రీడింగ్‌కు వెళ్లడంలేదు.
- లైన్ల నిర్వహణ, విద్యుత్ చౌర్యం, రెవెన్యూ వసూళ్లపైనే కాదు.. కనీసం మీటర్ స్టేటస్‌పై రివ్యూలు కూడా నిర్వహించడం లేదు. డిస్కంలో కీలకమైన సైబర్ సిటీ, సరూర్‌నగర్, రాజేంద్రనగర్, మేడ్చల్ సర్కిళ్ల పరిధిలోని ఆపరేషన్ విభాగంలోని ఇంజినీర్ల అలసత్వం కారణంగా ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు నష్టపోతున్నారు. చేతికందుతున్న బిల్లులను చూసి.. లబోదిబోమంటున్నారు.

డోర్‌లాక్ పేరుతో అడ్డగోలు బాదుడు

- బిల్లింగ్ స్టేటస్‌పై రివ్యూల విస్మరణ
- కరెంట్ వాడకపోయినా.. మినిమం పేరుతో భారీ వడ్డన
- ఫిర్యాదులకు స్పందించని శివారు సర్కిళ్ల ఇంజినీర్లు
- లబోదిబోమంటున్న విద్యుత్ వినియోగదారులు



'స్థానిక' ప్రతినిధులేరీ?

ఖాళీగానే ఆ నాలుగు డివిజన్లు

- కార్పొరేటర్లు లేక ప్రజల ఇక్కట్లు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ)లోని నాలుగు డివిజన్లకు (వార్డులకు) స్థానిక ప్రజాప్రతినిధులైన కార్పొరేటర్లు లేక నెలలు గడిచిపోతున్నాయి. ఒక డివిజన్‌లోనైతే కార్పొరేటర్ లేక ఏడాదిన్నర దాటింది. అయినప్పటికీ ఇంకా ఆ డివిజన్లకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో స్థానిక ప్రజలకు ఇబ్బందుల పాలవుతున్నారు. చెత్త కుప్పలు, దోమలు, రోడ్లపై గుంతలు, రాత్రిపూట వెలగని వీధి దీపాలతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. తమ సమస్యలను ఎవరికి చెప్పాలో తెలియని దయనీయ పరిస్థితిని వారు ఎదుర్కొంటున్నారు.

ఇద్దరి మృతి.. మరో ఇద్దరు ఎమ్మెల్యేలుగా ఎన్నిక..


గుడిమల్కాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ (బీజేపీ) గత సంవత్సరం జనవరిలో మృతి చెందారు. ఇప్పటివరకూ ఆ డివిజన్‌కు ఉప ఎన్నిక నిర్వహించలేదు. ఎర్రగడ్డ డివిజన్ కార్పొరేటర్ షాహీన్‌బేగం (ఎంఐఎం) నాలుగు నెలల క్రితం మరణించారు. దానికీ ఉప ఎన్నిక జరగలేదు. గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఇద్దరు ఎంఐఎం కార్పొరేటర్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికవడంతో రెండు డివిజన్లు ఖాళీ అయ్యాయి. మెహిదీపట్నం కార్పొరేటర్‌గా ఉన్న మహ్మద్ మాజిద్ హుస్సేన్ నాంపల్లి ఎమ్మెల్యేగా, శాస్త్రిపురం డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్న మహ్మద్‌ముబీన్ బహదూర్‌పురా ఎమ్మెల్యేగా గెలిచారు. దీంతో ఆ రెండు చోట్లా పది నెలలుగా స్థానిక కార్పొరేటర్లు లేరు.

నిబంధనల ప్రకారం..

ఏ కారణం చేతనైనా ఒక కార్పొరేటర్ స్థానం ఖాళీ అయితే పాలకమండలి తదుపరి ఎన్నికలకు ఆర్నెల్లలోపు గడువు మాత్రమే ఉంటే ఉప ఎన్నిక నిర్వహించరు. ఆర్నెల్ల కంటే ఎక్కువ సమయం ఉంటే జీహెచ్‌ఎంసీ చట్టంలోని సెక్షన్ 7 మేరకు ఉప ఎన్నిక నిర్వహించాలి. అందుకుగాను డివిజన్ ఖాళీ అయిన 15 రోజుల్లోగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసి సమాచారమివ్వాలి. ఉప ఎన్నిక నిర్వహించాల్సిందిగా కోరాలి. నాలుగు నెలల్లోగా ఎన్నికల సంఘం ఉప ఎన్నిక నిర్వహించాలి. నాలుగు డివిజన్లు ఖాళీ అయిన సందర్భాల్లో ఎప్పటికప్పుడు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖలు రాసినట్లు జీహెచ్‌ఎంసీ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం మాత్రం ఇప్పటి వరకు నాలుగు డివిజన్లకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఖాళీగానే ఉన్నాయి.

కాలం గడుస్తున్నా..

జీహెచ్‌ఎంసీ పాలకమండలి గడువు అయిదేళ్లు కాగా.. ఖాళీ అయిన డివిజన్లను భర్తీ చేయకపోవడంతో ఒక స్థానంలో ఇప్పటికే ఏడాదిన్నర దాటిపోయింది. రెండు చోట్ల ఏడాది కావస్తోంది. మరో చోట నాలుగు నెలలు దాటింది. బహుశా.. వచ్చే 2025 చివరిలో లేదా 2026 జనవరిలో తిరిగి పాలకమండలి ఎన్నికలు జరగనున్నాయి. అంటే.. త్వరలో ఉప ఎన్నిక నిర్వహించినా.. కొత్తగా ఎన్నికయ్యే కార్పొరేటర్లకు దాదాపు ఏడాది కాలం మాత్రమే గడువుంటుంది. ఇంకా ఆలస్యం జరిగితే అదీ మిగలదు. ఈ నేపథ్యంలో.. ఖాళీ అయిన డివిజన్లకు ఇప్పటికైనా ఉప ఎన్నికలు నిర్వహిస్తారో.. లేదో వేచి చూడాల్సిందే మరి.



మెట్రో లాస్ట్‌మైల్ కనెక్టివిటీకి 'మనయాత్రి'

- క్యాబ్, ఆటో, బైక్ ట్యాక్సీలు...
- రూ.40 కనిష్ట చార్జీతో సేవలు ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో ప్రయాణికులకు 'మన యాత్రి' చివరి మైల్ ప్రయాణ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. నగరంలోని 57 మెట్రోస్టేషన్‌ల నుంచి ప్రయాణికులు మన యాత్రి క్యాబ్, ఆటో, బైక్ ట్యాక్సీ సేవలను వినియోగించుకోవచ్చు. కేవలం రూ.40 కనిష్ట చార్జీలతో మన యాత్రి సేవలను వినియోగించుకోవచ్చని ఆ సంస్థ సీఈఓ సెల్విన్ తెలిపారు. ప్రయాణికులు మనయాత్రి మొబైల్ యాప్ ద్వారా తమ ప్రయాణానికి అనుగుణంగా ఆటో, క్యాబ్, బైక్‌లను బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. శుక్రవారం టీ-హబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో ఎండీ అండ్ సీఈఓ, ఇతర అధికారులు మనయాత్రి సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజారవాణా రంగంలో మెట్రోరైల్ అత్యంత వేగవంతమైన, మెరుగైన, నాణ్యమైన ప్రయాణ సదుపాయాన్ని అందజేసే సంస్థగా లక్షలాది మందికి చేరువైందన్నారు. ఈ క్రమంలోనే అతి తక్కువ చార్జీలతో మన యాత్రి ద్వారా లాస్ట్‌మైల్ కనెక్టివిటీని కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇంటి నుంచి మెట్రో స్టేషన్‌కు చేరుకొనేందుకు, మెట్రో నుంచి గమ్యం చేరేందుకు మనయాత్రిని వినియోగించుకోవచ్చన్నారు. ఇది సీమ్‌లెస్ జర్నీ సదుపాయాన్ని అందజేస్తుందని పేర్కొన్నారు. లక్షలాదిమంది మెట్రో ప్రయాణికులు మరింత వేగంగా లాస్ట్‌మైల్ వరకు తమ ప్రయాణాన్ని కొనసాగించవచ్చని చెప్పారు. పర్యావరణహిత, వేగవంతమైన ప్రయాణ సదుపాయాన్ని అందజేయడంలో మెట్రో ఎప్పుడూ ముందుంటుందన్నారు.



నగర పోలీసుకు మీరే దన్ను

క్షేత్రస్థాయి సమాచారంపై దృష్టి పెట్టండి



- అనునిత్యం అత్యంత అప్రమత్తంగా ఉండండి
- స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి సిటీ కొత్వాల్ ఉద్బోధ
- టీజీ సీసీసీలో విస్తృత స్థాయి సమీక్ష నిర్వహణ

సాక్షి, సిటీబ్యూరో: స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ) అనేది నగర పోలీసు విభాగానికి కళ్లు, చెవులు వంటిది. ఈ విభాగం సిబ్బంది ఇచ్చే సమాచారం ఆధారంగానే ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని సిటీ కొత్వాల్ సీవీ ఆనంద్ అన్నారు. స్పెషల్ బ్రాంచ్ పని తీరుపై ఆయన శుక్రవారం విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఇటీవల చోటు చేసుకున్న ఇంగ్లిష్ హౌస్ అకాడెమీ, మెట్రో పోలీస్ హోటల్ ఉదంతాల నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం సంతరించుకుంది. బంజారాహిల్స్‌లోని టీజీ సీసీసీలో జరిగిన సమీక్షలో ఎస్బీ చీఫ్ ఎస్.చైతన్యకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల్ మాట్లాడుతూ.. 'ఎస్బీ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించడంపై దృష్టి సారించాలి. దీని ఆధారంగానే ఉన్నతాధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటారు. ఎస్బీలో విధులంటే కొందరు పనిష్మెంట్‌గా భావిస్తుంటారు. ఆ భావన వీడి అంకితభావంతో పని చేయండి. ఈ అనుభవం మీ సర్వీసులో ఎంతో ఉపకరిస్తుంది. స్థానికులతో పాటు నాయకులు, పెద్దలతో సత్సంబంధాలు కొనసాగించండి. అప్పుడు ఎప్పటికప్పుడు సమాచారం లభిస్తుంది. అలా అందిన దానిపై నిర్లక్ష్యం చేయకుండా ఉన్నతాధికారులకు చేరవేయండి. ఆ సమాచారం ఎవరిచ్చారనేది మాత్రం బహిర్గతం చేయవద్దు. బయటి ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే కొత్తగా వచ్చే వారిపై నిరంతర నిఘా ఉంచండి. అనుమానితులకు సంబంధించి హోటళ్లు, బస్తీ, కాలనీ వాసుల నుంచి సమాచారం వచ్చే విధంగా ఏర్పాట్లు చేసుకోండి. సరిహద్దు దేశాల నుంచి నగరానికి వివిధ పనులపై వచ్చే వారు ఎక్కువగా ఉంటారు. వారిపై నిరంతరం నిఘా అవసరం. ఇతర రాష్ట్రాల నుంచి వస్తూ సభలు, సమావేశాలు, క్లాసులు ఏర్పాటు చేసే వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎస్బీలో అధికారులు మారిన వెంటనే సిబ్బంది పనితీరు మారకూడదు. సర్వకాల సర్వావస్థల్లోనూ అప్రమత్తంగా ఉంటూ సమాచారం సేకరించాలి. ప్రతి ప్రాంతంపై అవగాహన పెంచుకోవడం ద్వారా ఉద్రిక్తతల్ని ముందే గుర్తించి నిరోధించవచ్చు. ఈ విభాగానికి కొత్తగా వచ్చే వారికి ప్రత్యేక శిక్షణ అవసరం. పాస్‌పోర్టు వెరిఫికేషన్‌లో నిజాయితీగా వ్యవహరించండి. అప్పుడే పోలీసు శాఖకు మంచి పేరు వస్తుంది' అని సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

నృత్య 'ప్రణామ్'

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అభినేత్రి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రణామ్ పేరిట శుక్రవారం రవీంద్ర భారతిలో నిర్వహించిన నృత్య రూపకాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. సికింద్రాబాద్ ప్రభుత్వ సంగీత కళాశాల నృత్య గురువు మంజుల శ్రీనివాస్‌కు నివాళులర్పిస్తూ ఆమె శిష్య బృందం వివిధ అంశాలపై చేసిన నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్యులు కోట్ల హన్మంతరావు, ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కె.వరలక్ష్మమ్మ, శ్రీ త్యాగరాజ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగ, సికింద్రాబాద్ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సరిత, నటుడు మైమ్ మధు, అకాడమీ వ్యవస్థాపకులు ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.
- గన్‌ఫౌండ్రీ





డైమండ్ క్యాపిటల్ సిటీగా హైదరాబాద్

మంత్రి శ్రీధర్‌బాబు



ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మాదాపూర్: వజ్రాభరణాల వ్యాపారంలో హైదరాబాద్ డైమండ్ క్యాపిటల్‌గా సిటీగా అవతరించనుందని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన హైదరాబాద్ జ్యువెలరీ ఎక్స్‌పోను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నగరంలో ఆకట్టుకునే రీతిలో జ్యువెలరీ పార్కును తీసుకురానున్నామని చెప్పారు. ఈ నెల 20 వరకు ఎక్స్‌పో కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శనలో 150 ఎగ్జిబిటర్లు, 350కుపైగా జ్యువెలరీ స్టాళ్లు, సరికొత్త డిజైన్‌లతో కూడిన ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ గోల్డ్, సిల్వర్ జ్యువెలరీ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్, కర్ణాటక, తమిళనాడు జ్యువెలరీ ఫెడరేషన్, డైమండ్ ట్రేడర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో రూ.26 లక్షలకు కుచ్చుటోపీ

బంజారాహిల్స్: ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి రూ.26 లక్షలు వసూలు చేసి ముఖం చాటేసిన భార్యాభర్తలపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లోని వెంకటగిరి స్రవంతినగర్‌లో నివసించే ఆరెవరపు వాసు టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. గత ఏడాది జనవరిలో అక్కడే పనిచేస్తున్న చల్లా శ్రీరామ్ కిరణ్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వాసుకు పరిచయం అయ్యాడు. తనకు పెద్ద పెద్ద కంపెనీల్లో పరిచయాలు ఉన్నాయని, ఐబీఎం కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో వాసు తన స్నేహితులను సంప్రదించి ఒక్కొక్కరి నుంచి రూ.2- 2.5 లక్షల వరకు 17 మంది దగ్గర రూ.26 లక్షలు వసూలు చేసి చల్లా శ్రీరామ్‌కిరణ్‌కు ఇచ్చాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ 17 మందికి ఆఫర్ లెటర్లు ఇవ్వగా వీరంతా ఆయా కంపెనీల్లో జాయిన్ కావడానికి వెళ్లినప్పుడు అవి బోగస్ ఆఫర్ లెటర్లు అని తేలింది. లబోదిబోమంటూ బాధితులు చల్లా శ్రీరామ్‌కిరణ్, ఆయన భార్య సంధ్యారాణిని సంప్రదించారు. అయితే మరో కంపెనీలో జాబ్‌లు ఇప్పిస్తానని, తనను నమ్మాలని చెప్పాడు. నెలలు గడుస్తున్నా వీరికి జాబ్‌లు ఇవ్వకపోగా డబ్బులు తిరిగి ఇవ్వమంటే ముఖం చాటేశాడని బాధితుడు వాసు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బ్యాక్‌డోర్ జాబ్స్ పేరుతో ఉద్దేశపూర్వకంగా తమ వద్ద నుంచి రూ.26 లక్షలు వసూలు చేసి మోసగించిన శ్రీరామ్‌కిరణ్, ఆయన భార్య సంధ్యారాణిలపై చర్యలు తీసుకోవాల్సిందిగా బాధితులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు ఇద్దరి పైనా ఐపీసీ సెక్షన్ 406, 420 కింద చీటింగ్ కేసు నమోదు చేసి జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన నిలోఫర్ ఉద్యోగి బావిలో శవమై తేలాడు



విజయ్‌రామ్ (ఫైల్)

నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రిలో పనిచేసే అసిస్టెంట్ దోభీ ఎం.విజయ్ రామ్ మంగళహాట్ పోలీసు స్టేషన్ పరిధిలో శవమై తేలాడు. ఈ నెల 12న హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అఫ్జల్‌సాగర్‌లో నివాసం ఉండే ఎం.తోతారామ్ కుమారుడు ఎం.విజయ్‌రామ్ దసరా పండుగ రోజున ఇంటి నుంచి బయలుదేరి నిలోఫర్ ఆసుపత్రికి వెళ్లాడు. అనంతరం మధ్యాహ్నం సమయంలో ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లాడు. బయటకు వెళ్లిన విజయ్‌రామ్ మళ్లీ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బంధువులు హబీబ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా మంగళహాట్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ మద్యం దుకాణం వద్ద కనిపించినట్లుగా సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించారు. మద్యం దుకాణం నుంచి స్నేహితులతో కలిసి వెళ్లిన అతడి జాడ మళ్లీ కనిపించలేదు. శుక్రవారం సీతారామ్‌భాగ్‌లోని ఓ బావిలో శవమై కనిపించాడు. బావిలో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు సమాచారం ఇవ్వగా.. పోలీసులు శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఇదిలా ఉండగా అదృశ్యమైన ఎం.విజయ్‌రామ్‌ను హత్య చేసి పారేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

గ్లోబల్ వేదికగా భారత మహిళల స్ఫూర్తి

- హెచ్‌బీఏ సీఈఓ మేరీ స్టట్స్



సమ్మిట్‌లో పాల్గొన్న మహిళా వ్యాపార వేత్తలు

సాక్షి, సిటీబ్యూరో: భారతీయ మహిళలకు కెరీర్, ఆరోగ్య సంరక్షణ పరంగా అత్యున్నత నైపుణ్యాల శిక్షణ అందించడానికి, అవగాహన కల్పించడానికి హెల్త్‌కేర్ బిజినెస్ ఉమెన్స్ అసోసియేషన్ (హెచ్‌బీఏ) సంసిద్ధంగా ఉందని హెచ్‌బీఏ సీఈఓ మేరీ స్టట్స్ తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు, భారతీయ మహిళలకున్న ప్రాధాన్యం దృష్ట్యా., ఇక్కడి మహిళల స్ఫూర్తివంతమైన నైపుణ్యాలు ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపించగలవని, ఆరోగ్య సంరక్షణ రంగంలో మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం మరింత పెంచగలవని ఆశిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని నోవార్టిస్ కార్పొరేట్ సెంటర్‌లో 'ది హెల్త్‌కేర్ షీ-ఈ-ఓ: విమెన్ ఎట్ ది హెల్మ్' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీ స్టట్స్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ వ్యాపారంలో మహిళల పురోగతి, ప్రభావాన్ని మరింత పెంచడానికి దాదాపు 50 ఏళ్లుగా సమర్థవంతమైన మహిళా నాయకులను తయారు చేసే లక్ష్యంతో హెచ్‌బీఏ కృషి చేస్తుందని అన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణతో పాటు వర్కింగ్ ప్లేస్‌లో సమాన వేతనం, మహిళలకు ప్రాతినిధ్యం వహించడం, లింగ సమానత్వంలో పురుషుల పాత్ర వంటి అంశాలపైన హెచ్‌బీఏ దృష్టి సారించిందని అన్నారు. భారత్‌లో హైదరాబాద్ వేదికగా హెచ్‌బీఏ మొదటి ఇండియా లీడర్‌షిప్ సమ్మిట్‌ను నిర్వహించడం ఒక మైలురాయిగా నిలిచిపోతుందని హెచ్‌బీఏ ఇండియా చైర్‌పర్సన్ డాక్టర్ దీపా దేశాయ్ సంతోషం వ్యక్తం చేశారు. భారత్‌లో ఆరోగ్య సంరక్షణ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది, దీనికి నాయకత్వం వహించడానికి మహిళలను శక్తివంతం చేసే వేదికను అందించడం పట్ల గర్విస్తున్నామని ఆమె అన్నారు.

ఏసీబీకి చిక్కిన సెక్షన్ ఆఫీసర్

సాక్షి, సిటీబ్యూరో: పౌర సరఫరాల శాఖలోని కన్స్యూమర్ ఎఫైర్స్ విభాగంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న విక్రమ్ అలెగ్జాండర్ శుక్రవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కారు. ఓ వ్యక్తి పెన్షన్ మంజూరు కోసం రూ.15 వేలు డిమాండ్ చేసి, తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. నిందితుడిని అరెస్టు చేసిన అధికారులు ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఓయూ దూరవిద్య ప్రవేశాల గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య ప్రవేశాల గడువు నవంబరు 15 వరకు పొడిగించినట్లు డైరెక్టర్ ప్రొ.జీబీ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ విద్యా సంవత్సరం (2024-25) మొదటి విడత డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, ఇతర కోర్సులలో ప్రవేశాలకు అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

కలెక్టర్..ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు?

- ఏ పార్టీ తరఫున ప్రచారం చేశారో చెప్పండి
- హైదరాబాద్ కలెక్టర్‌పై హైకోర్టు అసహనం

సాక్షి, హైదరాబాద్: ఓ సివిల్ కేసులో అప్పీల్ దాఖలు చేయడంలో ప్రభుత్వ ఆలస్యానికి కారణం ఎన్నికలని చెప్పడంపై హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. అధికారులు ఏమన్నా రాజకీయ నాయకులా..కలెక్టర్ ఏ నియోజక వర్గం నుంచి పోటీ చేశారు..గెలిచారా? లేదా? అని ప్రశ్నించింది. ఎన్నికలు వచ్చినా అధికారులు తమ విధుల్లో నిర్లక్ష్యం వహించకూడదు కదా.. అప్పీల్ దాఖలుకు ఎన్నికలు ఎందుకు అడ్డంకి అవుతాయంటూ తప్పుబట్టింది. కలెక్టర్ ఏ పార్టీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని నిలదీసింది. హైదరాబాద్ గుడిమల్కాపూర్‌లోని ఓ స్థలం ఏపీ ప్రభుత్వానిదని 2014లో కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఫజలుల్లాల్ హక్‌తో పాటు మరో 9 మంది 2016లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి..ఆ స్థలం ప్రైవేట్ వ్యక్తులకే చెందుతుందని ఉత్తర్వులు జారీ చేశారు. 1968 నుంచి ప్రభుత్వం ఆ స్థలాన్ని లీజుకు తీసుకుని పాఠశాల నిర్వహిస్తున్నందున ఖాళీ చేయాలని చెప్పలేమన్నారు. భూ సేకరణ చట్టం కింద ఆరు నెలల్లో ప్రక్రియ పూర్తి చేయాలని, ఒకవేళ ప్రక్రియ చేపట్టకుంటే స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు స్వాధీనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు 2016లో తీర్పు వెలువరించారు. సింగిల్ జడ్జి తీర్పుపై హైదరాబాద్ కలెక్టర్ 2024, జూలైలో అప్పీల్ దాఖలు చేశారు. ఎన్నికల కారణంగా అప్పీల్‌లో ఆలస్యం జరిగిందంటూ మధ్యంతర అప్లికేషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఈ అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫునన స్పెషల్ జీపీ ఎ.దివ్య వాదనలు వినిపిస్తూ..ఎన్నికల నోటిఫికేషన్ కారణంగా అప్పీల్‌లో ఆలస్యం జరిగిందని, విచారణకు స్వీకరించాలని కోరారు. అప్పీల్ దాఖలుకు ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎలా కారణంగా చెబుతారని ధర్మాసనం ప్రశ్నించింది. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ, ఎన్నికల కోడ్ కారణంగా అధికారులు ఇతర పలు కార్యక్రమాల్లో బిజీ ఉన్నారని జీపీ సమాధానమిచ్చారు. దీనికి ధర్మాసనం మరింత అసహనం వ్యక్తం చేస్తూ.. మీ స్పందన ఇలానే ఉంటే ఇంకా ఇబ్బందికరమైన ప్రశ్నలు వేయాల్సి వస్తుందని, అప్పీల్‌ను తిరస్కరించాల్సి వస్తుందని హెచ్చరించింది. సరైన కారణాలతో అప్పీల్ దాఖలు చేస్తామని న్యాయవాది చెప్పడంతో ధర్మాసనం వాయిదా వేసింది.

తెలంగాణ రోలర్ హాకీ జట్టులో మనాల్, సుమేర్



సాక్షి, హైదరాబాద్: జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా నిర్వహించే రోలర్ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనే తెలంగాణ జూనియర్ బాలబాలికల జట్టులో హైదరాబాద్‌కు చెందిన మనాల్ సుల్తానా, మొహమ్మద్ సుమేర్ ఎంపికయ్యారు. వనస్థలిపురంలో ఇటీవల నిర్వహించే సెలక్షన్ ట్రయల్స్‌లో వీరిద్దరు రాణించి రాష్ట్ర జట్టులో స్థానాన్ని సంపాదించారు. ఐదోసారి మనాల్, సుమేర్ జాతీయ రోలర్ హాకీ పోటీల్లో పాల్గొనబోతున్నారు. అంబర్‌పేట గోల్నాకలోని సెయింట్ పాల్స్ మోడల్ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న మనాల్, సుమేర్ చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లేగ్రౌండ్‌లో కోచ్ అబూద్ ఖురేషీ వద్ద శిక్షణ తీసుకుంటున్నారు. జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు కోయంబత్తూరులో డిసెంబర్ 5 నుంచి 15వ తేదీ వరకు జరుగుతాయి.

'ప్రజా సంబరాలు' ఘనంగా నిర్వహిస్తాం

బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న ప్రజా సంబరాలు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. కేబీఆర్ ప్రామెనేడ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కేబీఆర్ పార్కు వద్ద మధ్యాహ్నం 12:30 గంటల నుండి ప్రజా సంబరాలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. హైదరాబాద్ సంప్రదాయ, వారసత్వ సంపద సంరక్షణ, మరుగున పడిపోతున్న కళలకు పునర్జీవం పోయడం, ప్రాంతీయ కళాకారులు, ఔత్సాహికులను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా వివిధ రకాలైన ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కేబీఆర్ ప్రామెనేడ్‌లో ప్రజలు కుటుంబంతో సహా ఆస్వాదించేలా సాంస్కృతిక కార్యక్రమాలు, లైవ్ మ్యూజిక్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, ఫన్, అడ్వెంచర్ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ సంబరాలకు ఉచిత ప్రవేశం ఉందని, ఆర్ట్స్, పెయింటింగ్ పోటీలలో పాల్గొనేవారు మాత్రం తప్పనిసరిగా తమ పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఖైరతాబాద్ జోనల్, జూబ్లీహిల్స్ సర్కిల్ కార్యాలయాల్లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఆర్ట్ అండ్ పెయింటింగ్ లో ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్ని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా 'ఎస్ఎఫ్ఏ చాంపియన్‌షిప్' పోటీలు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని గచ్చిబౌలి స్టేడియం, లాల్ బహదూర్ శాస్త్రి స్టేడియంతో పాటు వివిధ ప్రాంతాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఎస్ఎఫ్ఏ (స్పోర్ట్స్ ఫర్ ఆల్) చాంపియన్‌షిప్-2024'లో దాదాపు 400 పాఠశాలల నుంచి పోటీ పడుతున్న క్రీడాకారులు తమ నైపుణ్యాలతో ఆకట్టుకుంటున్నారు. ఇందులో భాగంగా 4వ రోజు గచ్చిబౌలి స్టేడియంలో జెండా ఆవిష్కరణ వేడుకల్లో సాంక్తా మారియా ఇంటర్నేషనల్ స్కూల్ (గచ్చిబౌలి), విఘ్నాన్స్ బో ట్రీ స్కూల్ (నిజాంపేట్), సాంటినోస్ గ్లోబల్ స్కూల్ (మీర్పేట్), సెంటియా ద గ్లోబల్ స్కూల్ (మియాపూర్), సీజీఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ (హైటెక్ సిటీ), ది గ్లోబల్ ఎడ్జ్ స్కూల్ (కోకాపేట్) వంటి పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. శుక్రవారం యూసఫ్‌గూడలో జరిగిన అండర్-15 బాలుర సింగిల్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. కరాటే కాటా అండర్-15 అమ్మాయిల విభాగంలో తమన్నా ప్రసన్నిక్ స్వర్ణ పతకం సాధించింది. శ్రీరామ్ స్కేటింగ్ రింగ్ వద్ద ప్రారంభమైన పోటీల్లో విజ్ఞాన్స్ బో ట్రీ స్కూల్‌కు చెందిన చారిత శ్రీ మండిపూడి అండర్-17 అమ్మాయిల 1000 మీటర్ల ఇన్‌లైన్ విభాగంలో స్వర్ణ పతకం సాధించింది. ఈ పోటీలు అక్టోబర్ 22 వరకు కొనసాగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

యువతిపై ప్రేమోన్మాది దాడి

సనత్‌నగర్: తనను ప్రేమించి దూరం పెడుతుందనే అక్కసుతో ఓ యువతిపై ప్రేమోన్మాది బ్లేడ్‌తో దాడి చేసి గాయపర్చిన సంఘటన ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఏపీలోని శ్రీకాళహస్తి సమీపంలోని చోడవరం గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి, అదే ప్రాంతానికి చెందిన యువతి (21) నెల్లూరు జిల్లాలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యాభ్యాసం చేశారు. కళాశాలలోని వేర్వేరు విభాగాల్లో చదువుకున్న వీరు ఇన్‌స్టాగామ్ ద్వారా పరిచయమయ్యారు. ప్రేమలో పడిన వీరు అమీర్‌పేటలో ఐటీ కోర్సుల్లో శిక్షణ పొందడం కోసం నగరానికి వచ్చారు. అమీర్‌పేట సత్యం థియేటర్ సమీపంలోని ఓ సంస్థలో ఇద్దరూ శిక్షణ పొందుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల మద్యం, ఇతర వ్యసనాలకు బానిసైన మధుసూదన్‌రెడ్డిని యువతి దూరం పెడుతూ వస్తుంది. దీంతో ఆమెపై కోపం పెంచుకున్నాడు. కనకదుర్గా బాయిస్ హాస్టల్‌లో ఉంటున్న మదుసూదన్‌రెడ్డి గురువారం సాయంత్రం ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలో నిలబడి ఉన్న యువతిపై బ్లేడ్‌తో దాడికి పాల్పడ్డాడు. సంఘటనలో ఆమె మెడకు గాయమైంది. అదే సమయంలో అటుగా వెళ్తున్న పోలీసు పెట్రోలింగ్ సిబ్బంది, నిందితుడిని అక్కడే పట్టుకున్నారు. బాధితురాలిని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు గొడవపడుతున్నారని..

మనస్తాపంతో కుమారుడి ఆత్మహత్య

జవహర్‌నగర్: తల్లిదండ్రులు నిత్యం గొడవ పడుతున్నారని మనస్తాపం చెంది కుమారుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జవహర్‌నగర్ శ్రీరామ్‌నగర్ కాలనీలో నివసించే రేపని స్వామి(22) ప్రైవేట్ ఉద్యోగి. తల్లిదండ్రులు సిద్ధయ్య, తల్లి లక్ష్మితో కలిసి ఉంటున్నాడు. స్వామి తల్లిదండ్రులు నిత్యం ఇంట్లో గొడవ పడుతుండేవారు. వారికి ఎన్నోసార్లు సర్దిచెప్పినా మారలేదు. ఈ నెల 17న స్వామి పనికి వెళ్లి ఇంటికి వచ్చేలోపు తల్లిదండ్రులు గొడవ పెట్టుకున్నారు. గమనించిన స్వామి వారికి బుద్ధి చెప్పి రాత్రి భోజనం చేయకుండా తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు. శుక్రవారం ఉదయం స్వామిని నిద్రలేపడానికి తల్లిదండ్రులు ప్రయత్నించగా తలుపులు తీయకపోవడంతో చుట్టుపక్కల వారి సహాయంతో తలుపులు పగులగొట్టి చూడగా చీరతో ఉరి వేసుకొని వేలాడుతూ కన్పించాడు. తల్లిదండ్రులు ప్రతిరోజు గొడవ పడుతుండటంతో కాలనీలో వారికి విలువ లేకుండా పోయిందని మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్య



సంతోష్ అలియాస్ సరిత (ఫైల్)

జవహర్‌నగర్: ఉరి వేసుకొని ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జవహర్‌నగర్ కార్పొరేషన్ సంతోష్‌నగర్ కాలనీలో దొంతి సంతోష్ (31), భార్య బాలమణి, కుమారుడితో కలిసి నివసించేవారు. 2012 సంవత్సరంలో వీరికి వివాహం అయింది. కాగా గత నాలుగు సంవత్సరాల క్రితం సంతోష్ ట్రాన్స్‌జెండర్‌గా మారి సరితగా పేరు పెట్టుకున్నాడు. అప్పటి నుండి కుటుంబానికి దూరంగా ఉంటూ వికలాంగుల కాలనీ రేణుకానగర్‌లో అద్దె ఇంట్లో ఉంటూ అప్పుడప్పుడు ఇంటికి వచ్చి వెళ్తుండేవాడు. కాగా ఇటీవల భార్య కుషాయిగూడలోని పుట్టింటికి వెళ్లిపోయి తల్లితో ఉంటోంది. శుక్రవారం ఉదయం ట్రాన్స్‌జెండర్ సరిత భార్య బాలమణితో వీడియోకాల్‌లో మాట్లాడారు. 'నేను నిన్ను మోసం చేశాని, నువు లేకుండా ఉండలేకపోతున్నానని, నువ్వు వెంటనే రావాలని, లేకుంటే చనిపోతానని' చెప్పాడు. వెంటనే ఫోన్ కట్ చేసిన భార్య బాలమణి చుట్టుపక్కల వారికి ఫోన్ చేసి చెప్పింది. అయితే ఇంటి పక్కనవారు వెళ్లి చూసేసరికి సరిత చున్నీతో ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించింది. బాలమణి సంఘటన స్థలానికి వచ్చి చూడగా అప్పటికే సరిత మృతిచెందింది. తన భర్త ట్రాన్స్‌జెండర్‌గా మారి కుటుంబానికి ద్రోహం చేశాడని మనస్థాపం చెంది ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుననారు.

గృహిణిని వేధిస్తున్న యువకుడిపై క్రిమినల్ కేసు

బంజారాహిల్స్: అర్ధరాత్రి ఇంటి తలుపులు తడుతూ..డోర్ బెల్ కొడుతూ న్యూసెన్స్‌కు పాల్పడడమే కాకుండా ఇదేమిటని ప్రశ్నిస్తే కత్తితో పొడుస్తానని బెదిరిస్తున్నాడని ఓ గృహిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు రుషినాయుడు అనే యువకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..నవోదయ కాలనీలో నివసించే గృహిణి (42) ఇంటి ఎదురుగా నవ్య డిజైనర్ పేరుతో రుషినాయుడు, ఆయన తండ్రి షాపు నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా రుషినాయుడు అర్ధరాత్రి ఆమెకు ఫోన్లు చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడు. గత మూడు రోజుల నుంచి గేటు దూకి లోపలికి వెళ్లి డోర్ బెల్ కొడుతున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున 6 గంటలకు డోర్ బెల్ కొట్టగా బాధితురాలి భర్త తలుపు తీయగా తన వద్ద ఉన్న కత్తితో పొడిచేందుకు యత్నించాడు. అడ్డువచ్చిన బాధితురాలిపై కూడా దాడికి ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులందరినీ చంపేస్తానని బెదిరించి గోడ దూకి పారిపోయాడు. రుషినాయుడు నుంచి తమకు ప్రాణహాని ఉందని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై బీఎన్ఎస్ సెక్షన్ 78(2), 79, 351(3) కింద క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌జే శేఖర్ బాషా అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: రేడియో జాకీ (ఆర్‌జే) శేఖర్ బాషాను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. బిగ్ బాస్ తెలుగు ఎనిమిదో సీజన్‌లో శేఖర్ బాషా కంటెస్టెంట్‌గా ఉన్నారు. ప్రముఖ యూట్యూబర్ హర్ష సాయిపై ఇటీవల ఓ యువతి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఆమెపై లైంగిక దాడి చేయడంతో పాటు మానసికంగా వేధించాడనేది ప్రధాన ఆరోపణ. ఈ కేసులో బాధితురాలిగా ఉన్న యువతిపై శేఖర్ బాషా యూట్యూబ్ ఛానళ్లల్లో నిరాధార, అభ్యంతరకర ఆరోపణలు చేశారని సైబరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో మరో కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి శేఖర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు వివిధ కోణాల్లో విచారిస్తున్నారు.

మోసగించి అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు..

భాగస్వాములే పాత్రధారులంటూ పోలీసులకు ఓ వ్యక్తి ఫిర్యాదు

మియాపూర్: తన పేరుపై ఉన్న భవనాన్ని కొంతమంది వ్యక్తులు కలిసి ఇతరులకు విక్రయించి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఓ వ్యక్తి మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..మల్కాజిగిరి ఉప్పలగూడకు చెందిన దండు లచ్చిరాజు మియాపూర్ మాతృశ్రీనగర్ కాలనీలో సర్వే నంబర్ 44/1లో ప్లాట్ నెం.90లోని 389 చదరపు గజాల స్థలాన్ని 1980 సంవత్సరంలో కొనుగోలు చేశాడు. అతని ప్లాట్‌కు పక్కనే ఉన్న మరో ప్లాట్ యజమాని జె.ప్రభావతితో కలిసి ఇద్దరి ప్లాట్లలో 2015లో బహుళ అంతస్తుల భవనం నిర్మించారు. 2017లో వీరితో ఫాస్కో హాస్పిటాలిటీ సర్వీసెస్ అనే సంస్థ కూడా భవన నిర్మాణంలో పాలుపంచుకుంది. వీరంతా కలిసి 2018లో బోయిన్‌పల్లి వెంకటేశ్వరరావు, అతని భాగస్వాములతో లీజు ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో ఫాస్కో హాస్పిటాలిటీ సర్వీస్ భాగస్వాములు, భవన నిర్మాణ యజమాని ప్రభావతి...లచ్చిరాజుకు తెలియకుండా భవనంలోని కొన్ని ప్లాట్లను అక్రమంగా ఫాస్కో హాస్పిటాలిటీకి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేశారు. లావాదేవీల సమయంలో లచ్చిరాజు నుండి బ్లాంక్ చెక్కు, ప్రామిసరీ నోటును తీసుకుని చీటింగ్‌కు పాల్పడ్డారు. అలాగే వీరందరు కలిసి అనుమతి లేకుండానే కొంత ఏరియాను ఫీడ్జీ లిమిటెడ్ బ్రాంచ్ నిర్వాహకులకు అద్దెకు ఇచ్చారని తెలిపారు. ఈ విషయంపై దండు లచ్చిరాజు గతంలో (2020,2021 సంవత్సరాల్లో) మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దండు లచ్చిరాజు సీనియర్ సిటిజన్ కావడంతో అతని బంధువైన చిట్టిబాబు ఈ సంవత్సరం మే నెలలో జీపీఏ చేసుకున్నారు. ఈ విషయంపై జీపీఏ హోల్డర్ అయిన చిట్టిబాబు మరోసారి ఈ నెల 5వ తేదీన మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భవనాన్ని ఆక్రమించిన ఫాస్కో హాస్పిటాలిటీ సర్వీసెస్ భాగస్వాములు బోయినపల్లి వెంకటేశ్వర్‌రావు, తన్నీరు గౌతమ్, కారపాటి నాగ రవి, గోని రాజ్‌కుమార్, జంపన్న ప్రభావతి, టి.పద్మజారావులు తమను మోసగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరంతా గత ప్రభుత్వంలోని కీలక నాయకుడికి బంధువులని, అందుకే తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని బోయినపల్లి వెంకటేశ్వర్‌రావు, తన్నీరు గౌతమ్, గారపాటి నాగరవి, గోని రాజుకుమార్, జంపని ప్రభావతి, తన్నీరు పద్మజారావు, ఫిడ్జీ లిమిటెడ్ బ్రాంచ్ నిర్వాహకులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎన్ఎస్‌బీనగర్‌లో అక్రమ నిర్మాణం తొలగింపు



రహమత్‌నగర్ : ఖైరతాబాద్ మండల రెవెన్యూ సిబ్బంది గురువారం రాత్రి మరో అక్రమ నిర్మాణాన్ని జేసీబీతో కూల్చివేశారు. ఎస్పీఆర్‌హిల్స్ ఎన్ఎస్‌బీనగర్ ప్రధాన రహదారిపై ఉన్న ప్రభుత్వ స్థలంలో గతంలో రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డు నాటారు. ఆ తర్వాత అయితే దానికి ఓ వ్యక్తి తొలగించి నిర్మాణం చేపట్టాడు. ఖైరతాబాద్ తహసీల్దార్ ఎండీ నయీముద్దీన్ ఆదేశాల మేరకు స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌రాజ్, చైస్‌మెన్ మెహతాబ్, మధురానగర్ పోలీసులు బందోబస్తు నడుమ గురువారం రాత్రి జేసీబీతో అ ఇంటిని నెల మట్టం చేశారు. బోర్డును తొలగించి అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టిన సదరు వ్యక్తిపై పోలీసులు ఫిర్యాదు చేయనున్నట్లు ఆర్ఐ కిరణ్‌రాజ్ తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ

రహమత్‌నగర్: మార్షల్ ఆర్ట్స్ ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి గుర్తు చేశారు. చిన్నతనం నుంచే కరాటే, కుంగ్‌ఫూ లాంటి విద్యలను తమ పిల్లలను నేర్పించాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో క్వారీ మైదానంలో శుక్రవారం షావోలిన్ కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో, మాస్టర్ మనోహర్ నేతృత్వంలో పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ఎల్లో, ఆరెంజ్ బెల్టులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ యముల మనోహర్ మాట్లాడుతూ.. తమ సంస్థ షావోలిన్ కుంగ్‌ఫూ ఆర్ట్స్ అకాడమీలో అనేక మంది విద్యార్థులు బహుమతులు పొంది జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్బరావు, వేముల యాదయ్య, మన్సూర్, షేక్ సాబేర్, జేపీ జ్ఞానేశ్వర్, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకృతి ఎలైట్ దీపావళి స్పెషల్ ఎగ్జిబిషన్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: ఆకృతి ఎలైట్ దీపావళి స్పెషల్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం మ్యారియోట్ హోటల్‌లో ఆకృతి ఎలైట్ డైరెక్టర్ శశి నహతా ప్రారంభించారు. ఆదివారం వరకు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని ఆమె తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక

రహమత్‌నగర్(బోరబండ): జలమండలి జీఎం హరిశంకర్‌ను శుక్రవారం సిల్ట్ వెహికిల్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దసరా శుభాకాంక్షలు తెలిపారు. సీవరేజీ తరలించడంతో సిల్ట్ వాహనాలు పనితీరు బాగుందని జీఎం ప్రశంసించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కాసాల అరుణ్ కుమార్, పల్లె నాగరాజు, యాదగిరి, వంశీ, ప్రేమ్, సురేష్, శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సలహాదారు దృష్టికి వినియోగదారుల సమస్యలు



వేం నరేందర్‌రెడ్డిని కలిసిన డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: ముఖ్యమంత్రి సలహాదారు(పబ్లిక్ ఎఫైర్స్) వేం నరేందర్‌రెడ్డిని శుక్రవారం కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వినియోగదారుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వినియోగదారులు ఎలా మోసపోతున్నారో తెలియజేసే పలు పత్రాలను సమర్పించారు.

మాతృ ప్రేమతో పరిపాలన సాగించాలి

లిబర్టీ: మాతృ ప్రేమతో పరిపాలన సాగించాలని మాతృదేవోభవ నినాదాన్ని ప్రభుత్వం విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హరికర వేణుగోపాల్‌కు మాతృదేవోభవన సంస్థ విన్నవించింది. మాతృదేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షులు కె.బి.శ్రీధర్ సారథ్యంలోని ప్రతినిధి బృందం వేణుగోపాలను కలిసి వినతిపత్రం సమర్పించి మాతృ ప్రేమ గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ... మాతృదేవోభవ నినాదాన్ని తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రాముఖ్యతను వివరించాలని వేణుగోపాల్‌కు సమర్పించిన వినతిపత్రంలో విన్నవించారు. విశ్వంలో అన్నింటికంటే మాతృప్రేమ గొప్పదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పక్షాన సహాయక చర్యలు ఉంటాయని వేణుగోపాల్ హామీ ఇచ్చారు. ఈ బృందంలో ఎస్ఎస్ ఉదయలక్ష్మి, రాజు, వి.బి.వినాయక్, బాలాజీ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కుల గణనకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి

జీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

లిబర్టీ: అన్ని రాజకీయ పక్షాలు కుల గణనకు పూర్తిగా సహకరించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి కోరారు. బడుగు, బలహీన వర్గాల కోసం కుల గణన చేపట్టాలని ప్రభుత్వాన్ని నిర్ణయించిందని ఆయన పేర్కొన్నారు. దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కుల గణన చేపట్టాలని రాష్ట్ర క్యాబినేట్ నిర్వహించి జీవో జారీ చేయటాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. ఏడు నెలల క్రితమే గణన చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. కుల గణన విషయంలో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. రాహుల్‌గాంధీ ఎన్నికల ముందు కుల గణన చేస్తామని ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఆచరణలో చిత్తశుద్ధితో పని చేస్తుందని స్పష్టం చేశారు. ఈ నెల 24వ తేదీ నుంచి కుల గణన ప్రక్రియ మొదలవుతుందని తెలిపారు.బడుగు, బలహీన వర్గం పూర్తిగా సహకరించాలని కుమారస్వామి విజ్ఞప్తి చేశారు.

వ్యభిచార గృహంపై దాడి

వెంగళరావునగర్: వ్యభిచార గృహంపై దాడి చేసి నిర్వాహకురాలితో పాటుగా సెక్స్‌వర్కర్‌ను మరో యువకుడిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. స్థానిక జవహర్‌నగర్‌లో వ్యభిచారం జరుగుతున్నట్టుగా మధురానగర్ పోలీసులకు సమాచారం అందింది. దాంతో శుక్రవారం ఎస్ఐ లక్ష్మయ్య తన సిబ్బందితో కలిసి జవహర్‌నగర్‌లోని గృహంపై దాడి చేశారు. ఈ సమయంలో నిర్వాహకురాలు జ్యోతి ఇంట్లో ఉంది. పోలీసులు ఆ ఇంటిని సోదా చేయగా రాజమండ్రికి చెందిన మహిళతో పాటుగా కూకట్‌పల్లిలో నివసించే నిఖిల్ అనే యువకుడు ఉన్నారు. వారిని విచారించగా వ్యభిచారం చేస్తున్నట్టుగా అంగీకరించారు. దాంతో నిర్వాహకురాలితో పాటుగా మహిళను, యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఫోన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుడ్డులో కోడిపిల్ల!

ఉడకబెట్టిన గుడ్డులో ప్రత్యక్షం కావడంతో అందరూ షాక్!

- అంగన్‌వాడీ కేంద్రాలకు పాడైపోయిన గుడ్ల సరఫరా
- కేంద్రాలకు చేరని పాలు పట్టించుకోని అధికారగణం



ఓ అంగన్‌వాడీ కేంద్రంలో ఉడకబెట్టిన కోడిగుడ్డులో బయటపడ్డ కోడిపిల్ల

బంజారాహిల్స్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, కిశోర బాలికలు, గర్భిణులకు పెట్టే ఆహారం నాణ్యత లోపిస్తోంది. తాజాగా చిన్నారులకు ఇచ్చే ఉడకబెట్టిన కోడిగుడ్డులో కోడిపిల్ల రావడం సంచలనంగా మారింది. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గుడ్లు పంపిణీ చేయగా ఆ గుడ్డును ఇంటికి తీసుకెళ్లిన లబ్ధిదారులు ఉడకబెట్టి పొట్టు తీసి చూడగా చనిపోయిన కోడిపిల్ల ప్రత్యక్షం కావడంతో చిన్నారుల తల్లిదండ్రులు షాక్ అయ్యారు. ఇదేమిటని అంగన్‌వాడీ టీచర్‌ను ప్రశ్నించగా తనకేం తెలియదని తనకు అందజేసిన గుడ్లను తాను సరఫరా చేసినట్లు సమాధానం చెప్పింది.

◆ గత కొద్ది రోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అనేక కేంద్రాల్లో ఈ సమస్య ఉత్పన్నమైనట్లు సమాచారం. పిల్లలు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు సరఫరా చేసే పౌష్టికాహారంపై సరైన నిఘా లేకపోవడంతో నాసిరకం ఉత్పత్తులను కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పాడైపోయిన గుడ్లు తిని కొందరు పిల్లలు అస్వస్థతకు గురైనట్లు కూడా సమాచారం. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఈ ఘటనపై విచారణ చేసి సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పాలకు దూరమైన గర్భిణులు...

◆ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులకు ప్రతిరోజూ 200 మిల్లీ లీటర్ల పాలు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ గడిచిన నెల రోజుల నుంచి మెజార్టీ కేంద్రాలకు పాలు రావడం లేదు. పాలు కావాలని అడిగితే పట్టించుకోవడం లేదంటూ లబ్ధిదారులు వాపోతున్నారు. అదే విధంగా వారికి ప్రతిరోజూ ఓ గుడ్డును సైతం ఉడకబెట్టి ఇవ్వాల్సి ఉంటుంది. చిన్న పిల్లలకు ఒక్కొక్కరికి 15 రోజులకు ఎనిమిది కోడి గుడ్లు ఇవ్వాల్సి ఉన్నా చాలా కేంద్రాల్లో అవి అందరికీ ఇవ్వడం లేదు. ఇటీవల ఓ కేంద్రంలో 920 కోడిగుడ్లు సరఫరా కాగా అందులో 120 గుడ్లు పాలైపోయినవి వచ్చినట్లు తెలిసింది. పాడైపోయిన గుడ్లు వస్తున్నాయని సదరు టీచర్లు, లబ్ధిదారులు ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

కుళ్లిన కోడి గుడ్లు, ఆహార పదార్థాలను ఇవ్వొద్దు

అంగన్‌వాడీలో తనిఖీలు చేపట్టిన కార్పొరేటర్ కవితారెడ్డి



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నం .10లోని ఇబ్రహీంనగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ పిల్లలకు పంపిణీ చేస్తున్న కోడి గుడ్లలో నాణ్యత కరువైందని ఫిర్యాదులు రావడంతో ఆమె నేరుగా పరిశీలించారు. ఇక్కడ స్టాక్ చేసిన ఆహార పదార్థాలపై ఆరా తీశారు. కుళ్లిపోయిన కోడి గుడ్లు, ఇతర ఆహార పదార్థాలను ఎట్టిపరిస్థితుల్లోనూ పంపిణీ చేయొద్దని నిర్వాహకులకు హెచ్చరించారు. మరోసారి ఇలాంటి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తామని పేర్కొన్నారు.

అనధికారిక స్టిక్కర్లు.. వాహనదారులకు జరిమానాలు!



స్టిక్కర్లను తొలగిస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్

ఫిలింనగర్: అడ్డదారుల్లో దూసుకెళ్తూ మోటార్ వాహనాల చట్టాన్ని ఉల్లంఘించి అనధికారిక స్టిక్కర్లు వేసుకుంటున్న వాహనదారులపై జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం జూబ్లీహిల్స్ రోడ్ నం.17 బరోడా బ్యాంక్ వద్ద నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలపై పోలీసు, ప్రెస్, ప్రభుత్వ వాహనం, ఎక్స్ కార్పొరేటర్, ఆర్మీ తదితర స్టిక్కర్లను అడ్డదారుల్లో ఏర్పాటు చేసుకుని తిరుగుతుండగా పట్టుకున్నారు.

◆ మొత్తం 22 వాహనాలపై ఇలా అనధికారికంగా ఏర్పాటు చేసిన స్టిక్కర్లను అక్కడికక్కడే తొలగించి ఒక్కొక్కరికి రూ.700 జరిమానా విధించారు. వాహనాలపై నంబర్ ప్లేట్ తప్పితే ఇతర ఏ స్టిక్కర్లు ఉండకూడదని ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ తెలిపారు. ట్రాఫిక్ ఎస్ఐ తమ్మినేని గోపీతో కలిసి ఆయన స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొని స్టిక్కర్ల తొలగింపుతో పాటు హెల్మెట్ లేకుండా, నంబర్ ప్లేట్ లేకుండా, రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనదారులపై కూడా జరిమానాలు విధించారు.

◆ పొల్యూషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలు కూడా లేకుండా తిరుగుతున్న వారిని పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానాలు విధించారు. నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్, డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ కట్టా హరిప్రసాద్ ఆదేశాల మేరకు ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు చెప్పారు. సుమారుగా 75 వాహనాలపై నిబంధనల ఉల్లంఘనల కింద జరిమానాలు విధించినట్లు ఆయన వెల్లడించారు.

విశ్వబ్రాహ్మణ,విశ్వకర్మలను ఒకే కులంగా పరిగణించాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్



బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మదన్‌మోహన్

కాచిగూడ: తెలంగాణలోని కమ్మరం, వడ్రంగం , కంచరం, శిలాశిల్పి, స్వర్ణకార వృత్తులు చేస్తున్న వారందరిని ఒకే కులస్తులుగా పరిగణించాలని తెలంగాణ విశ్వబ్రాహ్మణ/విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ రాష్ట్ర ప్రభుత్వానికి, బీసీ కమిషన్‌కు, ప్లానింగ్ బోర్డుకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో జరిగిన జనగణనలో వృత్తులనే కులాలుగా భావించిన ప్రభుత్వాలతో విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాలలో నిర్లక్ష్యం చేయబడ్డారని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనైనా జరుగబోతున్న బీసీ కులగణనలో పంచదాయ వృత్తిదారులను ఒకే కులంగా గుర్తించాలని కోరారు. ఈమేరకు బీసీ కమిషన్‌ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లాలుగోట వెంకటచారి, చొల్లేటి కృష్ణమాచారి, రాగిఫణి రవీంద్రాచారి, పులిగిళ్ల శ్రీనివాసాచారి, దేవరకొండ వీరాచారి, నాగారం భాస్కరాచారి, నారోజు జగ్‌జీవన్, వీణవంక సందానందం, లక్ష్మీ రామాచారి, శశిధర్ శిల్పి, రంగు లక్ష్మణాచారి, పెద్దకొలిమి బ్రహ్మాచారి, ఉట్కూరి కిషన్, చెన్నోజు రవికిరణ్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కేశవనగర్ మురుగు సమస్యను పరిష్కరిస్తాం



కేశవనగర్ కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: కేశవనగర్‌కాలనీలో ఏళ్లుగా ఉన్న మురుగు సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి శుక్రవారం ఎల్లారెడ్డిగూడ జలమండలి సెక్షన్ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. కాలనీని ఆనుకొని ఉన్న శ్మశానవాటిక నుంచి లైన్‌కు మరమ్మతు చేయాల్సి ఉందని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్మశానవాటిక కమిటీతో పాటు కాలనీ కమిటీతో ఆమె చర్చించారు. త్వరలోనే కాలనీలో మురుగు సమస్యను పరిష్కరిస్తామన్నారు. మురుగు పొంగకుండా చర్యలు తీసుకుంటామని ఆమె కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

మేయర్ ప్రత్యేక శ్రద్ధ.. పనులకు శంకుస్థాపన



ఎన్‌బీటీనగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ గద్వాల విజయలక్ష్మి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎన్‌బీటీనగర్‌లో మేయర్ నివాసం వెనుక భాగంలో రూ.17 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సీసీరోడ్డు పనులకు శుక్రవారం జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. స్థానికంగా రోడ్డు బాగోలేదని స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో స్పందించిన మేయర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిధులు మంజూరు చేయించారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే రాకపోకలకు ఇబ్బందులు తగ్గుతాయని అన్నారు. త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేయాలని ఇంజినీర్లకు సూచించారు.

ఆలయంలో హుండీ చోరీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం. 10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న సాయిబాబా దేవాలయంలో హుండీ చోరీకి గురయ్యింది. ఈ మేరకు ఆలయ పూజారి అజయ్ కృష్ణ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 16వ తేదీ రాత్రి పూజాదికాలు ముగిసిన తర్వాత ఆలయానికి తాళం వేసి తాను ఇంటికి వెళ్ళిపోయానని 17వ తేదీన ఉదయం 7.30 గంటలకు వచ్చిచూడగా ఆలయంలో హుండీ కనిపించలేదన్నారు. ఆలయ పరిసరాలన్నీ వెతికామని అయితే ఎక్కడా ఆచూకీ తెలియకపోవడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి హుండీని దొంగిలించారని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యాషన్ డిజైనర్ కార్ టైర్లు కోసేసి.. షాప్ యజమానిని అడిగితే బెదిరింపులు

బంజారాహిల్స్: దుస్తులు కొనుగోలు చేసేందుకు దుకాణానికి వచ్చిన ఫ్యాషన్ డిజైనర్ కారు టైర్లు ధ్వంసం చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... బంజారాహిల్స్ రోడ్‌నెం. 12లో నివసించే ఫ్యాషన్ డిజైనర్ జి.కీర్తిరెడ్డి ఫ్యాబ్రిక్ కొనుగోలు చేసేందుకు బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని ర్యాన్‌గ్రన్జ్ ఫ్యాబ్రిక్ స్టోర్‌కు వచ్చారు. తన కారు టీఎస్ 09 ఈజెడ్ 1221ను ర్యాన్‌గ్రన్జ్ ఫ్యాబ్రిక్ స్టోర్ ముందు పార్కింగ్ చేసి ఓ షాపులోకి వెళ్లి పది నిమిషాల్లో తిరిగి వచ్చారు.

◆ కారు స్టార్ట్ చేసేందుకు ప్రయత్నించగా రెండు టైర్లు పూర్తిగా దెబ్బతిని కనిపించాయి. ఇనుప చువ్వలతో కారు టైర్లను కోసేసి గాలి తీశారని తెలిపారు. సదరు షాపులో పనిచేసే ఉద్యోగి తన కారును ధ్వంసం చేశాడని చర్యలు తీసుకోవాల్సిందిగా ఆమె పోలీసులను కోరారు. తాను స్టోర్ యజమానికి ఫిర్యాదు చేయగా అసభ్యంగా మాట్లాడటమే కాకుండా బెదిరింపులకు పాల్పడ్డాడని ఫిర్యాదు చేశారు. దీనికి కారణమైన షాపు నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలిన కోరారు. పోలీసులు ఆ స్టోర్ ఉద్యోగిపై బీఎన్ఎస్ సెక్షన్ 324(4), 125, 351(2), రెడ్‌విత్ 3(5) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్ కస్టమర్ల ఆభరణాల చోరీ

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నం.10లోని జామూన్ హోటల్‌కు పంజగుట్టకు చెందిన వైవీ మూర్తి తన కుటుంబసభ్యులతో కలిసి లంచ్‌కు వచ్చాడు. తన కారును వ్యాలెట్ పార్కింగ్‌లో ఇచ్చి లంచ్ చేసిన తర్వాత బయటకు వచ్చి కారులో చూడగా అందులో ఉన్న జ్యువెలరీ బాక్స్ ఓపెన్ చేసి ఉంది. హిమాయత్‌నగర్ ప్రాంతానికి వెళ్లిన తర్వాత ప్లాస్టిక్ కవర్‌లో చుట్టిన ఆభరణాల కోసం చూడగా 100 గ్రాముల నగలతో పాటు ఒక జత డైమండ్ చెవి రింగులు, ఒక డైమండ్ ఉంగరం కనిపించలేదు. దీంతో వెంటనే హోటల్‌కు వెళ్లి వ్యాలెట్ పార్కింగ్ నిర్వాహకులు రామ్‌కరణ్ యాదవ్, తేజ్‌నారాయణ్‌ముకియా, కుమార్ రాజేష్ తదితరులను ప్రశ్నించారు. నగలు చోరీకి గురయ్యాయని వారితో చెప్పగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిందిగా బాధితుడు వైవీ మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 303(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మీయ సమ్మేళనం

లిబర్టీ: ప్రేమ, కరుణా, దయతో ఇతరులకు చేయూతనివ్వాలని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఆదినారాయణ అన్నారు. మానవత్వం చాటి చేయూతనిచ్చినప్పుడే సమాజంలో వ్యక్తులకు సంస్థలకు గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఆత్మీయ సమ్మేళనం బుధవారం జరిగింది. డాక్టర్ ఎస్.ఆదినారాయణ మాట్లాడుతూ.. పరస్పరం గౌరవం ఇచ్చిపుచ్చుకోవాలని కోరారు. ఎంత ఆస్తి అంతస్తులు ఉన్నా సంస్కారం లేకపోతే వ్యక్తులకు సమాజంలో విలువ ఉండదన్నారు. నీతినిజాయితీ నిబద్ధతతో జీవితం సాగించాలని సూచించారు. విలువలు కలిగిన వ్యక్తి ఏ ప్రాంతానికి వెళ్లిన ఈ ప్రదేశానికి అన్ని వర్గాల నుంచి ఆదరణ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు జరగాలి



సభ్యత్వ నమోదులో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బీజేపీ సభ్యత్వ నమోదు రికార్డు స్థాయిలో జరిగేలా కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉండాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం వెంకటేశ్వరనగర్ కాలనీ డివిజన్, బంజారాహిల్స్ డివిజన్లలో ఇంటింటికి వెళ్లి సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్రమోదీ పరిపాలనకు ప్రజలు ఆకర్షితులై స్వచ్ఛందంగా ముందుకువచ్చి బీజేపీ సభ్యత్వాన్ని తీసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు మెచినేని శ్రీనివాస్, బద్దం మహిపాల్ రెడ్డి, బంగారం చంద్రశేఖర్, శ్రవణ్‌యాదవ్, వినయ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- మలుపు బుక్స్ నిర్వహణలో 'పోటెత్తిన కెరటాన్ని', 'నియంత అంతం'పుస్తకాల ఆవిష్కరణ రవీంద్రభారతి మినీహాల్‌లో సాయంత్రం 6 గంటలకు జరుగుతుంది.
- భరతనాట్య గురువు డాక్టర్ జయశ్రీ రాజగోపాలన్ ఆధ్వర్యంలో భరత నాట్యాచారిణి విశిష్ట డింగారి ప్రదర్శన గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ ఇన్ఫోసిస్ రోడ్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో సాయంత్రం 5 గంటలకు జరుగుతుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని శ్రీ కృష్ణ జ్యువెలరీస్ సాయంత్రం 4 గంటలకు పెద్ద నగల ప్రదర్శనను నిర్వహించనున్నది.
- కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్ శాఖకు చెందిన పబ్లిక్ రిలేషన్ ఆఫీస్ ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటలకు మెహిదీపట్నంలోని వీర్ కన్వార్ సింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రోడ్ సేఫ్టీ సదస్సు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

పండ్ల మార్కెట్.. ఏండ్ల కల!



మార్కెట్ నమూనా చిత్రం


కోహెడ మార్కెట్‌కు మోక్షం ఎప్పుడో!

- ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్‌కు బీఆర్ఎస్ హయాంలో ప్రణాళిక
- రూ.400 కోట్లతో నిర్మాణం చేపట్టేందుకు డీపీఆర్ సైతం సిద్ధం
- ఖాతాలో రూ.314 కోట్లు ఉన్నప్పటికీ.. పనులు చేపట్టని మార్కెటింగ్ శాఖ

సాక్షి, సిటీబ్యూరో: డీపీఆర్ ఉంది.. నిధులు ఉన్నాయి.. 200 ఎకరాల స్థలం సిద్ధంగా ఉంది. అన్నీ ఉన్నాయి. లేనిదల్లా అధికారుల్లో చిత్తశుద్ధే. ఇదీ కోహెడ్ పండ్ల మార్కెట్ దుస్థితి. కొత్తపేట్ నుంచి మార్కెట్‌ను బాటసింగారం తరలించే సమయంలో మూడు నెలల్లో కోహెడలో నిర్మాణ పనులు పూర్తి చేస్తామని మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో డీపీఆర్ సిద్ధమైనా, అధికారులు మాట ఇచ్చి మూడేళ్లు పూర్తి కావస్తున్నా ఇంతవరకు అతీగతీ లేదు నిర్మాణ పనులకు ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతులు రాలేదని, సీఎం వద్ద దానికి సంబంధించిన ఫైల్ ఉందని మార్కెటింగ్ శాఖ ఓ ఉన్నత అధికారి 'సాక్షి'కి చెప్పారు. ఇంకో నాలుగైదు నెలల్లో మామిడి సీజన్ ప్రారంభం కానుంది. బాటసింగారం మార్కెట్‌లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేవని, ఇబ్బందులు పడుతున్నామని రైతులు, వ్యాపారులు మూడేళ్లుగా వాపోతున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కోహెడలో పండ్ల మార్కెట్ నిర్మిస్తామన్న అధికారుల హామీ నెరవేరేదెప్పుడోనని అందరూ ఎదురుచూస్తున్నారు.

నెలనెలా అద్దెలకు రూ.70 లక్షలు

రెండు వందల ఎకరాల్లో రూ.400 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులను చేపట్టేందుకు డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు(డీపీఆర్)ను సైతం సిద్ధం చేసింది. అసెంబ్లీ ఎన్నికలు రావడంతో నిర్మాణ ప్రక్రియ ఆగిపోయింది. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం పండ్ల మార్కెట్ ఏర్పాటు అంశాన్ని పక్కన పెట్టిందని రైతులు, వ్యాపారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆసియాలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్‌గా రూపుదిద్దుకోవాల్సిన కోహెడ పండ్ల మార్కెట్ కలగానే మిగిలిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ నడుస్తున్న బాట సింగారంలో ప్రైవేటు స్థలాలకు నెల నెలా రూ.70 లక్షల అద్దె చెల్లిస్తున్నప్పటికీ ప్రభుత్వం భారంగా భావించడం లేదు. సరి కదా.. ఖాతాలో రూ.314 కోట్లు మూలుగుతున్నప్పటికీ మార్కెట్ ఏర్పాటుకు మీనమేషాలు లెక్కిస్తుండటం గమనార్హం. మరోవైపు ఈ నెల 5వ తేదీన మార్కెట్ కమిటీ కొత్త చైర్మన్ బాధ్యతలు స్వీకరణ సభలో పలువురు ప్రజాప్రతినిధులు భిన్నస్వరాలు వినిపించారు. కోహెడకు బదులు వేరు ప్రభుత్వ స్థలంలో మార్కెట్ నిర్మించాలని వారి వాదన. అయితే ఈ వాదనపై కమిషన్ ఏజెంట్లు మండి పడుతున్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి తాము కట్టించిన మార్కెట్ ఫీజుతో మార్కెట్ కోసం భూమి కొనుగోలు చేసి ఇప్పుడు వేరే ప్రాంతానికి తరలిస్తామంటే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కోహెడలోనే మార్కెట్ నిర్మించాలి

మూడేళ్లు గడుస్తున్నా ఇంతవరకు మార్కెట్ నిర్మించలేదు. రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం కోహెడలో పండ్ల మార్కెట్ నిర్మాణం కోసం భూమిపూజ కూడా చేసింది. ఈ ప్రభుత్వం వెంటనే ఇక్కడే మార్కెట్ పనులు ప్రారంభించి 6 నెలల్లో పూర్తి చేయాలి. లేనిపక్షంలో కోర్టుకు వెళ్తాం.

– అచ్చ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు, కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్, గడ్డిఅన్నారం

ప్రజావాణికి 627 దరఖాస్తులు

లక్డీకాపూల్ : ప్రజావాణి కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి ఆయా సమస్యలపై అర్జీలను అందజేశారు. మహాత్మ జ్యోతిబా పూలే ప్రజాభవంలో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 627 దరఖాస్తులు అందాయి. అర్జీదారుల సమస్యలు ఓపికగా విని సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి దరఖాస్తుల తక్షణ పరిష్కారానికి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి కృషి చేశారు. ఇళ్ల కోసం 185 దరఖాస్తులు వచ్చాయి. సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించి 108, రెవెన్యూ శాఖకు 60, విద్యుత్ శాఖ 57, ప్రవాసి ఎన్.ఆర్.ఐ. విభాగానికి సంబంధించి 4 , ఇతర శాఖల 213 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులను చిన్నారెడ్డి, దివ్య దేవరాజ్‌లు స్వీకరించారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి

పంచాయతీ ఎన్నికలలోపు దళితబంధు నిధులను విడుదల చేయకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని లబ్ధిదారులు హెచ్చరించారు. రాష్ట్ర దళితబంధు సాధన ఐక్య పోరాట సమితి ఆధ్వర్యంలో లబ్ధిదారులు పెద్ద ఎత్తున ప్రజావాణికి తరలివచ్చి అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు కె.మహేష్ ఆధ్వర్యంలో లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు.

బీసీ విద్యార్థుల అరెస్ట్

- 'సచివాలయం ముట్టడి'ని అడ్డుకున్న పోలీసులు



ఉస్మానియా యూనివర్సిటీ: 'సచివాలయం ముట్టడి'కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. శుక్రవారం బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ నేత జక్కని సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ నుంచి సచివాలయానికి ర్యాలీగా బయలుదేరారు. అయితే ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు విద్యార్థులను అడ్డుకొని అరెస్ట్ చేశారు. అనంతరం సంజయ్‌కుమార్ మాట్లాడుతూ మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.7,600 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిధుల కోసం నాలుగు రోజుల పాటు కాలేజీలు బంద్ పాటించడం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. విద్యాశాఖ మంత్రిని నియమించాలని, నల్లగొండ హాస్టళ్లలో నీటిసమస్యను పరిష్కరించాలని, గురుకుల పాఠశాలల భవనాలకు అద్దెలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వంశీ నేత, రేవెళ్లి అజయ్, పంజాల రేవంత్‌గౌడ్, అనిల్ యాదవ్, కె.రాజు, దేవునూరి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గార్డియన్ సర్టిఫికెట్ కోసం నమోదు చేసుకోవాలి: కలెక్టర్ అనుదీప్

లక్డీకాపూల్: హైదరాబాద్ జిల్లాలో నివసిస్తూ గార్డియన్ సర్టిఫికెట్ కావలసినవారు నేషనల్ ట్రస్ట్ యాక్ట్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, పరిశీలించి సర్టిఫికెట్ జారీ చేస్తామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం నేషనల్ ట్రస్ట్ యాక్ట్ -1999 ప్రకారం నియమించిన కమిటీ సమావేశం జరిగింది. మానసిక వికలాంగుల పోషణ, నిర్వహణ బాధ్యతల్ని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు చేపట్టాలని సూచించారు. వారి తదనంతరం వికలాంగుల బాగోగులు చూడటానికే జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీ ఉంటుందని తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో 2020 నుంచి 2024 వరకు 35 సర్టిఫికెట్లను జారీ చేశామన్నారు. 3 నెలలకు ఓసారి లోకల్ లెవెల్ కమిటీ సమావేశం కలెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ప్రతి శుక్రవారం నిర్వహించే వయోవృద్ధుల నిర్వహణ కేసుల విచారణలో ఆరు కేసులను పరిష్కరించారు. ఈ సమావేశంలో వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రాజేందర్, కమిటీ సభ్యులు మంజుల కళ్యాణ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏజీ వర్సిటీని సందర్శించిన కర్ణాటక మంత్రి



వర్సిటీలో కర్ణాటక వ్యవసాయ మంత్రి, అధికారులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్నికర్ణాటక వ్యవసాయ శాఖ మంత్రి ఎన్.చలువరాయస్వామి శుక్రవారం సందర్శించారు. రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమై విశ్వవిద్యాలయ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. బోధన, పరిశోధన, విస్తరణ కార్యక్రమాల గురించి అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని డ్రోన్ అకాడమీని పరిశీలించారు. డ్రోన్ ద్వారా అందిస్తున్న సేవల గురించి శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. పరిపాలనా భవనంలోని అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌ను కూడా సందర్శించారు. కార్యక్రమంలో కర్ణాటక వ్యవసాయ శాఖ మంత్రి ఓఎస్‌డీ ప్రొఫెసర్ పాటిల్, విశ్వవిద్యాలయం అధికారులు పాల్గొన్నారు.

అభినందన



ఎంబీబీఎస్ సీట్లు సాధించినవారిని అభినందించిన గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందిన ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేజ్--2 ప్రెసిడెంట్ కృష్ణారావు మనవడు జయశ్రీ గోపాల్ క్రిష్, మనవరాళ్లు కృష్ణశ్రీ కామినేని, సౌమ్యలను పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే కుటుంబంలోని ముగ్గురు విద్యార్థులు ఎంబీబీఎస్‌లో ప్రవేశాలు పొందటం అభినందనీయమన్నారు. బాగా చదువుకొని పేరు ప్రఖ్యాతలు గల వైద్యులుగా సమాజానికి సేవచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ ఫేజ్-2 ప్రెసిడెంట్ కృష్ణారావు, కట్ట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన చికెన్‌కు కెమికల్స్ కలిపి..

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, జనతా బార్లకు సరఫరా

- ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో వెలుగు చూసిన విషయాలు
- బేగంపేట ప్రకాష్‌నగర్‌లో బాలయ్య చికెన్ సెంటర్ సీజ్.. కేసు నమోదు..

సనత్‌నగర్: ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, జనతా బార్లలో చికెన్ వంటకాలను లాగించేస్తున్నారా..? పైకి నిగనిగలాడుతూ ఘుమఘుమలు గుప్పిస్తూ ఉండే కోడి మాంసం రెసిపీలను లొట్టలేసుకుని మరీ ఆరగించేస్తున్నారా..? అయితే మీ ఆరోగ్యం ప్రమాదంలో పడినట్లే! ఎందుకు.. ఎలా.. అని అంటారా! అయితే ఈ నిజాలను తెలుసుకోండి మరి. బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని బాలయ్య చికెన్ సెంటర్‌లో జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మాంసప్రియులు ఖంగుతినే వాస్తవాలు వెలుగు చూశాయి. కుళ్లిపోయిన కోడి మాంసంతోపాటు కొవ్వు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. కుళ్లిన కోడి మాంసానికి కెమికల్స్ కలిపి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లతోపాటు నగరంలోని జనతాబార్‌లకు ఇక్కడి నుంచే సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కేజీ, రెండు కేజీలు కాదు.. ఏకంగా ఏడు క్వింటాళ్ల కుళ్లిపోయిన కోడి మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాలయ్య చికెన్ సెంటర్‌ను సీజ్ చేశారు. నగరంలోని జనతా బార్‌లకు చికెన్ సరఫరాపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఇంకా ఎక్కడెక్కడ సరఫరా చేశారనే దానిపై దర్యాప్తు చేస్తున్నారు. బాలయ్య చికెన్ సెంటర్ యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.



కుళ్లిన మాంసాన్ని స్వాధీనం చేసుకుని వాహనంలో తరలిస్తున్న దృశ్యం

ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్ ప్రారంభం



ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

శామీర్‌పేట్: ఈఎన్‌టీలో అధునాతన పురోగతులపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన సౌత్ జోన్ ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్-2024ను హైదరాబాద్ అలంకృత రిసార్ట్స్‌లో శుక్రవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. ప్రకృతి, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ కలిసే 'బేసిక్స్ అండ్ బియాండ్'అనే ఇతివృత్తంతో సదస్సు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాల నుంచి వెయ్యి మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ది అసోసియేషన్ ఆఫ్ ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా సౌత్ జోన్ (ఏఓఐఎస్‌జెడ్) ఆధ్వర్యంలో మూడు రోజులపాటు సదస్సు జరుగుతుందని తెలిపారు. దీనిలో సర్వ్ స్టిమ్యులేషన్ వంటి కొత్త చికిత్సలను ప్రదర్శించడంతోపాటు వివిధ అలర్జీల అధునాతన చికిత్సలపై చర్చించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రోగి సంరక్షణను మెరుగుపరచడంతోపాటు చికిత్స ఖర్చులు తగ్గించి అధునాతన పరిష్కారాలను అందించడమే లక్ష్యంగా ఈ ఈవెంట్‌ను నిర్వహిస్తున్నామని వివరించారు.



ఈఎన్‌టీ సర్జన్స్ ఈవెంట్‌లో పాల్గొన్న గవర్నర్, ఇతర ప్రముఖులు

ట్రిపుల్ ఐటీ లివింగ్ ల్యాబ్‌కు అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ బృందం

రాయదుర్గం: ఇండియా మొబైల్ కాంగ్రెస్-2024లో 'ది బెస్ట్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ ఎగ్జిబిట్ ఆఫ్ ది ఇయర్'అవార్డు ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లోని స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్‌కు దక్కింది. ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో జరిగిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ ఎగ్జిబిషన్ శుక్రవారం ముగిసింది. ఈ ఎగ్జిబిషన్‌లో ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ నుంచి ఫ్యాకల్టీ డాక్టర్ ఆఫ్తాబ్ హుస్సేన్ నేతృత్వంలోని స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ బృందం స్మార్ట్ సిటీ సమస్యలను పరిష్కరించడానికి మూడు కీలక పరిష్కారాలను ప్రదర్శించి సత్తా చాటింది. ఈ సందర్భంగా స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ బృందానికి, ఫ్యాకల్టీ సభ్యులకు స్మార్ట్ సిటీ ల్యాబ్ చీఫ్ టెక్నాలజీ ఆర్కిటెక్ట్ ప్రొఫెసర్ అనురాధ వట్టెం అభినందనలు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో సభ్య దేశాలు, స్టాండరైజేషన్ బాడీలు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్టార్టప్‌లు వంటి విభిన్న రంగాలకు చెందిన అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్స్ ఆధార్‌కార్డుల జారీ క్యాంపు

- డైరెక్టర్ బి.శైలజ



చాదర్‌ఘాట్: రాష్ట్రంలో నివాసముంటున్న ట్రాన్స్‌జెండర్స్‌కు ఈ నెల 22, 23, 24 తేదీల్లో మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో ఆధార్ కార్డుల జారీ ప్రక్రియ క్యాంపును నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజ తెలిపారు. శుక్రవారం మలకపేటలోని కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు ట్రాన్స్‌జెండర్స్ బర్త్ సర్టిఫికెట్, తల్లి లేదా తండ్రి ఆధార్‌కార్డుతోపాటు ఇరువురిలో ఒకరిని వెంట తీసుకురావాలని తెలిపారు. 18 ఏళ్ల వయసుపైబడిన వారు ఓటరు ఐడీ కార్డు, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని రావాలని అన్నారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆధార్‌కార్డులో పొరపాట్లు ఉంటే రూ.50, రూ.100 ఫీజు తీసుకొని సరిచేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ట్రాన్స్‌జెండర్స్ వినియోగించుకోవాలని సూచించారు.

రేపు 'వగరు జ్ఞాపకాల నవ్వు'

సాక్షి, సిటీబ్యూరో: 'వగరు జ్ఞాపకాల నవ్వు'పేరుతో ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విమల కవిత్వం సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 'కాలం గుండెచప్పుడు'ఆధ్వర్యంలో సుధాకిరణ్ అధ్యక్షతన జరిగే ఈ సభలో కె.శ్రీనివాస్, కాత్యాయని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. అనంతరం ఖాదర్ మొహియుద్దీన్, మెర్సీ మార్గరెట్, ఊర్మిళ, తాడి ప్రకాష్ తదితరులు విమలతో ''వగరు జ్ఞాపకాల నవ్వు'', ఇతర సంబంధిత అంశాలపై సంభాషించనున్నారు. సభలో చిందు సంస్థ ''కవిత్వ నృత్య ప్రదర్శన'', కవిత్వ వీడియో ప్రదర్శించనుంది.

ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి రూ.2.13 లక్షల జరిమానా

- చికిత్స కోసం వచ్చిన వ్యక్తిని వీల్‌చైర్ నుంచి కింద పడేసిన సిబ్బంది
- బాధితుడికి నష్టపరిహారం అందించాలని ఆదేశించిన వినియోగదారుల కమిషన్

సిటీ కోర్టులు: కంటి పరీక్ష కోసం ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి వెళ్లిన ఓ వ్యక్తిని వీల్‌చైర్ నుంచి పడేయడంతో కాలు విరిగింది. ఆస్పత్రి సిబ్బంది సరైన జాగ్రత్తలు పాటించకపోవడంతోనే పిటిషనర్ గాయపడ్డారని రాష్ట్ర వినియోగదారుల కమిషన్ అభిప్రాయపడింది. అతని చికిత్స కోసం అయిన ఖర్చు రూ.1.48 లక్షలను గాయపడిన నాటి నుంచి కోర్టు ఆర్డర్ వరకు 9 శాతం వడ్డీతో చెల్లించాలని ఆస్పత్రి యాజమాన్యాన్ని కమిషన్ ఆదేశించింది. అదనంగా రూ.50 వేల నష్టపరిహారం, మరో రూ.15 వేలను కోర్టు ఖర్చుల నిమిత్తం చెల్లించాలని రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఇన్‌చార్జి చైర్మన్ మీనా రామనాథన్, మెంబర్ వి.వి.శేషుబాబుతో కూడిన బెంచ్ ఆస్పత్రి యాజమన్యాన్ని ఆదేశిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలు... కరీంనగర్‌కు చెందిన మైన నారాయణ డిసెంబర్ 30, 2015న హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ దవాఖానాకు కంటి పరీక్షల కోసం వెళ్లాడు. సిబ్బంది వీల్‌చైర్‌లో డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అతడు కిందపడిపోయాడు. దీంతో అతని ఎడమ కాలు తొడ భాగం విరిగింది. సిబ్బంది నిర్లక్ష్యం వల్లే కాలు విరిగిందని, ఆపరేషన్‌కు అయిన ఖర్చులను ఇవ్వాలని కోరగా యాజమాన్యం ఒప్పుకోలేదు. దీంతో బాధితుడు రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌ను సంప్రదించి పిటిషన్ దాఖలు చేశారు.

అభిమానుల్లో గ్యాంగ్ లీడర్స్ జోష్

బాచుపల్లిలో ఎంటీవీ రోడీస్ డబుల్ క్రాస్ ఆడిషన్స్ ప్రచారం



చార్మినార్ వద్ద సందడి చేస్తున్న రియా చక్రవర్తి..

నిజాంపేట్: ఎంటీవీ రోడీస్ డబుల్ క్రాస్ ఆడిషన్స్ ప్రచారానికి బాచుపల్లిలోని సూర్య ది గ్లోబల్ స్కూల్ వేదికైంది. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో హోస్ట్ రణ్‌విజయ్, గ్యాంగ్ లీడర్స్ ప్రిన్స్, నేహా, రియా చక్రవర్తి, ఎల్విష్ అభిమానుల్లో జోష్ నింపారు. గత సీజన్‌లోనే గ్యాంగ్ లీడర్‌గా అరంగేట్రం చేసిన రియా చక్రవర్తి తాజాగా ప్రేక్షకుల ఆదరణను అందుకున్నారు. ఎంటీవీ రోడీస్ డబుల్ క్రాస్ ఆడిషన్స్ ప్రచారం నిమిత్తం ఆమె హైదరాబాద్ వచ్చారు. ఐకానిక్ చార్మినార్ మార్కెట్‌లో రియా భోజనం చేస్తూ, వీధుల్లో నడుస్తూ, మాట్లాడుతూ హైదరాబాద్ సంస్కృతికి ముగ్ధురాలైంది. అభిమానులతో సమావేశమవుతూ, వారికి అభినందనలు చెబుతూ, శరత్ సిటీ క్యాపిటల్ మాల్‌కు వెళ్లిన రియా చక్రవర్తి అక్కడ 1000+ లక్కీ అభిమానులతో ముఖాముఖీ అయ్యారు. ఈ సీజన్ షార్ట్‌లిస్ట్‌లో ఎంపిక అవుతారా అని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నెల 20న పుణె నిషిగంధ లాన్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆడిషన్స్ నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

జిల్లా స్టాంప్స్ కార్యాలయానికి తాళం

- విద్యుత్ సరఫరా తొలగింపు... గంటలకొద్దీ అవస్థలు పడిన ఉద్యోగులు
- ఉన్నతాధికారుల జోక్యంతో శాంతించిన యజమాని

అద్దె సక్రమంగా చెల్లించడంలేదని ఇంటి యజమాని ఆగ్రహం

నాంపల్లి: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ కార్యాలయానికి తాళం పడింది. దీంతో గంటల కొద్దీ ఉద్యోగులు కార్యాలయం బయటే ఉండిపోయారు. ఇంటి యజమాని కనికరం కోసం ఎదురుచూశారు. వివరాలు... 25 ఏళ్లుగా రెడ్‌హిల్స్‌లోని అద్దె భవనంలో హైదరాబాద్ జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం కొనసాగుతోంది. అయితే ప్రభుత్వం అద్దె సక్రమంగా చెల్లించడంలేదని ఆగ్రహించిన ఇంటి యజమాని శుక్రవారం ఆ కార్యాలయానికి తాళం వేశారు. విద్యుత్ సరఫరాను కూడా తొలగించారు. నీటి సరఫరాకు అంతరాయం కలిగించారు. దీంతో ఉద్యోగులంతా కొన్ని గంటలపాటు అవస్థలు పడాల్సి వచ్చింది. గురువారం సాయంత్రం వరకు కార్యాలయంలో హాయిగా పనిచేసుకున్న ఉద్యోగులు రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం వచ్చేసరికి తాళం దర్శనమివ్వడంతో షాక్‌కు గురయ్యారు. ఇంటి యజమానిని సంప్రదించగా సక్రమంగా ఇంటి అద్దె సక్రమంగా చెల్లించడం లేదని, పైగా ఖాళీ చేయాలని కోరినా పట్టించుకోవడం లేదని, గత ఐదేళ్లుగా ఈ తంతు నడుస్తోందని ఉద్యోగులపై మండిపడ్డారు. కార్యాలయ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని కొంత సమయం ఇస్తే ఎలాగైనా ఖాళీ చేస్తామని, మరో భవనంలోకి మారే వరకు ఇక్కడే ఉండే అవకాశం ఇవ్వాలని కోరగా, ఎట్టకేలకు మధ్యాహ్నం యజమాని శాంతించారు. ఇంటికి వేసిన తాళం తొలగించారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఇబ్బందుల్లో క్రయ విక్రయదారులు...

ఇన్నాళ్లు మంచి రోజులు లేని కారణంగా వేచి చూసిన క్రయవిక్రయదారులు రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి తాజాగా మంచి రోజులు రావడంతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి క్యూ కట్టారు. అయితే కార్యాలయానికి తాళాలు ఉండటంతో వారు అవాక్కయ్యారు. డాక్యుమెంట్లను సిద్ధంగా ఉంచుకున్న క్రయ విక్రయదారులతోపాటు బ్రోకర్లు కూడా ఆందోళన చెందారు. ఇక కార్యాలయం తెరుస్తారో! లేదోననే మీమాంసలో పడ్డారు. వెనక్కి తిరిగి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా కార్యాలయం తాళాలు తెరుచుకున్నాయి. దీంతో అందరూ ఊరట పొందారు.

బీఆర్‌కే భవన్‌లోకి మారాలని సూచిస్తే...

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలన్నీ ప్రభుత్వ భవనాల్లోనే ఉండాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో భాగంగానే హైదరాబాద్ జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ కార్యాలయాన్ని బీఆర్‌కే భవనంలోనికి మార్చాలని సంబంధిత శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపింది. అయితే రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ససేమిరా అనడం గమనార్హం. అధికారుల వైఖరి వల్లే తాజా పరిస్థితి తలెత్తిందని పలువురు వ్యాఖ్యానించారు.



రిజిస్ట్రేషన్ కార్యాలయం



ఆ రుచిపై

ఆసక్తి పెరుగుతోంది

పెరుగు ఎలా తయారు చేస్తారు? అదేం ప్రశ్న.. చిన్న పిల్లలను అడిగినా ఠక్కున సమాధానం చెప్పేస్తారు. గేదె లేదా ఆవు పాల నుంచి తయారు చేస్తారని కదూ.. ఎందుకైనా మంచిది మరోసారి ఆలోచించండి.. అయినా ఆ పాల నుంచే తయారు చేస్తారనేదే మీ సమాధానం అయితే.. తప్పులో కాలేసినట్టే.. ఎందుకంటే ఇప్పుడు కొత్త రకం పెరుగు మార్కెట్లో నోరూరిస్తోంది. పల్లీల నుంచి తయారు చేసిన పాలతో పెరుగును తయారు చేస్తున్నారు. ఈ పెరుగును లొట్టలేసుకుని లాగించేస్తున్నారు. ఏంటీ గేదె పాలు, ఆవు పాలతో కాకుండా వేరే విధంగా కూడా పెరుగు తయారు చేయవచ్చా అని ఆశ్చర్యపోతున్నారా? అయితే ఈ డిఫరెంట్ పెరుగు ఎందుకు? ఎవరు వాడుతున్నారు.. ఎలా తయారు చేస్తున్నారనే విషయాలు తెలుసుకుందాం..
- సాక్షి, సిటీబ్యూరో

సాధారణంగా వేగనిజాన్ని పాటించే వారు జంతువుల నుంచి తయారైన ఆహార పదార్థాలను తీసుకోరు. అందుకే సాధారణ పెరుగుకు ప్రత్యామ్నాయంగా సరికొత్తగా వేరుశెనగ పాల నుంచి పెరుగు తయారు చేస్తున్నారు. ఈ ట్రెండ్ నాలుగైదేళ్లుగా నడుస్తోంది. కానీ దీని గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. వేగనిజం పాటిస్తున్న వారు ఇంట్లోనే సొంతంగా తయారుచేసుకుని తింటున్నారు. మార్కెట్లో పెద్దగా అందుబాటులో లేదు. దీంతో ఇప్పుడిప్పుడే కొందరు పెద్దస్థాయిలో తయారు చేసి మార్కెట్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. బాదాం, సోయా పాలతో కూడా పెరుగు తయారు చేయవచ్చు. వాటి ధర అధికంగా ఉండటంతో చాలామంది వేరుశెనగ పాల నుంచే తయారు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

అలర్జీ ఉన్న వారు కూడా..

సాధారణంగా పాల ఉత్పత్తులు కొందరి శరీరాలకు సరిపోవు. అంటే అలర్జీలు వస్తుంటాయి. అలాంటి వారు ఇటీవల సాధారణ పెరుగుకు ప్రత్యామ్నాయంగా వేగన్ పెరుగును తీసుకుంటున్నారు. కొందరు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి కూడా గేదె, ఆవు పాలు, వాటి ఉత్పత్తులు తీసుకోవద్దని కొందరు డాక్టర్లు సూచిస్తున్నారు. ఇలాంటి వారు కూడా వేగన్ పెరుగును ఆశ్రయిస్తున్నారు. దీంతో పెరుగును తినాలనే కోరికను చంపుకోకుండా ప్రత్యామ్నాయ మార్గంలో ఈ సరికొత్త పెరుగును లాగించేస్తున్నారు.

అందరికీ అందుబాటులో ఉంచాలనే..



వేగన్ పెరుగు అందరికీ అందుబాటు ధరలో ఉంచేందుకే వేరుశెనగ పాల నుంచి పెరుగును తయారు చేస్తున్నాం. ఈ పెరుగును మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకురావాలని 7 ఏళ్ల క్రితమే ఉత్పత్తి ప్రారంభించాం. ఈ పెరుగులో కొవ్వు పదార్థాలు ఉండకపోవడంతో బరువు తగ్గాలనుకునే వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం కూడా సబ్సిడీ ఇస్తే పెద్దస్థాయిలో ఉత్పత్తి చేసి మరింత తక్కువ ధరకే ఈ పెరుగు అందుబాటులో ఉంచుతాం. ప్రస్తుతం ఆర్డర్ పెట్టుకున్న వారికి హోం డెలివరీ చేస్తున్నాం.
- వి.మనోహర్, ఫ్రోస్టీ ఐస్‌క్రీమ్స్, నల్లగండ్ల





- నగరంలో పెద్దసంఖ్యలో పెరుగుతున్న వేగన్స్
- జీవహింసకు దూరంగా ఉండేందుకు..
- జీవన విధానంలో మార్పు కోసం..
- పాలు, పెరుగుకు సైతం దూరం
- వారి కోసం నగరంలో ప్రత్యేక స్టాల్స్



ఫుల్ ట్రెండ్.. వేగన్ డైట్

వేగనిజం వైపు పర్యావరణ, జంతు ప్రేమికులు

చాలామందికి ముక్క లేనిదే ముద్ద దిగదు. కొందరు మాత్రం మాంసాహారం ముట్టరు. కొందరేమో కొన్ని ప్రత్యేక వారాల్లో నాన్‌వెజ్ తినరు. కానీ మరికొందరు మరీ ప్రత్యేకం.. ఎందుకంటే వారు నాన్‌వెజ్ మాత్రమే కాదు.. కనీసం జంతువుల నుంచి తయారైన ఉత్పత్తులే తినరు. వారినే ఇప్పుడు వేగన్స్ అంటున్నారు. ఇటీవల వేగనిజం కాన్సెప్ట్‌కు చాలామంది ఆకర్షితులవుతున్నారు. ఖచ్చితంగా పాటిస్తున్న వారి సంఖ్య భారీగా పెరుగుతున్నారు. అసలు వేగనిజం అంటే ఏంటి.. అసలు అటువైపు ప్రజలు.. ముఖ్యంగా యువత ఎందుకు మొగ్గు చూపుతున్నారని పరిశీలిస్తే పర్యావరణ పరిరక్షణ, జీవహింసకు దూరంగా ఉండాలని చాలామంది పేర్కొంటున్నారు. - సాక్షి, సిటీబ్యూరో



పర్యావరణ, జంతు ప్రేమికుల్లో వేగన్‌గా మారాలన్న ఆలోచనలు పెరుగుతున్నాయి. తీసుకునే ఆహారంలో పోషకాలు కావాలంటే ఒక్క మాంసాహారమే తినాల్సిన అవసరం లేదు. శాఖాహారంలోనూ శరీరానికి అవసరమైన విటమిన్లు, పోషకాలు, ప్రోటీన్లు లభిస్తాయని గట్టిగా నమ్ముతున్నారు. దీనికి సంబంధించిన స్టడీస్ ఆధారాలను ముందుంచుతున్నారు. జంతువుల నుంచి వచ్చే ముడిసరుకు ఆధారంగా తయారయ్యే ఉత్పత్తుల వలన కలిగే లాభాలు ఏంటి, వాటికి శాఖాహారపరంగా ప్రత్యామ్నాయాలను ఎలా సమకూర్చుకోవాలనే ఆలోచనలకు పదును పెడుతున్నారు.



ప్రత్యేకంగా వేగన్స్ ఫుడ్ స్టాల్స్

మాంసాహారం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలకు ఎక్కువగా వినియోగించే కోడినే ఉదాహరణగా చూపిస్తున్నారు. ఒక కోడి పెరగడానికి ఎన్ని రోజులు పడుతుంది. వేగంగా పెరగడానికి ఇస్తున్న స్టెరాయిడ్స్ వంటివి మానవ శరీరంపై ఎలాంటి దుష్ప్రభావాలు చూపిస్తాయనే అంశాలను వివరిస్తున్నారు. అలాగే ప్రతి విషయంలోనూ ప్రస్తుత పరిస్థితుల్లో మాంసాహారం వల్ల రోగాలు కొనుక్కునట్లే అవుతుందని అభిప్రాయపడుతున్నారు. ఇటువంటి వాటికి దూరంగా ఉండి, ప్రకృతి సిద్ధమైన శాఖాహారం తీసుకోవడానికే ఇష్టపడుతున్నారు. నగరంలో పూర్తిగా కాకపోయినా వారంలో ఒకటి రెండు రోజులైనా పూర్తిస్థాయి వేగన్‌గా మారిపోవాలని కోరుకుంటున్నారు. గత రెండేళ్లలో ఇటువంటి వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వీళ్లకు అనుగుణంగా నగరంలోని పలు ప్రైమ్ ప్రాంతాల్లో వేగన్స్ ఫుడ్ స్టాల్స్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. పూర్తి శాఖాహార ఉత్పత్తులు అక్కడ లభిస్తున్నాయి.



ఆరేళ్ల నుంచి ఆచరిస్తున్నాను



నాకు జీవహింస చేయడం నచ్చదు. అందుకే వాటి నుంచి వచ్చే ఉత్పత్తులకు దూరంగా ఉంటాను. కాల్షియం కోసం పాలు తాగుతున్నాం.. నువ్వులు వినియోగిస్తే మన శరీరానికి అవసరమైన కాల్షియం వస్తుంది. పాలు కావాలంటే సోయాబీన్స్‌తో తయారు చేసుకోవచ్చు. శాఖాహారంలోనూ పోషకాలన్నీ లభిస్తాయి. మాంసాహారమే కాదు లెదర్ బెల్టు, పర్సు, బూట్లు, జంతువుల నుంచి వచ్చే ఏ వస్తువులను వినియోగించను. సిల్క్ తయారు చేయడానికి లక్షల పురుగులను చంపాల్సి వస్తుంది. సిల్క్ వస్తువులకు దూరం. చికెన్ వంటి వంటకాలతో ఆరోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నారు. ఆరేళ్ల నుంచి పూర్తిగా మారిపోయాను.
- అఖిల్, హైదరాబాద్

జీవన విధానంలో మార్పు కోరుకున్నా..



ఒక కోడి లేదా మేక పెరగాలంటే కనీసం మూడు నెలల నుంచి రెండు మూడేళ్ల పడుతుంది. దాన్ని ఒక్క రోజులో తినేస్తారు. ఆ జంతువు పెరగడానికి ఎన్ని ప్రకృతి వనరులు కావాలి. అంటే రెండేళ్ల రిసోర్సెస్‌ను ఒక్క పూటలో ఆరగించేస్తున్నామన్నమాట. మాంసం తింటేనే ప్రోటీన్లు అంటారా.. వాటికి ఎక్కడి నుంచి ప్రోటీన్ వస్తుందో అదే ఆహారం మనం తీసుకుంటే సరిపోతుంది కదా.. వేగన్‌గా మారడానికి ప్రకృతి, జీవహింస మాత్రమే కాదు. నా జీవన విధానంలో మార్పు కోరుకున్నా.. ఆచరిస్తున్నా. ప్రతివారం చెరువుల్లో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, పక్షుల సంరక్షణకు కార్యక్రమాలకు సమయం కేటాయిస్తా. - వినయ్, ఆర్కిటెక్ట్

రా మ్యాంగోలో.. గార్లాండ్ ఉత్సవ్



సాక్షి, సిటీబ్యూరో: భారతీయ సంప్రదాయాలకు చిహ్నంగా నిలిచే ప్రతిష్టాత్మక రా మ్యాంగో 'గార్లాండ్ – ఉత్సవం 2024' నగరంలో ఘనంగా ప్రారంభమైంది. బంజారాహిల్స్‌లోని రా మ్యాంగో వేదికగా ప్రారంభమైన ఈ ఉత్సవంలో సంస్కృతిని ప్రతిబింబించే పూలహారాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. భారతీయ సంప్రదాయాలను ఆధునీకరించి చూపిస్తున్న ఈ పూలతోరణాలు, మాలలు.. మౌర్యుడి విగ్రహాలలో చూపిన ప్రత్యేక రూపాల నుంచి ప్రేరణ పొందాయి. ఇందులో భాగంగా రాజస్థాన్ కంహయ్యా దంగల్ వంటి ప్రదర్శనలు వ్యక్తిగత అభిరుచిని, సంప్రదాయాన్ని సమ్మిళితం చేస్తుంది. ముఖ్యంగా లెహెంగాలు, చీరలు, కుర్తాల్లో బ్రోకేడ్ ఎంబ్రాయిడరీ, కాంట్రాస్ట్ కలర్ అప్లిక్వే వంటి ప్రత్యేకతలు గార్లాండ్ ఉత్సవంలో హైలైట్‌గా నిలుస్తున్నాయి. ఈ సేకరణ ఢిల్లీలో జరిగే వివాహ నేపథ్యాలను ప్రతిబింబిస్తుంది. ఈ ఉత్సవం భారతీయ సంప్రదాయాల సమ్మిళితమై వ్యక్తిగత సాంస్కృతిక వైభవాలను ప్రదర్శిస్తుందని నిర్వాహకులు తెలిపారు. సంప్రదాయ విలువలు, ఆధునికతను కలిపి వేడుకలలో ఆత్మీయత, సాంస్కృతిక విశిష్టతను తెలియజేస్తుందని అన్నారు.

- ముందుకు వస్తున్న నగరవాసులు
- పలు స్వచ్ఛంద సంస్థల స్పెషల్ డ్రైవ్స్
- సహకారం అందిస్తున్న కార్పొరేట్ సంస్థలు

పెట్స్ అంటే ఎంతో ఇష్టం.. కానీ ఎక్కడి నుంచి వాటిని తెచ్చుకోవాలి..? రోడ్డుపై తిరుగుతున్న ఓ వీధి కుక్కను పెంచుకోవాలని ఆసక్తి ఉన్నా వాటికి ఇంటికి తెచ్చుకుంటే ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తారేమోననే భయం.. ఇలాంటి వారు నగరంలో ఎంతో మంది ఉన్నారు. అయితే కొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పెట్స్‌ను దత్తత తీసుకునే వారిని ఆహ్వానిస్తున్నాయి. పెట్స్‌పై మీరు ఇష్టం పెంచుకోండి.. కష్టం కలగకుండా వాటిని మీకు అందిస్తాం అంటున్నాయి. దీంతో పెట్స్‌ను దత్తత తీసుకునేందుకు పెద్దసంఖ్యలో నగరవాసులు ముందుకు వస్తున్నారు.
- బంజారాహిల్స్





మనసు పెట్టండి

వీధికుక్కల దత్తతకు స్వచ్ఛంద సంస్థల ఆహ్వానం

వీధుల్లో ఎవరూ పట్టించుకోకుండా ఉన్న వీధి శునకాలను దత్తత తీసుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న డ్రైవ్‌లలో నగర యువత పెద్ద ఎత్తున పాల్గొంటూ నచ్చిన పప్పీస్‌ను తీసుకుంటూ వాటిని అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. యువత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఆసక్తి కనబరుస్తున్నారు. వీధి కుక్కల దత్తతకు కార్పొరేట్ సంస్థలు కూడా సహకారం అందిస్తుండటం గమనార్హం. వీధి కుక్కలను దత్తత తీసుకుంటే 3 నెలల పాటు వాటికి సంబంధించిన ఫుడ్, యాక్ససరీస్‌ను వారికి ఉచితంగా అందజేస్తూ ప్రోత్సహిస్తున్నాయి. జూబ్లీహిల్స్‌లో మార్స్, బ్లూక్రాస్ సంయుక్తంగా గ్లోబల్ అడాప్షన్ వీక్ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన పెట్స్ దత్తత కార్యక్రమంలో నగర యువత పెద్ద ఎత్తున పాల్గొని నచ్చిన పప్పీస్‌ను తమతో తీసుకెళ్లారు. ఇంకొంత మంది నచ్చిన కుక్కలను అడాప్ట్ చేసుకొని సంతోషంగా ఇళ్లకు వెళ్లారు.

వీటితో గడుపుతుంటే..



బ్లూ క్రాస్‌కు ప్రతి వారం వస్తుంటాను. బ్లైండ్, ప్రమాదాల్లో కాళ్లు కోల్పోయిన కుక్కలకు సేవ చేయడం వల్ల ఎంతో ఆనందం కలుగుతుంది. అవి ఎంతో ప్రేమగా నా దగ్గరికి వస్తాయి. వాటితో ఆడుకొని, వాకింగ్ చేయించి, గ్రూమింగ్ చేయించి వస్తుంటాను. వీటితో ఉంటే సమయమే తెలియదు. - కామిని, వలంటీర్



వలంటీర్స్ సేవలు భేష్

పెట్స్‌ను అడాప్ట్ చేసుకోవాలనుకునే వారికి, స్వచ్ఛంద సంస్థలకు మధ్య కొంతమంది పెట్ లవర్స్ అనుసంధానంగా ఉంటూ వలంటీర్ సేవలు అందిస్తున్నారు. నగరంలో ఎక్కడెక్కడ ఎటువంటి కుక్కలు, పిల్లులు ఉన్నాయి. వాటి వయసు, ఆరోగ్య పరిస్థితితో పాటు ఇతర వివరాలను ఈ వలంటీర్లు పెట్ లవర్స్‌కు అందిస్తారు. స్వచ్ఛంద సంస్థల వద్ద పెరుగుతున్న డిసేబుల్, పప్పీస్ ఆలన, పాలన కూడా చూస్తుంటారు. ప్రమాదాల్లో కాళ్లు విరిగిపోయిన వాటికి సేవలు అందిస్తుంటారు.

ప్రతినెలా 100కి పైగా..

నగరంలో తెలంగాణ పెట్ అడాప్షన్, బ్లూ క్రాస్, మార్గ్ పెట్ అడాప్షన్, సిటిజన్స్ ఫర్ యానిమల్ సంస్థలు పెట్ అడాప్షన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రతినెలా 100కి పైగా వీధి కుక్కలు దత్తత అవుతున్నాయని బ్లూక్రాస్ చీఫ్ ఆపరేషనల్ ఆఫీసర్ కుమారి తెలిపారు. దత్తత ఇచ్చే కుక్కలకు రేబిస్ వ్యాక్సినేషన్‌తో పాటు మూడు నెలల కంటే తక్కువ వయసు ఉంటే ప్రివెంటివ్ డిసీజ్ వ్యాక్సినేషన్లను ఉచితంగా వేస్తున్నారు.



అవగాహన కల్పిస్తున్నాం

చాలామంది వీధి శునకాలను దత్తత తీసుకోవడానికి ముందుకొస్తున్నారు. దత్తత తీసుకున్న వారికి మార్స్, పెడిగ్రీ వంట సంస్థలు ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. గ్రూమింగ్ కిట్‌తో పాటు మూడు నెలల పాటు ఆ పెట్‌కు కావాల్సిన ఫుడ్‌ను ఉచితంగా అందజేస్తున్నాయి. పెట్ కేర్ విధానంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. మేం శునకాలకు సంబంధించిన పలు రకాల వ్యాక్సినేషన్లపై అవగాహన కల్పిస్తున్నాం.
- కుమారి, బ్లూ క్రాస్ చీఫ్ ఆపరేషనల్ ఆఫీసర్



ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: దీపావళి, కార్వాచౌత్ నేపథ్యంలో సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్ వేదికగా ఏర్పాటు చేసిన నేత్ర స్టార్ ప్రీమియమ్ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి ఆవిష్కరించారు. శుక్రవారం ప్రారంభమైన ఈ ఎగ్జిబిషన్‌లో విభిన్న రకాల ఫ్యాషన్ ఉత్పత్తులు నగరవాసులను అలరిస్తున్నాయి. ఈ ఎగ్జిబిషన్ శనివారం కూడా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

తారలు దిగివచ్చిన వేళ..

డీఆర్ఎస్ స్కూల్‌లో బాలీవుడ్ నటుల సందడి


విద్యార్థులతో కలిసి స్టెప్పులేసిన భూల్ భూలయ్యా-3 చిత్ర యూనిట్

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో భూల్ భులయ్యా-3 చిత్ర యూనిట్ సందడి చేసింది. బాలీవుడ్ నటుడు కార్తీక్ ఆర్యన్ నటించిన భూల్ భులయ్యా-3 చిత్రం ప్రమోషన్‌లో భాగంగా డీఆర్ఎస్ స్కూల్‌లో కార్యక్రమం నిర్వహించారు. హీరో కార్తీక్ ఆర్యన్, చిత్ర యూనిట్ సభ్యులు విద్యార్థులతో కలిసి స్టెప్పులు వేసి వారిలో ఉత్సాహం నింపారు. టీషర్టులపై ఆటోగ్రాఫ్‌లు ఇచ్చారు. అనంతరం సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. స్కూల్ డైరెక్టర్ ఏకే అగర్వాల్, పాఠశాల డైరెక్టర్లు సంజయ్ అగర్వాల్, గర్వ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. - మేడ్చల్



నేడే రాక్‌స్టార్ డీఎస్‌పీ లైవ్ మ్యూజిక్ కన్సర్ట్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని గచ్చిబౌలి స్టేడియం వేదికగా శనివారం ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ దేవీశ్రీ ప్రసాద్ లైవ్ మ్యూజిక్‌తో అలరించనున్నారు. టాలీవుడ్ రాక్‌స్టార్ డీఎస్‌పీ ఆధ్వర్యంలో జరగనున్న ఈ లైవ్ మ్యూజిక్ కన్సర్ట్‌లో తన మ్యూజిక్ బ్యాండ్ విభిన్న రకాల సంగీత స్వరాలతో ఆకట్టుకోనున్నారు. సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభం కానున్న ఈ కన్సర్ట్‌లో ప్రముఖ సినీ గాయకులు పాల్గొననున్నారని నిర్వాహకులు తెలిపారు.





తిరుమల శ్రీవారిని శుక్రవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీ సుధ దర్శించుకున్నారు

ప్రశ్నించే స్వరం వినిపించకూడదా?

మీ అవినీతిని ప్రశ్నించిన 'సాక్షి'పై కేసులు పెడతారా?: వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై నిలదీయకూడదా? మీరు చేసే అవినీతిపై ప్రశ్నించకూడదా? ప్రశ్నిస్తే కేసులు పెడతారా? ఇదెక్కడి అరాచక పాలన..?' అంటూ సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రశ్నించే స్వరమే వినిపించకూడదని ఆరాటపడుతూ తప్పుడు కేసులు పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. దీనికి తార్కాణం 'సాక్షి' ఎడిటర్‌పై పెట్టిన కేసేనని చెప్పారు. 'ఇలాగైతే ప్రజలు మీకు సింగిల్ డిజిట్ కూడా దక్కకుండా చేస్తారు...' అంటూ చంద్రబాబును హెచ్చరించారు.

కులగణనకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- ఈనెల 20న అఖిలపక్ష సమావేశం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: సమగ్ర కులగణనకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి కిషన్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాంను జాజుల శ్రీనివాస్‌గౌడ్ కలసి బీసీ కులగణనపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కులగణన చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు జీవో 18 జారీ చేసిందన్నారు. సమగ్ర కులగణనపై ఈనెల 20న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశానికి హాజరు కావాలని కోరారు. కులగణనకు తమ పార్టీ సంపూర్ణ మద్దతిస్తుందని, బీసీ రిజర్వేషన్లు పెంచేందుకు ఈ కులగణన ఉపయోగపడేలా సహకరిస్తామని కిషన్‌రెడ్డి ఈ మేరకు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ ప్రతినిధి బృందంలో బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, నేతలు తాటికొండ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఇది మాఫియా సామ్రాజ్యం

దోచుకో.. పంచుకో.. తినుకో.. అనేది వీళ్ల విధానం..

కూటమి ప్రభుత్వ పాలనపై వైఎస్ జగన్ కన్నెర్ర

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో మాఫియా సామ్రాజ్యాన్ని నడిపిస్తున్నారని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా ఎక్కడా మచ్చుకైనా డీబీటీ కానరావడం లేదని... కన్పిస్తుందల్లా డీపీటీ (దోచుకో పంచుకు తినుకో) ఒక్కటేనని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, సూపర్ సిక్స్ లేదు.. సెవనూ లేదని వ్యాఖ్యానించారు. ఎన్నికల హామీలపై ప్రజలు నిలదీస్తారనే భయంతో పూర్తి స్థాయిలో బడ్జెట్ కూడా ప్రవేశపెట్టలేని అసమర్థ ప్రభుత్వాన్ని చంద్రబాబు నడిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏకంగా ఇన్ని నెలల పాటు ఓట్ ఆన్ అకౌంట్‌పై నడుస్తున్న ప్రభుత్వం బహుశా దేశంలోనే కాదు.. ప్రపంచంలోనూ మరెక్కడా ఉండదన్నారు. ఎన్నికలప్పుడు నాసిరకం లిక్కర్.. ధరలు ఎక్కువ అంటూ దుష్ప్రచారం సాగించిన చంద్రబాబు ఇప్పుడు ఓ పద్ధతి ప్రకారం మద్యం మాఫియాకు తెర లేపారని చెప్పారు. అప్పుడైనా.. ఇప్పుడైనా అవే డిస్టిలరీస్, లిక్కర్‌లో అవే స్పెసిఫికేషన్స్ అని గుర్తు చేశారు. రాష్ట్రంలో 20 డిస్టిలరీస్ ఉంటే 14 కంపెనీలకు చంద్రబాబు హయాంలో అనుమతులు ఇచ్చారని, తాము అధికారంలో ఉండగా ఒక్క డిస్టిలరీకి కూడా కొత్తగా అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో చూసినా ఇసుక, మద్యం, పేకాట క్లబ్‌ల మాఫియాలు విచ్చలవిడిగా రాజ్యమేలుతున్నాయని మండిపడ్డారు. ఓ నియోజకవర్గంలో పరిశ్రమ ఉన్నా.. ఎవరైనా కొత్తగా స్థాపించాలన్నా కప్పం కట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఎవరు ఏం చేయాలన్నా అడిగినంత ముడుపులు ముట్టజెప్పాల్సిందేనన్నారు. ఎమ్మెల్యే కింత.. ముఖ్యమంత్రికి ఇంత.. అనే రీతిలో దోచుకో పంచుకో తినుకో విధానం



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ జగన్

లో మాఫియా పాలన రాష్ట్రంలో సాగుతోందన్నారు. ఎన్నికల హామీల అమలు.. ప్రభుత్వ అవినీతిపై ఎవరూ నిలదీయ కుండా.. ప్రశ్నించే స్వరం వినిపించకూడదనే లక్ష్యంతో తప్పుడు కేసులు బనాయిస్తున్నారని.. 'సాక్షి' దినపత్రిక ఎడి టర్‌పై పెట్టిన కేసే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

మరిన్ని వార్తలు, వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

- చంద్రబాబు మోడస్ ఆపరండా (ఓ పద్ధతి ప్రకారం అనుసరించే వ్యూహం) గమనిస్తే ఎన్నికలప్పుడు ఒక అబద్ధానికి రెక్కలు కడతారు. ప్రజల ఆశలతో చెలగాటాలాడుతూ అబద్ధాలు చెబుతారు. వాళ్లకున్న ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 మీడియా సామ్రాజ్యంతో కలిసి గోబెల్స్ ప్రచారం చేస్తారు.
- ఆయన ఏ స్థాయిలో అబద్ధాలకు రెక్కలు కట్టి ప్రచారం చేస్తారంటే.. పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇంటింటికి పంపిస్తారు. వలంటీర్లకు రూ.10 వేలు జీతం అని మోసగించడంతో అది మొదలవుతుంది. మీకు రూ.పది వేలు రావాలంటే మా ప్రభుత్వం రావాలి.. మా ప్రభుత్వం రావాలంటే మేం చెప్పిన అబద్ధపు హామీలను ప్రతీ ఇంటికి తీసుకెళ్లాలి అని వలంటీర్లకు చెబుతారు.
- ఏ ఇంటికి వెళ్లినా సరే చిన్నపిల్లలు కనిపిస్తే నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు! సంతోషమా..? అని అడుగుతారు. వాళ్ల అమ్మలు కనిపిస్తే నీకు రూ.18 వేలు.. సంతోషమా? అంటారు. చిన్నమ్మలు తారసపడితే నీకు రూ.18 వేలు.. పెద్దమ్మలు కనిపిస్తే నీకు రూ.48 వేలు... ఉద్యోగం కోసం వెతుక్కుంటూ 20 ఏళ్ల పిల్లాడు బయటకొస్తే నీకు రూ.36 వేలు... కండువా వేసుకొని రైతు బయటకొస్తే నీకు రూ.20 వేలు.. సంతోషమా? అని అడుగుతారు. ఎవరినైనా సరే ఇదే మాదిరిగా మాటలు చెప్పి, ప్రజల ఆశలతో చెలగాటమాడి అధికారంలోకి రావడమే మోడస్ ఆపరండాగా మార్చుకున్నారు.
- తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం క్లిష్ట పరిస్థితు ల్లో ఉంది. చేయాలన్నా నేను చేయలేకపోతున్నా..! అంటూ కొత్త మోడస్ ఆపరండా తెరపైకి తెస్తారు. అంతటితో ఆగిపోతుందా అంటే ఆగిపోదు. ఎన్నికల హామీలపై ఎవ రైనా ప్రశ్నిస్తారేమో? ఎవరైనా నిలదీస్తారేమో? అనే భయంతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ ప్రశ్నించే స్వరం వినిపించకుండా చేయాలని ఆరాట పడుతున్నారు. వీటికి తోడు మార్పులు తీసుకొస్తున్నామని చెబుతున్నారు. ఈ క్రమంలో స్కామ్‌లకు తెర తీస్తున్నా రు. వీళ్ల మోడస్ ఆపరండా ఏమిటో ఈ 5 నెలలుగా సాగుతున్న ఇసుక, మద్యం మాఫియా పాలనే నిదర్శనం.

'సాక్షి' ఎడిటర్‌పై కేసు సరికాదు

నినదించిన పాత్రికేయ సంఘాలు

సాక్షి, అమరావతి/విశాఖ సిటీ/సాక్షి, హైదరాబాద్: ఇటీవల విజయవాడలో వరద సహాయక చర్యల్లో జరిగిన అవినీతిని ఎండగట్టినందుకు సాక్షి దినపత్రిక ఎడిటర్‌పై కేసు నమోదు చేయడాన్ని పలు సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. ఇది సరికాదని పేర్కొన్నారు. ఈ కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

వేధించడమే ఏపీ ప్రభుత్వ ఉద్దేశం: సాక్షి దినపత్రిక ఎడిటర్ వి.మురళిపై ఏపీ ప్రభుత్వం అక్రమంగా కేసు బనాయించడాన్ని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్‌డబ్ల్యూజే), తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఖండించింది. వార్తా కథనంపై ఏపీ సర్కారుకు అభ్యంతరాలుంటే వివరణ ఇవ్వాలని లేదా వివరణ కోరవచ్చని, అలాకాక పోలీసు కేసు పెట్టడం వెనుక ప్రభుత్వ ఉద్దేశం జర్నలిస్టులు, మీడియాను వేధించడమేనని ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పి.ఆనందం, టీడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య శుక్రవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. వార్తాకథనంపై అభ్యంతరం ఉంటే ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. మురళిపై నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

కేసు ఉపసంహరించుకోవాలి: ఏపీయూడబ్ల్యూజే

మీడియా కథనాలపై కేసు నమోదు చేయడం మంచిది కాదని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.వి.సుబ్బారావు, చందు జనార్దన్ పేర్కొన్నారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాక్షి కథనాల్లో అవాస్తవాలు ఉంటే వివరణ ఇచ్చుకోవచ్చని తెలిపారు. అలా కాకుండా సాక్షాత్తు ఎడిటర్ వర్ధెల్లి మురళిపై కేసు పెట్టడం సరైనచర్య కాదని పేర్కొన్నారు. విజయవాడలో పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని కోరారు.

ఈ కేసును వ్యతిరేకిస్తున్నాం: ఏపీడబ్ల్యూజేఎఫ్

పత్రికల్లో ప్రచురితమైన వార్తాకథనాలపై అనుమానాలు, తప్పులు, పొరపాట్లు ఉంటే వాటిని ఎత్తిచూపే పద్ధతిని విస్మరించి పోలీసు కేసులు పెట్టే వైఖరిని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) వ్యతిరేకిస్తోందని ఆ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు తెలిపారు. ఈ సంస్కృతిని ఖండిస్తున్నట్లు తెలిపారు. 'పోలీసు కేసులు పెట్టడం మీడియాను భయపెట్టే చర్యగా భావిస్తున్నాం. మీడియాను భయపెట్టేందుకు చేసే ఇటువంటి ప్రయత్నాలు విరమించుకోవాలి' అని వారు చెప్పారు.

కేసు అక్రమం: స్మాల్

మీడియా స్వేచ్ఛను హరించే విధంగా కూటమి ప్రభుత్వం ప్రయతిస్తున్నట్టు తాజాగా జరిగిన కొన్ని ఘటనలు రుజువు చేస్తున్నాయని చిన్న, మధ్యతరహా వార్తాపత్రికల సంఘం (స్మాల్) శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఒక వార్తా కథనం పేరుతో 'సాక్షి' ఎడిటర్ వి.మురళిపై విజయవాడలో పోలీస్ కేసు నమోదు చేయడం అక్రమమని స్మాల్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లి ధర్మారావు, సిహెచ్.రమణారెడ్డి తీవ్రంగా ఖండించారు. పత్రికల్లో ప్రచురితమైన వార్తా కథనాలపై అనుమానాలు, తప్పులు, పొరపాట్లు ఉంటే వాటిని ఎత్తిచూపే పద్ధతిని విస్మరించి.. పోలీసు కేసులు పెట్టే వైఖరి సరికాదని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు పేర్కొన్నారు.

హైడ్రా 'హైడ్రామా': పాల్



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి హైడ్రా పేరుతో పెద్ద 'హైడ్రామా'ను నడిపిస్తున్నారని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ ఆరోపించారు. ప్రభుత్వ విధివిధానాలు నచ్చక ప్రజలంతా ఎదురు తిరుగుతున్నా.. పాలకులు మేల్కొనకపోవడం సిగ్గుచేటన్నారు. ఆయన శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరు లతో మాట్లాడారు. ఈవీఎంలపై దేశం అంతా ఆలో చిస్తోందని, అనుమానపడుతోందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలు దేశవ్యాప్తంగా బ్యాలెట్ పేపర్ల విధానంలో జరగాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తామని ఆయన స్పష్టం చేశారు. తనను చంపేందుకు కొందరు కుట్ర పన్నుతున్నారని పాల్ ఆరోపించారు. ఇలా కుట్ర పన్నిన వారంతా చనిపోయారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.విజయవాడ వరదల్లో అవినీతి, అక్రమాలనే కదా 'సాక్షి' దినపత్రిక బయటపెట్టింది.. అవి అబద్ధాలైతే ఖండనలు ఇవ్వాలే తప్ప వ్యక్తిగతంగా ఎడిటర్ మురళిపై కేసు నమోదు చేయడం సరికాదని స్పష్టం చేశారు. ఏపీలో 'సాక్షి' టీవీతో పాటు మరికొన్ని చానళ్లను ప్రభుత్వం నిషేధించడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనన్నారు. రిపోర్టర్లకు ప్రశ్నలు అడిగే హక్కు, కథనాలు రాసే వెసులుబాటుందని, దాన్ని తప్పుపట్టడం సరికాదన్నారు.

ప్రేమోన్మాది ఘాతుకం

> ఇంటర్ విద్యార్థిని దారుణ హత్య
> ప్రేమించడం లేదని పురుగుమందు బలవంతంగా తాగించి చంపేశాడు
> కర్నూలు జిల్లాలో కిరాతకం

ఆదోని రూరల్: కర్నూలు జిల్లా ఆస్పరి మండలం నగరూరు గ్రామానికి చెందిన అశ్విని అనే ఇంటర్మీడియెట్ విద్యార్థిని ప్రేమోన్మాది చేతిలో బలైంది. విద్యార్థిని నోట్లో పురుగుల మందు పోసి హత్యచేసిన ఘటన శుక్రవారం నగరూరు గ్రామంలో కలకలం రేపింది. విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నరసమ్మ, చిన్న వీరేష్ దంపతుల ఏకైక కుమార్తె అశ్విని పత్తికొండ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి వచ్చింది. అదే గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి సన్నీ శుక్రవారం అశ్విని ఇంట్లో ఎవరూలేని సమయం చూసి ఆమె ఇంట్లోకి ప్రవేశించాడు. తనను ప్రేమించకపోతే చంపేస్తానని వెంట తెచ్చుకున్న పురుగుల మందు డబ్బా చూపుతూ ఆమెను బెదిరించాడు. అయినప్పటికీ బాలిక అతని మాట లెక్కచేయకపోవడంతో సన్నీ ఆమె నోట్లో బలవంతంగా పురుగు మందు పోసి పరారయ్యాడు. కొద్దిసేపటికి విద్యార్థిని తల్లిదండ్రులు పొలం పనులు ముగించుకుని ఇంటికి వచ్చి చూసేసరికి కుమార్తె చావుబతుకుల్లో కనిపించింది. సన్నీ అనే వ్యక్తి బలవంతంగా పురుగు మందు తాగించాడని తల్లిదండ్రులకు తెలిపింది. వారు వెంటనే ఆమెను ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.



మియాపూర్‌లో చిరుత సంచారం

మియాపూర్ (హైదరాబాద్): మియాపూర్ మెట్రో స్టేషన్ వెనుకవైపు ప్రైమ్ నిర్మాణం సమీపంలో చెట్లలో చిరుత సంచారం కలకలం రేపింది. మెట్రో స్టేషన్ సమీపంలో ప్రైమ్ భవన నిర్మాణ కార్మికులు శుక్రవారం సాయంత్రం 7 గంటల సమయంలో చిరుతను గుర్తించి చిత్రీకరించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇది గమనించిన మియాపూర్ పోలీసులు.. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఆ శాఖ నుంచి ప్రత్యేక బృందం వచ్చి చిరుత కోసం గాలింపు చేపట్టింది. అక్కడ చిరుత తిరిగిన ఆనవాళ్లను సేకరిస్తోంది. ఈ వార్తతో మెట్రో స్టేషన్ సమీపంలోని న్యూ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, నడిగడ్డ తాండా, సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ కాలనీల మధ్యలోని దాదాపు 50 ఎకరాల ఖాళీ ప్రదేశంలో చెట్లు, పొదలున్నాయి. అక్కడే చిరుత నక్కినట్లు అనుమానిస్తున్నారు.



మోకాళ్లపై కూర్చోబెట్టి.. హోంవర్క్ చేయించి..

ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుల శిక్ష

మేడ్చల్: ఆ విద్యార్థులు చేసిన పాపమల్లా.. హోం వర్క్ చేయకపోవడమే. అందుకు వారి చొక్కాలు విప్పించి, మోకాళ్లపై కూర్చోబెట్టి హోం వర్క్ చేయించారు ఒక ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి పూడూర్‌లోని సెయింట్ మేరీస్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. విషయం తెలిసి గ్రామస్తులు, మీడియా ప్రతినిధులు పాఠశాలకు వెళ్లగా విద్యార్థులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. హోంవర్క్ చేయకుంటే విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో చెప్పి చేయించాల్సింది పోయి.. చొక్కాలు విప్పి మోకాళ్లపై నిలబెట్టడం సరికాదని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. కాగా దీనిపై పాఠశాల కరస్పాండెంట్ నీత కిష్టోఫర్ మాట్లాడుతూ విద్యార్థులకు భయం ఉండాలని మాత్రమే శిక్షించామని చెప్పారు. పిల్లలను దారిలో పెట్టేందుకు.. కేవలం 5 నిమిషాలు మాత్రమే శిక్ష అమలు చేసి తిరిగి తరగతులకు పంపామని తెలిపారు. సెయింట్ మేరీస్ పాఠశాల ఘటన తమ దృష్టికి వచ్చిందని, వివరణ కోరుతూ పాఠశాల యాజమాన్యానికి నోటీసు ఇచ్చామని, దీనిపై విచారణ జరుపుతామని ఎంఈవో రంగాచారి విలేకరులకు తెలిపారు.

గొలుసు దొంగిలించిందనే అనుమానంతో...

కేజీబీవీ విద్యార్థినిని మంత్రగాని వద్దకు తీసుకెళ్లిన కాంట్రాక్టు టీచర్



విద్యార్థిని చేతివేలి గోరుపై కనిపిస్తున్న నల్ల రంగు

నిజామాబాద్‌అర్బన్: శాస్త్రీయ దృక్పథంతో విద్యార్థులకు పాఠాలు బోధించాల్సిన టీచరే మూఢ నమ్మకంతో దొంగతనం ఆరోపణతో ఓ విద్యార్థినిని మంత్రగాని వద్దకు తీసుకెళ్లింది. శుక్రవారం నిజామాబాద్ జిల్లాలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.. మాక్లూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ (కేజీబీవీ)లో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్(సీఆర్‌టీ)గా పనిచేస్తున్న గౌతమి బంగారు గొలుసు కేజీబీవీలో పోయింది. ఆరో తరగతికి చెందిన విద్యార్థినులే దొంగిలించారన్న అనుమానంతో అందరినీ ప్రశ్నించింది. అదే క్లాసులో చదువుతున్న సహస్ర అనే విద్యార్థిని పట్ల గౌతమికి అనుమానం ఉండటంతో ఆ బాలికను నందిపేట మండలం మారంపల్లి గ్రామంలోని దర్గా వద్దకు తీసుకెళ్లింది. దర్గాలో విద్యార్థిని చేతులకు నల్ల రంగు పూసి, నిమ్మకాయలతో మంత్రించారు. దీంతో విద్యార్థిని తీవ్ర భయాందోళనకు గురైంది. అనంతరం కేజీబీవీకి వచ్చిన సహస్ర అప్పట్నుంచీ భయంతో ఏడుస్తోంది. కాంట్రాక్టు టీచర్ గౌతమి తన గొలుసు పోయిన విషయంపై మాక్లూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేజీబీవీ నాన్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను కలిసి గౌతమిపై ఫిర్యాదు చేశారు. కేజీబీవీ ప్రత్యేకాధికారే టీచర్‌ను, విద్యార్థినిని మంత్రగాని వద్దకు పంపించినట్లు తెలుస్తోంది.

సాక్షి రియల్టీ



కోకాపేట.. కెవ్వు కేక!

సాక్షి, హైదరాబాద్: కోకాపేట బంగారం కంటే ఖరీదైపోయింది. ఇక్కడ ప్రాజెక్ట్ నిర్మించడం, నివాసం ఉండటం డెవలపర్లకు, కొనుగోలుదారులకు ఇద్దరికీ స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. గత ఐదేళ్లలో ప్రాపర్టీ ధరల పెరుగుదలలో దేశంలోనే కోకాపేట రెండో స్థానంలో నిలిచింది. ఇక్కడ 89 శాతం మేర పెరుగుదల నమోదు కాగా.. బాచుపల్లిలో 57 శాతం, తెల్లాపూర్‌లో 53 శాతం ధరలు పెరిగాయని అనరాక్ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది. 2019లో ఈ ప్రాంతంలో ధర చ.అ.కు రూ.4,750గా ఉండగా.. 2024 నాటికి రూ.9 వేలకు పెరిగింది. ఈ ప్రాంతంలో భూముల ధరలు ఖరీదు కావడంతో విల్లాల కంటే ఎక్కువగా హైరైజ్ భవనాలనే ఎక్కువగా నిర్మిస్తున్నారు. మూడేళ్ల క్రితం వరకూ కోకాపేట బడ్జెట్ హోమ్స్ దొరికేవి కానీ, ఇప్పుడు 40 అంతస్తుల స్కైస్క్రాపర్లే ఎక్కువగా కనిపిస్తున్నాయి. కనిష్టంగా 8 వేల చ.అ. నుంచి గరిష్టంగా 16 వేల చ.అ. విస్తీర్ణం ఉన్న అపార్ట్‌మెంట్లు సైతం నిర్మిస్తున్నారు.

ధర రూ.2.5 కోట్లకు పైమాటే..

గత ఐదేళ్లలో కోకాపేటలో దాదాపు 12,920 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి. ఇందులో అల్ట్రా లగ్జరీ గృహాలే ఎక్కువగా ఉన్నాయి. రూ.2.5 కోట్ల కంటే ఎక్కువ ధర కలిగిన యూనిట్ల వాటా 52 శాతంగా ఉందంటే డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. 30 శాతం మధ్య, ప్రీమియం విభాగం యూనిట్లు, రూ.1.5–2.5 కోట్ల మధ్య ఉన్న లగ్జరీ గృహాల వాటా 19 శాతంగా ఉంది.

బాచుపల్లిలో బూమ్..

బాచుపల్లిలో కూడా రియల్టీ మార్కెట్ బూమ్‌లో ఉంది. ఇక్కడ గత ఐదేళ్లలో ధరలు 57 శాతం పెరిగాయి. 2019లో ఇక్కడ సగటు ధర చ.అ.కు రూ.3,690 ఉండగా.. 2024 నాటికి రూ.5,800లకు పెరిగాయి. మిడ్, ప్రీమియం విభాగానికి బాచుపల్లి కేంద్రంగా మారింది. 2019లో తెల్లాపూర్‌లో ధర చ.అ.కు రూ.4,819గా ఉండగా.. 2024 నాటికి 53 శాతం వృద్ధి రేటుతో రూ.7,350కు పెరిగాయి. తెల్లాపూర్‌లో గత ఐదేళ్లలో 18,960 యూనిట్లు లాంచింగ్ కాగా.. ఇందులో 66 శాతం ప్రీమియం, 34 శాతం లగ్జరీ విభాగం గృహాలే.

దేశంలో గత ఐదేళ్లలో ధరల వృద్ధిలో టాప్–10 ప్రాంతాలివీ


నగరం	ప్రాంతం	వృద్ధి (%లో)
బెంగళూరు	బెంగళూరు	90
హైదరాబాద్	కోకాపేట	89
బెంగళూరు	వైట్‌ఫీల్డ్	80
ఎన్‌సీఆర్	ద్వారాకా ఎక్స్‌ప్రెస్‌వే	79
బెంగళూరు	సర్జాపూర్ రోడ్	58
హైదరాబాద్	బాచుపల్లి	57
హైదరాబాద్	తెల్లాపూర్	53
ఎంఎంఆర్	పన్వేల్	50
ఎన్‌సీఆర్	న్యూ గుర్గావ్	48
ఎంఎంఆర్	డోంబివాలి	40

సంపన్న వర్గాల ఆసక్తి..



బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాలలో రద్దీ పెరగడంతో ఇక్కడి వారు కోకాపేటకు మారుతున్నారు. ఈ ప్రాంతం హై ప్రొఫైల్, ప్రీమియం ప్రాజెక్ట్‌లకు డెస్టినేషన్‌గా మారింది. – ప్రశాంత్ రావు, డైరెక్టర్, పొలోమీ ఎస్టేట్స్

మౌలిక వసతులే మెయిన్



ఐటీ కారిడార్లకు చేరువగా ఉండటమే బాచుపల్లి హైలైట్. అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులతో పాటు ఇంటర్నేషనల్ స్కూల్స్, హాస్పిటల్స్, మాల్స్ తో ఈ ప్రాంతానికి డిమాండ్ పెరిగింది. ప్రవాసులు, ఉన్నత హోదా ఉద్యోగులు ఇక్కడ నివాసం ఉండేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. –నరేంద్ర కుమార్, డైరెక్టర్, ప్రణీత్ గ్రూప్



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో కల్లుగీత కార్మిక సంఘం పదేళ్ల ప్రయాణం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నూతి శ్రీకాంత్ గౌడ్, పల్లె రవికుమార్ గౌడ్ తదితరులు

గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం 67వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం పదేళ్ల ప్రయాణం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నూతి శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 5 లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తు న్నాయని, వారి జీవనోపాధిని మెరుగుపర్చేందుకు ప్రభు త్వం కృషిచేస్తుందని తెలిపారు. ముఖ్యంగా గీతకార్మికు లకు ఉపాధి, ఎక్స్‌గ్రేషియా తదితర సమస్యలను పరిష్కరి స్తామన్నారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ.. కల్లుగీత వృత్తిలో ఉపాధిని పెంపొందించే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజు గౌడ్ మాట్లాడుతూ... ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలకు అతీతంగా గీతకార్మికులంతా ఏకమై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపుని చ్చారు. కల్లుగీత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మి, సమన్వయ కమిటీ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.

కన్నకొడుకును హత్య చేయించిన తల్లి

- ఇంట్లోనే శవం ఉంచి కుమారుడు కనిపించడం లేదంటూ వెతుకులాట
- మెదక్ జిల్లా హవేళిఘణాపూర్ మండలంలో ఘటన

హవేళిఘణాపూర్(మెదక్): కన్నకొడుకునే ఓ తల్లి హత్య చేయించిన దారుణ ఘటన మెదక్ జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని అవుసులపల్లి గ్రామానికి చెందిన నాగా రం లక్ష్మి భర్త 20 ఏళ్ల కిందట చనిపోగా, కుమారుడు శివసాయి(23)తో కలిసి ఉంటోంది. ఇంటర్ వరకు చదువుకున్న శివసాయి ఏ పని చేయకుండా ఇంటి వద్దే ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయంలో నిత్యం తల్లి, కుమారుడి మధ్య గొడవలు జరుగుతుండేవి. దీంతో విసిగిపోయిన లక్ష్మి గురువారం రాత్రి కుమారుడిని వేరే వ్యక్తులతో కలిసి హత్య చేయించింది. అనంతరం ఇల్లు శుభ్రం చేయించింది. తిరిగి తన కుమారుడు కనిపించడం లేదని ఊరంతా వెతికింది. ఎక్కడా ఆచూకీ లభించలేదు. ఆమెపై అనుమానంతో గ్రామ స్తులు ఇంట్లో కూడా వెతకగా శివసాయి మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసేందుకు తల్లి మొదట అంగీకరించలేదు. పోలీసులు చెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మురళి తెలిపారు. తల్లిని ఇంకా అదుపులోకి తీసుకోలేదు.



శివసాయి(ఫైల్)



తల్లిదండ్రులు మడావి లక్ష్మణ్, కమలాబాయిలతో టీచరు ఉద్యోగం సాధించిన కుమార్తెలు కవిత, దివ్య, కళ్యాణి, టీచర్ కావడమే లక్ష్యమంటున్న చిన్నకుమార్తె కృష్ణప్రియ (కుడి చివర)

ఈ ఇల్లు పాఠాలు నేర్పుతుంది

'ఎంత మంది పిల్లలు?' అనే ప్రశ్న వినిపించినప్పుడల్లా లక్ష్మణ్ గుండెల్లో రైళ్లు పరుగెత్తినంత పనయ్యేది. ఎందుకంటే...'నాకు అయిదుగురు ఆడపిల్లలు' అనే మాట లక్ష్మణ్ నోటినుంచి వినిపించడమే ఆలస్యం 'అయ్యో!' అనే అకారణ సానుభూతి వినిపించేది.

'ఇంట్లో ఒకరిద్దరు ఆడపిల్లలు ఉంటేనే కష్టం. అలాంటిది అయిదుగురు ఆడపిల్లలంటే మాటలా! నీ కోసం చాలా కష్టాలు ఎదురుచూస్తున్నాయి' అనేవాళ్లు.

అయితే వారి పెదవి విరుపు మాటలు, వెక్కిరింపులు తనపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపించలేకపోయాయి.

ఈ ఇల్లు పిల్లలకు బడి పాఠాలు చెప్పే ఇల్లే కాదు... ఆడపిల్లల్ని తక్కువ చేసి చూసేవారికి గుణపాఠాలూ చెబుతుంది.

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన మడావి లక్ష్మణ్ బాల్యమంతా పేదరికంలోనే గడిచింది. ఆదివాసీ తెగకు చెందిన లక్ష్మణ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడైన తరువాత ఆర్థిక కష్టాలు తీరాయి.

లక్ష్మణ్– కమలాబాయి దంపతులకు మొదటి సంతానంగా ఆడపిల్ల పుట్టింది.

'ఆడపిల్ల ఇంటికి అదృష్టం' అన్నారు చుట్టాలు పక్కాలు, పెద్దలు.

రెండోసారి ఆడపిల్ల పుట్టింది. వాతావరణంలో కాస్త మార్పు వచ్చింది. 'మళ్లీ ఆడపిల్లేనా!' అన్నారు.

'ఇద్దరు పిల్లలు చాలు' అనుకునే సమయంలో 'లేదు... లేదు... అబ్బాయి కావాల్సిందే' అని పట్టుబట్టారు ఇంటి పెద్దలు.

మూడో సారి... అమ్మాయి.

'ముత్యాల్లాంటి ముగ్గురు పిల్లలు చాలు' అనుకునే లోపే....

'అలా ఎలా కుదురుతుంది....అబ్బాయి...' అనే మాట మళ్లీ ముందుకు వచ్చింది.

నాల్గోసారి... అమ్మాయి.

'ఇక చాలు' అని గట్టిగా అనుకున్నా సరే... పెద్దల ఒత్తిడికి తలవొంచక తప్పలేదు.

'ఆరు నూరైనా ఈసారి కొడుకే' అన్నారు చాలా నమ్మకంగా పెద్దలు. దేవుడికి గట్టిగా మొక్కుకున్నారు.

అయిదోసారి... అమ్మాయి.

'అయ్యయ్యో' అనే సానుభూతులు ఆకాశాన్ని అంటాయి. అయితే లక్ష్మణ్, కమలాబాయి దంపతులు ఎప్పుడూ నిరాశపడలేదు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు అయినప్పటికీ ఖర్చులకు సరిపడా జీతం రాకపోవడంతో ఖర్చులు పెరిగాయి. 'ఎంత ఖర్చు అయినా, అప్పు చేసైనా సరే పిల్లలను బాగా చదివించాలి' అని గట్టిగా నిర్ణయించుకున్నాడు లక్ష్మణ్.

పిల్లల్ని చదివించడమే కాదు ఆడపిల్లలు అనే వివక్ష ఎక్కడా ప్రదర్శించేవారు కాదు. ఆటల్లో, పాటల్లో వారికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చేవారు. పిల్లలు బాగా చదువుకోవాలంటే బెత్తం పట్టుకోనక్కర్లేదు. వారికి నాలుగు మంచి మాటలు చెబితే సరిపోతుంది. ఆ మాటే వారికి తిరుగులేని తారక మంత్రం అవుతుంది.

అయిదుగురు పిల్లల్ని కూర్చోపెట్టుకొని ''అమ్మా... మీ నాయిన టీచర్. మా నాయినకు మాత్రం చదువు ఒక్క ముక్క కూడా రాదు. నాకు మాత్రం సదువుకోవాలనే బాగా ఇది ఉండే. అయితే మా కుటుంబ పరిస్థితి చూస్తే... ఇంత దీనమైన పరిస్థితుల్లో సదువు అవసరమా అనిపించేది. ఎందుకంటే సదువుకోవాలంటే ఎంతో కొంత డబ్బు కావాలి. ఏ రోజుకు ఆరోజే బువ్వకు కష్టపడే మా దగ్గర డబ్బు ఎక్కడిది! అయినా సరే సదువుకోవాలని గట్టిగా అనుకున్నాను. ఎన్నో కష్టాలు పడ్డాను...' అని నాన్న చిన్నప్పుడు చెప్పిన మాటలు పిల్లలపై బలమైన ప్రభావాన్ని చూపాయి. వారు చదువును ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. ఆ ఫలితం వృథా పోలేదు.

ఇప్పుడు...

రెండో కూతురు కవిత, మూడో కూతురు దివ్య, నాల్గో కూతురు కళ్యాణి ప్రభుత్వ ఉపాధ్యాయులు. చిన్న కూతురు కృష్ణప్రియ కొద్ది మార్కుల తేడాతో టీచర్ అయ్యే చాన్స్ మిస్ అయింది. అక్కలలాగే టీచర్ కావాలని కలలు కంటున్న కృష్ణప్రియకు మరో ప్రయత్నంలో తన కల నెరవేర్చుకోవడం పెద్ద కష్టం కాకపోవచ్చు. అప్పుడు ఒకే ఇంట్లో నలుగురు టీచర్‌లు!

ఇంటర్ వరకు చదివిన పెద్ద కూతురు రత్నకుమారి చెల్లెళ్ల స్ఫూర్తితో పై చదువులు చదవాలనుకుంటోంది. వారిలాగే ఒక విజయాన్ని అందుకోవాలనుకుంటుంది. ఇప్పుడు లక్ష్మణ్‌ను చూసి జనాలు ఏమంటున్నారు?

'నీకేమయ్యా... ఇంటినిండా టీచర్‌లే!'

'మీది టీచర్స్ ఫ్యామిలీ'

– గోడిసెల కృష్ణకాంత్, సాక్షి, ఆదిలాబాద్

ఫొటోలు: చింతల అరుణ్ రెడ్డి

నాన్న మాటలు

తల్లిదండ్రులు మమ్మల్ని ఎప్పుడూ చిన్నచూపు చూడలేదు. వారి ఆశీర్వాద బలంతోనే టీచర్ అయ్యాను. 'చదువే మన సంపద' అని నాన్న ఎప్పుడూ చెబుతుండే వాడు. ఆయన మాటలు మనసులో నాటుకుపోయాయి.

– కవిత, రెండో కుమార్తె

నేను టీచర్... అక్క హెడ్‌మాస్టర్

అక్క కవితకు, నాకు ఒకేసారి ఉద్యోగాలు వచ్చాయి. ప్రస్తుతం నేను జైనూర్ మండలం జెండాగూడలో ఎస్జీటీగా పనిచేస్తున్నాను. మా స్కూలుకు అక్క కవితనే ప్రధానోపాధ్యాయురాలు. చిన్నప్పటి నుంచి కలిసి పెరిగిన మేము ఇప్పుడు ఒకే బడిలో పనిచేస్తుండటం సంతోషంగా ఉంది.

– దివ్య, మూడో కుమార్తె

ఆరోజు ఎంత సంతోషమో!

మొన్నటి డీఎస్సీలో టీచర్ ఉద్యోగం వచ్చింది. ఆదిలాబాద్ జిల్లా సిరికొండలో నాకు పోస్టింగ్ ఇచ్చారు. మొన్ననే విధుల్లో చేరాను. టీచర్‌గా మొదటి రోజు స్కూల్‌కి వెళ్లినప్పుడు నాకు కలిగిన సంతోషం అంతా ఇంతా కాదు. 'మా ముగ్గురు పిల్లలు టీచర్‌లే అని ఇప్పుడు గర్వంగా చెప్పుకుంటాను' అంటున్నాడు నాన్న.

– కళ్యాణి, నాలుగో కుమార్తె

టీచర్ కావడమే నా లక్ష్యం

అక్క కళ్యాణితో కలిసి నేను కూడా మొన్నటి డీఎస్సీ పరీక్ష రాశాను. కొద్ది మార్కుల తేడాతో నాకు ఉద్యోగం చేజారింది. అయితే నా లక్ష్యాన్ని మాత్రం వీడను. ఎలాగైనా టీచర్ కొలువు సాధిస్తాను.

– కృష్ణప్రియ, ఐదో కుమార్తె

చైతన్యపథం

బంజరు భూమిని బంగరు భూమి చేసింది

'కలిసి ఉంటేనే కాదు కష్టపడితే కూడా కలదు సుఖం' అని అనుభవపూర్వకంగా తెలుసుకుంది సంతోష్ దేవి. తన రెక్కల కష్టంతో బంజరు భూమిని బంగరు భూమిగా మార్చింది. ఎంతోమంది రైతులను తన మార్గంలో నడిపిస్తోంది.



సంతోష్ దేవి

రాజస్థాన్‌లోని సికార్ జిల్లా బేరి గ్రామంలో... 1.25 ఎకరాల బంజరు భూమితో సంతోష్ దేవి ఖేదార్ ప్రయాణం ప్రారంభమైంది. కుటుంబం వీడిపోవడంతో తన భర్త వాటాగా 1.25 ఎకరం భూమి వచ్చింది. భర్త రామ్ కరణ్ హోంగార్డ్. చాలీచాలని జీతం. దీంతో వ్యవసాయం వైపు మొగ్గు చూపింది సంతోష్‌దేవి.

'పది, ఇరవై ఎకరాలు ఉన్నవారికే దిక్కు లేదు. ఎకరంతో ఏం సాధిస్తావు? అప్పులు తప్ప ఏం మిగలవు!' అన్నారు చాలామంది. ఈ నేపథ్యంలో 'వ్యవసాయం లాభసాటి వ్యాపారం' అని నిరూపించడానికి రంగంలో దిగింది సంతోష్ దేవి.

'నేను చదువుకోవాలని మా నాన్న కోరుకున్నారు. గ్రామీణ వాతావరణాన్ని ఇష్టపడే నాకు చదువుల కంటే వ్యవసాయం అంటేనే ఇష్టం' అంటుంది సంతోష్‌దేవి. తాతగారి పొలంలో ఎప్పుడూ రసాయనిక ఎరువులు వాడకున్నా మంచి దిగుబడి వచ్చేది. ఇక్కడ మాత్రం భిన్నమైన పరిస్థితి. చాలా ఏళ్లుగా రసాయనాలు వాడడం వల్ల పొలం నిస్సారంగా మారింది. చుట్టుపక్కల నీటి వనరులు లేకపోవడంతో జొన్న, సజ్జలాంటి సంప్రదాయ పంటలే పండించేవారు.

కలుపు మొక్కలతో గందరగోళంగా ఉన్న పొలాన్ని ఒక దారికి తేవడంతో మొదటి అడుగు వేసింది. రసాయనిక ఎరువుల స్థానంలో సేంద్రియ ఎరువులు వాడాలని నిర్ణయించుకుంది. దానిమ్మ పండించమని, తక్కువ భూమిలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని సికార్ వ్యవసాయ అధికారి సలహా ఇచ్చాడు. ఆ సలహా వారి జీవితాన్నే మార్చేసింది.

220 దానిమ్మ మొక్కలను కొనడానికి గేదెను అమ్మేయాల్సి వచ్చింది. మొక్కలు కొనగా మిగిలిన డబ్బుతో పొలంలో గొట్టపు బావిని వేయించింది. నీటి ఎద్దడి ఉన్న ఆ ప్రాంతంలో బిందు సేద్య పద్ధతిని నమ్ముకుంది. చుక్క నీరు కూడా వృథా చేయవద్దని నిర్ణయించుకుంది. జనరేటర్‌ను అద్దెకు తీసుకుంది. గ్రామంలోని ఎంతోమంది రైతుల సలహాలు తీసుకొని సేంద్రియ ఎరువు తయారీ మొదలుపెట్టింది. లేయర్ కటింగ్, సేంద్రియ పురుగు మందులకు బెల్లం కలపడంలాంటి రకరకాల టెక్నిక్‌ల గురించి తెలుసుకుంది. మూడేళ్ల కఠోర శ్రమ ద్వారా దానిమ్మ పండ్ల తొలి దిగుబడితో మూడు లక్షల లాభం వచ్చింది. సేంద్రియ ఎరువును ఎక్కువగా వాడడం వల్ల నేల సారవంతంగా మారింది.

భర్త పోలీస్‌స్టేషన్ నుంచి వచ్చిన తరువాత, పిల్లలు స్కూలు నుంచి వచ్చిన తరువాత నేరుగా పొలానికే వెళ్లేవాళ్లు. 'ఫలితం ఎలా ఉండబోతుందో తెలియదు. కాని బాగా కష్టపడాలనుకున్నాం' అని ఆ రోజులను గుర్తు చేసుకుంది సంతోష్‌దేవి. పండ్లతోటను నిర్వహించే అనుభవం రావడంతో యాపిల్‌లాంటి ఇతర పండ్లను పండించడంపై దృష్టి పెట్టింది.

దానిమ్మ మొక్కల మధ్య నిర్దిష్టమైన దూరం ఉండాలి. ఆ ఖాళీ స్థలంలో కలుపు లేకుండా చూడాలి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆ ఖాళీల మధ్య మోసంబి మొక్కలు నాటింది. ఇది కూడా మంచి ఫలితాన్ని ఇచ్చింది. ఆ తరువాత నిమ్మ నుంచి బెల్‌లాంటి ఎన్నో మొక్కలను నాటింది. పొలంలో సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకోవడంతో ఖర్చు తగ్గింది.

'మన దేశంలో రైతులు పడుతున్న కష్టాలకు కారణం వారు పండిస్తున్న దానికి సరైన ధర లభించకపోవడమే. దళారులు లాభాలన్నీ అనుభవిస్తున్నారు' అంటున్న సంతోష్‌దేవి ఒక్క పండును కూడా దళారులకు అమ్మదు. అన్ని పండ్లూ నేరుగా పొలంలోనే అమ్ముతారు.

సంతోష్ సాధించిన విజయాన్ని చూసి గ్రామంలోని ఇతర రైతులు కూడా దానిమ్మ మొక్కలను పెంచడం ప్రారంభించారు. అయితే చాలామంది విఫలమయ్యారు. అలాంటి వారు సంతోష్‌దేవిని సలహా అడిగేవారు. నాణ్యమైన మొక్కల కొరత వల్లే వారు విఫలమవుతున్నారు అని గ్రహించిన సంతోష్ దేవి ఆ లోటును భర్తీ చేయడానికి కొత్త మొక్కల కోసం 'షెకావది కృషి ఫామ్ అండ్ నర్సరీ' ప్రారంభించింది.

కష్టఫలం

నేను, నా భర్త, పిల్లలు మాత్రమే పొలంలో పని చేసేవాళ్లం. కూలీలతో పనిచేయించే స్థోమత మాకు లేదు. అయితే ఎప్పుడూ కష్టం అనుకోలేదు. ఇంట్లో ఎలా సంతోషంగా ఉంటామో, పొలంలో అలాగే ఉండేవాళ్లం. కబుర్లు చెప్పుకుంటూనే కష్టపడేవాళ్లం. మా కష్టం ఫలించినందుకు సంతోషంగా ఉంది.

– సంతోష్‌దేవి

'పోవే, నాకు విశ్రాంతి ఏంటి?!'

'గుండె గొంతుకలోన కొట్లాడుతాది, కూసుండనీదురా కూసింత సేపు' అంటారు నండూరి సుబ్బారావు తన ఎంకి పాటల్లో.

107 ఏళ్ల వయసున్న కుంజమ్మకు ఈ మాట సరిగ్గా సరిపోలుతుంది. కుంజమ్మ గాయని. కర్ణాటక సంగీతకారిణి. తన పన్నెండవ ఏట నుండి ఆమె గుండె ఆమె గొంతులో స్వరబద్ధంగా కొట్టుకుంటూ ఉంది. 'సంగీతమే నా హృదయ స్పందన' అంటారు కుంజమ్మ, గమకం వంటి ఒక చిరునవ్వుతో.

కుంజమ్మ 21వ ఏట ఆమె భర్త చనిపోయారు. ఆర్మీలో పనిచేసేవారు ఆయన. ఆనాటి నుంచీ సంగీతమే ఆమెకు జీవనాధారం, ప్రాణాధారం



అయింది. నేటికీ కొల్లమ్‌లో ఆమె ఉంటున్న పూయప్పల్లిలో ఆమె గాత్రం గుడి గంట వంటిది. ఆ ఊళ్ళో ఏ వేడుకా, ఏ పెళ్ళీ, ఏ పుట్టిన రోజూ ఆమె పాడకుండా, ఆమె హార్మనీ వాయించకుండా మొదలైనట్టు కాదు, ముగిసినట్టూ కాదు. అంత్యక్రియల్లోనూ ఆమె స్వరం అనునయిస్తూనే అవతలి వారిని సాంత్వన పరుస్తుంది.

కుంజమ్మకు కూతురు లిల్లీకుట్టి. కుంజమ్మకు పూయప్పల్లి ఆత్మబంధువు. ఊరికన్నా ఆమె చిన్నదో, ఆమెకన్నా ఊరు చిన్నదో చెప్పలేం. లేదా కుంజమ్మ, పూయప్పల్లి కవలలు అయి ఉండాలి. ఆమెకు కాస్త విశ్రాంతిని ఇచ్చేటందుకు ఆమె వయసు ఎంత ప్రయత్నిస్తున్నా... 'పోవే, నాకు విశ్రాంతి ఏంటీ?!' అని గాత్రాన్ని, సంగీత వాద్యాన్ని శ్రావ్యంగా పలికిస్తూనే, సుమధుర రాగాలను ఒలికిస్తూనే ఉన్నారు కుంజమ్మ!!

వంటిల్లు

ఆరోగ్యంలో మునగండి



మునగాకులో ఏ, బీ, సీ విటమిన్‌లుంటాయి. క్యాల్షియం, పొటాషియం, ఐరన్... మెగ్నీషియం, ఫాస్ఫరస్ కూడా ఉంటాయి. తరచూ తింటే చాలా మంచిది. రోజూ కూరల్లో వేసుకుంటే ఇంకా మంచిది.

మొరింగా టీ

- మునగాకులో ఈనెలు, చిల్లు పడిన ఆకులు, పండిపోయిన ఆకులను ఏరివేసి శుభ్రంగా కడిగి చిల్లుల పాత్రలో వేసి నీరు పోయే వరకు ఉంచాలి.
- తర్వాత ఆకును ఒక పేపర్ మీద కానీ నూలు వస్త్రం మీద కాని వేసి తేమ పూర్తిగా ఆరిపోయే వరకు ఉంచాలి. మునగాకును ఎండ బెట్టకూడదు, నీడలోనే ఆరబెట్టాలి. వాతావరణాన్ని బట్టి ఒకటి లేదా రెండు రోజుల్లో ఆరిపోతాయి. ఆకులను చేత్తో కదిలించినప్పుడు తేమలేకుండా గలగలలాడాలి.
- ఆకులను మిక్సీ జార్‌లో మెత్తగా పొడి చేయాలి. పొడిని జల్లించి తేమ లేని సీసాలో నిల్వ చేసుకోవాలి.

టీ తయారీ:

- పావు లీటరు నీటిని మరిగించి అందులో టీ స్పూన్ మొరింగా పౌడర్ వేసి మూత పెట్టాలి. ఓ నిమిషం తర్వాత గ్లాసులో పోసుకుని తాగాలి. రోజూ ఉదయం ఈ మొరింగా టీ తాగితే అధిక బరువు తగ్గుతుంది.

గమనిక: ఇలా తయారు చేసుకున్న పొడి ఆరు నెలల వరకు నిల్వ ఉంటుంది. కూరల్లో, పప్పులోకి తాజా మునగాకు దొరకని రోజుల్లో ఈ పొడిని వేసుకోవచ్చు.

మునగాకు - పెసరపప్పు



కావలసినవి:

మునగాకు – 4 కప్పులు; పెసరపప్పు– కప్పు; ఎండు మిర్చి – 1; ఉల్లిపాయ ముక్కలు – పావు కప్పు; వెల్లుల్లి రేకలు– 5; ఆవాలు – టీ స్పూన్; ఇంగువ – పావు టీ స్పూన్; పసుపు – అర టీ స్పూన్; మిరప్పొడి – అర టీ స్పూన్; ఉప్పు – పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి;పచ్చి కొబ్బరి తురుము– పావు కప్పు; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు;

తయారీ:

- మునగాకులో ఈనెలు లేకుండా ఏరి వేసి ఆకును మంచి నీటితో శుభ్రంగా కడిగి పక్కన పెట్టాలి.
- పెసరపప్పును కూడా కడిగి సిద్ధంగా ఉంచుకోవాలి.
- బాణలిలో నూనె వేడి చేసి అందులో ఆవాలు, ఎండుమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లి రేకలు, ఇంగువ వేసి వేగిన తర్వాత పెసర పప్పు వేయాలి. ఇప్పుడు మునగాకు, పసుపు, మిరప్పొడి వేసి కలిపి నీరు పోసి మూత పెట్టాలి. ఉడకడం మొదలైన తర్వాత మూత తీసి మరోసారి కలిపి మంట తగ్గించి ఉడికించాలి. నీరు తగ్గిపోయన తర్వాత కొబ్బరి పొడి, ఉప్పు కలిపి మూత పెట్టి స్టవ్ ఆపేయాలి. ఇది అన్నం, రోటీల్లోకి బాగుంటుంది.

నగధగలు

వజ్రం మరో వజ్రాన్ని కోస్తుంది!

ఆభరణం చాలా రోజులు బీరువాలో ఉంచితే కొద్దిగా మసకబారినట్లు అనిపిస్తుంది. ఆభరణం ధగధగలాడాలంటే ధరించే ముందు ఏ జాగ్రత్తలు తీసుకోవాలి, ధరించిన తర్వాత తిరిగి భద్రపరిచేటప్పుడు ఎటువంటి చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం.



- ఆభరణాన్ని (బంగారు ఆభరణం, వజ్రాల ఆభరణం ఏదైనా) ధరించే ముందు వెల్వెట్ క్లాత్ లేదా మెత్తని నూలు వస్త్రంతో సున్నితంగా తుడవాలి.
- దుమ్ము పట్టేసినట్లనిపిస్తే వేడి నీటితో శుభ్రం చేయాలి. ఇది చాలా అరుదుగా మాత్రమే చేయాలి. ఓపెన్ సెట్టింగ్ వజ్రాల ఆభరణాన్ని వేడి నీటిలో ఒకసారి ముంచి తీసి వెంటనే టిష్యూ పేపర్‌తో తేమ వదిలే వరకు సున్నితంగా తుడవాలి. ఇది ఇతర రంగు రాళ్లేవీ లేకుండా అన్నీ వజ్రాలే ఉన్న ఆభరణానికి మాత్రమే వర్తిస్తుంది. ఇతర రాళ్లు పొదిగిన ఆభరణాలను వేడి నీటిలో ముంచరాదు.
- క్లోజ్‌డ్ సెట్టింగ్ వజ్రాల ఆభరణాన్ని నీటిలో ముంచకూడదు. నీటిలో ముంచినట్లయితే కొంతనీరు వజ్రానికి బంగారానికి మధ్యలో చేరుతుంది. ఆ నీటిని తొలగించడం కష్టం. మరీ ఎక్కువగా నీరు పట్టినప్పుడు వజ్రాన్ని తీసి మళ్లీ చేయించుకోవడమే మార్గం. కాబట్టి క్లోజ్‌డ్ సెట్టింగ్ వజ్రాల ఆభరణం మీద పట్టిన దుమ్మును వదిలించాలంటే టిష్యూ పేపర్ లేదా వెల్వెట్ క్లాత్‌తో తుడవాలి. అంతేకాదు, ఆభరణాలను తరచూ నీటితో శుభ్రం చేస్తుంటే బంగారం కరిగిపోతుంది.
- ఏ ఆభరణాన్నయినా (పూర్తి బంగారు ఆభరణాలు, రాళ్లు పొదిగిన ఆభరణాలు, వజ్రాల ఆభరణాలు) తెల్లటి ప్లాస్టిక్ బాక్సుల్లోనే పెట్టాలి.
- వెల్వెట్ క్లాత్‌కి రంగును వదిలే స్వభావం ఉంటుంది. దీర్ఘకాలం వెల్వెట్ క్లాత్ మధ్య ఉంచితే వెల్వెట్ క్లాత్ రంగు ప్రభావం ఆభరణం మీద పడుతుంది.
- వజ్రాల ఆభరణాలు ఒక బాక్సులో ఒక్కటి మాత్రమే ఉండాలి. వజ్రం గట్టిగా ఉంటుంది. కోసే గుణం కూడా ఉంటుంది. కాబట్టి ఒక స్టోన్ కారణంగా మరొక స్టోన్ కోతకు గురయ్యే ప్రమాదం ఉంటుంది.



రీటా షా
కన్సల్టెంట్ అండ్ జ్యూయలరీ డిజైనర్, హైదరాబాద్

నిద్రపోనివ్వని కల

చిన్నప్పుడు మల్లవ్వ భీమప్పకు చదువు ఒక కల. ఉద్యోగం ఇంకాస్త పెద్ద కల. కానీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు ఆమె కన్న ఆ రెండు కలల్ని నెరవేరనివ్వలేదు. మల్లవ్వ పెరిగి పెద్దదైంది. ఊరికి సర్పంచ్ గా కూడా పనిచేసింది. ఆమె కలలు మాత్రం కలలు గానే ఉండిపోయాయి. వాటిని సాకారం చేసుకోటానికి అక్టోబర్ 13న ఊళ్ళో ఒక లైబ్రరీని ప్రారంభించింది మల్లవ్వ. తను చదువుకోలేకపోవచ్చు. తను ఉద్యోగం చేయలేకపోవచ్చు. చదువుకునే పిల్లల కోసం, ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమవాలనుకున్న యువతీయువకుల కోసం.. వారికి పనికొచ్చే పుస్తకాలను లైబ్రరీలో అందుబాటులో ఉంచింది. ఇంకా కొన్ని పుస్తకాలను తెప్పిస్తోంది. వాళ్ళలో తనను చూసుకుంటోంది. లైబ్రరీ ఏర్పాటు కోసం మల్లవ్వ ఖర్చు చేసిన 1.50 లక్షల రూపాయల్లో.. గృహలక్ష్మి యోజన కింద ప్రభుత్వం నెలనెలా ఇస్తున్న 2000 రూపాయలను దాచిపెట్టగా జమ అయిన 26 వేల రూపాయలు కూడా ఉన్నాయి. కల అంటే నిద్రలో వచ్చేది కాదు, నిద్ర పోనివ్వకుండా చేసేది అనే మాట మల్లవ్వ విషయంలో నిజమైంది. రుజువైంది.



బుక్ షెల్ఫ్

ఈ ఐదు పుస్తకాలూ చదవాలి

ట్వింకిల్ ఖన్నా పేరు వినిపిస్తే సినిమాలే కాదు, పుస్తకాలు కూడా గుర్తుకు వస్తాయి. హ్యూమర్ నుంచి సెల్ఫ్– హెల్ప్ వరకు ఎన్నో పుస్తకాలు రాసి 'బెస్ట్‌సెల్లింగ్ ఆథర్'గా పేరు తెచ్చుకుంది. రాయడమే కాదు, పుస్తక పఠనాన్ని బాగా ఇష్టపడుతుంది. పుస్తక ప్రియుల కోసం ఆమె అయిదు ఉత్తమ పుస్తకాలను సూచిస్తోంది. అవి:

1. ఖబర్– క్రిష్ణ మీరా
2. ది గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్– అరుంధతీ రాయ్
3. ఇఫ్ ఇట్ బ్లీడ్స్– స్టీఫెన్ కింగ్
4. లెస్– ఆండ్రూ సీన్ గ్రీర్
5. బ్రంట్ షుగర్–– అవనీ దోషి

సో ట్వింకిల్‌ను అభిమానించే వారి జాబితాలో సినీ ప్రేమికులే కాదు, పుస్తక ప్రియులు కూడా చేరవచ్చన్నమాట. అంతేనా... ఆమె సూచించిన పుస్తకాలను కూడా ఇష్టంగానే చదువుకోవచ్చు.



ట్వింకిల్ ఖన్నా

● లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్

చావు పుట్టుకలు మన చేతిలో ఉండవు. మధ్యనున్న జీవితమే మన చేతిలో ఉండేది. ఆ జీవితాన్ని దుఃఖభరితం చేసుకోవద్దు. పరిపూర్ణంగా జీవించాలంటే ఆరోగ్యంగా ఉండాలి. ఆరోగ్యం శారీరకంగానే కాదు మానసికంగా కూడా. అలాగే... ఆధ్యాత్మిక ఆరోగ్యమూ అవసరమే. వీటన్నింటి సమ్మేళనమే సుషుమ్న ధ్యాన ప్రక్రియ. రోజుకో గంట చాలు... లైఫ్ హ్యాపీ లైఫ్ అవుతుంది అంటారు ఆత్మానందమయి అమ్మ.

మన కోసం మనం



'మనిషి భూమ్మీదకు వచ్చింది దుఃఖపడడానికి కాదు, సంతోషం గా, సంతృప్తిగా జీవిస్తూ జీవితాన్ని పరిపూర్ణం చేసుకోవాలి' అంటారు ఆత్మానందమయి. మీకోసం మీరు రోజుకి గంట కేటాయించగలిగితే పరిపూర్ణమైన జీవితాన్ని జీవించగలుగుతారు. సుషుమ్న క్రియ సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం కుదుటపడుతుంది... అని ప్రపంచదేశాలకు హోలిస్టిక్ వెల్‌బీయింగ్ గురించి వివరిస్తున్నారామె. ఇటీవల అమెరికాలోని న్యూ జెర్సీ, అట్లాంటా, డాలస్, డెట్రాయిట్, కాలిఫోర్నియా, మియామీ, న్యూయార్క్ లలో వచ్చిన విశేషమైన స్పందనను సాక్షితో పంచుకున్నారు ఆత్మానందమయి అమ్మ.

అందరూ సంతోషంగా ఉండాలి!

ఆత్మానందమయికి తల్లిదండ్రులు పెట్టిన పేరు వాసంతి. చెన్నైలో పుట్టిన వాసంతి సుషుమ్న క్రియ సాధనతోనే జీవితాన్ని పునర్నిర్మించుకున్నారు. తీవ్రమైన డిప్రెషన్‌కు గురయిన వాసంతిని భగవద్గీత, 'ఒక యోగి ఆత్మకథ' కొత్తమార్గంలో నడిపించాయి. ధ్యానం మీద ఆసక్తి పెరిగింది. సుషుమ్న క్రియ సాధన ద్వారా తాను సాధించిన పరిపూర్ణతను అందరికీ అందించడానికి జీవితాన్ని అంకితం చేశారామె.

చాలా ఈజీ... ప్రాక్టీస్ చేయండి!

నిజానికి లైఫ్ అంటే మనం ఇరవై నాలుగ్గంటల్లో తీసే పరుగులు కాదు. మనం తెలుసుకోవలసింది ఇంకా ఏదో ఉంది. ఆ సత్యాన్ని తెలుసుకోవడానికి ఒక గంట ధ్యానం దారి చూపిస్తుంది. సుషుమ్న క్రియ సాధన గురించి ఆధునిక సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి, ప్రపంచ దేశాలకు పరిచయం చేయడానికి ఆమె విస్తృతంగా పర్యటిస్తున్నారు. మన దేశంలో అనేక రాష్ట్రాలతోపాటు దుబాయ్, ఆస్ట్రేలియా, యూఎస్‌లలో శిక్షణ తరగతులు నిర్వహించారు. బెంగళూరులో ప్రతి శని, ఆదివారాల్లో నిర్వహించే ఆన్‌లైన్ క్లాసులకు అనేక దేశాల వాళ్లు హాజరవుతున్నారు. చాలా సులువైన ఈ ధ్యాన ప్రక్రియను 49 రోజుల పాటు చేయడం ద్వారా శారీరక, మానసిక, భావపూర్ణ, సామాజిక, ఆధ్యాత్మిక వికాసం కలిగి సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారు. ఈ భావనను ఆచరణలోకి తీసుకురావడం, విశ్వవ్యాప్తం చేయడమే తన జీవితలక్ష్యం అంటున్నారు ఆత్మానందమయి అమ్మ.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

> సుషుమ్న క్రియను సాధన చేయడం ద్వారా సెల్ఫ్ ఇంటరాక్షన్ సాధ్యమవుతుంది. ఇది జీవితాన్ని పరిపూర్ణంగా జీవించడానికి దోహదం చేస్తుంది. మనుషులంతా తమకు తాముగా ఆత్మానందాన్ని పొందగలగాలని, అందు కోసం ఈ క్రియను సాధన చేయడంలో శిక్షణ ఇవ్వమని నా గురువులు ఆదేశించారు. ఆ ఆదేశం మేరకు నేను అందులోనే నిమగ్నమయ్యాను. పాతికేళ్లుగా సుషుమ్న క్రియ సాధనలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను.
> – ఆత్మానందమయి, దివ్య బాబాజీ సుషుమ్న క్రియా యోగ ఫౌండేషన్, బెంగళూరు



● సఫలమైన ప్రయోగం



కలల్లోనూ కమ్యూనికేషన్!

ఇద్దరు వ్యక్తులు కలల్లో సంభాషించడం సాధ్యమా? సాధ్యమే అని ప్రకటించుకుంది సైన్సుకు సంబంధించిన ఓ సంస్థ. కాలిఫోర్నియాకు చెందిన 'రెమ్ స్పేస్' అనే ఓ స్టార్టప్‌లో గత నెల 24న నిర్వహించిన ఓ ప్రయోగం సఫలమైందని ఆ సంస్థ ప్రకటించుకుంది. ఈ ప్రయోగం జరిగిన తీరిది...

ఈ పరిశోధనలో పాలు పంచుకుంటున్న ఇద్దరూ చెరో మంచం మీద పడుకున్నారు. ఇద్దరి తలలకూ అనేకరకాల వైర్లూ, పరికరాలూ అమర్చి ఉన్నాయి. ఇద్దరూ కలగంటున్నప్పుడు వారి తలల నుంచి ఎలాంటి తరంగాలు వెలువడుతున్నాయో నమోదు చేసేందుకు 'పాలీ సోమ్నోగ్రఫిక్' డాటాను ఒడిసిపట్టేందుకు అన్ని రకాల ఉపకరణాలూ అమర్చి ఉన్నాయి. ప్రయోగ వేత్తలు వీటన్నింటినీ ఓ 'సెంట్రల్ సర్వర్'తో లింక్ చేసి పెట్టారు. ఈ మొత్తం ప్రయోగానికి ఈ సెంట్రల్ సర్వర్ గుండెకాయ లాంటిది. ఎందుకంటే స్లీప్ పాటర్న్ మొత్తాన్ని ఇదే మానిటర్ చేస్తూ ఉంటుంది.

నిద్రిస్తున్నప్పుడు కనురెప్పలు వేగంగా స్పందించే 'ర్యాపిడ్ ఐ మూవ్‌మెంట్' (రెమ్) దశ, కనురెప్పలు స్పందించని 'నాన్ ర్యాపిడ్ ఐ మూవ్‌మెంట్ (నాన్‌రెమ్) దశలు ఒకదాని తర్వాత మరొకటి నడుస్తుంటాయనీ, ఈ 'రెమ్'దశలోనే మెదడు చాలా చురుగ్గా పనిచేస్తూ ఉంటుందనీ, ఇందులోనే కలలు వస్తుంటాయన్నది తెలిసిందే. ఈ దశలో కలలు కంటున్న ఇద్దరు లూసిడ్ డ్రీమర్స్... ఇప్పుడా సర్వర్... ఆ డ్రీమర్స్ మెదళ్లలోంచి వెలువడుతున్న బ్రెయిన్ వేవ్స్‌ను ఒడిసిపట్టుకుని వాళ్లలో ఏ కలరన్ అవుతోందో చెబుతున్న తరుణంలో 'రెమ్యో'అంటూ పిలిచే ఆ స్వప్నభాషలోంచి ఆవిర్భవించిన 'జిలాక్' అంటూ పుట్టిన ఓ పదాన్ని నిద్రపోతున్న వ్యక్తుల్లో ఒకరు ఉచ్చరిస్తుండగా... వాళ్లు ఉచ్చరించిన ఆ పదాన్ని ఉపకరణాలు రికార్డు చేశాయి. ఇది ప్రయోగంలోని తొలిసగం. ఇప్పుడు మళ్లీ ఎనిమిది నిమిషాల తర్వాత అదే సర్వర్... కలగంటున్న మరో వ్యక్తికి... తొలి వ్యక్తి ఉచ్చరించిన అదే పదాన్ని వాళ్ల ఇయర్ బడ్స్‌కు చేర్చింది. అప్పుడా కలగంటున్న వ్యక్తి దాన్ని జాగ్రత్తగా వినింది. ఇప్పుడు ఈ రెండోవ్యక్తి కూడా నిద్రలేచాక తానేం విన్నదో దాన్ని మెల్లగా ఉచ్చరించింది 'జిలాక్' అంటూ! అంతే... దాంతో వారిద్దరూ అన్నదీ, విన్నదీ ఒకటే పదమన్న విషయం రూఢీ అయ్యింది!!

ఇది కేవలం ఒకరు అన్నది నిద్రలో మరొకరు విన్నట్లుగా తేలిగ్గా తీసుకునే విషయం కాదనీ, నిద్రలో జరిగిన కమ్యూనికేషన్ తాలూకు ఓ మైలురాయిగా అభివర్ణిస్తోంది 'రెమ్‌స్పేస్' సంస్థ. తాము ప్రత్యేకంగా రూపొందించిన సర్వర్ వంటి ఉపకరణాలూ, కొన్ని పరికరాలూ, వైఫై సెన్సర్లూ వంటి వాటిని ఉపయోగించామని చెబుతున్నా నిర్దిష్టంగా ఆ సాంకేతికత ఏమిటన్నది ఆ సంస్థ స్పష్టం గా వెల్లడించడం లేదు.

ఇప్పుడీ దశలో ఆ ప్రయోగం వాస్తవమే అని తేలాలంటే ఆ సాంకేతికత ఏమిటో ఇతర సైంటిస్టులకూ తెలియాలి. వారి ప్రయోగాల్లోనూ ఇదే మరోసారి జరగాలి. సర్వత్రా ఎక్కడ ప్రయోగం జరిగినా ఒకేలాంటి ఫలితాలు వచ్చినప్పుడే ఆ ప్రయోగాలు సఫలమైనట్లుగా చెప్పగలమనేది సైంటిస్టుల మాట. అయితే ఒకవేళ స్లీప్ రీసెర్చ్‌లో తేలిన ఈ విషయాలు వాస్తవమని ఇతర సైంటిస్టుల ప్రయోగాల్లోనూ నిర్ధారణ అయ్యాక స్లీప్ సైన్స్‌లో ఇదో విప్లవాత్మకమైన మైలురాయి అవుతుంది. మానసిక చికిత్సల్లో మరింత మెరుగుదల సాధించేందుకు ఇదో అద్భుతమైన ప్రయోగమవుతుంది. ●

> "నిన్నటివరకూ నిద్రలో, కలల్లో కమ్యూనికేషన్ అనేది ఓ సైన్స్ ఫిక్షన్ మాత్రమే. కానీ రేపు ఇది వాస్తవ రూపం దాల్చిన తర్వాత మన జీవితాల్లో ఇదో అనివార్యమైన సాంకేతికత అవుతుంది. దీన్ని లేకుండా మన జీవితాల్ని ఊహించలేము. మనం మన స్వప్న ప్రపంచంలో ఎలా ఉంటాం, ఎలా వ్యవహరిస్తాం, ఎలా కమ్యూనికేట్ చేస్తామనే ఈ అంశాలన్నీ అనేక వాణిజ్య ప్రయోజనాల కోసం కూడా ఉపయోగపడతాయి "

బుజ్జాయిలు హాయిగా బజ్జుంటున్నారా?



చిన్న పిల్లలకి నిద్ర చాలా ముఖ్యం. సుఖమైన నిద్ర వారి ఎదుగుదలను ఆరోగ్యవంతంగా చేయడమే కాదు.. వారిలో రోగ నిరోధక శక్తిని పెంచి, మేధాశక్తిని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. ● రోజూ ఒకే సమయాన్ని నిద్రకు కేటాయిస్తే అది సంతృప్తికర నిద్రకు దోహదపడుతుంది. ఇది వాళ్ళ స్లీప్ సైకిల్‌ని క్రమబద్ధపరచడమే కాకుండా పిల్లల్ని మరింత శక్తిమంతంగా తయారు చేస్తుంది. సమయానుసారంగా పడుకోవడం.. లేవడం చిన్న పిల్లలకే కాదు, పెద్దవాళ్ళకూ ఎంతైనా అవసరం. ● సుఖమయమైన నిద్రకు 'పాజిటివ్ బెడ్ టైం రొటీన్', అంటే నిద్రపోయే ముందు ప్రతిరోజూ చేసే కొన్ని పనులు ఎంతగానో దోహదపడతాయి. ఇది పిల్లల మానసిక ఆరోగ్యం మెరుగుదలకు ఉపకరిస్తుంది. ● ముఖ్యంగా పడుకునే ముందు స్నానం చేయడం, పళ్లు తోముకోవడం, నైట్ డ్రెస్ వేసుకోవడం, కథలు వింటూనో, చెబుతూనో నిద్రపోవడం.. పిల్లలను ఆరోగ్యంగా ఉంచడమే కాదు, వారికి బంధాల పట్ల గౌరవ మర్యాదలు పెరగడానికీ సహాయపడతాయి.

యూరిక్ యాసిడ్ సహజంగా తగ్గాలంటే..?



సాధారణంగా బాడీలో యూరిక్ యాసిడ్ ఎక్కువ ఉన్నప్పుడు కీళ్లనొప్పులు తీవ్రమవుతుంటాయి. ఆ స్థాయిని తగ్గించుకోవడానికి ఇంట్లోనే సులభంగా చేసుకునే చిట్కాలు..

బచ్చలికూర జ్యూస్

బాడీలో యూరిక్ యాసిడ్‌ని తగ్గించే బెస్ట్ రెమిడీ బచ్చలికూర జ్యూస్. బచ్చలికూర, దోసకాయ సమపాళ్లలో తీసుకుని చిన్న అల్లం ముక్క, ఒక నిమ్మ చెక్క రసం కలిపి, ఆ మిశ్రమాన్ని తీసుకోవడంతో మంచి ఫలితం ఉంటుంది.



పసుపు పాలు

యూరిక్ యాసిడ్ స్థాయి తగ్గించడంలో పసుపు పాలు ప్రభావవంతంగా పనిచేస్తాయి. పడుకునే ముందు ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపు కలుపుకుని తాగితే మంచి ఫలితం ఉంటుంది.





దోసకాయ జ్యూస్

ఈ జ్యూస్ శరీరంలోని యూరిక్ యాసిడ్‌తో సహా టాక్సిన్స్‌ను బయటకు పంపుతుంది.

పుచ్చకాయ జ్యూస్

పుచ్చకాయ జ్యూస్ తాగితే బాడీలో ఎక్కువగా ఉన్న యూరిక్ యాసిడ్ బయటికి పోయి మూత్రపిండాల వ్యవస్థ మెరుగుపడుతుంది.



అల్లం టీ


తాజా అల్లం ముక్కలను నీటిలో ఉడకబెట్టి, ఆ నీటిలో కొద్దిగా తేనె కలిపి తీసుకుంటే ఫలితం ఉంటుంది.



గ్రీన్ టీ


చాలా ఆరోగ్య ప్రయోజనాలను అందించే గ్రీన్ టీ.. కిడ్నీ పనితీరుకు ఎంతగానో సహకరిస్తాయి. యాంటీ ఆక్సిడెంట్లతో నిండిన ఈ టీ తీసుకుంటే యూరిక్ యాసిడ్ బాడీ నుంచి బయటకి పోతుంది.

మీ శరీరమే మీ మందుల ఫ్యాక్టరీ!



జ్వరమొస్తే.. జలుబు చేస్తే మందులేసుకుంటాం. ఈ మందుల వల్ల అనేక దుష్ప్రభావాలు కనపడటం అందరికీ తెలిసిన విషయం. మరి ప్రత్యామ్నాయం? మీ శరీరాన్నే బయో ఫ్యాక్టరీగా మార్చుకుని మందులు ఉత్పత్తి చేసుకోవడం అంటున్నారు యూనివర్శిటీ ఆఫ్ టెక్సస్‌కు చెందిన సౌత్‌వెస్టర్న్ మెడికల్ సెంటర్ శాస్త్రవేత్తలు. అదెలా అంటే... మన కణాల్లోని మైటోకాండ్రియాలోని క్రోమోజోమ్‌లలో ఉండచుట్టుకుని ఉండే డీఎన్‌ఏ పోగు భాగాన్నే ఎంఆర్‌ఎన్‌ఏ అంటారు. ఇవి జీవక్రియలకు అవసరమైన ప్రొటీన్లు ఎలా తయారు చేయాలన్న సమాచారాన్ని మోసుకెళుతూంటాయి. ఈ ఎంఆర్‌ఎన్‌ఏలలో కొద్దిపాటి మార్పులు చేస్తే వాటి ద్వారా శరీరంలోనే మనకు అవసరమైన మందులను తయారు చేయవచ్చునని శాస్త్రవేత్తలు గుర్తించారు. రెండు రకాల కేన్సర్లతోపాటు చర్మ సంబంధిత ఆరోగ్య సమస్యలకూ ఈ ఎంఆర్‌ఎన్‌ఏ టెక్నాలజీ ద్వారా మందులు ఉత్పత్తి చేయవచ్చు.''ఆసుపత్రికో లేదా క్లినిక్‌కు తరచూ వెళ్లాల్సిన అవసరం లేకుండా.. మందుల షాప్‌లోనే నెలకోసారి ఈ ఎంఆర్‌ఎన్‌ఏ మందుల ఫ్యాక్టరీని శరీరంలోకి ఎక్కించుకోవచ్చు. వ్యాధి బారిన పడ్డవారికి ఈ టెక్నాలజీ వల్ల ఎంతో మేలు జరుగుతుంది'' అంటున్నారు ఈ పరిశోధనల్లో పాల్గొన్న డేనియల్ సీగ్‌వార్ట్.

సినిమా



● అఖిల్

తిరుపతి నేపథ్యంలో...

వాట్ నెక్ట్స్? అఖిల్ అక్కినేని చేయనున్న కొత్త చిత్రం గురించిన చర్చ ఇది. వార్తల్లో ఉన్న ప్రకారం అఖిల్ రెండు సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఒకటి యూవీ క్రియేషన్స్ నిర్మించనున్న సినిమా అని, ఈ చిత్రాన్ని అనిల్ కుమార్ అనే కొత్త దర్శకుడు తెరకెక్కించనున్నారని ఇప్పటికే ప్రచారంలో ఉంది. ఇక మరో చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించనుందని భోగట్టా. కిరణ్ అబ్బవరం హీరోగా 'వినరో భాగ్యము విష్ణుకథ' చిత్రాన్ని తెరకెక్కించిన మురళీ కిషోర్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందనుందని సమాచారం. మురళి చెప్పిన కథ నాగార్జునకు నచ్చడంతో హోమ్ బేనర్‌లో నిర్మించాలని నిర్ణయించుకున్నారట. తిరుపతి నేపథ్యంలో పీరియాడిక్ మూవీగా రూపొందనుందని టాక్. ఈ చిత్రానికి 'లెనిన్' టైటిల్ అనుకుంటున్నారని భోగట్టా. అలాగే యూవీ క్రియేషన్స్‌లో నటించనున్న చిత్రానికి 'ధీర' అనే టైటిల్ పరిశీలనలో ఉందట. ఇది కూడా పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్ మూవీ అట. ఇక అఖిల్ అయితే ఈ మధ్య మేకోవర్ అయ్యారు. ఈ మేకోవర్ ఏ సినిమా కోసం అనేది తెలియాల్సి ఉంది.



● షారుక్ ఖాన్

సెట్‌లోనే కన్ను మూయాలనుంది

''జీవితాంతం నేను నటుడిగానే ఉంటాను. సినిమా సెట్‌లో కన్ను మూయాలన్నదే నా సంకల్పం'' అని పేర్కొన్నారు షారుక్ ఖాన్. భారతీయ చిత్ర పరిశ్రమకు తాను చేసిన సేవలకుగాను 'లోకర్నో ఫిల్మ్ ఫెస్టివల్'లో జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు షారుక్. ఈ సందర్భంగా ఆయన అక్కడి మీడియాతో ముచ్చటించారు. అందులో భాగంగా 'జీవితాంతం మీరు నటుడిగానే కొనసాగుతారా?' అని ఓ విలేకరి ప్రశ్నించారు. ఇందుకు షారుక్ బదులిస్తూ... ''చనిపోయే వరకూ సినిమాల్లోనే ఉంటాను. ఏదైనా సినిమా సెట్‌లో యాక్షన్ చెప్పగానే నేను చనిపోవాలి. వాళ్లు కట్ చెప్పాక కూడా పైకి లేవకూడదు. ఇదే నా కోరిక'' అన్నారు. అలాగే స్టార్‌డమ్‌ని మీరు ఎలా ఫీలవుతారు? అనే మరో ప్రశ్నకు స్పందిస్తూ... ''స్టార్‌డమ్‌ను చాలా గౌరవిస్తాను. ఎందుకంటే దానివల్లే ఫ్యాన్స్ ప్రేమ, ఆదరణ, గుర్తింపు, డబ్బు లభించాయి. ఇక నాకు సెన్సాఫ్ హ్యూమర్ ఎక్కువ. అయితే ప్రస్తుతం ప్రజలు చాలా సున్నితమనసున్నవారయ్యారు. ఏం చెప్పినా డిస్టర్బ్ అవుతున్నారు. కాబట్టి సెన్సాఫ్ హ్యూమర్ లేకపోవడమే మంచిది'' అన్నారు షారుక్ ఖాన్.

రెండో భాగం కూడా..?



● మహేశ్‌బాబు

హీరో మహేశ్‌బాబు, డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో 'ఎస్ఎస్ఎంబీ 29' (వర్కింగ్ టైటిల్) సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ కాంబినేషన్‌లో సినిమా ప్రకటన వచ్చినప్పటి నుంచి నిత్యం ఏదో ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా 'ఎస్ఎస్ఎంబీ 29' చిత్రం ఒకటి కాదు రెండు భాగాలుగా రూపొందనుందనే న్యూస్ నెట్టింట వైరల్‌గా మారింది. 'బాహుబలి' సినిమా తరహాలోనే 'ఎస్ఎస్ఎంబీ 29'ని కూడా రెండు భాగాలుగా తెరకెక్కించే ఆలోచనలో ఉన్నారట రాజమౌళి. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే యాక్షన్ అడ్వెంచరస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీబిజీగా ఉంది. ఈ సినిమా కోసం పొడవాటి హెయిర్ స్టైల్, గెడ్డం, కండలు తిరిగిన బాడీ పెంచే పనిలో ఉన్నారు మహేశ్‌బాబు. కాగా కథకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా ఒకే భాగంలో చెప్పడం సాధ్యం కాదని, అందుకే రెండు భాగాలుగా ఈ చిత్రం రూపొందనుందని తెలుస్తోంది. అలాగే సీక్వెల్స్ వస్తాయనే ఊహాగానాలూ ఉన్నాయి. ఈ వార్తలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. జనవరిలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందని చిత్ర కథా రచయిత విజయేంద్ర ప్రసాద్ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే.

పేర్లు మర్చిపోయా!



● సమంత

జోరుగా, జోష్‌గా సినిమాలు చేసుకుంటూ వచ్చిన సమంత 'మయోసైటిస్' వ్యాధి కారణంగా ఏడాదికి పైగా షూటింగ్స్‌కి దూరంగా ఉన్నారనే సంగతి తెలిసిందే. ఈ వ్యాధి వల్ల తాను ఎదుర్కొన్న సమస్యల గురించి పలు సందర్భాల్లో పంచుకున్నారామె. తాజాగా 'సిటాడెల్: హనీ బన్నీ' వెబ్ సిరీస్ ప్రచార కార్యక్రమాల్లోనూ ఈ వ్యాధి గురించి ప్రస్తావించారు. ముఖ్యంగా అనారోగ్యంతో పోరాడుతున్న సమయంలో తాను ఒకరోజు జ్ఞాపక శక్తి కోల్పోయానని సమంత చెప్పిన విషయం వైరల్‌గా మారింది. ''సిటాడెల్: హనీ బన్నీ' షూటింగ్‌లో ఉన్నప్పుడు సడన్‌గా అంతా మర్చిపోయా. చాలామంది పేర్లు మర్చిపోయాను. ఆ షూటింగ్ కోసం ఉపయోగించిన సెట్ టైమ్ ఇంకా ఒకే ఒక్క రోజు మాత్రమే ఉంది. ఆ పరిస్థితిలో నేను అన్నీ మర్చిపోయాను. ఎవరో మనుషులు వస్తున్నారు... వెళుతున్నారు.. ఓ స్టంట్ మాస్టర్ నా ముందు ఉన్నాడు... నేనేం చేస్తున్నానో తెలియలేదు. ఇలా అయోమయ స్థితిలో పడిపోయాను. ఇప్పుడు ఆ విషయాన్ని గుర్తు చేసుకున్నా... ఆ టైమ్‌లో నన్నెవరూ ఆస్పత్రికి తీసుకెళ్లలేదని, నా ఆరోగ్యం గురించి ఎవరూ అడగలేదని అనుకుంటుంటాను. కానీ 'సిటాడెల్: హనీ బన్నీ' యూనిట్ సహకరించింది. నేను కోలుకున్నాక షూటింగ్ చేశారు'' అని పేర్కొన్నారు సమంత. అయితే సమంత ఇలా మర్చిపోయిన తర్వాత ఈ యూనిట్ డాక్టర్‌ని సంప్రదించిందట. ఆ విషయం సమంతకు గుర్తు లేదు. అందుకే ఎవరూ ఆస్పత్రికి తీసుకెళ్లలేదని ఆమె అనుకుంటున్నారు. ఇక రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో రూపొందిన 'సిటాడెల్: హనీ బన్నీ' నవంబరు 7 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ కానుంది.

పొట్టేల్ రియల్ పాన్ ఇండియన్ మూవీ
– సంయుక్తా మీనన్



● యువ చంద్రకృష్ణ, అనన్య, సంయుక్తా మీనన్

''పొట్టేల్' సినిమా ట్రైలర్ చాలా బాగుంది. ఈ కథ మీద డైరెక్టర్ సాహిత్ నాలుగేళ్లు పని చేయడం మామూలు విషయం కాదు. మంచి రైటింగ్, డైరెక్షన్ ఉంటేనే ఇంత అద్భుతమైన సినిమా తెరపైకి వస్తుంది. ఈ ట్రైలర్‌లో ఫస్ట్ షాట్ చూసినప్పుడు ఒక రియల్ పాన్ ఇండియన్ ఫిల్మ్‌లా అనిపించింది'' అని హీరోయిన్ సంయుక్తా మీనన్ అన్నారు. యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో అజయ్ కీలక పాత్రలో నటించిన రూరల్ యాక్షన్ డ్రామా 'పొట్టేల్'. సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహించారు. నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగే నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన సంయుక్తా మీనన్ మాట్లాడుతూ– ''నిశాంక్‌గారు ఈ సినిమా గురించి చెప్పినప్పుడు చాలా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ అనిపించింది. ఇలాంటి ప్యాషన్ ఉన్న నిర్మాతలు పరిశ్రమకి కావాలి'' అన్నారు. అనన్య నాగళ్ల మాట్లాడుతూ– ''ట్రైలర్‌లో చూసింది ఒక శాతం మాత్రమే. ఈ చిత్రంలో గొప్ప కథ ఉంది'' అని చెప్పారు. ''చాలా ప్రేమించి ఈ చిత్రం చేశాం'' అన్నారు యువ చంద్రకృష్ణ. ''ప్రేక్షకుల స్పందన కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను'' అని సాహిత్ మోత్కూరి పేర్కొన్నారు. ''మంచి కంటెంట్‌తో నిర్మించిన ఈ చిత్రం పెద్ద సౌండ్ చేయబోతోంది. సాహిత్ అద్భుతంగా తీశాడు'' అని నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగే తెలిపారు.

అది మరచిపోలేదు!



● పాల్ మెస్కల్

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్న హాలీవుడ్ చిత్రం 'గ్లాడియేటర్'. రిడ్లీ స్కాట్ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2000లో వసూళ్ల పరంగా చరిత్ర సృష్టించింది. ఈ సినిమాకి సీక్వెల్‌గా రూపొందిన 'గ్లాడియేటర్ 2'కి కూడా రిడ్లీ స్కాట్‌యే దర్శకత్వం వహించారు. పాల్ మెస్కల్, డెంజెల్ వాషింగ్‌టన్, పెడ్రో పాస్కల్, కొన్నే నిల్సన్, జోసెఫ్ క్విన్ వంటివారు నటించారు. ఈ చిత్రం నవంబరు 15న ఇంగ్లిష్, హిందీ, తెలుగు, తమిళ భాషల్లో 4డీఎక్స్ మరియు ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో రిలీజ్ కానుంది. ఇక 'నాకు ఆ రోజు జ్ఞాపకం ఉంది.. నేను అది మరచిపోలేదు.. ఒక బానిస రాజుపై ప్రతీకారం తీర్చుకున్న క్షణం' వంటి డైలాగ్స్ 'గ్లాడియేటర్ 2' ట్రైలర్‌లో ఉన్నాయి.

తెల్లారు పొద్దుల్లో...



● పీవీ విఘ్నేష్, శేఖర్, మార్కండేయ

సదన్, ప్రియాంకా ప్రసాద్ జోడీగా సాయికుమార్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'ప్రణయ గోదారి'. పీఎల్ విఘ్నేష్ దర్శకత్వంలో పారమళ్ల లింగయ్య నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. మార్కండేయ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'తెల్లారు పొద్దుల్లో..' అంటూ సాగే పాటని కొరియోగ్రాఫర్ శేఖర్ రిలీజ్ చేశారు. మార్కండేయ సాహిత్యం అందించిన ఈ పాటని ధనుంజయ్, అదితీ భావరాజు పాడారు. ''ఈ పాటకి మోహన్ మంచి కొరియోగ్రఫీ చేశారు. ఈ సినిమా పెద్ద హిట్ కావాలి'' అన్నారు శేఖర్ మాస్టర్.

ఓ తల్లి మనసు

ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిషోర్ నిర్మించిన చిత్రం 'తల్లి మనసు'. రచితా మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రం ద్వారా వి. శ్రీనివాస్ (సిప్పీ) దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ముత్యాల అనంత కిషోర్ మాట్లాడుతూ – ''తల్లి గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆమెకు సాటి ఎవరూ రారు. అలాంటి ఓ తల్లి మనసు ఎలాంటి భావోద్వేగాలకు గురైంది. అందుకు దారి తీసిన పరిస్థితులు ఏంటి? అనే అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందించాం. గురువారం విడుదల చేసిన మా చిత్రం టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. నవంబరులో సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు. ''మంచి కథ, కథనాలతో సినిమా చేయాలనే సంకల్పంతో 'తల్లి మనసు' నిర్మించాం'' అన్నారు ముత్యాల సుబ్బయ్య.



● సాత్విక్, రచిత

ప్రేమ... వినోదం



● కర్రి బాలాజీ

'బ్యాక్ డోర్' మూవీ ఫేమ్, నంది అవార్డుగ్రహీత డైరెక్టర్ కర్రి బాలాజీ దర్శకత్వంలో 'డర్టీ లవ్' టైటిల్‌తో ఓ చిత్రం రూపొందనుంది. ఏ2బీ ప్రొడక్షన్స్‌పై 'అన్‌స్టాపబుల్' వంటి కామెడీ ఎంటర్‌టైనర్ తీసిన నిర్మాత రంజిత్ రావు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా కర్రి బాలాజీ మాట్లాడుతూ– ''రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించనున్నాం. రేవ్ పార్టీల్లో విలాసాలతో, పబ్బుల్లో జల్సాలతో యువత మత్తులో ఎలా తూగుతున్నారు వంటి అంశాలను కూడా ఈ సినిమాలో చూపించనున్నాం. స్క్రిప్ట్ వర్క్ పూర్తయ్యింది. ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ మూవీలో కొత్త హీరో, హీరోయిన్లు నటిస్తారు'' అని తెలిపారు.

సాక్షి బిజినెస్

శనివారం
19-10-2024

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
218	104
81,225	24,854

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	18,505	▲	132
డోజోన్స్	43,285	▲	46
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,358	▼	27
డాక్స్	19,657	▲	74
షాంఘై	3,262	▲	92
నికాయ్	38,982	▲	71

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99 స్వచ్ఛత)		
77,410	▲	600
బంగారం (95 స్వచ్ఛత)		
77,100	▲	598
వెండి (కిలో)		
92,283	▲	683

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.66	84.68
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	108.18	111.05
€	యూరో	ఎస్‌బీఐ	89.92	92.55
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.44	56.87
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.36	57.56
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.64	66.33
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.52	23.07
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.00	23.78
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.96	12.79

జోయాలుక్కాస్ దీపావళి ఆఫర్లు

హైదరాబాద్: దీపావళి సందర్భంగా జోయాలుక్కాస్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. కస్టమర్లు రూ.లక్ష కంటే ఎక్కువ విలువైన డైమండ్, అన్‌కట్ డైమండ్ జ్యువెలరీ కొనుగోలుపై ఒక గ్రాము బంగారు నాణేన్ని ఉచితంగా పొందవచ్చు. రూ.50వేలు అంతకంటే విలువైన గోల్డ్, ప్రెషస్ జ్యువెలరీ కొనుగోళ్లపై రూ.1,000 గిఫ్ట్ వోచర్, రూ.10,000 అంతకంటే విలువైన సిల్వర్ కొనుగోలుపై రూ.500 గిఫ్ట్ వోచర్ కూడా పొందవచ్చు. కేవలం 10% ముందస్తు చెల్లింపుతో ప్రస్తుత బంగారం ధరకే బుకింగ్ చేసుకోవచ్చు. ఇప్పటికే మొదలైన ఈ ఆఫర్ నవంబర్ 3 వరకు అందుబాటులో ఉంటుంది. కస్టమర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జోయాలుక్కాస్ చైర్మన్ జోయ్ అలుక్కాస్ కోరారు.

అన్‌లిమిటెడ్ స్టోర్లలో 'ఫెస్టివ్‌ఫ్యాషన్‌వైబ్స్'

హైదరాబాద్: ప్రముఖ ఫ్యాషన్ దుస్తుల విక్రయ సంస్థ అన్‌లిమిటెడ్ స్టోర్స్ 'ఫెస్టివ్‌ఫ్యాషన్‌వైబ్స్' పేరుతో పండుగ సంబరాలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా రూ.5,999 కొనుగోలుపై పిజియాన్ మిక్సర్ గ్రైండర్‌ను రూ.399లకే అందిస్తోంది. అలాగే రూ.2999 కొనుగోలుపై సౌండ్‌బార్ లేదా చక్రాలు కలిగిన డఫిల్ బ్యాగ్ రూ.199లకే పొందవచ్చు. ''పండుగ సందర్భంగా జీన్స్, కుర్తా, షేర్వానీ సహా చిన్నారులు, మహిళల కోసం సరికొత్త డిజైన్లను అందుబాటులోకి తెచ్చాము. కొత్త డిజైన్లను కస్టమర్లు ఇష్టపడతారు. నాణ్యమైన ఉత్పత్తులు ఆకర్షిస్తాయి. ఈ గొప్ప అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి'' అని కంపెనీ సీఓఓ వినీత్ జైన్ తెలిపారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

వడ్డీ రేట్లు తగ్గిస్తే తొందరపాటే: ఆర్‌బీఐ	జేఎస్‌డబ్ల్యూ చేతికి థిస్సెన్‌క్రుప్ ఎలక్ట్రికల్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-10-2024	
విశాఖ	505-00
చిత్తూరు	538-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505-00
విజయవాడ	510-00
హైదరాబాద్	490-00
వరంగల్	492-00

హిందుస్తాన్ జింక్ లాభం హైజంప్

క్యూ2లో రూ. 2,327 కోట్లు



న్యూఢిల్లీ: మైనింగ్ రంగ దిగ్గజం హిందుస్తాన్ జింక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 35 శాతం జంప్‌చేసి రూ. 2,327 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,729 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 7,014 కోట్ల నుంచి రూ. 8,522 కోట్లకు ఎగసింది. దీనిలో జింక్, లెడ్, ఇతర విభాగాల ఆదాయం రూ. 6,403 కోట్లుకాగా.. సిల్వర్ నుంచి రూ. 1,550 కోట్లు సమకూరింది. అత్యుత్తమ ధరల నేపథ్యంలో లెడ్ విధానంలో పైరో కార్యకలాపాల ద్వారా సిల్వర్ ఉత్పత్తిని పెంచినట్లు కంపెనీ సీఈవో అరుణ్ మిశ్రా పేర్కొన్నారు. వెరసి క్యూ2లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 2,56,000 టన్నుల మైన్డ్ మెటల్ ఉత్పత్తిని సాధించింది. జవార్ మైన్‌లో ఓర్ ఉత్పత్తి పుంజుకోవడం ఇందుకు సహకరించింది. రిఫైన్డ్ జింక్ ఉత్పత్తి 7 శాతం ఎగసి 1,98,000 టన్నులను తాకింది. సేలబుల్ సిల్వర్ ఉత్పత్తి 2 శాతం వృద్ధితో 184 మెట్రిక్ టన్నులకు చేరింది. కాగా.. సెరెంటికా రెనెవబుల్ ఇండియా(ఎస్‌ఆర్‌ఐపీఎల్)లో కనీసం 26 శాతం వాటా కోసం రూ. 327 కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు బోర్డు అనుమతించినట్లు హిందుస్తాన్ జింక్ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో హిందుస్తాన్ జింక్ షేరు బీఎస్‌ఈలో యథాతథంగా రూ. 508 వద్ద ముగిసింది.

జీ ఎంటర్‌టైన్‌మెంట్ దూకుడు

న్యూఢిల్లీ: మీడియా రంగ దిగ్గజం జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్(జీల్) ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 70 శాతంపైగా దూసుకెళ్లి రూ. 209 కోట్లను అధిగమించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 123 కోట్లు ఆర్జించింది. పటిష్ట వ్యయ నియంత్రణల కారణంగా మార్జిన్లు 6 శాతంపైగా మెరుగుపడినట్లు కంపెనీ పేర్కొంది. అయితే మొత్తం ఆదాయం 19% క్షీణించి రూ. 2,034 కోట్లకు పరిమితమైంది. గత క్యూ2లో రూ. 2,510 కోట్ల టర్నోవర్ అందుకుంది. పునీత్ గోయెంకాను 2025 జనవరి1 నుంచి ఐదేళ్ల కాలానికి ఎండీ, సీఈవోగా బోర్డు తిరిగి నియమించినట్లు జీల్ పేర్కొంది.

షేరు 5% జంప్ చేసి రూ. 132 వద్ద ముగిసింది.

గేమింగ్.. జూమింగ్



- 2028 నాటికి రెట్టింపునకు
- రూ.66,000 కోట్లకు మార్కెట్
- మరో 2–3 లక్షల మందికి ఉపాధి

న్యూఢిల్లీ: దేశంలో గేమింగ్ పరిశ్రమ రానున్న మూడేళ్లలో రెట్టింపు కానుంది. 2028 నాటికి రూ.66,000 కోట్లకు చేరుకుంటుందని పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక వెల్లడించింది. తద్వారా ఈ రంగంలో రెండు నుంచి మూడు లక్షల మందికి అదనంగా ఉపాధి లభిస్తుందని అంచనా వేసింది. ఆర్థికాభివృద్ధికి తోడు, సాంస్కృతిక వైభవం గేమింగ్ పరిశ్రమ వృద్ధికి మద్దతుగా నిలుస్తున్నట్టు తెలిపింది. 'ఫ్రమ్ సన్ రైజ్ టు సన్‌షైన్..' పేరిట భారత గేమింగ్ పరిశ్రమపై పీడబ్ల్యూసీ ఇండియా ఒక నివేదిక విడుదల చేసింది. ఢిల్లీలో ఇండియా గేమింగ్ కన్వెన్షన్ ఇందుకు వేదికగా నిలిచింది. ఈ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటికి పరిష్కారాలను సూచించింది.

ఏటా 15 శాతం చొప్పున..

- భారత ఆన్‌లైన్ గేమింగ్ మార్కెట్ 2023 నాటికి రూ.33,000 కోట్లుగా ఉంది. 2023 నుంచి 2028 వరకు ఏటా 14.5 శాతం చొప్పున కాంపౌండ్ అవుతూ రూ.66,000 కోట్లకు చేరుకుంటుంది. ఈ సామర్థ్యాన్ని చేరుకోవడానికి వీలుగా అవకాశాలను సొంతం చేసుకోవాలంటే అందుకు పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించాలి.
- ఆన్‌లైన్ గేమింగ్‌లో అదిపెద్ద ఉప విభాగమైన రియల్ మనీ గేమింగ్ మార్కెట్ 2028 నాటికి రూ.26,500 కోట్లకు చేరుకోవచ్చు. గేమింగ్ పరిశ్రమ వచ్చే కొన్నేళ్లలో ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 2–3 లక్షల మందికి ఉపాధికల్పించడం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థపై చెప్పుకోతగ్గ ప్రభావాన్ని చూపిస్తుంది.

సవాళ్లు-మార్గాలు..

గేమింగ్ రంగం వృద్ధి ప్రధానంగా పన్ను అంశాల పరిష్కారం, నియంత్రణపరమైన స్పష్టతపైనే ఆధారపడి ఉంటుందని పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక స్పష్టం చేసింది. నియంత్రణ పరమైన అనుసంధాన లేమి, అధిక జీఎస్‌టీ కారణంగా నిలకడలేని వ్యాపార నమూనా, గేమింగ్ మానిటైజేషన్ విషయంలో ఉన్న నైతిక అంశాలు, నైపుణ్యాల అంతరం, భాగస్వాముల ప్రయోజనాల విషయంలో సమతుల్యం, గేమర్ల మానసిక ఆరోగ్యం, ప్లేయర్ల ఎంగేజ్‌మెంట్, సాంస్కృతిక సంబంధిత గేమ్‌ల రూపకల్పన, గేమింగ్ కెరీర్ పట్ల సమాజంలో ఉన్న భావనలు మార్చడం, చట్టవిరుద్ధమైన గ్యాంబ్లింగ్‌ను కట్టడి చేయడం వంటి సవాళ్లను ప్రస్తావించింది.

టయోటా టైజర్ లిమిటెడ్ ఎడిషన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీలో ఉన్న టయోటా కిర్లోస్కర్ మోటార్ తాజాగా కాంపాక్ట్ ఎస్‌యూవీ టైజర్ లిమిటెడ్ ఎడిషన్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా రూ.20,160 విలువ చేసే టయోటా జెనివిన్ యాక్సెసరీస్ కిట్‌ను ఆఫర్ చేస్తోంది. అన్ని టర్బో వేరియంట్లలో అక్టోబర్ 31 వరకే ఇది లభిస్తుంది. ఇప్పటికే కంపెనీ పండుగ సీజన్ కోసం ఇతర మోడళ్లలోనూ లిమిటెడ్ ఎడిషన్లను అందుబాటులోకి తెచ్చింది.



- 24,850 స్థాయిపైకి నిఫ్టీ
- బ్యాంకులు, మెటల్ షేర్లకు డిమాండ్
- ఆరంభ నష్టాల నుంచి పుంజుకున్న సూచీలు

మూడు రోజుల వరుస నష్టాలకు బ్రేక్

-598 నుంచి +218కు..

ముంబై: ఆరంభ నష్టాల నుంచి బలంగా పుంజుకున్న స్టాక్ సూచీలు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. బ్యాంకులు, ఫైనాన్షియల్స్, మెటల్ షేర్లు రాణించడంతో పాటు సానుకూల అంతర్జాతీయ సంకేతాలు కలిసొచ్చాయి. ఉదయం నష్టాలతో మొదలైన సూచీలు తర్వాత కొనుగోళ్ల మద్దతుతో కోలుకొని లాభాల బాటపట్టాయి. ఇంట్రాడేలో 598 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్ పుంజుకొని 218 పాయింట్ల లాభంతో 81,225 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 104 పాయింట్లు పెరిగి 24,854 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 24,886 – 24568 శ్రేణిలో కదలాడింది. దీంతో మూడురోజుల వరుస నష్టాల నుంచి సూచీలు గట్టెక్కినట్లైంది. ఐటీ, టెక్, కన్జూమర్ డ్యూరబుల్స్, ఆయిల్‌అండ్‌గ్యాస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.21% లాభపడగా, స్మాల్ క్యాప్ సూచీ 0.16 శాతం నష్టపోయింది.



- సెప్టెంబర్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ఇన్వెస్టర్లను మెప్పించలేకపోవడంతో ఇన్ఫోసిస్ షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. బీఎస్‌ఈలో 4.50% నష్టపోయి రూ.1,879 వద్ద నిలిచింది. ఒక దశలో 5% క్షీణించి రూ.1,870 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.37,639 కోట్లు హరించుకుపోయి రూ.7.80 లక్షల కోట్లకు దిగివచ్చింది. సెన్సెక్స్, నిఫ్టీల్లో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే.
- ఐటీ సేవల సంస్థ విప్రో షేరు 4% పెరిగి రూ.549 వద్ద ముగిసింది. రెండో క్వార్టర్ నికర లాభంలో 21% వృద్ధి నమోదు ఈ షేరుకు డిమాండ్ పెంచింది.

త్వరలో తెలుగు రాష్ట్రాల్లో గృహ రుణాలు

గోద్రెజ్ క్యాపిటల్ ఎండీ మనీష్ షా వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వచ్చే రెండేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో కూడా గృహ రుణాల విభాగంలోకి ప్రవేశించనున్నట్లు గోద్రెజ్ క్యాపిటల్ ఎండీ మనీష్ షా వెల్లడించారు. ప్రస్తుతం తమ గ్రూప్ సంస్థ గోద్రెజ్ ప్రాపర్టీస్ ప్రాజెక్టులున్న కొన్ని ప్రాంతాల్లో వీటిని అందిస్తున్నట్లు చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం చిన్న, మధ్యతరహా సంస్థలు మొదలైన వాటికి రుణాలు ఇస్తున్నట్లు, ఈ పోర్ట్‌ఫోలియో సుమారు రూ. 500 కోట్లుగా ఉన్నట్లు వివరించారు. తెలుగు రాష్ట్రాల్లో 6 శాఖలు ఉండగా వీటిని పదికి పెంచుకుంటున్నట్లు వివరించారు.



డీమ్యాట్ సెక్యూరిటీలు }రూ. 500 లక్షల కోట్లు



డీమెటీరియలైజ్డ్(డీమ్యాట్) రూపంలో ఉన్న మొత్తం సెక్యూరిటీల విలువ రూ. 500 లక్షల కోట్లను తాకినట్లు నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ(ఎన్‌ఎస్‌డీఎల్) వెల్లడించింది. 2024 సెప్టెంబర్‌కల్లా 6 లక్షల కోట్ల డాలర్లకు చేరినట్లు తెలిపింది. తొలి రూ. 100 లక్షల కోట్ల మార్క్‌ను 18ఏళ్లలో అంటే 2014 జూన్‌లో అందుకున్నట్లు తెలియజేసింది. తదుపరి ఆరేళ్ల కాలంలో 2020 నవంబర్‌కల్లా విలువ రెట్టింపై రూ. 200 లక్షల కోట్లకు చేరింది. ఈ బాటలో డీమ్యాట్ సెక్యూరిటీలు 4ఏళ్లలోనే రూ. 500 లక్షల కోట్లయ్యింది.

కృతజ్ఞతలు

ఈ చరిత్రాత్మక మైలురాయికి కారణమైన ఇన్వెస్టర్లు, మార్కెట్ పార్టిసిపెంట్లు, నియంత్రణ సంస్థలు తదితరులకు కృతజ్ఞతలు.

– ఎస్.గోపాలన్
ఎన్‌ఎస్‌డీఎల్ ఎండీ

గోదావరి బయో @ రూ. 334-352

ఇథనాల్, బయో ఆధారిత కెమికల్స్ తయారీ కంపెనీ గోదావరి బయోరిఫైనరీస్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ నెల 23న ప్రారంభంకానున్న ఇష్యూకి తాజాగా రూ. 334–352 ధరల శ్రేణిని ప్రకటించింది. 25వ తేదీన ఆఫర్ ముగుస్తుంది. ఐపీవో ద్వారా రూ. 555 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది.

సాక్షి స్పోర్ట్స్



ఫైనల్లో న్యూజిలాండ్

షార్జా: మహిళల టి20 ప్రపంచకప్‌లో 14 ఏళ్ల విరామం తర్వాత న్యూజిలాండ్ జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన రెండో సెమీఫైనల్లో న్యూజిలాండ్ 8 పరుగుల తేడాతో మాజీ చాంపియన్ వెస్టిండీస్‌ను ఓడించింది. తద్వారా ఈసారి మహిళల టి20 ప్రపంచకప్‌లో కొత్త చాంపియన్ అవతరించడం ఖాయమైంది. ఈ టోర్నీ చరిత్రలో న్యూజిలాండ్ 2009, 2010లలో వరుసగా రెండుసార్లు ఫైనల్లోకి ప్రవేశించి రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. ఆదివారం జరిగే ఫైనల్లో దక్షిణాఫ్రికాతో న్యూజిలాండ్ తలపడుతుంది. విండీస్‌తో జరిగిన సెమీఫైనల్లో మొదట న్యూజిలాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 128 పరుగులు చేసింది. జార్జియా ప్లిమర్ (33 ; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. విండీస్ బౌలర్ డాటిన్ నాలుగు వికెట్లు తీసింది. అనంతరం 129 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసి ఓడిపోయింది.

ఎదురీత!

- భారత్ రెండో ఇన్నింగ్స్ 231/3
- ఇంకా 125 పరుగులు వెనుకబడి ఉన్న టీమిండియా
- రోహిత్ శర్మ, కోహ్లి అర్ధ సెంచరీలు
- న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 402 ఆలౌట్
- రచిన్ రవీంద్ర అద్భుత సెంచరీ
- టిమ్ సౌతీ మెరుపు ఇన్నింగ్స్

అనూహ్య తడబాటు నుంచి కోలుకున్న టీమిండియా... న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో ఎదురీదుతోంది. బ్యాటింగ్‌కు అనువుగా మారిన బెంగళూరు పిచ్‌పై ప్రత్యర్థి భారీ స్కోరు చేయగా... మనవాళ్లు కూడా దీటుగా బదులిస్తున్నారు. రచిన్ రవీంద్ర సూపర్ సెంచరీ, టిమ్ సౌతీ సమయోచిత ఇన్నింగ్స్‌తో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరును నమోదు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో భారత టాపార్డర్ రాణించింది. రోహిత్, కోహ్లి, సర్ఫరాజ్ అర్ధ శతకాలతో టీమిండియా ఇన్నింగ్స్ గాడిన పడింది. మూడో రోజు ఇన్నింగ్స్ చివరి బంతికి విరాట్ కోహ్లిను అవుట్ చేసి న్యూజిలాండ్ పైచేయి సాధించగా... కోహ్లి పెవిలియన్ చేరడంతో ఈ మ్యాచ్‌లో భారత్ గట్టెక్కాలంటే మిగిలిన బ్యాటర్లు విశేషంగా రాణించాల్సి ఉంటుంది.



కోహ్లి



రచిన్ రవీంద్ర

బెంగళూరు: తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే కుప్పకూలిన భారత జట్టు... రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం గట్టిగానే పోరాడుతోంది. ప్రత్యర్థికి భారీ ఆధిక్యం దక్కిన ఈ మ్యాచ్‌లో అద్భుతం జరిగితే తప్ప టీమిండియా గట్టెక్కడం కష్టమే అనిపిస్తోంది. 356 పరుగులతో వెనుకబడి శుక్రవారం మూడో రోజు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ ఆట ముగిసే సమయానికి 49 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (70; 8 ఫోర్లు, ఒక సిక్సర్), సర్ఫరాజ్ ఖాన్ (78 బంతుల్లో 70 బ్యాటింగ్; 7 ఫోర్లు, 3 సిక్సర్లు), కెప్టెన్ రోహిత్ శర్మ (63 బంతుల్లో 52; 8 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధ శతకాలతో ఆకట్టుకోగా... యశస్వి జైస్వాల్ (35; 6 ఫోర్లు) పర్వాలేదనిపించాడు. చేతిలో 7 వికెట్లున్న టీమిండియా ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే మరో 125 పరుగులు చేయాలి. క్రీజులో ఉన్న సర్ఫరాజ్‌తోపాటు ఇంకా రావాల్సిన కేఎల్ రాహుల్, పంత్, జడేజా, అశ్విన్ భారీ ఇన్నింగ్స్ ఆడితే భారత్ కోలుకోవచ్చు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 180/3తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ 91.3 ఓవర్లలో 402 పరుగులకు ఆలౌటైంది. రచిన్ రవీంద్ర (157 బంతుల్లో 134; 13 ఫోర్లు, 4 సిక్సర్లు) తన కెరీర్‌లో రెండో సెంచరీ సాధించాడు. మాజీ కెప్టెన్ టిమ్ సౌతీ (73 బంతుల్లో 65; 5 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపు ఇన్నింగ్స్‌తో రచిన్‌కు అండగా నిలిచాడు.

చివరి బంతికి కోహ్లి అవుట్...

తొలి ఇన్నింగ్స్‌లో తడబడ్డ భారత టాపార్డర్ రెండో ఇన్నింగ్స్‌లో మెరుగ్గా ఆడింది. యశస్వి, రోహిత్ బౌలర్లపై సంపూర్ణ ఆధిపత్యం కనబర్చడంతో టీమిండియాకు శుభారంభం దక్కింది. తొలి వికెట్‌కు 72 పరుగులు జోడించాక జైస్వాల్ అవుట్ కాగా... కాసేపటికి అర్ధశతకం పూర్తి చేసుకున్న రోహిత్ కూడా వెనుదిరిగాడు. ఈ రెండు వికెట్లు ఎజాజ్ పటేల్ ఖాతాలోకే వెళ్లాయి. మరోసారి వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన కోహ్లి ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యత తీసుకున్నాడు. సర్ఫరాజ్ ఖాన్‌తో కలిసి చకచకా పరుగులు చేస్తూ... ప్రత్యర్థి ఆధిక్యాన్ని తగ్గించే పనిలో పడ్డాడు. ఈ క్రమంలో సర్ఫరాజ్ 42 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకోగా... కోహ్లి 70 బంతుల్లో ఆ మార్క్ అందుకున్నాడు. టీమిండియా కోలుకున్నట్లే అనుకుంటున్న దశలో చివరి బంతికి కోహ్లి అవుటవ్వడంతో భారత జట్టుకు నిరాశ తప్పలేదు.

ఆ భాగస్వామ్యం లేకుంటే...

భారత సంతతి ఆటగాడు రచిన్... కుటుంబ సభ్యుల సమక్షంలో చిన్నస్వామి స్టేడియంలో చెలరేగి ఆడటంతో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేయగలిగింది. మిచెల్ (18), బ్లండెల్ (5), ఫిలిప్స్ (14), హెన్రీ (8) విఫలమవడంతో కివీస్ జట్టు 233/7తో నిలిచింది. కాసేపట్లో కివీస్ ఆలౌట్ కావడం ఖాయమే అనుకుంటే... సౌతీ సహకారంతో రచిన్ రెచ్చిపోయాడు. ఎనిమిదో వికెట్‌కు 137 పరుగులు జోడించి చివరి వికెట్‌గా వెనుదిరిగాడు.

4

టెస్టు క్రికెట్‌లో 9 వేల పరుగులు పూర్తి చేసుకున్న నాలుగో భారత క్రికెటర్‌గా విరాట్ కోహ్లి నిలిచాడు. సచిన్ టెండూల్కర్ (15,921), రాహుల్ ద్రవిడ్ (13,265), సునీల్ గావస్కర్ (10,122) ముందున్నారు. ఓవరాల్‌గా ఈ మైలురాయి దాటిన 18వ ప్లేయర్‌గా కోహ్లి ఘనత సాధించాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 46; **న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్:** లాథమ్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 15; కాన్వే (బి) అశ్విన్ 91; యంగ్ (సి) కుల్దీప్ (బి) జడేజా 33; రచిన్ (సి) (సబ్) జురెల్ (బి) కుల్దీప్ 134; మిచెల్ (సి) జైస్వాల్ (బి) సిరాజ్ 18; బ్లండెల్ (సి) రాహుల్ (బి) బుమ్రా 5; ఫిలిప్స్ (బి) జడేజా 14; హెన్రీ (బి) జడేజా 8; సౌతీ (సి) జడేజా (బి) సిరాజ్ 65; ఎజాజ్ (ఎల్బీ) కుల్దీప్ 4; రూర్కే (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (91.3 ఓవర్లలో ఆలౌట్)** 402. **వికెట్ల పతనం:** 1-67, 2-142, 3-154, 4-193, 5-204, 6-223, 7-233, 8-370, 9-384, 10-402. **బౌలింగ్:** బుమ్రా 19-7-41-1, సిరాజ్ 18-2-84-2, అశ్విన్ 16-1-94-1, కుల్దీప్ 18.3-1-99-3, జడేజా 20-1-72-3.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (స్టంప్డ్) బ్లండెల్ (బి) ఎజాజ్ 35; రోహిత్ (బి) ఎజాజ్ 52; కోహ్లి (సి) బ్లండెల్ (బి) ఫిలిప్స్ 70; సర్ఫరాజ్ (బ్యాటింగ్) 70; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (49 ఓవర్లలో 3 వికెట్లకు)** 231. **వికెట్ల పతనం:** 1-72, 2-95, 3-231. **బౌలింగ్:** సౌతీ 7-1-22-0; హెన్రీ 11-1-52-0; రూర్కే 11-1-48-0; ఎజాజ్ 12-2-70-2; ఫిలిప్స్ 8-1-36-1.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

మాస్టర్స్ కప్ చెస్ టోర్నీ విజేత అర్జున్

లండన్: ఆద్యంతం అద్భుతంగా ఆడిన భారత నంబర్‌వన్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ డబ్ల్యూఆర్ చెస్ మాస్టర్స్ కప్ టోర్నీలో చాంపియన్‌గా అవతరించాడు. 16 మంది క్రీడాకారుల మధ్య నాకౌట్ పద్ధతిలో ఈ టోర్నీ జరిగింది. ఫైనల్లో అర్జున్ 'అర్మగెడాన్' గేమ్‌లో ఫ్రాన్స్ గ్రాండ్‌మాస్టర్ మాక్సిమి లాషెర్ లగ్రేవ్‌పై విజయం సాధించాడు. అంతకుముందు వీరిద్దరి మధ్య జరిగిన రెండు గేమ్‌లు 'డ్రా'గా ముగిశాయి. తొలి గేమ్ 30 ఎత్తుల్లో... రెండో గేమ్ 38 ఎత్తుల్లో 'డ్రా' అయ్యాయి. దాంతో విజేతను నిర్ణయించేందుకు 'అర్మగెడాన్' గేమ్‌ను నిర్వహించారు. ఈ టోర్నీ నిబంధనల ప్రకారం అర్మగెడాన్ గేమ్‌లో తెల్లపావులతో ఆడే ప్లేయర్‌కు పది నిమిషాలు, నల్లపావులతో ఆడే ప్లేయర్‌కు ఆరు నిమిషాలు కేటాయిస్తారు. తెల్లపావులతో ఆడే ప్లేయర్ కచ్చితంగా విజయం సాధించాల్సి ఉంటుంది. నల్లపావులతో ఆడే ప్లేయర్ కనీసం 'డ్రా' చేసుకున్నా విజేతగా ప్రకటిస్తారు. అర్మగెడాన్ గేమ్‌లో లగ్రేవ్ తెల్లపావులతో, అర్జున్ నల్లపావులతో ఆడారు. అయితే అర్జున్ ఈ గేమ్‌ను 'డ్రా' చేసుకోకుండా 69 ఎత్తుల్లో లగ్రేవ్‌ను ఓడించడం విశేషం. సెమీఫైనల్లో అర్జున్ 1.5–0.5తో భారత్‌కే చెందిన ప్రజ్ఞానందపై, క్వార్టర్ ఫైనల్లో 1.5–0.5తో విదిత్ సంతోష్ గుజరాతిపై, గెలిచాడు.



విజేతగా నిలిచిన అర్జున్‌కు 20 వేల యూరోలు (రూ. 18 లక్షల 25 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ టోర్నీలో ప్రదర్శన ద్వారా అర్జున్ ఎలో రేటింగ్ 2796 పాయింట్లకు చేరుకుంది.

అదరగొట్టిన తెలుగు టైటాన్స్

- ప్రొ కబడ్డీ లీగ్‌లో శుభారంభం
- తొలి పోరులో బెంగళూరుపై ఘనవిజయం




సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌ను తెలుగు టైటాన్స్ జట్టు విజయంతో మొదలు పెట్టింది. లీగ్‌లో ప్రతీ సీజన్‌లో పేలవ ప్రదర్శన కనబరుస్తూ వచ్చిన టైటాన్స్ ఈసారి శుభారంభం చేసింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన టోర్నీ తొలి మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 37–29 పాయింట్ల తేడాతో మాజీ చాంపియన్ బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. టైటాన్స్ తరఫున కెప్టెన్ పవన్ సెహ్రావత్ 13 పాయింట్లతో జట్టును ముందుండి నడిపించగా... బెంగళూరు కెప్టెన్ ప్రదీప్ నర్వాల్ కేవలం 3 పాయింట్లే నమోదు చేసి విఫలం కావడం జట్టును దెబ్బ తీసింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి టైటాన్స్ 20–11తో 9 పాయింట్ల తేడాతో ముందంజలో నిలిచింది. అయితే ఆ తర్వాత కోలుకున్న బుల్స్ 18–11 పాయింట్లతో రెండో అర్ధభాగంలో ఆధిక్యం ప్రదర్శించింది. బుల్స్ తమ ప్రత్యర్థిని ఒకసారి ఆలౌట్ చేయగా... టైటాన్స్ జట్టు బెంగళూరును రెండుసార్లు ఆలౌట్ చేసింది. పవన్ ప్రొ కబడ్డీ లీగ్‌లో 1200 రైడింగ్ పాయింట్లు పూర్తి చేసుకున్నాడు. రెండో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ జట్టు 36–28 పాయింట్ల తేడాతో యు ముంబా జట్టును ఓడించింది. ఢిల్లీ తరఫున ఆశు మలిక్ 10 పాయింట్లు సాధించాడు. **నేడు జరిగే మ్యాచ్‌ల్లో తమిళ్ తలైవాస్‌తో తెలుగు టైటాన్స్ (రాత్రి 8 గంటల నుంచి), పుణేరి పల్టన్‌తో హరియాణా స్టీలర్స్ (రాత్రి 9 గంటల నుంచి) తలపడతాయి.**





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


ఖమ్మం జిల్లా మధిర మండలంలోని సిరిపురం గ్రామ వ్యూ


సిరిపురం గ్రామం



ఖమ్మం జిల్లా మధిర మండలం సిరిపురంలోని గ్రామపంచాయితీ కార్యాలయం


సిరిపురం గ్రామంలో పంట పొలానికి నీరు అందిస్తున్న పంపుసెట్



గ్రామాలకు సోలార్ వెలుగులు

- సౌర విద్యుత్ వినియోగం దిశగా రాష్ట్రం అడుగులు
- మోడల్ సోలార్ విలేజ్‌లుగా మూడు గ్రామాల ఎంపిక
- కొండారెడ్డిపల్లి, సిరిపురం, వెలగనూరు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు
- ఈ గ్రామాల్లో ప్రభుత్వ ఖర్చుతోనే సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటు
- ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా అమలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం/మధిర: గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మొదటి అడుగు వేసింది. పర్యావరణ హితమైన సౌర విద్యుత్‌ను అందరూ వినియోగించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని మూడు గ్రామాలను పూర్తి స్థాయిలో సౌర విద్యుత్ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. ఆయా గ్రామాల్లో గృహాలు ఎన్ని, జనాభా ఎంత, గృహ, వ్యవసాయ కనెక్షన్లు ఎన్ని, సోలార్ విద్యుత్ పరికరాలు ఏర్పాటు చేసేందుకు రూఫ్‌టాప్‌లు అనుకూలంగా ఉన్నాయా.. తదితర అంశాలపై విద్యుత్ శాఖ ద్వారా సర్వే చేయించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. టెండర్లు పిలిచిన అనంతరం టీజీ రెడ్కో (తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) ఆధ్వర్యంలో సౌర విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేస్తారు.

మోడల్ సోలార్ విలేజ్..

గత బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా రాష్ట్రం మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమాన్ని తీసుకుంది. ఒక్కో జిల్లాకు ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి ప్రతీ ఇల్లు, కార్యాలయం, వ్యవసాయ బోర్లు సహా అన్నింటికీ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేస్తారు. పైలట్ ప్రాజెక్టులుగా సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి, మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలం వెలగనూరు, ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర మండలం సిరిపురం గ్రామాలను ఎంపిక చేసింది. ఈ మూడు గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారుల సర్వే పూర్తయింది.

అంతా సోలార్‌మయం

పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మూడు గ్రామాల్లో గృహ, వ్యవసాయ కనెక్షన్లకు పూర్తి స్థాయిలో సోలార్ విద్యుత్ అందించనున్నారు. ఉదయం సమయంలో సౌర విద్యుత్, రాత్రి సమయాన సాధారణ విద్యుత్‌ను వినియోగిస్తారు. గృహాలపై సోలార్ రూఫ్ టాప్‌లు, వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తారు. పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన గ్రామాల్లో వీటి ఏర్పాటులో ప్రజలపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వమే యూనిట్లు ఏర్పాటు చేయనుంది. అంతేకాక మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు యజమానులే విక్రయించుకునే వెసులుబాటు ఉంటుంది. ఒక్కో ఇంటిపై 2 నుంచి 3 కిలోవాట్ల సోలార్ ప్యానళ్లు.. వ్యవసాయ పంపుసెట్లకు 5 హెచ్‌పీ మోటారుకు 7.5 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ప్యానల్‌ను అమరుస్తారు.

బహుళ ప్రయోజనాలు..

సోలార్ విద్యుత్ వినియోగంతో బహుళ ప్రయోజనాలను పొందే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు ఏర్పాటు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడానికి వీలవుతుంది. మిగులు విద్యుత్‌ను విక్రయించడం ద్వారా స్థానికులకు ఆర్థిక లబ్ధి చేకూరుతుంది. విద్యుదుత్పత్తి కోసం బొగ్గు తదితర శిలాజ ఇంధనాల వినియోగం ద్వారా పర్యావరణానికి హాని కలగడమే కాకుండా.. ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తుంది. ఇలాంటి దుష్పరిణామాలను నివారించడానికి సౌరవిద్యుత్ దోహదం చేస్తుంది.

సిరిపురంలో సర్వే పూర్తి

మధిర నియోజకవర్గంలోని సిరిపురం గ్రామంలో ఈనెల 4న సౌర విద్యుత్ ప్రాజెక్టు అమలు నిమిత్తం విద్యుత్‌శాఖ అధికారులు సర్వే పూర్తి చేశారు. అంతేకాక గ్రామస్తులు, రైతులకు పైలట్ ప్రాజెక్టు గురించి వివరించారు. సర్వే అనంతరం సిరిపురం వచ్చిన ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించారు. ఈ గ్రామంలో మొత్తం 5,428 మంది జనాభా ఉండగా, 1,024 గృహ సర్వీసులు, 510 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. గృహ విద్యుత్‌ను 1,007 మంది 200 యూనిట్లలోపు వినియోగిస్తున్నారు.

సోలార్ విద్యుత్.. రైతులకు ఉపయోగం



మా గ్రామంలో సోలార్ విద్యుత్ ఏర్పాటుతో వ్యవసాయ పంపు సెట్లు ఉన్న రైతులకు ఉపయోగంగా ఉంటుంది. ఇటీవల డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అవగాహన కల్పించారు. అధికారులు కూడా బ్యాంక్ ఖాతాల వివరాలు తెలుసుకున్నారు. మిగులు విద్యుత్‌కు డబ్బు చెల్లిస్తారని తెలిసింది. విద్యుత్ ఉన్నా, లేకున్నా సోలార్ విద్యుత్ పంపుసెట్లతోపంట సాగుకు ఇబ్బంది ఉండదు.

– వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, రైతు, సిరిపురం, మధిర మండలం, ఖమ్మం జిల్లా

బిల్లుల భారం తగ్గి, ఆదాయం వస్తుంది..



ప్రభుత్వం 200 యూనిట్లలోపు గృహావసరాలకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. దీనికి మించి ఒక్క యూనిట్ ఎక్కువైనా బిల్లు మొత్తం చెల్లించాల్సి వస్తోంది. ఇప్పుడు సోలార్ విద్యుత్ వల్ల బాధలు తప్పుతాయి. మా గ్రామాన్ని ఇందుకోసం ఎంపిక చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు. సోలార్ విద్యుత్‌తో బిల్లుల భారం తగ్గి, ఆదాయం కూడా వస్తుంది.

– చీదిరాల వెంకటేశ్వరరావు, సిరిపురం, మధిర మండలం, ఖమ్మం జిల్లా

రుణపడి ఉంటాం..



మా గ్రామంలో ఎక్కువగా దళిత కుటుంబాలే ఉంటాయి. సోలార్ విద్యుత్‌ను గృహ, వ్యవసాయ అవసరాలకు వినియోగించుకో వడం వల్ల ఆర్థికంగా కలిసొస్తుంది. మిగిలిన విద్యుత్‌ను విక్రయించుకునే అవకాశం ఉండటం సంతోషంగా ఉంది. మా గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు రుణపడి ఉంటాం. ఇప్పటికే రోడ్లు, వైరా నదిపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు.

– నంద్రు విజయారావు, సిరిపురం, మధిర మండలం, ఖమ్మంజిల్లా

రాష్ట్రంలో మెరుగ్గా 'ఉపాధి హామీ'

- జాతీయస్థాయి కంటే పనిదినాల పెరుగుదల
- లిబ్‌టెక్ ఇండియా తాజా నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమల్లో తెలంగాణ మంచి ప్రదర్శనను కనబరిచింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నాటికి జాతీయస్థాయిలో ఉపాధి హామీలో పని దినాలు (పర్సన్ డేస్) 16.2 శాతం తగ్గగా రాష్ట్రం మాత్రం 27.1 శాతం పనిదినాల పెరుగుదలను నమోదు చేసింది. అదేవిధంగా ఈ ఏడాది (ఏప్రిల్–సెప్టెంబర్‌ల మధ్య) జాతీయస్థాయిలో ఉపాధి పొందిన కుటుంబాల సంఖ్య తగ్గినప్పటికీ, తెలంగాణలో మాత్రం ఈ కుటుంబాల సంఖ్య పెరిగింది. దీంతో రాష్ట్రంలో 25.33 లక్షల కుటుంబాలు ఈ ఏడాది ఉపాధి హామీ ద్వారా వివిధ పనులు పొందినట్టు స్పష్టమవుతోంది. జిల్లాల వారీగా ఉపాధి కల్పనను పరిశీలిస్తే.. కామారెడ్డి, ములుగు, వరంగల్ జిల్లాలు వరుసగా 82%, 66%, 66% చొప్పున గణనీయమైన పెరుగుదలను నమోదు చేసుకొని రాష్ట్రంలో ముందంజలో ఉన్నాయి. అయితే సంగారెడ్డి జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 46 లక్షల వ్యక్తిగత రోజులు ఉండగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో 43 లక్షలకు పడిపోవడంతో తగ్గుదల నమోదైంది. నెలల వారీగా పని దినాల విషయానికొస్తే.. ఈ ఏడాది ఏప్రిల్, మేలో ఉపాధి కల్పన పనులు మెరుగ్గా ప్రారంభమైనా, జూన్, జూలైలలో పనిదినాల నమోదులో తగ్గుదల కనిపించింది. ఈ మేరకు లిబ్‌టెక్ ఇండియా తాజా నివేదికను శుక్రవారం ఆ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ రాహుల్ ముక్కెర మీడియాకు విడుదల చేశారు. రాష్ట్రంలో ఉపాధి హామీ చట్టం అమలు తీరు పర్యవేక్షణతో పాటు దీని ద్వారా బలహీన వర్గాలు మరింత ప్రయోజనం పొందేలా చూసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మెరుగైన సహకారం అవసరమని ఈ నివేదిక సూచించింది.

రాష్ట్రాన్ని 'నఫ్రత్‌కా బజార్'గా మారుస్తున్నారు

రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రమంత్రి బండి సంజయ్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: 'కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తెలంగాణను మొహబ్బత్ కీ దుకాన్ (ప్రేమతో కూడిన ప్రదేశం)గా మారుస్తామని హామీనిచ్చారు. కానీ అందుకు భిన్నంగా రాష్ట్రం క్రమంగా 'నఫ్రత్ కా బజార్ (విద్వేషపూరితం)గా మారుతోంది'అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. 'అర్ధరాత్రి ఉద్యోగార్థులు, మహిళలను అరెస్ట్ చేయడానికి మీకెంత ధైర్యం ?'అని శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న వారి పట్ల అమానవీయంగా ప్రవర్తించి, వారిని లాగిపడేసి, కొట్టి దుర్మార్గంగా వ్యవహరించడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకెంతగా దిగజారి వ్యవహరిస్తుందని నిలదీశారు. 'అసలు ప్రభుత్వానికి జీవో 29 పై వైఖరేమిటి? ఒకవేళ న్యాయస్థానం మీకు వ్యతిరేకంగా ఆదేశాలిస్తే పరీక్షను మళ్లీ నిర్వహిస్తారా?'అని ప్రశ్నలు సంధించారు. నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి ఆందోళనలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిందిపోయి ప్రభుత్వం బలప్రయోగంతో వారి గొంతులు నొక్కేసేందుకు మొగ్గుచూపుతోందని సంజయ్ ధ్వజమెత్తారు.

భూ నిర్వాసితుల సమస్యలపై చర్చకు సిద్ధం

ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

సాక్షి, హైదరాబాద్: మల్లన్నసాగర్ భూ నిర్వాసితుల సమస్యలపై హరీశ్‌రావుతో చర్చకు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. చర్చకు సమయం, తేదీని నిర్ణయించాలని హరీశ్‌రావుకు సూచించారు. సిద్దిపేట అంబేడ్కర్ విగ్రహం దగ్గర బహిరంగ చర్చకు రావాలని కోరారు. మల్లన్నసాగర్ అంశంపై చర్చించడానికి మాజీ సీఎం కేసీఆర్‌ను తీసుకొస్తే ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటానన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సిద్దిపేట, గజ్వేల్, చొప్పదండి, ధర్మపురి ఎక్కడైనా చర్చకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. మలన్నసాగర్‌లో కేసీఆర్, హరీశ్‌రావు చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని, పరిహారం అడిగిన రైతులు, నేతలపై కేసులు పెట్టారని ఆరోపించారు.



మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టుకు సంబంధించి దక్షిణ కొరియాలోని సియోల్ నగరంలో అధ్యయన యాత్రకు శనివారం బయల్దేరనున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి పర్యటన విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి సీతక్క

- సాక్షి, హైదరాబాద్

పదేళ్లపాటు ఏం చేశారు?

సాక్షి, హైదరాబాద్: పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు మూసీ నదిని అభివృద్ధి చేయకపోగా, ఇప్పుడు పునరుజ్జీవానికి పూనుకున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడ్డుకోవడం సమంజసం కాదని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి బీఆర్‌ఎస్ నేతలకు హితవు పలికారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బుద్ధి చెప్పినా బీఆర్‌ఎస్ నేతలు మారలేదని, ఇప్పుడు కూడా మూర్ఖంగా వ్యవహరిస్తున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. మూసీ నది పునరుజ్జీవ కార్యక్రమం పవిత్ర యజ్ఞమని, అది సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అధికారంలో ఉన్నప్పుడు చేయకపోగా, ఇప్పుడు అడ్డుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు.

రాంచీ చేరుకున్న డిప్యూటీ సీఎం

సాక్షి, హైదరాబాద్: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఏఐసీసీ పరిశీలకునిగా నియమితులైన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం రాంచీ చేరుకున్నారు. రాంచీ విమానాశ్రయంలో జార్ఖండ్ పీసీసీ అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు సుల్తాన్ అహ్మద్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిజిత్ రాజ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుంజన్‌సింగ్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

కేసీఆర్‌తో పార్టీ నేతల భేటీ

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావును ఎర్రవెల్లిలోని ఆయన నివాసంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు తదితరులు కలిశారు. తమ జన్మదినాన్ని పురస్కరించుకుని కలిసిన నేపథ్యంలో కేసీఆర్ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

కేటీఆర్‌తో ఒమన్ అంబాసిడర్ భేటీ

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను భారత్‌లోని ఒమన్ అంబాసిడర్ ఇస్సా అల్ షిబానీ మర్యాద పూర్వకంగా కలిశారు. నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఆయనతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఉభయులు పలు అంశాలపై కాసేపు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా ఒమన్ అంబాసిడర్ అల్ షిబానీని కేటీఆర్ సత్కరించి.. చార్మినార్ జ్ఞాపిక అందజేశారు.

అంజయ్యకు ప్రముఖుల నివాళి



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్య 38వ వర్ధంతి సందర్భంగా పలువురు ప్రముఖులు, ముఖ్య నేతలు లుంబినీపార్క్ సమీపంలోని ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కేవీపీ రాంచందర్‌రావు, కేశవరావు, షబ్బీర్ అలీ, అనిల్‌కుమార్ యాదవ్, జితేందర్‌రెడ్డి, జి.నిరంజన్, శ్రీనివాస్‌రెడ్డి, రెహమత్ అలీ, అంజన్‌కుమార్ యాదవ్, గడ్డం వంశీ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలన్నీ అంతే సంగతులా!?

పరిహారం అందలేదంటూ బుడమేరు వరద బాధితుల గగ్గోలు

- 21 వేల మందికిపైగా కలెక్టరేట్‌లో దరఖాస్తులు
- 45 రోజులకు పైగా గడుస్తున్నా అందని సాయం
- అంచనా బృందాలు నట్టేట ముంచాయని బాధితుల మండిపాటు



ఈ ఫొటోలో ఉన్న ఆమె పేరు బంకపల్లి వసంత. విజయవాడ కండ్రికలోని ఈమె ఇల్లు ఇటీవల బుడమేరు వరదల్లో పూర్తిగా మునిగింది. 12 రోజులు బిక్కుబిక్కుమంటూ గడిపింది. సర్వే సిబ్బంది వివరాలు రాసుకుని వెళ్లారు. అయితే, పరిహారానికి సంబంధించిన జాబితాలో మాత్రం ఈమె పేరులేదు. సచివాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితంలేదు. కలెక్టరేట్‌లో కూడా మరోసారి దరఖాస్తు చేసుకుంది. చివరికి.. ఎవరిని అడిగినా లాభంలేక సాయం కోసం వేయికళ్లతో ఎదురుచూస్తోంది.

సాక్షి ప్రతినిధి, విజయవాడ : బుడమేరు వరదతో విజయవాడలో నిండా మునిగిన బాధితులకు నష్టపరిహారం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. వరదలు వచ్చి 45 రోజులకు పైగా గడిచినప్పటికీ, సాయం కోసం ఇంకా వేలాది మంది బాధితులు నిరీక్షిస్తూనే ఉన్నారు. ప్రతి ఒక్క బాధితుడికి సహాయం అందిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు నీటి మూటలుగానే మిగిలాయి. రకరకాల సాకులతో బాధితుల జాబితాకు కోతేసి గతనెల 17న సచివాలయాల్లో ప్రదర్శించారు. కానీ, సర్వే అంతా తప్పుల తడకగా ఉందని, గ్రౌండ్‌ఫ్లోర్ అయితే, ఫస్ట్ ఫ్లోర్ అని.. వాహనాలు నమోదు కాలేదని బాధితులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మరికొందరైతే తమ పేర్లు నమోదు చేయలేదంటూ రోడ్డెక్కి ధర్నా చేశారు. దీంతో బాధితుల ఆగ్రహాన్ని చల్లార్చేందుకు సచివాలయాల పరిధిలో దరఖాస్తులు తీసుకున్నారు. ఆ సమయంలో 18వేల దరఖాస్తులు వచ్చాయి. వాటిలో కొన్నింటిని పరిష్కరించి, వరద బాధితుల ఖాతాల్లో నగదు జమచేశారు. అయినా ఇంకా తమకు పరిహారం అందలేదంటూ చాలామంది సెప్టెంబరు 27 వరకు సచివాలయాల చుట్టూ తిరిగారు. తామేమీ చేయలేమని అక్కడి సిబ్బంది చెతులెత్తేయడంతో సెప్టెంబరు 28 నుంచి బాధితులు దరఖాస్తులతో విజయవాడలోని కలెక్టరేట్ బాటపట్టారు. ఇలా వచ్చిన దరఖాస్తులు 21వేలకు పైగా ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

సాయం కోసం ఎదురుచూపులు..

సీస్ కట్‌చేస్తే.. ఇప్పుడీ దరఖాస్తుల గురించి సమాధానం చెప్పేవారే కరువయ్యారు. వీటిని అధికారులు పరిశీలించి, అర్హులైన జాబితాలు సచివాలయాల్లో ఉంచితే బాధితుల్లో గందరగోళం ఉండేది కాదు. అయితే, దరఖాస్తులు కంటితుడుపుగా తీసుకున్నారా లేక కాలయాపన చేసి వీటిని కోల్డ్‌స్టోరేజీలోకి నెడతారా అని బాధితులు అనుమానిస్తున్నారు. ఎవరి దగ్గర నుంచి సరైన సమాధానం రాకపోవడంతో, బాధితుల అర్జీలన్నీ బుట్టదాఖలు అయినట్లేనని వారు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ప్రభుత్వం స్పందించి ఆదుకోకపోతే ఆందోళన తప్పదని హెచ్చరిస్తున్నారు.

అంచనా బృందాల అరాచకం..

ఇక నష్టం అంచనా జాబితాలోనే ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించిందంటూ బాధితులు మండిపడుతున్నారు. అంచనా బృందాలు వచ్చినప్పుడు ఇంట్లోనే ఉన్నా డోర్‌లాక్ అని నమోదు చేశారని, గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఉంటే నాలుగో అంతస్తు అని నమోదు చేశారని.. ఇల్లంతా బురదమయంగా కనిపిస్తున్నా.. నష్టం జరగలేదని నమోదు చేశారని, వాహనాలు పూర్తిగా పాడైనా.. ఎలాంటి నష్టం జరగలేదని నమోదు చేశారని, ఆధార్, బ్యాంకు ఖాతాలన్నీ సక్రమంగానే ఉన్నా నాట్ ట్రేస్డ్ అని నమోదు చేశారని బాధితులు దుమ్మెత్తిపోస్తున్నారు.



దరఖాస్తులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు పెద్ద సంఖ్యలో వచ్చిన బాధితులు (ఫైల్ ఫొటో)

సాయం చేసింది గోరంతే..

ఇదిలా ఉంటే.. వరద నష్టం అంచనా పూర్తయిన తరువాత ముంపు ప్రాంతాల్లో 2.68 లక్షల కుటుంబాలకు నష్టం జరిగిందని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ఇందులో 2.32 లక్షల కుటుంబాలకు సంబంధించి 1,700 సర్వే బృందాలతో సర్వే చేయించారు. ఇందులో ఇప్పటివరకు 89,616 ఇళ్లు నీట మునిగినందున రూ.188.80 కోట్ల పరిహారం అందించారు. ఎంఎస్‌ఎంఈలు, వాహనాలు, వ్యవసాయరంగం, పశువులు, మత్స్యశాఖ, చేనేత, ఉద్యానవనం అన్ని శాఖలకు కలిపి రూ.97.66 కోట్ల సాయం మాత్రమే అందించారు. ఇందులో వ్యవసాయ రంగానికి సంబంధించే రూ.55.60 కోట్ల పరిహారం ఉంది. అంటే.. వరదకు సంబంధించి జిల్లాలో అన్ని రకాల సాయం కింద అందించింది కేవలం రూ.286.46 కోట్లు మాత్రమే కావడం గమనార్హం. ఇక బాధితులకు ఇచ్చిన పరిహారం కంటే అగ్గిపెట్టెలు, భోజనాలు ఇతర ఖర్చుల కింద ఎక్కువగా ఖర్చుచేయడం విశేషం.

అతీగతీలేని సాయం..



మేం రాజీవ్‌నగర్ ప్లాట్ నెంబరు 26లో ఉంటున్నాం. బుడమేరు వరదలో ఇల్లు పూర్తిగా మునిగింది. సర్వే సిబ్బంది వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు. నష్టపరిహారానికి సంబంధించిన జాబితాలో పేరున్నా డబ్బు మాత్రం పడలేదు. ఎవర్ని అడిగినా సమాధానం కరువైంది. చివరికి కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకున్నా ఇప్పటివరకు అతీగతీలేదు.

– వెంగల సాయితేజ, రాజీవ్‌నగర్

కుప్పం కేంద్రంగా గంజాయి గుప్పు!



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు (ఫైల్)

- పంటపొలాల్లో సాగు చేస్తూ పక్క రాష్ట్రాలకు తరలింపు
- రూ.50 నుంచి రూ.500 వరకు ప్యాకెట్ల విక్రయం
- ద్విచక్ర వాహనాల్లో యథేచ్ఛగా సరఫరా

కుప్పం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లాలోని కుప్పం నియోజకవర్గం గంజాయి విక్రయాలకు అడ్డాగా మారింది. పొలాల మధ్య గంజాయి సాగు చేసి పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ప్రధానంగా కుప్పం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో గంజాయి ప్యాకెట్లు విచ్చలవిడిగా లభ్యం అవుతున్నాయి. రామకుప్పం మండలంలో గంజాయి సాగు మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

యువతను మత్తులో దించేసి..

రామకుప్పం మండలం 89 పెద్దూరు గ్రామంలో కొందరు పొలాల మధ్య గంజాయి సాగు చేస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో పక్క రాష్ట్రాలకు సులభంగా సరఫరా చేస్తున్నారు. అనుమానం రాకుండా కాయగూరల పంటల మధ్యలో గంజాయి మొక్కలు పెంచుతున్నారు. గంజాయి ఆకును కోసి గోనె సంచుల్లో తమిళనాడు, రాజీపేట రోడ్డు, కుప్పం రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. గంజాయి విక్రయాలకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకుని యువతను మత్తులో దించుతున్నారు. కుప్పం రైల్వే స్టేషన్ పరిధిలోని షీకార్ కాలనీ, ఎన్టీఆర్, అర్బన్ కాలనీల్లో విచ్చలవిడిగా గంజాయి ప్యాకెట్లు లభ్యం అవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

ఇటు ఎగుమతి.. అటు దిగుమతి

కుప్పంలో సాగు చేస్తున్న గంజాయిని పక్క రాష్ట్రాలకు ఎగుమతి చేయడంతో పాటు అదే తరహాలో దిగుమతి కూడా చేసుకుంటున్నారు. తమిళనాడుకు చెందిన సేలం, వానియంబడి, తిరుపత్తూరు, కృష్ణగిరి, కర్ణాటకలోని కేజీఎఫ్, కోలార్ పట్టణాల నుంచి కుప్పానికి ఎగుమతులు, దిగుమతులు సాగిస్తున్నారు. ద్విచక్రవాహనాల్లో గంజాయి ప్యాకెట్లు తరలిస్తున్నారు. తమిళనాడు సరిహద్దులో ఉన్న కుప్పం మండలం మల్లానూరు, అడవిబూదుగురు, కోటాలూరు, మెట్లచేను, గుండ్లమడుగు గ్రామాలు అటవీ సరిహద్దు ప్రాంతాలు. ఇక్కడ ఎలాంటి పంటలు సాగు చేసినా పట్టించుకునే వారు లేరు. ఇదే ఆసరాగా చేసుకుని విచ్చలవిడిగా గంజాయి సాగు చేస్తున్నారు. కుప్పం నుంచి కోయంబత్తూరుకు సైతం సరఫరా చేస్తున్నారు. గంజాయి ఆకును చిన్నపాటి ప్యాకెట్లుగా చేసి రూ.50 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. ఇటీవల వినాయక చవితి సందర్భంగా విరాళాల సేకరణ సమయంలో గంజాయి మత్తులో రెండు వర్గాలు ఘర్షణకు దిగడం గమనార్హం. దీనికి సంబంధించి 8 మంది యువకులపై కుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా...

అప్పన్నను దర్శించుకున్న ఆర్‌బీఐ ఈడీ



సింహాచలం (విశాఖ జిల్లా): శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధాశ్యామ్ రాథో దర్శించుకున్నారు. ముందుగా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, వేద ఆశీర్వచనం అందజేశారు. ఈవో త్రినాథరావు స్వామివారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాన్ని అందజేశారు.

శ్రీశైలం ఆలయ ఈవో బదిలీ

సాక్షి, అమరావతి: శ్రీశైలం శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి వారి ఆలయ ఈవో డి.పెద్దిరాజును ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయనను తన సొంత జీఏడీ విభాగానికి అప్పగిస్తూ, ప్రస్తుతం ఆలయ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డిని ఇన్‌చార్జి ఈవోగా నియమిస్తూ దేవదాయ శాఖ కార్యదర్శి శుక్రవారం జీవో జారీ చేశారు.

'జైళ్ల' పనులకు రూ.101.16కోట్లు విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జైళ్లలో నిర్మాణ పనులు, ఉపకరణాల కోసం ప్రభుత్వం రూ.101.16 కోట్లు విడుదల చేసింది. ఆ నిధులతో విశాఖపట్నం, రాజమహేంద్రవరం, రేపల్లె, దర్శి, కడప జైళ్లలో నిర్మాణ పనులు చేపట్టడంతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సమాచార ఉపకరణాల కొనుగోలుచేస్తారు. ఈమేరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసు వాయిదా

విశాఖ లీగల్: విశాఖ విమానాశ్రయంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో నిందితుడు జే.శ్రీనివాసరావు శుక్రవారం నగరంలోని మూడవ అదనపు జిల్లా కోర్టు (జాతీయ దర్యాప్తు సంస్థ ప్రత్యేక న్యాయస్థానం)లో హాజరయ్యాడు. నిందితుడి తరపున న్యాయవాది సలీమ్ వాదనలు వినిపించారు. అనంతరం న్యాయమూర్తి ఈ కేసును వచ్చే నెల 15వ తేదీకి వాయిదా వేశారు.

బీడీఎస్ యాజమాన్య సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: 2024–25 విద్యా సంవత్సరానికి బీడీఎస్ యాజమాన్య కోటా సీట్లను ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం కేటాయించింది. తొలి దశ కౌన్సెలింగ్‌లో భాగంగా సీట్లు కేటాయించిన వర్సిటీ, ఈనెల 21లోగా విద్యార్థులు కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

మహారాష్ట్ర ఎన్నికల పరిశీలకులుగా ముగ్గురు బీజేపీ నేతలు

సాక్షి, అమరావతి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్రం నుంచి ముగ్గురు నేతలను బీజేపీ అధిష్టానం ఎంపిక చేసింది. నాందేడ్ పరిశీలకునిగా విష్ణువర్ధన్‌రెడ్డి, నాసిక్ పరిశీలకునిగా పీవీఎన్ మాధవ్, మరఠ్వాడా పరిశీలకునిగా మధుకర్ నియమితులయ్యారు.

ఇళ్ల మధ్య మద్యం షాపులా!?

- ఎక్కడపడితే అక్కడ ఏర్పాటుచేయడంపై తిరుగుబాటు
- మాకు లిక్కర్ షాపులు వద్దంటూ మండిపాటు
- పలు జిల్లాల్లో మహిళల ఆగ్రహావేశాలు

సాక్షి నెట్‌వర్క్ : బడి, గుడి అన్న తేడాలేకుండా ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా ఏర్పాటుచేస్తున్న లిక్కర్ షాపులపై మహిళలు దండెత్తుతున్నారు. ముఖ్యంగా నివాసాల మధ్య వీటిని ఏర్పాటుచేయడానికి వీల్లేదంటూ రోడ్డెక్కుతున్నారు. టీడీపీ నేతల హెచ్చరికలను సైతం వీరు లెక్కచేయకుండా ఎదురుతిరుగుతూ ఆందోళన బాట పడుతున్నారు. ప్రకాశం జిల్లా తర్లుపాడు బీసీ కాలనీ మహిళలు «మాకు మద్యం షాపు వద్దు.. మా కుటుంబాలను నాశనం చెయ్యొద్దు» అంటూ నిర్వాహకులపై మండిపడ్డారు. విషయం తెలుసుకున్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోదరుడు కందుల రామిరెడ్డి, టీడీపీ నేత.. మద్యం సిండికేట్ నాయకుడైన పరమేశ్వరరెడ్డి వీరిని బెదిరించి వైన్ షాపును ప్రారంభించేందుకు సమాయత్తం కాగా మహిళలందరూ వారితో వాగ్వాదానికి దిగారు. అవసరమైతే పెట్టిన షాపును పగులకొడతామని హెచ్చరించారు. దీంతో.. మీకు చేతనైంది చేసుకోండి.. వైన్ షాపు పెట్టి తీరుతామంటూ టీడీపీ నేతలు తెగేసి చెప్పారు. పోలీసులు జోక్యం చేసుకునేందుకు యత్నించినా మహిళలు వారినీ ఖాతరు చేయలేదు. ఇళ్లమధ్య వైన్ షాపును పెడితే సహించేదిలేదంటూ హెచ్చరించారు.

- ఇదే జిల్లా కనిగిరి పట్టణంలో శుక్రవారం రాత్రి మహిళలు మద్యం అమ్మకాలను అడ్డుకుని ఆందోళన చేశారు. కేసిరెడ్డి నగర్‌లో మద్యం షాపు ప్రారంభించగా స్థానిక మహిళలు అభ్యంతరం వ్యక్తంచేసి అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా భోజనం టేబుళ్లపై బాటిళ్లు పెట్టి విక్రయాలు చేపట్టారు. దీంతో మహిళలు భారీ సంఖ్యలో షాపు వద్దకు వచ్చి ఆందోళన చేశారు. మద్యం షాపును ఎత్తేయాలని, మహిళలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలంటూ నినాదాలు చేశారు.

- అలాగే, అనంతపురం గుత్తి రోడ్డు వద్దనున్న చెన్నకేశవస్వామి దేవుని మాన్యం స్థలంలో నగర తెలుగు యువత నేత మారుతి మద్యం షాపు ఏర్పాటుకు చేస్తున్న అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపాలని మహిళలు డిమాండ్ చేశారు. దేవునికి సంబంధించిన స్థలంలో మద్యం షాపు ఎలా చేపడతారని వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్‌ను ప్రశ్నించారు. బళ్లారి బైపాస్ రోడ్డులోని పెద్ద మసీదు వద్ద కూడా మద్యం షాపు ఏర్పాటుపై స్థానికులు ఆందోళన చేస్తున్నారు.

- పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు రైల్వే ఫీడర్ రోడ్డులో కూడా జనావాసాల మధ్య మద్యం షాపు వద్దంటూ మహిళలు ఆందోళనకు దిగారు. స్థానిక హోల్‌సేల్ చేపల మార్కెట్ సమీపంలో మద్యం షాపు ఏర్పాటుచెయ్యొద్దని ఆ ప్రాంత ప్రజలు, స్థానిక కౌన్సిలర్ పడాల శ్రీనివాసరెడ్డి అడ్డుకుంటున్నా పట్టించుకోకుండా మద్యం దిగుమతి చేయడంపై మహిళలు ఆందోళన చేపట్టారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ ఏర్పాటుచేయడానికి వీల్లేదన్నారు.

- కర్నూలు జిల్లా వెల్దుర్తి పట్టణంలోనూ బీజేపీ మండల మహిళా అధ్యక్షురాలు శాంతి ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన చేపట్టారు. దీని వల్ల తమకు ఇబ్బందులు తలెత్తుతాయంటూ ఆరోపించారు. ఇక్కడ ఒకవైపు శ్రీసిద్ధేశ్వరస్వామి దేవాలయం, మరోవైపు మండల పరిషత్ పాఠశాల, ఇంకోవైపు పెనుకొండ బాబాదర్గాతోపాటు ఎదురుగా పోలీస్‌స్టేషన్ ఉన్నాయని.. త్వరలో కార్తీకమాసం ప్రారంభమవుతుందని.. ఈ నేపథ్యంలో అందరికీ ఇబ్బందిగా ఉంటుందని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- ఇక శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలో ఏర్పాటుచేస్తున్న మద్యం షాపు జనావాసాల నుంచి వేరే చోటకు తరలించాలని మహిళలు, వృద్ధులు శుక్రవారం సాయంత్రం ఆందోళనకు దిగారు. దీనివల్ల రాత్రిళ్లు తాము ఇబ్బందిపడతామన్నారు. పక్కనే సాయిబాబా గుడి కూడా ఉన్నందున ఈ షాపు వేరే చోటుకు మార్చాలని, లేదంటే షాపును తామే మూసివేస్తామని హెచ్చరించారు. మూడ్రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని ఎక్సైజ్ అధికారుల హామీతో మహిళలు వెనక్కి తగ్గారు.



ప్రకాశం జిల్లా తుర్లపాడులో నిరసన తెలుపుతున్న మహిళలు, యువకులు



అనంతపురంలో దేవుని మాన్యంలో మద్యం షాపు వద్దంటూ ఫిర్యాదు చేస్తున్న మహిళలు



పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో మద్యం షాపు ఏర్పాటుపై స్థానికుల ఆందోళన



కర్నూలు జిల్లా వెల్దుర్తిలో మద్యం దుకాణం వద్ద మహిళల నిరసన



శ్రీకాకుళం జిల్లా చిలకపాలెంలో ఎక్సైజ్ అధికారులతో మహిళల వాగ్వాదం

ఢిల్లీ కంటే ఏపీ లిక్కర్ స్కాం అతిపెద్దది

- వ్యాపారుల నుంచి డబ్బు డిమాండ్ చేసిన ప్రజాప్రతినిధుల్ని సస్పెండ్ చేయాలి
- 'సాక్షి' ఎడిటర్ మురళిపై కేసు పత్రికా స్వేచ్ఛను హరించడమే
- ఢిల్లీలో మీడియాతో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎ.పాల్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కంటే ఆంధ్రప్రదేశ్‌లోని లిక్కర్ స్కాం అతి పెద్దదని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కె.ఎ.పాల్ చెప్పారు. అందరూ చూస్తుండగానే బహిరంగంగా లిక్కర్ షాపు యజమానుల నుంచి ప్రజాప్రతినిధులు 15 శాతం వసూళ్లకు పాల్పడ్డారని తెలిపారు. ఇలా వసూళ్లకు పాల్పడిన ప్రజాప్రతినిధుల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇలా చేసే దమ్ము, ధైర్యం చంద్రబాబుకు, పవన్‌కళ్యాణ్‌కు ఉన్నాయా అని నిలదీశారు. ఆయన మంగళవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఢిల్లీ లిక్కర్ స్కాం అనేది సీక్రెట్‌గా జరిగితే ఏపీలో ఇటీవల తీసుకొచ్చిన కొత్త మద్యం పాలసీలో స్కాం అనేది బహిరంగంగా జరిగిందని ఆరోపించారు. టీటీడీ లడ్డూలో కల్తీ జరగలేదని మొత్తుకున్నా చంద్రబాబు వినలేదని విమర్శించారు. ఇప్పుడు సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడంతో.. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఈ విషయంలో సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. తాను చేస్తున్న ఉద్యమాలతో ఇటు ఏపీలో, అటు తెలంగాణలో తనను చంపేందుకు కుట్రలు పన్నుతున్నట్లు ఆరోపించారు.

పత్రికా స్వేచ్ఛను హరించడమే

విజయవాడ వరదల్లో జరిగిన అవినీతి అక్రమాలనే కదా 'సాక్షి' దినపత్రిక బయటపెట్టింది.. అవి అబద్ధాలైతే ఖండనలు ఇవ్వాలే తప్ప వ్యక్తిగతంగా ఎడిటర్ మురళిపై కేసు నమోదు చేయడం సరికాదని చెప్పారు. ఏపీలో «సాక్షి» టీవీతో పాటు మరికొన్ని చానళ్లను ప్రభుత్వం నిషేధించడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనన్నారు. రిపోర్టర్లకు ప్రశ్నలు అడిగే హక్కు, కథనాలు రాసే వెసులుబాటు ఉన్నాయని, వీటిని తప్పుపట్టడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

'ఉపాధి' నివేదికలు పటిష్టంగా రూపొందించండి

డ్వామా పీడీలకు 'ఉపాధి' డైరెక్టర్ ఆదేశాలు

సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలకనుగుణంగా నివేదికలను పటిష్టంగా రూపొందించాలని గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధి హామీ పథకం డైరెక్టర్ వైవీకే షణ్ముఖ్‌కుమార్ డ్వామా పీడీలను ఆదేశించారు. ఆ మార్గదర్శకాల ప్రకారం గ్రామ పంచాయతీల్లో ఏడు రిజిస్టర్ల నిర్వహణతో పాటు జాబ్‌కార్డులు సైతం సకాలంలో పంపిణీ చేయాలని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం అన్ని జిల్లాల డ్వామా పీడీలకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి గ్రామ పంచాయతీల వద్ద ఉండాల్సిన ఏడు రకాల రిజిస్టర్లలో ఆస్తుల కల్పనకు సంబంధించిన 5 (ఏ), 5 «బీ) రిజిస్టర్లు సరిగా నిర్వహించడం లేదని గ్రామీణాభివృద్ధి కమిషనర్ కార్యాలయం దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఏడు రిజిస్టర్ల నిర్వహణ విధానంపై రాష్ట్రమంతటా క్షేత్రస్థాయి సిబ్బంది, ఫీల్డు అసిస్టెంట్లకు మండలాల్లో తప్పనిసరిగా శిక్షణా కార్యక్రమాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు.

పశువుల మేత పెంపకానికి 'ఉపాధి' నిధులు

విధివిధానాలు విడుదల చేసిన గ్రామీణాభివృద్ధిశాఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పాడి రైతులు తమ సొంత వ్యవసాయ భూముల్లో పశువుల మేతకు అవసరమైన గడ్డిని పెంచుకునేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ఆర్థిక సాయం చేయనుంది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ శుక్రవారం విధివిధానాలను విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో ఒక్కో లబ్ధిదారుడు కనీసం పది సెంట్ల భూమి కలిగి ఉండాలి. అందులో గడ్డి పెంపకానికి రూ.6 వేల చొప్పున గరిష్టంగా అర ఎకరం భూమిలో గడ్డి పెంచుకునేందుకు రూ.30 వేల దాకా అందజేయనున్నారు. లబ్ధిదారుల ఎంపిక మాత్రం పూర్తిగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

ఏజెన్సీలో మద్యం దుకాణాలను ఆదివాసీలకే కేటాయించాలి

సీఎంకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

సాక్షి, అమరావతి: ఏజెన్సీ ప్రాంతంలో మద్యం దుకాణాలకు అనుమతులివ్వడం, రద్దు చేయడం వంటి అధికారాలు పెసా గ్రామ సభకు ఉంటుందని, పెసా చట్టం ప్రకారం ఏజెన్సీలో మద్యం దుకాణాలను ఆదివాసీలకే కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను శుక్రవారం ఆయన మీడియాకు విడుదల చేశారు. పెసా చట్టానికి విరుద్ధంగా ఏజెన్సీలో అమలు చేస్తున్న మద్యం షాపుల వేలం రద్దు చేయాలని, స్థానిక గిరిజనులకే వాటిని అప్పగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

'రాయలసీమలో మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయండి'

సాక్షి, అమరావతి: మహిళల కోసం రాయలసీమలో ప్రత్యేకంగా ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్‌కు వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ లేఖ రాసినట్లు మంత్రి కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) యుగంలో పయనిస్తున్న తరుణంలో జనాభాలో సగం ఉన్న మహిళలకు స్థిరమైన అభివృద్ధి అవకాశాలు కల్పించాలని లేఖలో పేర్కొన్నారు. ధర్మవరంలో ప్రత్యేకంగా మహిళల కోసం ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని అనంతపురం జేఎన్టీయూ ప్రతిపాదించిందని గుర్తు చేశారు. సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్)ను లేఖకు జత చేశారు.

'ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణ వద్దు'

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఇచ్చే ఫౌండేషనల్ లిటరసీ– న్యూమరసీ (ఎఫ్ఎన్ఎల్) వృత్యంతర శిక్షణా తరగతులను వారం రోజుల పాటు రెసిడెన్షియల్ విధానంలో ఇవ్వడం ఉపాధ్యాయులకు ఇబ్బందిగా ఉంటుందని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ విధానంతో వారం రోజుల పాటు ఉపాధ్యాయుల కుటుంబాలు ఇబ్బంది పడతాయని సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామిశెట్టి వెంకటేశ్వర్లు విద్యాశాఖకు విజ్ఞప్తి చేశారు. 26 జిల్లాల ఉపాధ్యాయులను కేవలం 9 శిక్షణ కేంద్రాల్లో నివాసాలకు దూరంగా ఉంచడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రస్తుతం అన్ని రకాల శిక్షణ తరగతులు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎఫ్ఎన్ఎల్ శిక్షణ సైతం ఆన్‌లైన్ విధానంలో జరపాలని లేదా మండల, జిల్లాలో నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఎన్‌ఆర్ఐ కోటా సీట్ల భర్తీకి గడువు పెంపు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో 2024–25 సంవత్సరానికి ఎన్‌ఆర్ఐ, ఇన్ లైఈయూ ఆఫ్ ఎన్‌ఆర్ఐ కోటాలో ఎంఎస్సీ, ఎంటెక్, పీహెచ్‌డీ సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో దరఖాస్తుల కోసం ఇచ్చిన తేదీలను అభ్యర్థుల కోరిక మేరకు నవంబర్ 15వ తేదీ వరకు పొడిగించామని, ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులు నవంబర్ 15వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా రిజిస్ట్రార్, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, పరిపాలన విభాగం, లాంఫాం, గుంటూరు కార్యాలయంలో అందేలా చూడాలని పేర్కొన్నారు. విద్యార్థులు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏఎన్‌జీ ఆర్ఏయూ.ఏసీ.ఇన్‌లో చూడాలన్నారు.

గిరిజన సమరయోధుల మ్యూజియంకు రూ.6,75 కోట్లు

సాక్షి, అమరావతి: అల్లూరి జిల్లా తాజంగిలో గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణానికి కేటాయించిన రూ.6,75,57,268 నిధుల వినియోగానికి ప్రభుత్వం పరిపాలన అనుమతినిచ్చింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2020–21లో తాజంగిలో గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణానికి గత ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.20కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ.15కోట్లు మొత్తం రూ.35కోట్లతో ఈ మ్యూజియంను ప్రతిపాదించారు. దీనిలో భాగంగా 2023–24లో రూ.6,75,57,268 కేటాయిస్తూ పరిపాలనా అనుమతి కోసం గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ప్రతిపాదించారు. దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఎడ్యుకేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గ్రాంట్‌లో ఆ మొత్తాన్ని వినియోగించుకునేందుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇచ్చింది.

రెండు సంస్థలతో సీడాప్ ఒప్పందం

సాక్షి, అమరావతి: ఆతిథ్యం, ఐటీ–ఐటీఈఎస్ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేలా సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) రెండు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. తమిళనాడుకు చెందిన అడియార్ ఆనంద్ భవన్, హైదరాబాద్‌కు చెందిన ఆబ్జెక్ట్ టెక్నాలజీస్‌తో ఈ ఒప్పందం జరిగింది. శుక్రవారం విజయవాడలో సీడాప్ చైర్మన్ జి.దీపక్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వర్క్‌షాప్‌లో ఈ ఒప్పందాలపై రెండు సంస్థలు సంతకాలు చేశాయి.







• మన సినిమా

ది మెజీషియన్స్ ఎలిఫెంట్

అద్భుతమైన ఒక ఫాంటసీ సినిమా చూస్తారా? దాని పేరు 'ది మెజీషియన్స్ ఎలిఫెంట్'. యానిమేటెడ్ ఫిల్మ్. ఈ కథ పీటర్ అనే ఓ అనాథది. పీటర్ చిన్నప్పుడే తన ఫ్యామిలీతో పాటు తను ఎంతగానో ఇష్టపడే చెల్లెలిని కోల్పోతాడు. అప్పటి నుండి పీటర్‌ను ఓ మాజీ సైనికుడు పెంచుతూ ఉంటాడు. అనకోకుండా పీటర్ ఓ మహిళా మెజీషియన్‌ను కలుస్తాడు. ఆ మెజీషియన్ పీటర్ చెల్లెలు బతికే వుందని, కాకపోతే ఓ ఎలిఫెంట్ ద్వారా పీటర్‌కు ఆ చెల్లెలు దొరుకుతుందని చెబుతుంది. పీటర్ ఉండేది బాల్టీసి రాజ్యంలో. ఆ రాజ్యంలో ఇప్పటి దాకా తను ఏ ఎలిఫెంట్‌ను చూడలేదు, ఇప్పుడెలాగబ్బా అని అనుకుంటుంటే మేజిక్ షోలో పీటర్‌కు ఓ ఎలిఫెంట్ కనిపిస్తుంది. ఆ ఎలిఫెంట్‌ను తనతో తీసుకువెళదామనుకుంటే ఆ దేశపు తిక్కరాజు పీటర్‌కు మూడు కఠినమైన టాస్కులు పెడతాడు. వాటిలో పీటర్ నెగ్గితే ఎలిఫెంట్‌ను తీసుకువెళ్ళవచ్చని కండిషన్ పెడతాడు. రాజు పెట్టిన ఆ మూడు కండిషన్లు ఏమిటి, పీటర్ ఎలిఫెంట్‌ను గెలుచుకుంటాడా లేదా, పీటర్ చివరికి తన చెల్లెలిని కలుసుకుంటాడా అన్నది మాత్రం నెట్ ఫ్లిక్స్ వేదికగా వున్న 'ది మెజీషియన్స్ ఎలిఫెంట్'ను చూడాల్సిందే. వెండీ రాజర్స్ అనే దర్శకుడు తీసిన ఈ సినిమా పిల్లలతో పాటు పెద్దవాళ్ళకు కూడా నచ్చుతుంది. ముఖ్యంగా రాజు ఇచ్చిన టాస్కులు కాని, ఎలిఫెంట్ చేసే ఫీట్లుగాని సూపర్‌గా వుంటాయి. సో దిస్ వీకెండ్ పిల్లలకు, పెద్దలకు కాదు కాదు మొత్తం ఫ్యామిలీకి సూపర్ ఛాయిస్ 'ది మెజీషియన్స్ ఎలిఫెంట్'.

- ఇంటూరు హరికృష్ణ

• పూల పాట



పూలమ్మా పూలు.. అందమైన పూలు
పూలమ్మా పూలు.. నాణ్యమైన పూలు
రూపమెంతో హాయి.. వాసనెంతో హాయి
కోరి తీసుకున్నారంటె మీ మనసెంతో హాయి
పూలమ్మా పూలు.. అందమైన పూలు

దేవుడి గుడిలో నిలిచేటి పూలు
మగువల తలలో విరిసేటి పూలు
చిన్నారి నవ్వుల్లా మెరిసేటి పూలు
చాచాజీ గుండెపై అలరారు పూలు
పూలమ్మా పూలు.. అందమైన పూలు

• పోలార్ లైట్

పింక్ స్కై



ఆకాశం బ్లూగా ఉంటుంది. తెల్లటి మబ్బులతో ఉంటుంది. మరి ఇదేంటి? పింక్ రంగులో ఉంది... పింకే కాదు... గ్రీన్, ఆరెంజ్... ఇలా రకరకాల రంగుల్లో కూడా కనిపిస్తుంది. ఎక్కడ? నార్త్ పోల్, సౌత్ పోల్‌లో. ఇలా కనిపించే ఆకాశాన్ని 'అరోర' అంటారు. ఉత్తర ధ్రువంలో కనిపిస్తే 'అరోర బోలియసిస్' అని దక్షిణ ధ్రువంలో కనిపిస్తే 'అరోర ఆస్ట్రేలిస్' అని అంటారు. ఈ ఫొటోలో మీరు చూస్తున్నది దక్షిణధ్రువం వైపు ఉన్న ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో నాలుగు రోజుల క్రితం కనిపించిన దృశ్యం. సూర్యుని బాహ్య వలయం నుంచి అత్యంత వేగంతో (466 మైల్స్ పర్ సెకండ్) సోలార్ విండ్స్ భూమి వైపు వస్తాయి. అయితే భూమికి చేరే లోపే భూ అయస్కాంత క్షేత్రంతో ఢీకొని చీలి రెండు అర్ధ వలయాలుగా ఉత్తర, దక్షిణ ధ్రువం వైపు ప్రయాణిస్తాయి. ధ్రువ ప్రాంతాల్లో ఉన్న ధూళి కణాలు ఈ సూర్యుని నుంచి వచ్చిన ఎలక్ట్రాన్, ప్రోటాన్‌ల మందను చూసి ఎగ్జయిట్ అయ్యి కాంతి చిమ్ముతాయి. ఆ సమయంలో ఆకాశం ఇలా రంగులు చిమ్ముతుంది. ఈ ఆకాశాన్ని చూడ దానికే ప్రత్యేకంగా టూరిస్టులు వెళుతుంటారు.

• ఈ సామెత తెలుసుకోండి!

'మెరిసేదంతా బంగారం కాదు'



కొంతమంది చక్కటి మాటలతో మనల్ని ఆకట్టుకుంటారు. మనతో బాగున్నట్టే ఉంటూ మనకు చెడు చేయాలని చూస్తుంటారు. వారి పైపై మాటలు విని, వాళ్లని మంచివాళ్లు అని అనుకుంటాం. వారితో స్నేహం చేస్తాం. నష్టం జరిగాకే అసలు నిజం తెలుసుకుంటాం. పైపై మెరుపు చూసి అంతా బంగారం అనుకోకూడదని, పైపై మాటలతోనే ఎవర్నీ పూర్తిగా నమ్మకూడదని ఈ సామెత మనకు చెప్తుంది.



• మహనీయులు

గాంధీజీ అడిగితే...

బంగారు గాజులు ఇచ్చారు

పిల్లలూ! ఇతరులకు మంచి చేయడం మనందరి బాధ్యత. సమాజానికి మన వంతు సహకారం అందించడం మన కర్తవ్యం. అయితే మేము చిన్నపిల్లలం మాకంత శక్తి లేదనో, మేము ఏమీ చేయలేమనో మీరు అనుకోవద్దు. మీరు తల్చుకుంటే ఎన్నో చేయగలరు. మీకున్న దాంట్లోనే అద్భుతాలు సాధించగలరు.

మీకో విషయం చెప్తాను వినండి. మనదేశానికి స్వాతంత్య్రం రాకముందు మహాత్మా గాంధీ అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి వచ్చారు. ఆయన రాకను పురస్కరించుకుని విరాళాలు సేకరించి, స్వాతంత్య్ర సంగ్రామ నిధికి అందించాలని అంతా అనుకున్నారు. ఆ సమయంలో 12 ఏళ్ల ఓ పాప నేను వస్తానంటూ కదిలింది. జోలె పట్టి అందరి దగ్గరికీ వెళ్లి విరాళాలు సేకరించింది. అవన్నీ తీసుకుని వెళ్లి మహాత్మాగాంధీకి అందించింది. 'మరి నీ విరాళం ఏదీ?' అని గాంధీ తాత ఆ పాపను అడిగితే తన చేతులకున్న బంగారు గాజులు తీసి ఇచ్చేసింది. ఆ తర్వాత ఆ పాప పెద్దయ్యాక భారత స్వాతంత్య్ర సమరంలో పాల్గొంది. ధైర్యం గల నాయకురాలిగా పేరు పొందింది. ఆమే దుర్గాబాయి దేశ్‌ముఖ్.

చూశారా! చిన్న వయసులోనే ఎంత పట్టుదల, దీక్ష చూపిందో ఆమె. మీరూ అలా పట్టుదలతో, దీక్షతో ఉండాలి. ఇతరులకు చేతనైన సాయం చేయాలి. అందరిచేతా మెప్పు పొందాలి.

ఇంగ్లిష్‌లో మాట్లాడడం, రాయడం మంచిదే. అలా అని మన తల్లి భాషను మరవకూడదు. ఇక్కడ ఉన్న పదాలు మీకు తెలియపోతే తెలుసుకోండి. రాతలోనో, మాటలలోనో వాడితే అది మీ సొంతం అవుతుంది.

ఈ వారం కొన్ని పదాలు...



అధ్వము	దారి, దూరం
అనంత	భూమి
అనవరతము	ఎడతెగనిది, నిరంతరం
అనిలము	గాలి
తుల	పోలిక రాశులలో ఒకటి
తృణము	గడ్డి
తెరలిక	గుంపు
ఐరావతము	తెల్ల ఏనుగు
తేజరిల్లు	ప్రకాశించు
తేరగాథ	బౌద్ధ భిక్షువులు రాసిన కథలు
తేవ	ఉత్సవం
తైల పాయిక	గబ్బిలం
తొగ చెలికాడు	చంద్రుడు
త్రైవిద్యుడు	వేదం తెలిసిన వాడు

• మీకు తెలుసా?

రంగు పెన్సిళ్లు ఎలా పుట్టాయి?



చిన్నారులకు రంగురంగుల పెన్సిళ్లంటే ఎంతో ఇష్టం. బొమ్మలు గీసి, వాటికి రంగులు వేయాలంటే ఈ రంగు పెన్సిళ్లు కావాల్సిందే. వీటి పుట్టుక గురించి తెలుసా మరి? గతంలో గ్రీకులు, రోమన్లు చిత్రాల్లో రంగులు వేసేందుకు మైనంతో చేసిన ముద్దలను వాడేవారు.1834లో జర్మనీకి చెందిన 'Staedtler' అనే సంస్థ రంగు పెన్సిళ్ల తయారీ మొదలుపెట్టింది. అనంతరం 1924లో మొదటిసారి చిత్రాలు గీసేందుకు ఈ రంగుల పెన్సిళ్లను తయారుచేశారు. కొన్ని రంగులతో మొదలైన వీటి తయారీ ఆ తర్వాత అనేక రంగుల్లోకి మారింది. కాగితం మీద సున్నితంగా సాగే ఈ పెన్సిళ్లు చూసేందుకు అందంగా ఉండటంతోపాటు చిత్రాలకు చక్కటి రూపం తేవడంతో పిల్లలు వాటిని చాలా ఇష్టపడతారు. యానిమేషన్ రంగంలో కొన్ని చిత్రాలు గీసేందుకు సైతం ఈ రంగుల పెన్సిళ్లు వాడుతుంటారు.



బార్బీ బొమ్మా... నీ కథ చెప్పమ్మా!



హాయ్! నేనే.. మీకెంతో ఇష్టమైన బార్బీ బొమ్మని. నా గురించి చెప్పాలని వచ్చాను. నా పూర్తి పేరు బార్బరా మిలిసెంట్ రాబర్ట్స్. నేను పుట్టింది మార్చి 19, 1959లో. మా ఊరు న్యూయార్క్. నేను మొదటిసారి మీ ముందుకు బ్లాక్ అండ్ వైట్ స్విమ్‌సూట్‌లో వచ్చాను. నేను 11.5 అంగుళాల ఎత్తుతో ఉంటాను. నా మొదటి ధర మూడు డాలర్లు. నాకో ప్రత్యేకమైన రంగు ఉంది. ఆ రంగు పేరు 'బార్బీ పింక్'. నన్ను మీరు రకరకాల రూపాల్లో చూసి ఉంటారు. డాక్టర్, లాయర్, ఇంజినీర్, పైలెట్.. ఇలా 250 రకాల రూపాల్లో నేను మీకు కనిపిస్తాను. మనిషి చంద్రుడి మీద అడుగు పెట్టే నాలుగేళ్ల ముందే, అంటే 1965లో నేను అంతరిక్షానికి వెళ్లాను తెలుసా? అమ్మాయిలు ఏయే రంగాల్లో అయితే తక్కువగా ఉన్నారో ఆ రంగాల్లో నేను కనిపించి వారిలో స్ఫూర్తి నింపాను. అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే నా కల.

ప్రపంచంలోని అన్ని దేశాల వారూ నన్నెంతో ఇష్టపడతారు. నన్నింకా వైవిధ్యంగా తయారు చేసేందుకు నాకోసం సుమారు వెయ్యి మందికిపైగా రకరకాల ఫ్యాషన్లు తయారు చేశారు. మొదట్లో చిన్నపిల్లలు మాత్రమే నన్ను ఇష్టపడేవారు. ఆ తర్వాత 6 నుంచి 99 ఏళ్లవారు కూడా నా మీద ఇష్టం చూపడం మొదలుపెట్టారు. 1997లో నా పేరు మీద 'బార్బీ గాల్' అనే పాట కూడా తయారు చేశారు. అది ఇప్పటికీ ఎంతో ఫేమస్. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నిమిషానికీ 100 బార్బీ బొమ్మలు అమ్ముడుపోతున్నాయి. మొత్తం 150 దేశాల్లో నా బొమ్మలు అమ్ముతున్నారు.

నా పేరిట అనేక సోషల్‌మీడియా అకౌంట్లు ఉన్నాయి. అందులో నాకు 19 మిలియన్ల మంది ఫాలోవర్స్ ఉన్నారు. నా పేరిట ఉన్న యూట్యూబ్ ఛానెల్‌కి ప్రపంచవ్యాప్తంగా 20 మిలియన్లకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. నా పేరిట ఉన్న యూట్యూబ్ ఛానెల్‌లో నాకు సంబంధించి రకరకాల వీడియోలుంటాయి. ఇప్పటి దాకా 151 మిలియన్ల నిమిషాల సేపు ఆ వీడియోలను జనం చూశారు. నా పేరుతో 2023లో 'బార్బీ' అనే విడుదలైంది.

ఇదీ నా కథ. ఇక ఉంటాను. బై!

• కథ

భలే పులి

ఒక అడవిలో ఒక పులి వుండేది. అది చానా మంచిది. ఆకలేసినప్పుడే జంతువులను వేటాడేది. కానీ సన్న సన్న జంతువులను అస్సలు ఏమనేది కాదు. ఒకరోజు పులికి ఆకలిగా వుంటే వేటకు బయలుదేరింది. తిరగ్గా తిరగ్గా ఒక ఆవు కనబడింది. పులి అంతవరకు ఎప్పుడూ ఆవును చూడలేదు. ఎందుకంటే అసలు ఆ అడవిలో ఆవులు ఎక్కడా లేవు. దాంతో 'ఇది చూడడానికి బలంగా వుంది. రెండు కొమ్ములు వున్నాయి. ఇది మంచిదా, చెడ్డదా... దీనిని చంపాలా వద్దా' అని ఆలోచించసాగింది.

ఆవు పరిస్థితి కూడా అంతే ఉంది. అదెప్పుడూ పులిని చూడలేదు. ఇదేం జంతువబ్బా అనుకుంటా చిరునవ్వుతో దగ్గరికి పోయి 'నా పేరు ఆవు. అడవి నాకు కొత్త. మనుషులతో కలసి వుంటాను. శాకాహార జంతువును. గడ్డి, ఆకులు, పళ్ళు తింటా వుంటాను. నువ్వు ఎవరు' అనింది. పులికి ఆవు అమాయకురాలని తెలిసిపోయింది. దాంతో 'నా పేరు పులి. అడవి జంతువును. నేనంటే అడవిలో అందరికీ భయం. మాంసాహారం తిని బతుకుతాను' అనింది. ఆవు బెదిరిపోయింది. అది చూసి పులి 'తల్లీ... నేను మిగతా పులుల లెక్క కాదు. చెడ్డ జంతువులనే వేటాడతాను. ఏమీ భయపడవద్దు. ఇంతకూ నువ్వెందుకు ఇలా అడవిలోనికి వచ్చినావు' అనింది.

ఆవు బాధతో 'ఈ అడవికి ఉత్తరం వైపున వున్నదే మా వూరు. రోజూ అడవి బైట వున్న పెద్ద పచ్చని మైదానానికి మేత మేయడానికి వస్తాము. పొరపాటున కూడా ఎవరమూ అడవిలోకి అడుగు పెట్టము. నాకు ఒక చిన్న దూడ వుంది. అది ఆడుకుంటా ఆడుకుంటా పొరపాటున అడవిలోనికి వచ్చేసింది. నా దూడను వెదుక్కుంటా ఇక్కడికి వచ్చినాను' అనింది. దాని కళ్ళలోంచి నీళ్ళ చుక్కలు కారి టపటపా కింద వున్న గడ్డి మీద పడినాయి. ఆ మాటలకు పులి 'పరవాలేదు నేను వాసన పసిగట్టి అది అడవిలో ఎటువైపు ఎక్కడికి పోయిందో కనుక్కోని తెచ్చి నీ చేతిలో పెడతా' అనింది.

రెండూ వేగంగా ఆవులు మేత మేసే మైదానానికి చేరుకున్నాయి. పులి అక్కడంతా వాసన చూసుకుకుంటా అడవిలోనికి వచ్చింది. దానికి ఒకవైపు దూడ వాసన వచ్చింది. ఇంతలో 'అంబా' అన్న అరుపు



దీనంగా వినబడింది. పులి అదిరిపడి మెరుపు వేగంతో అటువైపు దూసుకొని పోయింది. అక్కడ ఒక పెద్ద తోడేలు ఎదుట బిక్కుబిక్కుమంటా బెదురు చూపులతో వణికిపోతా వున్న దూడ కనిపించింది. ఆ తోడేలు చానా చెడ్డది. కనబడిన జంతువునల్లా చంపి సంబరపడేది. పులి దాని కోసం చానా రోజుల నుంచి వెదుకులాడతా వుంది. అంతే... పులి ఎగిరి పంజాతో ఒక్క పెరుకు పెరికింది. ఆ దెబ్బకు తోడేలు ఎగిరి పడింది.

పులి అక్కడ ఉన్న దూడను తీసుకొని దాని అమ్మ దగ్గరికి చేరింది. ఆవు సంతోషంగా దూడను కౌగిలించుకొనింది. పులితో 'నీ మేలు ఎప్పటికీ మర్చిపోలేను. నువ్వే నాకు దేవుడివి' అనింది. పులి చిరునవ్వుతో దూడవైపు తిరిగి 'పాపా... ఇంకెప్పుడూ ఇలా అడవిలోకి రాకు. అమ్మ మాట వింటా అమ్మ వెంబడే తిరుగు. సరేనా' అంటూ సంతోషంగా తిరిగి అడవిలోనికి వెళ్ళిపోయింది

- ఎం. హరికిషన్

• బ్రెయిన్ జిమ్

మన పొడుపు కథలు

1. తెలిసేలా పూస్తుంది. తెలియకుండా కాస్తుంది.
2. మూతి తెరిస్తే ముత్యాల పేరు
3. రసం కాని రసం?
4. రెక్కలు లేని పిట్ట ఎగురుకుంటూ ఎగురుకుంటూ గూటికి భద్రంగా చేరింది.
5. ఇంటి వెనక ఇంగువ చెట్టు ఎంత కోసినా గుప్పెడు కాదు
6. చిన్న కంచం పెద్ద కంచం నూక బువ్వ నూరు బొట్లు



జవాబులు: 1. వేరు శనగకాయ, 2. దంతాలు, 3. నీరసం, 4. ఉత్తరం, 5. పొగ, 6. చంద్రుడు, మబ్బు నక్షత్రాలు, వాన

బిజినెస్ రీల్

గ్లాండ్ ఫార్మా సీఈవోగా శ్యామకాంత్ గిరి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీలో ఉన్న హైదరాబాద్ కంపెనీ గ్లాండ్ ఫార్మా సీఈవోగా శ్యామకాంత్ గిరి నియమితులయ్యారు. 2025 జనవరి 15 నుంచి ఆయన ఈ కొత్త బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు బోర్డు నిర్ణయం తీసుకుందని కంపెనీ శుక్రవారం వెల్లడించింది. ప్రస్తుతం ఆయన ఆమ్నియల్ ఫార్మాస్యూటికల్స్ ఇండియా, ఎమర్జింగ్ మార్కెట్స్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా శ్రీనివాస్ సాధు కొనసాగుతారని కంపెనీ తెలిపింది.

రూ.80 వేలకు రూ.100 దూరంలో..

పసిడి హ్యాట్రిక్ పరుగు

న్యూఢిల్లీ: పసిడి దేశ రాజధాని న్యూఢిల్లీలో వరుసగా మూడవరోజూ పయనించి కొత్త రికార్డులను తాకింది. క్రితం ముగింపుతో పోల్చితే రూ.550 ఎగసి రూ.79,900కు చేరింది. ఇక 99.5 స్వచ్ఛత ధర కూడా రూ.550 పెరిగి రూ. 79,500కు చేరింది. వెండి కేజీ ధర రూ.1,000 పెరిగి రూ.94,500కు ఎగసింది. పండుగల సీజన్ కావడంతో ఆభరణ వర్తకుల నుంచి డిమాండ్, భౌగోళిక ఉద్రిక్తతలు, అమెరికా ఫెడ్ ఫండ్ వడ్డీరేట్ల తగ్గింపు, డాలర్ బలహీనత, అంతర్జాతీయంగా ధర పటిష్టత, ఈక్విటీల అనిశ్చితి వంటి అంశాల నేపథ్యంలో బంగారం ధరల స్పీడ్ కొనసాగుతోంది.

అందుబాటులోకి బీఎస్ఈ ప్రీమియం కన్జంప్షన్ సూచీ

న్యూఢిల్లీ: బీఎస్ఈ అనుబంధ సంస్థ ఏషియా ఇండెక్స్ తాజాగా బీఎస్ఈ ప్రీమియం కన్జంప్షన్ ఇండెక్స్‌ను ఆవిష్కరించింది. దీనితో దేశీయంగా పెరుగుతున్న వినియోగం వల్ల లబ్ధి పొందే కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసే అవకాశం లభిస్తుందని పేర్కొంది. బీఎస్ఈ 500 సూచీలోని ప్రీమియం వినియోగ ఉత్పత్తుల సంస్థల స్టాక్స్ ఈ సూచీలో ఉంటాయని తెలిపింది. ఫ్రీ-ఫ్లోట్ మార్కెట్ క్యాపిటలైజేషన్ ప్రాతిపదికన వాటిని ఎంపిక చేస్తామని ఏషియా ఇండెక్స్ ఎండీ ఆశుతోష్ సింగ్ తెలిపారు. ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్స్ మొదలైన వాటి కోసం ఫండ్స్ దీన్ని ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు.

- కోటక్ మహీంద్రా బ్యాంక్ చేతికి

స్టాన్‌చార్ట్ బ్యాంక్ పర్సనల్ లోన్ పోర్ట్‌ఫోలియో

న్యూఢిల్లీ: స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్‌కి చెందిన రూ. 4,100 కోట్ల పర్సనల్ లోన్ పోర్ట్‌ఫోలియోను కొనుగోలు చేయనున్నట్లు కోటక్ మహీంద్రా బ్యాంక్ తెలిపింది. అయితే, ఇందుకోసం ఎంత మొత్తం వెచ్చిస్తున్నదీ వెల్లడించలేదు. ఈ డీల్ మూడు నెలల్లోగా పూర్తి కావచ్చని అంచనా వేస్తున్నట్లు వివరించింది. రెండేళ్ల క్రితమే మరో విదేశీ బ్యాంకు సిటీ తమ రిటైల్ వ్యాపారాన్ని యాక్సిస్ బ్యాంక్‌నకు విక్రయించిన సంగతి తెలిసిందే. వ్యక్తిగత రుణాల్లాంటి అన్‌సెక్యూర్డ్ రుణాల విషయంలో రిస్కుల గురించి రిజర్వ్ బ్యాంక్ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఈ డీల్స్ ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

నేటి బోర్డు సమావేశాలు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యూకోబ్యాంక్, పంజాబ్ సింధ్ బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్, టెక్ మహీంద్రా, పీసీ జ్యువెలర్.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
AXISBANK	1,196.95	5.75
WIPRO	547.75	3.59
EICHERMOT	4,761.75	2.98
ICICIBANK	1,267.00	2.9
SHRIRAMFIN	3,350.00	2.8

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INFY	1,885.00	-4.22
BRITANNIA	5,870.00	-1.98
ASIANPAINT	2,998.85	-1.87
NESTLEIND	2,350.00	-1.21
TECHM	1,685.15	-0.82

స్టాక్ మార్కెట్ డేటా


	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,143
ఎన్ఎస్ఈ	83,147
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,01,795
ఎఫ్ఐఐ	- 5,486
డీఐఐ	+ 5,215

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.21	$ 70.67
బ్రెంట్	73.02	$ 74.45

ఈ దశలో వడ్డీ రేట్ల తగ్గింపు తొందరపాటే

- అది చాలాచాలా రిస్క్‌కు దారితీస్తుంది
- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్



న్యూఢిల్లీ: వడ్డీ రేట్ల విషయమై ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. వడ్డీ రేట్లను ఈ దశలో తగ్గించడం తొందరపాటు నిర్ణయం అవుతుందని, ఇది చాలా చాలా రిస్క్‌గా మారుతుందన్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం ఇప్పటికే గరిష్ట స్థాయిలోనే కొనసాగుతోందంటూ, భవిష్యత్ ద్రవ్యపరమైన నిర్ణయాలు డేటా ఆధారంగానే ఉంటాయని సంకేతం ఇచ్చారు. ఈ నెల మొదట్లో జరిగిన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ భేటీ కీలక రేట్లను యథాతథంగా కొనసాగిస్తూ నిర్ణయించడం తెలిసిందే. ద్రవ్యోల్బణ పరమైన ఒత్తిళ్లను ప్రస్తావిస్తూ, మానిటరీ పాలసీ విధానాన్ని తటస్థానికి సడలించింది. తదుపరి ఆర్‌బీఐ ఎంపీసీ ద్వైమాసిక భేటీ డిసెంబర్ 6న జరగనుంది. బ్లూంబర్గ్ నిర్వహించిన ఇండియా క్రెడిట్ ఫోరమ్‌లో పాల్గొన్న సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ఈ అంశాలను ప్రస్తావించారు. సెప్టెంబర్ నెలకు ద్రవ్యోల్బణం అధికంగా ఉండంటూ, తదుపరి నెల గణాంకాల్లోనూ ఇదే తీరు ఉంటుందని, ఆ తర్వాత మోస్తరు స్థాయికి దిగి రావొచ్చన్నారు. కనుక ఈ దశలో రేట్ల కోత ఎంతో తొందరపాటు అవుతుంది. ద్రవ్యోల్బణం 5.5 శాతం స్థాయిలో ఉన్నప్పుడు ఇలాంటి నిర్ణయం చాలా చాలా రిస్క్‌గా మారుతుంది''అని అభిప్రాయపడ్డారు. ఆర్‌బీఐ పోలీసు మాదిరిగా వ్యవహరించకూడదంటూ.. ఫైనాన్షియల్ మార్కెట్లపై కఠిన నిఘా కొనసాగిస్తూ, అవసరమైనప్పుడు నియంత్రణపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. నవి ఫిన్‌సర్వ్, ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ తదితర సంస్థలపై తాజాగా ఆర్‌బీఐ ఆంక్షలు విధించిన నేపథ్యంలో దాస్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.

ఇళ్ల కొనుగోలులో కీలకంగా వడ్డీ రేట్లు

- 9 శాతం దాటితే పునరాలోచిస్తాం
- 8.5 శాతంలోపు కొనసాగితే ఓకే
- ఫిక్కీ, అనరాక్ సర్వేలో మెజారిటీ మనోగతం



ముంబై: గృహ రుణాలపై వడ్డీ రేట్లు 9 శాతం దాటితే తమ ఇళ్ల కొనుగోలు నిర్ణయంపై గణనీయమైన ప్రభావం పడుతుందని మెజారిటీ ప్రజలు భావిస్తున్నారు. ఫిక్కీ, అనరాక్ నిర్వహించిన సర్వేలో 90 శాతం మంది ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇరు సంస్థలూ 'హోమ్ బయ్యర్ సెంటిమెంట్ సర్వే' వివరాలను ముంబైలో జరుగుతున్న రియల్ ఎస్టేట్ సదస్సులో భాగంగా విడుదల చేశాయి. 7,615 మంది అభిప్రాయాల ఆధారంగా ఈ వివరాలను రూపొందించాయి. ఇళ్ల కొనుగోలుపై పెరిగిన రుణ రేట్ల ప్రభావం ఏ మేరకు ఉంటుందో తెలుసుకునే ప్రయత్నం చేశాయి.

సర్వేలో వ్యక్తమైన అభిప్రాయాలు..

- గృహ రుణ రేట్లు 8.5 శాతం దిగువనే కొనసాగితే తమ ఇంటి కొనుగోలు నిర్ణయంపై ఎలాంటి ప్రభావం ఉండదని 71 శాతం మంది స్పష్టం చేశారు.
- 9 శాతం దాటితే తమ నిర్ణయాలు ప్రభావితం అవుతాయని 87 శాతం మంది తెలిపారు. 8.5–9 శాతం మధ్య రేట్లు కొనసాగితే తమ నిర్ణయాలపై ఓ మోస్తరు ప్రభావమే ఉంటుందని 54 శాతం మంది చెప్పారు.
- 59 శాతం మందికి రియల్ ఎస్టేట్ ప్రాధాన్య పెట్టుబడి సాధనంగా ఉంది. 67 శాతం మంది సొంత నివాస అవసరాలకే కొనుగోలు చేస్తున్నారు.
- రూ.45–90 లక్షల ఇళ్లకు 35 శాతం మంది మొగ్గు చూపిస్తుంటే, రూ.90 లక్షల నుంచి రూ.1.5 కోట్ల బడ్జెట్ ఇళ్లకు 28 శాతం మంది ఆసక్తి చూపిస్తున్నారు.
- 93 శాతం మంది నిర్మాణంలో నాణ్యతకు, 72 శాతం మంది మంచి వెలుతురు ఉండే ఇళ్లకు ప్రాధాన్యం చూపిస్తున్నారు.

చెప్పుకోతగ్గ మార్పు..

''భారత రియల్ ఎస్టేట్ రంగం చెప్పుకోతగ్గ పరిణామక్రమాన్ని చూసింది. ప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఇళ్ల కంటే నిర్మాణంలోని ప్రాపర్టీల వైపు వినియోగదారులు మొగ్గు చూపిస్తుండడం డెవలపర్ల పట్ల, నియంత్రణ వాతావరణం పట్ల పెరిగిన విశ్వాసాన్ని తెలియజేస్తోంది''అని ఫిక్కీ ప్రెసిడెంట్ సందీప్ సోమాని తెలిపారు. నివాస ఇళ్ల మార్కెట్ 2029 నాటికి 1.04 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఫిక్కీ అర్బన్ డెవలప్‌మెంట్, రియల్ ఎస్టేట్ చైర్మన్ రాజ్ మెండా తెలిపారు. ఏటా 25.6 శాతం వృద్ధి చెందుతుందన్నారు. ఈ కన్జ్యూమర్ సర్వేకు ఎంతో ప్రాముఖ్యత ఉందని అనరాక్ చైర్మన్ అనుజ్ పురి పేర్కొన్నారు. ప్రస్తుత మార్కెట్ వాతావరణంలో వినియోగదారుల ప్రాధాన్యతలకు ఇది అద్దం పడుతుందన్నారు.

దేశ రియల్ ఎస్టేట్ మార్కెట్ ధోరణలను తెలియజేస్తుందన్నారు. రీట్‌లకు పెరుగుతున్న ఆదరణను టాటా రియల్టీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎండీ, సీఈవో సంజయ్ దత్ ఈ సదస్సులో భాగంగా గుర్తు చేశారు. పాక్షిక యాజమాన్యంలో ఉన్న సానుకూలతలను ప్రస్తావించారు. తక్కువ పెట్టుబడితోనే నాణ్యమైన ఆస్తుల్లో వాటాను వీటి ద్వారా పొందొచ్చన్నారు.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ. 4,200 కోట్ల క్విప్ ఇష్యూ



న్యూఢిల్లీ: క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్విప్) ఇష్యూ ద్వారా 500 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 4,200 కోట్లు) సమీకరించినట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ వెల్లడించింది. కార్యకలాపాల విస్తరణ అవసరాల కోసం ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు పేర్కొంది. క్విప్ ఇష్యూకి దీర్ఘకాలిక ఇన్వెస్టర్లు, దేశీ మ్యుచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి 4.2 రెట్లు బిడ్లు వచ్చినట్లు సంస్థ తెలిపింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ గతేడాది జనవరిలోనే రూ. 20,000 కోట్ల ఫాలో ఆన్ ఆఫర్ (ఎఫ్‌పీవో) ప్రకటించినప్పటికీ, సరిగ్గా అదే సమయంలో గ్రూప్ కార్యకలాపాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక విడుదల చేయడం ప్రతికూల పరిణామాలకు దారి తీసింది. ఇష్యూ పూర్తిగా సబ్‌స్క్రయిబ్ అయినప్పటికీ, కంపెనీ దాన్ని రద్దు చేసుకుని, ఇన్వెస్టర్లకు సొమ్ము వాపసు చేసింది.

మెథనాల్ ప్లాంట్లతో పెట్రోలియం దిగుమతులకు చెక్!

- భారీ సామర్థ్యంతో ఏర్పాటు చేయాలి
- నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్



న్యూఢిల్లీ: భారీ పరిమాణంలో మెథనాల్ ప్లాంట్ల ఏర్పాటుతో శిలాజ ఇంధనాలైన పెట్రోలియం తదితర ఉత్పత్తుల దిగుమతులను తగ్గించుకోవచ్చని నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ సూచించారు. థర్మల్ ప్లాంట్లపై ఆధారపడడం భవిష్యత్తులో తగ్గుతుందంటూ.. మెథనాల్ తయారీకి పరిశ్రమ ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. మెథనాల్‌ను శుద్ధ ఇంధనంగా పేర్కొంటూ, భారీ వాణిజ్య వాహనాల్లోనూ దీన్ని వినియోగించొచ్చన్నారు. మెథనాల్‌తో నడిచే ఓడను నిర్మించాలంటూ ఓ విదేశీ కంపెనీ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌కు ఆర్డర్ ఇచ్చినట్టు చెప్పారు. ఈ నెల 17, 18 తేదీల్లో ఢిల్లీలోని మనేక్‌షా కేంద్రంలో రెండు రోజుల పాటు అంతర్జాతీయ మెథనాల్ సెమినార్, ఎక్స్‌పోను నీతి ఆయోగ్ నిర్వహిస్తున్నట్టు సారస్వత్ ప్రకటించారు. 2016లో అమెరికాకు చెందిన మెథనాల్ ఇనిస్టిట్యూట్‌తో నీతిఆయోగ్ భాగస్వామ్యం కుదుర్చుకోగా.. ఈ ఎనిమిదేళ్లలో ప్రాజెక్టులు, ఉత్పత్తులు, పరిశోధన, అభివృద్ధికి సంబంధించి సాధించిన పురోగతిని సెమినార్‌లో తెలియజేస్తామని చెప్పారు. ఉత్పత్తులు, టెక్నాలజీలను ఈ ఎక్స్‌పోలో ప్రదర్శిస్తామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మెథనాల్ తయారీ, వినియోగానికి వీలుగా ప్రభుత్వం ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తోందని, ఆ తర్వాత పెద్ద స్థాయి మెథనాల్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలతో సమగ్ర విధానాన్ని ప్రకటిస్తుందని చెప్పారు. ప్రస్తుతం దేశంలో 0.7 మిలియన్ మెట్రిక్ టన్నుల మెథనాల్ తయారీ సామర్థ్యం ఉండగా.. డిమాండ్ 4 మిలియన్ టన్నులు మేర ఉండడం గమనార్హం.

జేఎస్‌డబ్ల్యూ... జేస్వ్కర్ చేతికి థిస్సెన్‌క్రుప్ ఎలక్ట్రికల్

డీల్ విలువ రూ. 4,051 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ థిస్సెన్‌క్రుప్ ఎలక్ట్రికల్ స్టీల్ ఇండియా(టీకేఈఎస్)ను కొనుగోలు చేసేందుకు జేస్వ్కర్ ఎలక్ట్రికల్ స్టీల్ నాసిక్ ప్రయివేట్ లిమిటెడ్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. 100 శాతం ఈక్విటీ కొనుగోలుకి రూ. 4,051 కోట్లు వెచ్చించనుంది. జేఎస్‌డబ్ల్యూ జేఎఫ్ఈ ఎలక్ట్రికల్ స్టీల్ ప్రయివేట్ లిమిటెడ్(జే2ఈఎస్)కు జేస్వ్కర్ అనుబంధ సంస్థకాగా.. జే2ఈఎస్‌ను దేశీ దిగ్గజం జేఎస్‌డబ్ల్యూ స్టీల్, జపనీస్ దిగ్గజం జేఎఫ్ఈ స్టీల్ కార్పొరేషన్ 50:50 శాతం వాటాతో భాగస్వామ్య కంపెనీ(జేవీ)గా ఏర్పాటు చేశాయి. విలువజోడింపు స్టీల్ ప్రొడక్టుల వాటా పెంచే బాటలో తాజా కొనుగోలుకు తెరతీసినట్లు జేఎస్‌డబ్ల్యూ స్టీల్ పేర్కొంది. దేశీయంగా టీకేఈఎస్ ఇండియా నాసిక్ ప్లాంటు ద్వారా ప్రధానంగా గ్రెయిన్ ఆధారిత ఎలక్ట్రికల్ స్టీల్ తయారీ, విక్రయాలను చేపడుతోంది.

బీఎస్ఈలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేరు 1.2 % బలపడి రూ. 992 వద్ద ముగిసింది.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు — Q2 RESULTS

ఐసీఐసీఐ లంబార్డ్ లాభం అప్

క్యూ2లో రూ. 694 కోట్లు

న్యూఢిల్లీ: బీమా రంగ దిగ్గజం ఐసీఐసీఐ లంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 20 శాతం జంప్ చేసి రూ. 694 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 577 కోట్లు ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 5.5 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 5,049 కోట్ల నుంచి రూ. 5,850 కోట్లకు ఎగసింది. మొత్తం స్థూల ప్రీమియం రూ. 6,272 కోట్ల నుంచి రూ. 6,948 కోట్లకు బలపడింది. నికర ప్రీమియం ఆదాయం రూ. 4,240 కోట్ల నుంచి రూ. 4,835 కోట్లకు పుంజుకుంది. మొత్తం వ్యయాలు రూ. 4,452 కోట్ల నుంచి రూ. 5,186 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో ఐసీఐసీఐ లంబార్డ్ షేరు బీఎస్ఈలో 1.2 శాతం నీరసించి రూ. 2,015 వద్ద ముగిసింది.

టాటా కన్జ్యూమర్ లాభం ఫ్లాట్

రూ. 367 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ రంగ దిగ్గజం టాటా కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం నామమాత్ర వృద్ధితో రూ. 367 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 364 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం మరింత అధికంగా 18 శాతం ఎగసి రూ. 4,260 కోట్లను అధిగమించింది. మొత్తం వ్యయాలు సైతం 16 శాతం పెరిగి రూ. 3,836 కోట్లకు చేరాయి. మొత్తం బ్రాండెడ్ బిజినెస్ 12 శాతంపైగా బలపడి రూ. 3,771 కోట్లను తాకాగా.. నాన్‌బ్రాండెడ్ విభాగం 19 శాతం పుంజుకుని రూ. 462 కోట్లను దాటింది.

ఫలితాల నేపథ్యంలో టాటా కన్జ్యూమర్ షేరు బీఎస్ఈలో 0.7 శాతం లాభపడి రూ. 1,098 వద్ద ముగిసింది.

జియో ఫైనాన్షియల్ లాభం ప్లస్

క్యూ2లో రూ. 689 కోట్లు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి ప్రత్యేక కంపెనీగా విడివడిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 3 శాతం స్వల్ప వృద్ధితో రూ. 689 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 668 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 608 కోట్ల నుంచి రూ. 694 కోట్లకు బలపడింది. మొత్తం వ్యయాలు రెట్టింపై రూ. 146 కోట్లకు చేరాయి. గత క్యూ2లో కేవలం రూ. 71 కోట్లుగా నమోదయ్యాయి. కాగా.. కీలక ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ(సీఐసీ)గా ఆర్‌బీఐ నుంచి ఈ ఏడాది జులై 9న గుర్తింపును పొందింది. దీంతో అదేరోజు నుంచి డిపాజిట్లు స్వీకరించని ప్రధాన వ్యవస్థాగత సంస్థ(సీఐసీ–ఎన్‌డీ–ఎస్ఐ)గా ఆవిర్భవించినట్లు కంపెనీ తాజాగా వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో జియో ఫైనాన్షియల్ షేరు బీఎస్ఈలో 0.4 శాతం బలపడి రూ. 331 వద్ద ముగిసింది.

పీవీ హోల్‌సేల్ 3-5 శాతం వృద్ధి!

2024-25పై సియామ్ అంచనా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయ ప్యాసింజర్ వెహికిల్స్ (పీవీ) హోల్‌సేల్ విక్రయాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3–5 శాతం వృద్ధి చెందవచ్చని అంచనా వేస్తున్నట్లు సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్) తెలిపింది. పరిశ్రమలో మొదటి అర్ధభాగంలో అమ్మకాలు స్థిరంగా నమోదయ్యాయి. పండుగల కాలంలో బలమైన పనితీరుపై ఆశలు పెట్టుకున్నట్లు సియామ్ సోమవారం పేర్కొంది. 2024–25లో ప్యాసింజర్ వెహికిల్స్ పరిశ్రమ హోల్‌సేల్ విక్రయాలు 5–8 శాతం దూసుకెళ్తాయని ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో సియామ్ అంచనా వేసింది. 2024 ఏప్రిల్–సెప్టెంబర్‌లో దేశవ్యాప్తంగా పీవీ అమ్మకాలు 20,81,143 యూనిట్లు నమోదయ్యాయి. గతేడాది ఇదే కాలంలో ఇది 20,70,960 యూనిట్లుగా ఉంది. 'ఏప్రిల్ అమ్మకాలు బాగానే ఉన్నాయి. మే, జూన్ నెలల్లో మా అంచనాల మేరకు విక్రయాలు జరగలేదు. ఇది తీవ్రంగా ప్రభావితం చేసింది. సెప్టెంబరులో అమ్మకాలు పెరిగాయి. కానీ శ్రద్ధా కాలంలో తగ్గాయి. అందుకే 2024–25లో 5 శాతంలోపు వృద్ధిని ఆశిస్తున్నాం. సెప్టెంబర్ త్రైమాసికంలో మొత్తం దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమ గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 9 శాతం వృద్ధితో పటిష్టంగా ఉంది. ద్విచక్ర వాహనాలు 13 శాతం, త్రిచక్ర వాహనాలు 7 శాతం వృద్ధిని కొనసాగించాయి.. అయితే పీవీలు, వాణిజ్య వాహనాలు క్యూ2లో కొంత క్షీణతను నమోదు చేశాయి' అని సియామ్ ప్రెసిడెంట్ శైలేశ్ చంద్ర తెలిపారు.

మొదటి 12 రోజుల్లో..

అక్టోబర్–మార్చి కాలం ఇప్పుడు పెద్ద భారాన్ని కలిగి ఉంది. పండుగ సీజన్ వృద్ధి అంచనాలను అందించగలదని ఆశిస్తున్నామని శైలేశ్ చంద్ర అన్నారు. 'అక్టోబరు మొదటి 12 రోజుల్లో రిటైల్ అమ్మకాలు గత నెలతో పోలిస్తే 25 శాతం పెరిగాయి. ఇది పండుగ కాలంలో బలమైన విక్రయాలను సూచిస్తుంది. 2019–20లో ప్యాసింజర్ వెహికిల్స్ అమ్మకాలు 26 లక్షల యూనిట్ల నుంచి గత ఆర్థిక సంవత్సరంలో 42 లక్షల యూనిట్లకు పెరిగాయి. అందువల్ల బేస్ ఎఫెక్ట్ ఎక్కువగా ఉంటుంది. అయితే వృద్ధి రేట్లు స్థిరంగా లేదా స్వల్పంగా తగ్గుముఖం పడుతున్నాయి. కానీ అధిక స్థాయి డిమాండ్ కూడా ఉంది. అదే పరిశ్రమకు పెద్ద విషయంగా భావిస్తున్నాను. రెండో త్రైమాసికంలో ఇన్వెంటరీ స్థాయిలను తగ్గించడంలో పండుగ సీజన్ కూడా సహాయపడుతుంది. కీలక రాష్ట్రాల్లో భారీ వర్షపాతం, సెప్టెంబరులో దాదాపు మొత్తం శ్రద్ధా కాలం రావడంతో కొన్ని సెగ్మెంట్ల విక్రయాల సంఖ్యను ప్రభావితం చేసింది. రుతుపవనాల ముగింపు, నిరంతర మౌలిక సదుపాయాల వ్యయం, పండుగ సీజన్ రాక వినియోగాన్ని పెంచడంతో వచ్చే త్రైమాసికంలో ఆరోగ్యకర డిమాండ్‌ను అంచనా వేస్తున్నాము' అని వివరించారు.

పీసీలూ పెద్ద ఎత్తున ఎగుమతి



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ల తర్వాత పర్సనల్ కంప్యూటర్లు (పీసీ) ఈ ఏడాది ఏప్రిల్–ఆగస్టు మధ్య భారత్ నుండి కీలక ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతులుగా ఉద్భవించాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. 'యూఏఈ, రష్యా, బంగ్లాదేశ్, యూఎస్, శ్రీలంకకు వ్యక్తిగత కంప్యూటర్ల సరఫరా ఆరోగ్యకర వృద్ధిని నమోదు చేశాయి. ఈ మార్కెట్లకు పీసీల ఎగుమతులు 2024 ఏప్రిల్–ఆగస్టులో 102.6 మిలియన్ డాలర్లకు పెరిగాయి. 2023 ఏప్రిల్–ఆగస్ట్‌లో ఇది కేవలం 37 మిలియన్ డాలర్లు నమోదైంది. ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) ద్వారా పర్సనల్ కంప్యూటర్ల తయారీకి ప్రభుత్వం అందించిన మద్దతు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటి ఇతర చర్యలు ఈ వృద్ధికి తోడ్పడ్డాయి' అని వివరించింది.

ఇవీ టాప్-5 మార్కెట్స్..



ల్యాప్‌టాప్‌లు, పామ్‌టాప్‌లు, హ్యాండ్‌హెల్డ్‌లకు అతిపెద్ద మార్కెట్ అయిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో 64 మిలియన్ డాలర్ల విలువైన ఈ పరికరాలను దిగుమతి చేసుకుంది. గత ఏడాది ఇదే కాలంలో వీటి విలువ 29.7 మిలియన్ డాలర్లుగా ఉంది. భారత్ నుంచి రష్యాకు సరఫరా అయిన పీసీల విలువ 4.4 మిలియన్ డాలర్ల నుండి 20.4 మిలియన్ డాలర్లకు దూసుకెళ్లాయి. బంగ్లాదేశ్‌కు 7.7 మి.డాలర్లు, శ్రీలంక 5.6 మి.డాలర్లు, యూఎస్‌కు 3.7 మిలియన్ డాలర్ల ఎగుమతులు నమోదయ్యాయి.

పీసీబీలు సైతం..



ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్‌ల (పీసీబీ) ఎగుమతులు 76 శాతం ఎగసి 12.76 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. భారత్ నుండి అత్యధికంగా 3.54 మిలియన్ డాలర్ల పీసీబీలను ఫ్రాన్స్ కొనుగోలు చేసింది. ఆ తరువాత ఇజ్రాయెల్ 3.31 మి.డాలర్లు, ఇటలీ 1.64 మిలియన్ డాలర్లు నమోదైంది.

స్మార్ట్‌ఫోన్‌ల హవా..



ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో స్మార్ట్‌ఫోన్స్ తొలి స్థానాన్ని ఆక్రమించాయి. మొదటి ఐదు మార్కెట్లకు ఏప్రిల్–ఆగస్ట్ మధ్య 5.1 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్స్ భారత్ నుంచి సరఫరా అయ్యాయి. గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఎగుమతులు 59 శాతం అధికం కావడం విశేషం. 2.88 బిలియన్ డాలర్ల దిగుమతులతో యూఎస్ తొలి స్థానంలో నిలిచింది. నెదర్లాండ్స్ 833 మిలియన్ డాలర్లు, యూకే 517 మి.డాలర్లు, ఇటలీ 449 మి.డాలర్లు, ఆస్ట్రియా 421 మిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్స్‌ను భారత్ నుంచి దిగుమతి చేసుకున్నాయి.

పాక్ ప్రతాపం

● రెండో టెస్టులో ఇంగ్లండ్‌పై 152 పరుగుల తేడాతో ఘనవిజయం
● 8 వికెట్లు పడగొట్టిన స్పిన్నర్ నోమన్ అలీ



బెన్ స్టోక్స్



సాజిద్ ఖాన్
నోమన్ అలీ

11 సొంతగడ్డపై పాకిస్తాన్ జట్టుకు పదకొండు మ్యాచ్‌ల తర్వాత ఇదే తొలి విజయం 2021 దక్షిణాఫ్రికాపై టెస్టు మ్యాచ్ గెలిచిన అనంతరం స్వదేశంలో పాక్ జట్టు టెస్టు మ్యాచ్ నెగ్గలేదు.

1 షాన్ మసూద్ సారథ్యంలో పాకిస్తాన్ జట్టుకు ఇదే తొలి విజయం. మసూద్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో పాకిస్తాన్ ఓటమి పాలైంది.

7 ఒక టెస్టు మ్యాచ్‌లో మొత్తం 20 వికెట్లు ఇద్దరే బౌలర్లు పంచుకోవడంతో టెస్టు క్రికెట్‌లో ఇది ఏడోసారి. తాజా మ్యాచ్‌లో నోమన్ అలీ 11, సాజిద్ ఖాన్ 9 వికెట్లు తీశారు. చివరిసారిగా 1972లో ఇంగ్లండ్‌తో టెస్టులో ఆస్ట్రేలియా బౌలర్లు బాబ్ మస్సీ (16), డేనిస్ లిల్లీ (4) ఈ ఫీట్ సాధించారు.

ముల్తాన్: సుదీర్ఘ నిరీక్షణ అనంతరం... పాకిస్తాన్ జట్టు సొంతగడ్డపై టెస్టు విజయం రుచి చూసింది. స్పిన్నర్ల హవా సాగిన రెండో టెస్టులో పాకిస్తాన్ జట్టు 152 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను మట్టికరిపించింది. పాక్ జట్టుకు స్వదేశంలో 11 మ్యాచ్‌ల అనంతరం ఇదే తొలి విజయం కావడం గమనార్హం. ఫలితంగా మూడు మ్యాచ్‌ల సిరీస్ ప్రస్తుతం 1–1తో సమమైంది. 297 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 36/2తో శుక్రవారం నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ చివరకు 33.3 ఓవర్లలో 144 పరుగులకు ఆలౌటైంది. పేసర్లతో పనిలేకుండా ఇద్దరు పాక్ స్పిన్నర్లే పని పూర్తి చేశారు. కెప్టెన్ బెన్ స్టోక్స్ (37; 4 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... ఓలీ పోప్ (22), జో రూట్ (18), హ్యారీ బ్రూక్ (16), జేమీ స్మిత్ (6) విఫలమయ్యారు. గత మ్యాచ్‌లో చెలరేగి ఆడి రికార్డులు తిరగరాసిన ఇంగ్లండ్ జట్టు... రెండో టెస్టులో అదే జోరు కొనసాగించలేకపోయింది. ఊరించే లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. స్పిన్‌ను ఎదుర్కోలేక ఇంగ్లండ్ ప్లేయర్లు విలవిల్లాడారు. స్వీప్, రివర్స్ స్వీప్ ఆడేందుకు ప్రయత్నించి వికెట్లు సమర్పించుకున్నారు. పాకిస్తాన్ బౌలర్లలో నోమన్ అలీ 8 వికెట్లతో సత్తా చాటగా... సాజిద్ ఖాన్‌కు 2 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లోనూ ఈ ఇద్దరే 10 వికెట్లను తమ ఖాతాలో వేసుకున్నారు. మ్యాచ్ మొత్తంలో 9 వికెట్లు తీసిన సాజిద్ ఖాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. షాన్ మసూద్ టెస్టు కెప్టెన్‌గా పగ్గాలు చేపట్టిన తర్వాత పాకిస్తాన్ జట్టుకు ఇదే తొలి విజయం కావడం విశేషం. ముల్తాన్‌లోనే జరిగిన తొలి టెస్టులో పాకిస్తాన్ భారీ స్కోరు చేసి కూడా ఇంగ్లండ్ చేతిలో పరాజయం పాలైంది. ఇరు జట్ల మధ్య నిర్ణయాత్మక మూడో టెస్టు గురువారం నుంచి రావల్పిండిలో ప్రారంభం కానుంది.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్: 366; **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** 291; **పాకిస్తాన్ రెండో ఇన్నింగ్స్:** 221; **ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** 144 ఆలౌట్ (33.3 ఓవర్లలో) (జో రూట్ 18, ఓలీ పోప్ 22, హ్యారీ బ్రూక్ 16, బెన్ స్టోక్స్ 37, బ్రైడన్ కార్స్ 27, నోమన్ అలీ 8/48, సాజిద్ ఖాన్ 2/93).

ఆ అద్భుతం సాధ్యమా!


సర్ఫరాజ్

బెంగళూరు: న్యూజిలాండ్ చేతిలో భారత జట్టు స్వదేశంలో టెస్టు మ్యాచ్ ఓడిపోయి 37 ఏళ్లు గడిచాయి. 1987లో చివరిసారి భారత జట్టుకు న్యూజిలాండ్ చేతిలో సొంతగడ్డపై పరాజయం ఎదురైంది. సుదీర్ఘ కాలం తర్వాత మరోసారి భారత జట్టుకు న్యూజిలాండ్ చేతిలో ఓటమి ముప్పు పొంచి ఉంది. అయితే పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటం ... క్రీజులోకి రావాల్సిన భారత బ్యాటర్లకు భారీ స్కోర్లు చేసే సత్తా ఉండటంతో అద్భుతం జరుగుతుందా అనే ఆశ అభిమానుల్లో ఉంది. ఎందుకంటే 2001లో కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులోనూ భారత జట్టు ఇలాగే ప్రత్యర్థికి తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని సమర్పించుకొని... ఆ తర్వాత తిరిగి పుంజుకుని విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో ఆసీస్‌కు 274 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో వీవీఎస్ లక్ష్మణ్, రాహుల్ ద్రవిడ్ అసాధారణ ఆటతీరుతో కంగారూల నుంచి మ్యాచ్‌ను లాగేసుకున్నారు. ఇప్పుడు తాజా మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్‌కు 356 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఇంత భారీ లోటును పూడ్చాలంటే... రెండో ఇన్నింగ్స్‌లో అద్భుతం జరగాల్సిందే. అలాంటి అరుదైన సందర్భానికి శుక్రవారం బ్యాటింగ్ చేసిన నలుగురు నాంది పలకగా... నాలుగో రోజు మిగిలిన వాళ్లు దాన్ని కొనసాగించాల్సి ఉంది. దేశవాళీల్లో సుదీర్ఘ ఇన్నింగ్స్‌లు ఆడిన అనుభవం ఉన్న సర్ఫరాజ్ ఖాన్‌తో పాటు రిషబ్ పంత్, కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ బ్యాటింగ్‌కు రావాల్సి ఉంది. అయితే కీపింగ్ చేస్తూ గాయపడ్డ పంత్ బ్యాటింగ్ చేయడంపై స్పష్టత లేదు. సొంతగడ్డపై పూర్తిస్థాయి బ్యాటర్ల కన్నా మంచి ఇన్నింగ్స్‌లు ఆడే ఆల్‌రౌండర్లు అశ్విన్, జడేజా రాణించాల్సిన అవసరం ఉంది. టీమిండియాకు కనీసం రెండొందల పరుగుల ఆధిక్యం దక్కితే తప్ప... బెంగళూరులో బౌలర్లు కూడా పెద్దగా చేయగలిగిందేమీ లేదు!

ఉత్తరాఖండ్ 313/8

● హైదరాబాద్‌తో రంజీ మ్యాచ్
● తనయ్ త్యాగరాజన్‌కు 3 వికెట్లు



తనయ్

డెహ్రాడూన్: బ్యాటర్లు రాణించడంతో హైదరాబాద్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ లీగ్ మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ తొలి రోజు ఆటలో తొలి ఇన్నింగ్స్‌లో 76 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 313 పరుగులు చేసింది. గ్రూప్ 'బి'లో భాగంగా జరుగుతున్న ఈ పోరులో ఓపెనర్ అవనీశ్ (131 బంతుల్లో 89; 9 ఫోర్లు, ఒక సిక్సర్), ఆదిత్య తారె (73 బంతుల్లో 69; 11 ఫోర్లు) అర్ధసెంచరీలతో రాణించారు. యువరాజ్ (49; 9 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. హైదరాబాద్ బౌలర్లలో తనయ్ త్యాగరాజన్ 3 వికెట్లు పడగొట్టగా... రోహిత్ రాయుడు రెండు వికెట్లు తీశాడు. సొంతగడ్డపై జరిగిన తొలి మ్యాచ్‌లో గుజరాత్ చేతిలో ఓడిన హైదరాబాద్... ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ప్రత్యర్థిని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. మిలింద్ బౌలింగ్‌లో ఉత్తరాఖండ్ ఓపెనర్ వైభవ్ భట్ (3) అవుట్ కావడంతో హైదరాబాద్ కెప్టెన్ రాహుల్ సింగ్ నిర్ణయం సరైనదే అనిపించింది. అయితే ఒక ఎండ్‌లో అవనీశ్ కుదురుకోగా... కెప్టెన్ రవికుమార్ సమర్థ్ (17), కునాల్ చండేలా (22), స్వప్నిల్ సింగ్ (0), ఆకాశ్ మధ్వాల్ (0) విఫలమయ్యారు. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోతున్న అవనీశ్, యువరాజ్, ఆదిత్య ఆకట్టుకోవడంతో ఉత్తరాఖండ్ మంచి స్కోరు చేయగలిగింది.

స్కోరు వివరాలు

ఉత్తరాఖండ్ తొలి ఇన్నింగ్స్: అవనీశ్ (సి) తన్మయ్ అగర్వాల్ (బి) తనయ్ త్యాగరాజన్ 89; వైభవ్ భట్ (ఎల్బీడబ్ల్యూ) మిలింద్ 3; రవికుమార్ సమర్థ్ (ఎల్బీడబ్ల్యూ) రక్షణ్ రెడ్డి 17; కునాల్ చండేలా (సి) రాహుల్ రాధేశ్ (బి) కార్తికేయ 22; యువరాజ్ (బి) రోహిత్ రాయుడు 49; ఆదిత్య తారె (బి) తనయ్ త్యాగరాజన్ 69; స్వప్నిల్ సింగ్ (బి) రోహిత్ రాయుడు 0; అభయ్ నేగీ (బ్యాటింగ్) 25; ఆకాశ్ మధ్వాల్ (ఎల్బీడబ్ల్యూ) తనయ్ త్యాగరాజన్ 0; దీపక్ ధాపోలా (బ్యాటింగ్) 28; ఎక్స్‌ట్రాలు 11, **మొత్తం (76 ఓవర్లలో 8 వికెట్లకు) 313. వికెట్ల పతనం:** 1–15, 2–55, 3–129, 4–155, 5–223, 6–223, 7–271, 8–271, **బౌలింగ్:** మిలింద్ 12–1–54–1; కార్తికేయ 13–2–48–1; రక్షణ్ రెడ్డి 13–1–47–1; తనయ్ త్యాగరాజన్ 21–2–83–3, అనికేత్ 11–0–54–0; రోహిత్ 6–0–16–2.


ఒమన్‌లో శుక్రవారం ఎమర్జింగ్ కప్ ఆసియా టి20 క్రికెట్ టోర్నమెంట్ మొదలైంది. ఈ సందర్భంగా విన్నర్స్ ట్రోఫీతో ఎనిమిది జట్ల కెప్టెన్‌లు. ఈ టోర్నీలో భారత 'ఎ' జట్టుకు హైదరాబాద్ క్రికెటర్ తిలక్ వర్మ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. నేడు జరిగే తమ తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్ షహీన్స్ జట్టుతో భారత 'ఎ' జట్టు ఆడుతుంది.

సింధు పరాజయం



ఒడెన్స్: డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత కథ ముగిసింది. బరిలో మిగిలిన స్టార్ ప్లేయర్ పీవీ సింధు క్వార్టర్ ఫైనల్ అడ్డంకిని అధిగమించలేకపోయింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 18వ ర్యాంకర్ సింధు 13–21, 21–16, 9–21తో ప్రపంచ 8వ ర్యాంకర్, పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత గ్రెగోరియా మరిస్కా టున్‌జుంగ్ (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయింది. 57 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు తొలి గేమ్‌ను కోల్పోయినా వెంటనే తేరుకొని రెండో గేమ్‌ను దక్కించుకుంది. అయితే నిర్ణయాత్మక మూడో గేమ్‌లో గ్రెగోరియా ధాటికి సింధు చేతులెత్తేసింది. గతంలో గ్రెగోరియాపై 10 సార్లు గెలిచిన సింధు మూడుసార్లు ఓటమిని మూటగట్టుకుంది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన సింధుకు 4,675 డాలర్ల (రూ. 3 లక్షల 92 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 6,050 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

సాయి సుదర్శన్ డబుల్ సెంచరీ



న్యూఢిల్లీ: ఢిల్లీ జట్టుతో శుక్రవారం మొదలైన రంజీ ట్రోఫీ గ్రూప్ 'డి' లీగ్ మ్యాచ్‌లో తమిళనాడు బ్యాటర్లు కదంతొక్కారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 88 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 379 పరుగులు సాధించింది. ఓపెనర్ సాయి సుదర్శన్ (259 బంతుల్లో 202 బ్యాటింగ్; 23 ఫోర్లు, 1 సిక్స్) అజేయ డబుల్ సెంచరీతో అలరించాడు. మరో ఓపెనర్ నారాయణ్ జగదీశన్ (101 బంతుల్లో 65; 5 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి సుదర్శన్ తొలి వికెట్‌కు 168 పరుగులు జోడించాడు. జగదీశన్ అవుటయ్యాక వచ్చిన వాషింగ్టన్ సుందర్ (170 బంతుల్లో 96 బ్యాటింగ్; 12 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి సుదర్శన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు.

రుత్విక జోడీ ఓటమి

కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నీలో తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో ఓటమి చవిచూసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో రుత్విక–రోహన్ కపూర్ (భారత్) ద్వయం 24–22, 16–21, 15–21తో టాప్ సీడ్ సువాన్ యి వు–చు యున్ యాంగ్ (చైనీస్ తైపీ) జంట చేతిలో పోరాడి ఓడిపోయింది. 62 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రుత్విక ద్వయం తొలి గేమ్‌ను గెల్చుకున్నా ఆ తర్వాత తడబడి మూల్యం చెల్లించుకుంది.





కబడ్డీ అభిమానుల హంగామా...



కార్తీక్ ఆర్యన్, విద్యా బాలన్

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ గత సీజన్‌లో ఫైనల్‌కు ఆతిథ్యం ఇచ్చిన గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం ఇప్పుడు తొలి దశ పోటీలకు వేదికగా మారింది. మొదటి రోజు స్టేడియంలో దాదాపు హౌస్‌ఫుల్‌తో కబడ్డీ అభిమానుల ఉత్సాహం బాగా కనిపించింది. తెలుగు టైటాన్స్ జట్టుకు భారీగా మద్దతు పలికిన ఫ్యాన్స్ బ్యాండ్ బాజాలతో సందడి చేశారు. మరో వైపు భూల్ భులయ్యా–3 సినిమా ప్రచారంలో భాగంగా స్టేడియానికి వచ్చిన నటీనటులు కార్తీక్ ఆర్యన్, విద్యాబాలన్ కూడా అభిమానులను ఉత్సాహపరుస్తూ సందడి చేశారు. సినిమాలో పాటకు ఆర్యన్ చేసిన డ్యాన్స్‌కు అభిమానులు పాదం కలిపి స్టేడియాన్ని హోరెత్తించారు.

గుజరాత్ 289/8

● ఆంధ్రతో రంజీ మ్యాచ్
● లలిత్ మోహన్‌కు మూడు వికెట్లు


లలిత్ మోహన్

అహ్మదాబాద్: ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో పరాజయం అనంతరం రెండో మ్యాచ్‌లో ఆంధ్ర బౌలర్లు రాణించారు. గ్రూప్ 'బి'లో భాగంగా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో శుక్రవారం గుజరాత్‌తో ప్రారంభమైన మ్యాచ్‌లో ఆంధ్ర బౌలర్లు సమష్టిగా సత్తా చాటారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 87 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది. మీడియం పేసర్ అర్జన్ నాగ్‌వాస్‌వాలా (72 బంతుల్లో 59 బ్యాటింగ్; 8 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధసెంచరీతో మెరిపించగా... వికెట్ కీపర్ ఉర్విల్ పటేల్ (53 బంతుల్లో 48; 4 ఫోర్లు, 3 సిక్సర్లు), మనన్ హింగ్రాజియా (48; 5 ఫోర్లు, ఒక సిక్సర్) రాణించారు. కెప్టెన్ చింతన్ గాజా (38 బ్యాటింగ్; ఒక ఫోర్), రిషి పటేల్ (26), ప్రియాంక్ పాంచాల్ (28), జైమీత్ పటేల్ (20) ఫర్వాలేదనిపించారు. ఆంధ్ర బౌలర్లలో లలిత్ మోహన్ 3, విజయ్ రెండు వికెట్లు పట్టగొట్టారు. శశికాంత్, నితీశ్ కుమార్ రెడ్డి, సత్యనారాయణ రాజు తలా ఒక వికెట్ దక్కించుకున్నారు. తొలి వికెట్‌కు రిషి పటేల్, ప్రియాంక్ 48 పరుగులు జతచేయగా... సత్యనారాయణ రాజు ఆంధ్ర జట్టుకు తొలి వికెట్ అందించాడు.అక్కడి నుంచి ఆంధ్ర బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లు పడగొడుతున్నా... గుజరాత్ బ్యాటర్లు మొండిగాపోరాడి మెరుగైన స్కోరు చేశారు. చింతన్ గాజాతో పాటు అర్జాన్ క్రీజులో ఉన్నారు.

స్కోరు వివరాలు

గుజరాత్ తొలి ఇన్నింగ్స్: రిషి పటేల్ (సి) శ్రీకర్ భరత్ (బి) శశికాంత్ 26; ప్రియాంక్ (సి) శ్రీకర్ భరత్ (బి) సత్యనారాయణ రాజు 28; మనన్ హింగ్రాజియా (సి) శ్రీకర్ భరత్ (బి) నితీశ్ కుమార్ రెడ్డి 48; ఉమంగ్ కుమార్ (సి) శ్రీకర్ భరత్ (బి) విజయ్ 15; జయ్‌మీత్ పటేల్ (బి) విజయ్ 20; ఉర్విల్ పటేల్ (సి) విజయ్ (బి) లలిత్ మోహన్ 48; చింతన్ గాజా (బ్యాటింగ్) 38; సిద్ధార్థ్ దేశాయ్ (బి) లలిత్ మోహన్ 0; రవి బిష్ణోయ్ (బి) లలిత్ మోహన్ 3; అర్జాన్ (బ్యాటింగ్) 59; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (87 ఓవర్లలో 8 వికెట్లకు) 289. వికెట్ల పతనం:** 1–48, 2–71, 3–106, 4–129, 5–159, 6–197, 7–199, 8–203. **బౌలింగ్:** శశికాంత్ 13–3–37–1; నితీశ్ కుమార్ రెడ్డి 9–2–33–1; లలిత్ మోహన్ 25–1–90–3; విజయ్ 28–5–84–2; సత్యనారాయణ రాజు 12–4–42–1.

స్వియాటెక్ కొత్త కోచ్‌గా విమ్ ఫిసెట్



● గతంలో పలువురు వరల్డ్ నంబర్‌వన్ క్రీడాకారిణులకు కోచ్‌గా ఉన్న ఫిసెట్
● సీజన్ ముగింపు టోర్నీలో బాధ్యతల స్వీకరణ

వాషింగ్టన్: మహిళల టెన్నిస్ ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) కొత్త కోచ్‌ను నియమించుకుంది. వచ్చే నెలలో సౌదీ అరేబియా వేదికగా జరగనున్న సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో విమ్ ఫిసెట్ మార్గనిర్దేశకత్వంలో స్వియాటెక్ బరిలోకి దిగనుంది. యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ క్వార్టర్ ఫైనల్ పరాజయం అనంతరం చైనా ఓపెన్, కొరియా ఓపెన్‌కు దూరంగా ఉన్న స్వియాటెక్... త్వరలో తిరిగి కోర్టులో అడుగు పెట్టనుంది. ప్రపంచ మాజీ నంబర్‌వన్ క్రీడాకారిణులు, గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలిచిన నయోమి ఒసాకా (జపాన్), సిమోనా హాలెప్ (రొమేనియా), అజరెంకా (బెలారస్), ఎంజెలిక్ కెర్బర్ (జర్మనీ) వంటి మేటి ప్లేయర్లకు కోచ్‌గా వ్యవహరించిన ఫిసెట్... ఇకపై స్వియాటెక్‌కు శిక్షణ ఇవ్వనున్నాడు. 'కొత్త అధ్యాయం ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నా. ప్రస్తుతం డబ్ల్యూటీఏ ఫైనల్స్ కోసం రెడీ అవుతున్నా. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా కొత్త కోచ్‌ను ఎంపిక చేసుకున్నా. ఫిసెట్‌తో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. అత్యుత్తమ ప్లేయర్లకు శిక్షణ ఇచ్చిన అనుభవం ఫిసెట్ సొంతం' అని స్వియాటెక్ శుక్రవారం వెల్లడించింది. సుదీర్ఘ కాలంగా విక్టరోస్కీ వద్ద శిక్షణ తీసుకున్న స్వియాటెక్ తొలిసారి విదేశీ కోచ్‌ను నియమించుకుంది. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన స్వియాటెక్ కెరీర్‌లో ఇప్పటి వరకు ఐదు గ్రాండ్‌స్లామ్స్ టోర్నీలలో విజేతగా నిలిచింది. అందులో యూఎస్ ఓపెన్ (2022), ఫ్రెంచ్ ఓపెన్ (2020, 2022, 2023, 2024) టైటిళ్లు ఉన్నాయి. ఈ ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో స్వియాటెక్ కాంస్య పతకం గెలుచుకుంది.



సెమీస్‌లో హుమేరా జంట

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ15 టోర్నీలో తెలంగాణ అమ్మాయి హుమేరా బహార్మస్ డబుల్స్ విభాగంలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం బెంగళూరులో జరిగిన డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో హుమేరా–పూజా ఇంగాలె (భారత్) ద్వయం 6–1, 6–1తో దిశా బెహెరా–అర్జాన్ ఖోరకివాలా (భారత్) జంటపై గెలిచింది. అంతకుముందు తొలి రౌండ్‌లో హుమేరా–పూజా 6–4, 6–0తో సమీక్ష (భారత్)–మిలె సిబుల్‌స్కయిటి (లిథువేనియా)లపై విజయం సాధించారు. మరో క్వార్టర్ ఫైనల్లో చిలకలపూడి శ్రావ్య శివాని (భారత్)–కరోలాన్ (ఫ్రాన్స్) ద్వయం 4–6, 1–6తో దివా భాటియా–సాయి సంహిత చామర్తి (భారత్) జంట చేతిలో ఓడిపోయింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో తెలంగాణ అమ్మాయి వేమూరి అభయ 3–6, 1–6తో ఆకాంక్ష (భారత్) చేతిలో పరాజయం పాలైంది.

ఈషా ఫౌండేషన్‌పై కేసు మూసివేత

న్యూఢిల్లీ: ఆధ్యాత్మిక గురువు జగ్గీ వాసుదేవ్‌కు చెందిన ఈషా ఫౌండేషన్‌కు సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించింది. ఇద్దరు మహిళలను అక్రమంగా నిర్బంధించినట్లు దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణను న్యాయస్థానం మూసివేసింది. తమిళనాడులోని కోయంబత్తూరులో ఈషా ఫౌండేషన్‌లో తన ఇద్దరు కుమార్తెలను నిర్బంధించారని, వారిని బలవంతంగా సన్యాసులుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ ఓ వ్యక్తి తొలుత తమిళనాడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశాడు. తన బిడ్డలకు విముక్తి కల్పించి, తనకు అప్పగించాలని కోరాడు. దీనిపై స్పందించిన తమిళనాడు హైకోర్టు ఈషా ఫౌండేషన్‌పై దర్యాప్తు జరపాలని పోలీసులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఈషా ఫౌండేషన్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో తమిళనాడు హైకోర్టులోని హెబియస్ కార్పస్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు అప్పట్లో తనకు బదిలీ చేసుకుంది. హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. ఈషా ఫౌండేషన్‌పై విచారణ జరపొద్దని ఆదేశించింది. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ ఇద్దరు కుమార్తెలు మేజర్లేనని గుర్తించింది. వారు ఈషా ఫౌండేషన్ ఆశ్రమంలో ఇష్టపూర్వకంగానే ఉంటున్నారని, వారిపై ఎలాంటి ఒత్తిడి లేదని స్పష్టంచేసింది. హెబియస్ కార్పస్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు వెల్లడించింది. ఈ కేసులో ఇకపై తదుపరి ఆదేశాలు అవసరం లేదని స్పష్టం చేసింది. కాగా, పిటిషనర్ ఇద్దరు కుమార్తెల్లో ఒకరు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సుప్రీంకోర్టు ఎదుట విచారణకు హాజరయ్యారు.

500 మంది సైనికుల మృతదేహాలు..

ఉక్రెయిన్‌కు అప్పగించిన రష్యా

కీవ్: రష్యా శుక్రవారం 501 మంది ఉక్రెయిన్ సైనికుల మృతదేహాలను ఆ దేశానికి అప్పగించింది. 2022 ఫిబ్రవరిలో రష్యా ఆక్రమణ మొదలయ్యాక ఇంత పెద్ద సంఖ్యలో సైనికుల మృతదేహాలను అప్పగించడం ఇదే మొదటిసారని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. డొనెట్స్క్‌లోని అవ్‌డివ్కాపై పట్టుకోసం రష్యా ఆర్మీతో జరిగిన పోరులో వీరంతా వీరమరణం పొందారని వెల్లడించారు. మృతులను అధికారులు గుర్తించాక కుటుంబసభ్యులకు అప్పగిస్తామన్నారు. ఇలా ఉండగా, గురువారం రాత్రి తమ భూభాగంపైకి రష్యా ఏకంగా 135 షహీద్ తదితర డ్రోన్లను ప్రయోగించిందని ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. చాలా వరకు డ్రోన్లను కూల్చివేశామని పేర్కొంది. నష్టం, మృతుల వివరాలను మాత్రం తెలపలేదు.



డ్రాగన్‌లో టిబోర్ కపు, శుభాన్షు శుక్లా, పెగ్గీ వాట్సన్, సహోజ్ ఉజ్నన్స్కీ

శుభాన్షు శుక్లా... ఎంటర్ ద 'డ్రాగన్'

స్పేస్ ఎక్స్ వ్యోమనౌకలో భారత వ్యోమగామి

ప్రతిష్టాత్మక ఆక్సియం స్పేస్ ఏఎక్స్–4 మిషన్‌కు ఎంపికైన భారత వ్యోమగామి, వైమానిక దళ గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా తాము ప్రయాణించబోయే అత్యాధునిక డ్రాగన్ వ్యోమనౌకను తొలిసారి సందర్శించారు. అమెరికాలో హూస్టన్‌లోని స్పేస్ ఎక్స్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మిగతా ముగ్గురు సిబ్బందిని ముఖాముఖి కలుసుకున్నారు. వారంతా కలిసి వ్యోమనౌకలో కాసేపు గడిపారు. స్పేస్ సూట్‌కు కొలతలివ్వడంతో పాటు ప్రెజరైజేషన్ తదితర తప్పనిసరి పరీక్షల్లో వారంతా పాల్గొన్నారు. దీంతో వారందరికీ శిక్షణ ప్రక్రియ లాంఛనంగా మొదలైనట్టయింది. ఈ మిషన్‌కు నాసా వ్యోమగామి పెగీ వాట్సన్ సారథ్యం వహించనున్నారు. ఇందులో భాగంగా వారు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో 10 రోజుల పాటు పలు ప్రయోగాలు, పరిశోధనల్లో గడుపుతారు. ప్రైవేట్ వ్యక్తులు, పరిశోధకులకు ఐఎస్ఎస్ సందర్శనకు వీలు కల్పించేందుకు స్పేస్ ఎక్స్ తలపెట్టిన నవతరం వాణిజ్య అంతరిక్ష యాత్రల్లో ఆక్సియం స్పేస్ మిషన్ నాలుగోది. ఆక్సియం స్పేస్, స్పేస్ ఎక్స్, నాసా భాగస్వామ్యంతో ఈ ప్రయోగం జరుగుతోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్



కలుషితాలతో నురగమయంగా యమునా జలం

హస్తినలో యమునా తీరం..

కాలుష్య కాసారం!

చూసేందుకు పాల నురగలా తళతళా మెరిసిపోతూ కన్పిస్తోంది కదూ! కానీ ఇదంతా దేశ రాజధానిలో యమునా నదిని నిలువెల్లా కబళించిన కాలుష్యం తాలూకు నురగ! ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఈ నురగలో అమోనియా, పాస్పేట్ వంటివి ప్రమాదకర పాళ్లలో ఉన్నట్టు నిపుణులు తేల్చారు. ఇది శ్వాసతో పాటు పలురకాలైన చర్మ సమస్యలకు దారి తీస్తుందని వివరించారు. యమునలో కాలుష్యం కొంతకాలంగా ప్రమాదకర స్థాయికి పెరిగిపోతున్నా వర్షాకాలంలో ఈ స్థాయి నురగను ఎప్పుడూ చూడలేదంటూ స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. ఢిల్లీ పొడవునా యమునలో కాలుష్యానికి ప్రధాన కారకాలుగా నిలుస్తున్న 13 హాట్‌స్పాట్లను గుర్తించినట్టు రాష్ట్ర పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్ చెప్పారు. దుమ్ము, ధూళితో పాటు నురగను నియంత్రించేందుకు 80 చోట్ల యాంటీ స్మాగ్ గన్స్ మోహరిస్తామన్నారు. కానీ మాటలే తప్ప యమునలో కాలుష్యాన్ని అరికట్టేందుకు ఆప్ ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదంటూ బీజేపీ విమర్శలు గుప్పిస్తోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్



కీమోథెరపీ సందర్భంగా జుట్టు రాలకుండా అరికట్టే హెల్మెట్ లిలీ

క్యాన్సర్ చికిత్సలో జుట్టుకు శ్రీరామరక్ష

ఈ 'హెల్మెట్' ధరిస్తే చాలు | ఐరిష్ స్టార్టప్ రూపకల్పన | ఏడాదిలో అందుబాటులోకి

క్యాన్సర్ చికిత్సలో కీమోథెరపీ అక్షరాలా నరకప్రాయం. శరీరమంతటినీ నిస్తేజంగా మార్చేస్తుంది. పైగా దాని సైడ్ ఎఫెక్టులు అన్నీ ఇన్నీ కావు. వాటిలో ముఖ్యమైనది జుట్టు రాలడం. కనీసం 65 శాతానికి పైగా రోగుల్లో ఇది పరిపాటి. రొమ్ము క్యాన్సర్ బాధితుల్లోనైతే చికిత్స క్రమంలో దాదాపు అందరికీ జుట్టు పూర్తిగా రాలిపోతుంటుంది. ఈ బాధలు పడలేక కీమోథెరపీకి నిరాకరించే వాళ్లు కూడా ఉంటారు. అలాంటి వాళ్లందరికీ ఇది శుభవార్తే. కీమోథెరపీ సందర్భంగా హెల్మెట్ వంటి ఈ హెడ్‌గేర్ ధరిస్తే చాలు. జుట్టు రాలదు గాక రాలదు!

స్కాల్ప్ కూలింగ్ టెక్నాలజీ

ఐర్లండ్‌కు చెందిన ల్యూమినేట్ అనే స్టార్టప్ కంపెనీ ఈ వినూత్న హెల్మెట్‌ను తయారు చేసింది. దీన్ని స్కాల్ప్ కూలింగ్ టెక్నాలజీగా పిలుస్తున్నారు. చికిత్స జరుగుతున్నంతసేపూ రోగి ఈ హెడ్‌గేర్ ధరిస్తాడు. దాన్ని ఓ యంత్రానికి అనుసంధానిస్తారు. దానిగుండా తల మొత్తానికీ చల్లని ద్రవం వంటిది సరఫరా అవుతూ ఉంటుంది. అది తలలోని జుట్టు కుదుళ్లకు రక్త సరఫరాను బాగా తగ్గిస్తుంది. తద్వారా ఆ ప్రాంతానికి చేరే క్యాన్సర్ ఔషధాల పరిమాణం చాలావరకు తగ్గుతుంది. దాంతో వాటి దుష్ప్రభావం జుట్టుపై పడదు. కనుక అది ఊడకుండా ఉంటుంది. ''ఈ హెడ్‌గేర్‌ను ఇప్పటికే యూరప్‌లో ప్రయోగాత్మకంగా పరీక్షించగా 75 శాతానికి పైగా రోగుల్లో జుట్టు ఏ మాత్రమూ ఊడలేదు. మిగతా వారిలోనూ జుట్టు ఊడటం 50 శాతానికి పైగా తగ్గింది. రొమ్ము క్యాన్సర్ రోగుల్లోనైతే 12 సెషన్ల కీమో థెరపీ అనంతరం కూడా జుట్టు దాదాపుగా పూర్తిగా నిలిచి ఉండటం విశేషం'' అని కంపెనీ సీఈవో ఆరన్ హానస్ చెప్పారు. అంతేగాక వారిలో ఎవరికీ దీనివల్ల సైడ్ ఎఫెక్టులు కన్పించలేదన్నారు. రొమ్ము క్యాన్సర్ చికిత్స వల్ల జుట్టంతా పోగొట్టుకున్న ఓ యువతిని చూసి ఆయన చలించిపోయారట. ఆ బాధలోంచి పుడు పోసుకున్న ఈ హెల్మెట్‌కు లిలీ అని పేరు కూడా పెట్టారు! వచ్చే ఏడాది యూరప్, అమెరికాల్లో దీని క్లినికల్ ట్రయల్స్ మొదలు పెట్టనున్నారు. అవి విజయవంతం కాగానే తొలుత యూఎస్ మార్కెట్లో ఈ హెల్మెట్‌ను అందుబాటులోకి తెస్తారట. దీనికి క్యాన్సర్ రోగుల నుంచి విశేషమైన ఆదరణ దక్కడం ఖాయమంటున్నారు.

లోపాలూ లేకపోలేదు

అయితే ఈ స్కాల్ప్ కూలింగ్ టెక్నాలజీలో కొన్ని లోపాలూ లేకపోలేదు. కీమో సెషన్ జరిగినప్పుడల్లా చికిత్సకు ముందు, సెషన్ సందర్భంగా, ముగిశాక హెడ్‌గేర్ థెరపీ చేయించుకోవాలి. ఇందుకు కీమోపై వెచ్చించే దానికంటే కనీసం రెండు మూడు రెట్ల సమయం పడుతుందని హానస్ వివరించారు. ముఖ్యంగా చికిత్స పూర్తయిన వెంటనే హెల్మెట్‌ను కనీసం 90 నిమిషాల పాటు ధరించాల్సి ఉంటుందని చెప్పారు. పైగా దీనివల్ల తలంతా చెప్పలేనంత చల్లదనం వ్యాపిస్తుంది. ఇలాంటి లోటుపాట్లను అధిగమించే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నట్టు హానస్ చెప్పారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కేసుల పరిష్కారానికి గడువు పెట్టలేం

పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: దేశంలోని అన్ని కోర్టుల్లో కేసులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేలా ఆదేశాలివ్వాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఇది అమెరికా సుప్రీంకోర్టు కాదని వ్యాఖ్యానించింది. అలా గడువు పెట్టలేమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టుతో సహా దేశంలోని అన్ని కోర్టుల్లో దాఖలయ్యే కేసులను 12 నుంచి 36 నెలల్లోగా పరిష్కరించేలా ఆదేశాలివ్వాలని పిటిషనర్ కోరారు. విదేశాల్లో కేసుల పరిష్కారానికి నిర్దిష్ట గడువు ఉన్న విషయాన్ని పిటిషనర్ ఎత్తిచూపగా.. 'మాది అమెరికా సుప్రీంకోర్టు కాదు' అని సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టులో అన్ని కేసుల్లోనూ 12 నెలల్లో విచారణా పూర్తికావాలని కోరుకుంటున్నారా? అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఇది అత్యంత అభిలషణీయమైనా.. ఆచరణసాధ్యం కాదని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం, జడ్జిల సంఖ్య పెంచడం.. లాంటివెన్నో అవసరమవుతాయన్నారు. అమెరికా, ఇతర పాశ్చాత్యదేశాల్లో ఒక ఏడాదిలో సుప్రీంకోర్టులు ఎన్ని కేసులు పరిష్కరిస్తాయో మీకు తెలుసా? అని పిటిషనర్‌ను అడిగారు. కొన్ని పాశ్చాత్యదేశాల సుప్రీంకోర్టులు ఏడాది మొత్తం పరిష్కరించే కేసుల కంటే భారత సుప్రీంకోర్టు ఒక్కరోజు వినే కేసులే ఎక్కువన్నారు. భారత్‌లో అందరికీ న్యాయం పొందే అవకాశాన్ని మన వ్యవస్థ కల్పిస్తోందని, ఎవరినీ అడ్డుకోలేమని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు.

ఏడాదికి రెండుసార్లు ఎన్‌డీఏ భేటీ: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: చండీగఢ్‌లో గురువారం నాటి ఎన్‌డీఏ నేతల భేటీని దేశంలో 1975లో అత్యవసర పరిస్థితి విధించిన తర్వాత జరిగిన కాంగ్రెసేతర పక్షాల నేతల అతిపెద్ద సమావేశంగా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఇటువంటి సమావేశాలు ఏడాదిలో రెండు పర్యాయాలు జరగాలని ఆయన అన్నారు. ఇందుకు సంబంధించి బీజేపీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కాంగ్రెస్ నేతృత్వంలోని గత యూపీఏ ప్రభుత్వంతో పోల్చుకుంటే తమ ప్రభుత్వం ప్రజలతో ఎక్కువగా మమేకమైపోయిందని తెలిపారు. గత పదేళ్లలో దేశ ప్రజల నుంచి తనకు ఏకంగా 4.5 కోట్ల ఉత్తరాలు అందాయని చెప్పారు. 2004–14 సంవత్సరాల మధ్య యూపీఏ హయాంలో పదేళ్లలో ప్రధాని మన్మోహన్ సింగ్‌కు దేశ ప్రజల నుంచి అందిన ఉత్తరాలు కేవలం 5 లక్షలు మాత్రమేనని చెప్పారు. దీన్నిబట్టే తమ ప్రభుత్వంపై ప్రజలకున్న నమ్మకాన్ని అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. గురువారం చండీగఢ్‌లో జరిగిన భేటీకి బీజేపీ, మిత్ర పక్షాలకు చెందిన 17 మంది సీఎంలు, 18 మంది డిప్యూటీ సీఎంలు హాజరయ్యారని ప్రధాని మోదీ తెలిపారు. పాలన సజావుగా, పారదర్శకంగా సాగేందుకు ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాలకు పెట్టుబడులను ఎక్కువగా ఆకర్షించేందుకు ఇటువంటి సమావేశాలు దోహద పడతాయని చెప్పారు. అన్ని ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాల మంత్రులు, ఎమ్మెల్యేల చర్చలు, సంభాషణలు ఎక్కువగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజానుకూల సుపరిపాలన అందించేందుకు సోషల్ మీడియాను ఉపయోగించుకోవాలని ప్రధాని సూచించారని ఆ ప్రకటనలో బీజేపీ వివరించింది.

ముడాలో ఈడీ తనిఖీలు

బనశంకరి: మైసూరు నగరాభివృద్ధి ప్రాధికారసంస్థ(ముడా)లో ఇళ్ల స్థలాల కేటాయింపులో సీఎం సిద్దరామయ్యపై నమోదైన కేసు దర్యాప్తులో ఈడీ వేగం పెంచింది. శుక్రవారం సీఆర్‌పీఎఫ్ భద్రత మధ్య 12 మంది అధికారుల ఈడీ బృందం మైసూరులోని ముడా కార్యాలయంలో సోదాలు నిర్వహించింది. కుంభకోణానికి సంబంధించిన ఆధారాలివ్వాలని ఈడీ గతంలో ముడాకు సమన్లు జారీచేసింది. కానీ, అధికారులు స్పందించలేదని సమాచారం. శుక్రవారం ముడా కార్యాలయం, మైసూరు తహసీల్దార్ కార్యాలయంతోపాటు ముడా కేసులో ఏ–4గా ఉన్న కెంగేరిలోని దేవరాజు నివాసంలోనూ తనిఖీలు జరిగాయి. ముడా కార్యదర్శి ప్రసన్న కుమార్ నుంచి వివరాలు సేకరించారు. సీఎంకు, ఆయన కుటుంబసభ్యులకు సంబంధించిన ప్రాంతాలపై దాడులు చేయలేదని ఈడీ వర్గాలు తెలిపాయి. ముడాలో సీఎం సిద్దరామయ్య భార్య పార్వతికి రూ.కోట్ల విలువైన 14 స్థలాలు అక్రమంగా కట్టబెట్టారంటూ వచ్చిన ఆరోపణలపై విచారణకు గవర్నర్ ఆమోదం తెలపడం తెలిసిందే. ఈ మేరకు లోకాయుక్త సీఎంపై కేసు నమోదు చేసింది. ఇందులో సీఎం ఏ–1గా ఉన్నారు. ఆరోపణల నేపథ్యంలో సీఎం భార్య తనకు కేటాయించిన స్థలాలను ముడాకు తిరిగి ఇచ్చేయడం తెలిసిందే. ఈడీ సోదాలపై డిప్యూటీ సీఎం, రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ డీకే శివకుమార్ స్పందించారు. 'కేసుకు సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు, అవసరమైన పత్రాలు తీసుకెళ్లేందుకు మాత్రమే ఈడీ అధికారులు వచ్చారు. వాళ్లు అడిగినవి సమకూరుస్తారు. ఇందులో అన్యాయం ఎక్కడుంది? దీనిని ఈడీ దాడి అని ఎలా అంటారు?' అని ప్రశ్నించారు.

తైవాన్‌తో దౌత్య సంబంధాలు పెట్టుకోవద్దు

టీఈసీసీపై భారత్‌కు చైనా అభ్యంతరం

న్యూఢిల్లీ: ముంబైలో తైపీ ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్(టీఈసీసీ) కార్యాలయాన్ని తైవాన్ ప్రారంభించడంపై డ్రాగన్ దేశం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇటువంటివి భారత్–చైనాల సంబంధాలకు విఘాతం కలిగిస్తాయని తెలిపింది. రెండు దేశాల మధ్య సంబంధాలు సజావుగా సాగాలంటే తైవాన్‌తో ఏవిధమైన సంబంధాలు పెట్టుకోరాదని భారత్‌ను కోరింది. ఈ మేరకు శుక్రవారం దౌత్యపరమైన నిరసన తెలిపింది. గతంలో ఇచ్చిన హామీపై ఒకే చైనా విధానానికి విధిగా కట్టుబడి ఉండాలని భారత్‌ను కోరింది. తైవాన్ తమ దేశంలో విడదీయరాని భాగమని స్పష్టం చేసింది. తైవాన్, భారత్‌లు పరస్పరం ప్రతినిధి కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవడం సహా అధికారికంగా ఎటువంటి ఉత్తరప్రత్యుత్తరాలు జరపరాదంది. తైవాన్‌కు సంబంధించిన వ్యవహారాలను తగు మార్గంలో నిర్వహించుకోవాలని పేర్కొంది. కాగా, టీఈసీసీకి భారత్‌లో ఇప్పటికే ఢిల్లీ, చెన్నైల్లో కార్యాలయాలున్నాయి.

ఉజ్జయిని మహాకాల్ గర్భగుడిలోకి షిండే కుమారుడి ప్రవేశంపై వివాదం

ఉజ్జయిని/ముంబై: మధ్యప్రదేశ్ రాష్ట్రం ఉజ్జయినిలో మహాకాళేశ్వర్ ఆలయం గర్భగుడిలోకి మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే ప్రవేశించడంపై వివాదం చెలరేగింది. గర్భగుడిలోకి ఇతరులు ప్రవేశించడంపై ఏడాదిగా నిషేధం కొనసాగుతోంది. కల్యాణ్ ఎంపీ కూడా అయిన శ్రీకాంత్, ఆయన భార్య, మరో ఇద్దరు గురువారం సాయంత్రం గర్భగుడిలో పూజలు చేశారని ఆలయ వర్గాలు తెలిపాయి. వీరు పూజలు చేస్తున్నవీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. సాధారణ దర్శనం కోసం ప్రజలు గంటలకొద్దీ క్యూల్లో పడిగాపులు కాస్తుండగా, వీఐపీలను మాత్రం నిషేధం ఉన్నా ఏకంగా గర్భగుడిలోకి ఎలా పంపిస్తారని ప్రతిపక్ష కాంగ్రెస్ నిలదీసింది. అయితే, శ్రీకాంత్ షిండేను గర్భగుడిలోకి అనుమతించడం నిబంధనలకు విరుద్ధమేనని ఆలయ కమిటీ చైర్మన్, ఉజ్జయిన కలెక్టర్ నీరజ్ కుమార్ సింగ్ తెలిపారు. బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు.

చిన్నారిపై స్కూల్ స్వీపర్ అఘాయిత్యం

నోయిడా: కామంతో కళ్లు మూసుకుపోయిన పనిమనిషి స్కూల్‌లోనే మూడేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దారుణాన్ని బయటకు రాకుండా దాచినందుకు క్లాస్ టీచర్‌తోపాటు, స్కూల్ సూపర్‌వైజర్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఘటన చోటుచేసుకుంది. స్కూలు నుంచి ఇంటికొచ్చాక కొద్ది రోజులుగా బాధిత చిన్నారి ముభావంగా ఉండటాన్ని ఆమె తల్లిదండ్రులు గమనించారు. ఆమెను ప్రశ్నించగా అసలు విషయం తెలిపింది. తమ స్కూల్‌లో పనిచేసే స్వీపర్ కొద్ది రోజులుగా తనను ఎవరూ చూడని చోటుకు తీసుకెళ్లి ప్రైవేట్ భాగాలను తాకుతున్నట్లు తెలిపింది. షాకైన తల్లిదండ్రులు..అక్టోబర్ 10వ తేదీన సెక్టార్–20 పోలీస్ స్టేషన్‌లో ఈ విషయం ఫిర్యాదు చేశారు. పోలీసులు స్కూల్ స్వీపర్ నిత్యానంద్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిథారి గ్రామానికి చెందిన నిత్యానందే ఈ దారుణానికి పాల్పడినట్లు తేలింది. ఈ విషయం తెలిసినా, దాచేందుకు ప్రయత్నించిన బాధిత చిన్నారి క్లాస్ టీచర్, స్కూల్ సూపర్‌వైజర్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.

దృష్టి మరల్చేందుకే..

నిజ్జర్ హత్య తెరపైకి

కెనడా విపక్షనేత బెర్నియర్

ఒట్టావా: ఇతర వివాదాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యోదంతాన్ని తెరపైకి తెచ్చి భారత్‌పై ఆరోపణలు చేస్తున్నారని కెనడా విపక్షనేత మాక్సిమ్ బెర్నియర్ అన్నారు. గతంలో జరిగిన తప్పిదాన్ని సరిచేసుకోవాలంటే మరణానంతరం నిజ్జర్ పౌరసత్వాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. నిజ్జర్ హత్యలో భారత రాయబారి ప్రమేయముందని ట్రూడో ఆరోపించడం, పరస్పర దౌత్యవేత్తల బహిష్కరణతో భారత్–కెనడా సంబంధాలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈ వివాదానికి కేంద్రబిందువైన నిజ్జర్ విదేశీ ఉగ్రవాది అని, అతనికి 2007లో కెనడా పౌరసత్వం లభించిందని పీపుల్స్ పార్టీ ఆఫ్ కెనడా నేత బెర్నియర్ అన్నారు. కెనడా గడ్డపై భారత రాయబార సిబ్బంది నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడుతున్నారనేది నిజమైతే.. అది చాలా తీవ్రమైన విషయమని, తగుచర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కానీ ఇప్పటిదాకా భారత్ ప్రమేయంపై ఎలాంటి ఆధారాలను ప్రభుత్వం బయటపెట్టలేదని, ఇతర వివాదాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి ట్రూడో నిజ్జర్ హత్యను వాడుకుంటున్నారని సుస్పష్టంగా కనపడుతోందన్నారు. నిజ్జర్ విదేశీ ఉగ్రవాది అని, 1997 నుంచి పలుమార్లు తప్పుడు పత్రాలతో కెనడా పౌరసత్వాన్ని పొందడానికి ప్రయత్నించాడని అన్నారు. పలుమారు తిరస్కరణకు గురైనా మొత్తానికి 2007 పౌరసత్వం దక్కించుకున్నాడని తెలిపారు. నిజ్జర్ కెనడా పౌరుడు కాదని, అధికారిక తప్పిదాన్ని సరిచేసుకోవడానికి వీలుగా.. మరణానంతరం అతని పౌరసత్వాన్ని రద్దు చేయాలని బెర్నియర్ డిమాండ్ చేశారు. అతని దరఖాస్తు తిరస్కరణకు గురైన మొదటిసారే నిజ్జర్‌ను వెనక్కిపంపాల్సిందన్నారు.

'చచ్చి' బతికాడు!

అవయవ దానం చేసిన 'బ్రెయిన్‌డెడ్' రోగి
- శరీరాన్ని కోయబోతుండగా కళ్లు తెరిచిన వైనం
- మూడేళ్లుగా దాచి ఉంచిన ఆస్పత్రి వర్గాలు
- అమెరికాలో కలకలం రేపుతున్న ఘటన

అమెరికాలోని కెంటకీలో థామస్ హూవర్ అనే 36 ఏళ్ల వ్యక్తి డ్రగ్ ఓవర్ డోస్ వల్ల గుండెపోటుకు గురయ్యాడు. హుటాహుటిన బాప్టిస్ట్ హెల్త్ రిచ్‌మండ్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే బ్రెయిన్ డెడ్ అయ్యాడు. అతనిక బతికి బట్ట కట్టడం కల్లేనని వైద్యులు తేల్చారు. అవయవ దానం చేసి ఉండటంతో ముందుగా గుండెను సేకరించాలని నిర్ణయించారు. ఆపరేషన్ టేబుల్‌పైకి తీసుకెళ్లి సరిగ్గా కత్తులూ, కటార్లకు పని చెప్పబోయే సమయానికి మనవాడు ఉన్నట్టుండి కళ్లు తెరిచాడు! కాళ్లూ చేతులూ కదిలించేందుకు ప్రయత్నించాడు. తన పరిస్థితి అర్థమై కన్నీరు పెట్టుకున్నాడు. ఇదంతా చూసి డాక్టర్లంతా దిమ్మెరపోయారు. దాంతో అవయవ సేకరణ ప్రయత్నాలకు స్వస్తి చెప్పారు. ఇది 2021 అక్టోబర్‌లో జరిగితే ఆస్పత్రి వర్గాలు మాత్రం వెలుగులోకి రానివ్వలేదు. కనీసం హూవర్ కుటుంబీకులకు కూడా సమాచరమివ్వలేదు. పైగా అతనిలో కనిపిస్తున్న ప్రాణ లక్షణాలను పట్టించుకోకుండా అవయవాలను సేకరించాల్సిందిగా డాక్టర్లపై ఒత్తిడి తెచ్చాయి. వారు నిరాకరించడంతో వేరే వైద్యులను నియోగిస్తే వాళ్లు కూడా చేతులెత్తేశారు. దీనికి ప్రత్యక్ష సాక్షి అయిన ఆస్పత్రి మాజీ ఉద్యోగి ఒకరు గత జనవరిలో హూవర్ సోదరి డోనాకు విషయం చేరవేయడంతో ఇదంతా వెలుగులోకి వచ్చింది. చివరికి వైద్యుల సలహా మేరకు అతన్ని ఇంటికి తీసుకెళ్లిందామె. హూవర్ బహుశా ఇంకెంతో కాలం బతక్కపోవచ్చన్న డాక్టర్ల అంచనాలను వమ్ము చేస్తూ సోదరి సంరక్షణలో అతను చాలావరకు కోలుకున్నాడు. ఈ ఉదంతం ఇప్పుడు కెంటకీలో టాక్ ఆఫ్ ద టౌన్‌గా మారింది. కెంటకీ అటార్నీ జనరల్ కార్యాలయం దీనిపై విచారణ కూడా జరుపుతోంది.



- సాక్షి, నేషనల్ డెస్క్

మొదటి అధ్యక్షురాలి

అవకాశం మీకే!

చుక్ షుమర్‌పై జోకులు పేల్చిన ట్రంప్

న్యూయార్క్: అమెరికా సెనేట్ మెజారిటీ నేత చుక్ షుమర్‌తోపాటు డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హ్యారిస్‌పై రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ జోకులు పేల్చారు. గురువారం న్యూయార్క్‌లో జరిగిన అల్ స్మిత్ మెమోరియల్ డిన్నర్‌కు హాజరైన ట్రంప్..కమలా హ్యారిస్ నెగ్గకుంటే మొదటి అధ్యక్షురాలిగా ఎన్నికయ్యే అవకాశం మీకే వస్తుందంటూ షుమర్‌ను ఆటపట్టించారు. పలువురు ప్రముఖులు హాజరయ్యే ఈ కార్యక్రమంలో అధ్యక్ష ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు వచ్చి సరదాగా పట్టించుకుంటారు. ఇలా అందే విరాళాలు కేథలిక్ చారిటీలకు వెళ్తుంటాయి. అయితే, ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న కమలా హారిస్ రాలేదు. బదులుగా చుక్ షుమర్ వచ్చారు. వేదికపై ట్రంప్‌కు సమీపంలోనే ఆయన కూడా ఉన్నారు. 'షుమర్ చాలా డల్‌గా కనిపిస్తున్నారు. మరో కోణం కూడా చూడాలి. వాళ్ల పార్టీ చాలా చురుగ్గా తయారైంది. కమల అవకాశం కోల్పోతే, మొదటి అధ్యక్షురాలయ్యే అవకాశం మీకే వచ్చే అవకాశముంది'అని షుమర్‌నుద్దేశించి ట్రంప్ బిగ్గరగా అనడంతో హాలంతా నవ్వులతో నిండిపోయింది. ఈసారి కమలా హారిస్ లక్ష్యంగా ట్రంప్.. 'నా ప్రత్యర్థి ఈ కార్యక్రమానికి రావల్సిన అవసరం లేదని భావించినట్లున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆమె తీవ్రంగా అవమానించారు. గతంలో 1984లో వాల్టర్ మొండెల్ మాత్రమే ఇలా చేశారు. అప్పట్లో ఆయన రొనాల్డ్ రీగన్ చేతిలో ఓడిపోయారు'అంటూ వ్యాఖ్యానించారు.దీనిపై అనంతరం కమల తనదైన శైలిలో స్పందించారు. 'సహాయకుడు రాసిచ్చిన జోకుల్ని చదివేందుకే అవస్థలు పడ్డ ట్రంప్.. టెలీ ప్రాంప్టర్‌ను లోపలికి అనుమతించలేదంటూ ప్రశ్నించారు. తను అనుకుంటున్న జోకులకు ప్రేక్షకులు నవ్వలేదని ఫిర్యాదులు చేస్తున్నారు. ఆ జోకులు ఎవరికైనా అర్థమవుతాయా? ట్రంప్ మాట్లాడింది ఒక్క ముక్క కూడా అర్థం కాదు'అంటూ చురకలు అంటించారు. అనంతరం సోషల్ మీడియాలో ట్రంప్ జోకులపై మిశ్రమ స్పందన వచ్చింది.

రష్యాకు ఉత్తర కొరియా సైనిక సాయం

ఇప్పటికే 1,500 మంది సైనికులను పంపిన ఉత్తర కొరియా

మొత్తం 12 వేల మందిని పంపొచ్చని అంచనా

సియోల్: ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యాకు ఉత్తర కొరియా సైనిక సాయం చేస్తోంది. ఇప్పటికే 1,500 మంది సైనికులను రష్యాకు పంపిందని దక్షిణ కొరియా నిఘా సంస్థ 'నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీసు (ఎన్ఐఎస్) శుక్రవారం వెల్లడించింది. స్పెషల్ ఆపరేషన్ ఫోర్సెస్‌కు చెందిన 1,500 సైనికులను ఈనెల 8 నుంచి 13 వరకు రష్యాకు పంపిందని తెలిపింది. రష్యా తీరప్రాంత నగరం వ్లాదివోస్టోక్‌కు వీరు చేరుకున్నారని పేర్కొంది. ఉత్తరకొరియా సైనికులకు రష్యా సైనిక దుస్తులను ఇచ్చారని, ఆయుధాలను అందజేశారని, నకిలీ ధ్రువపత్రాలను సమకూర్చారని ఎన్ఐఎస్ వెల్లడించింది. ఉత్తర కొరియా మరింత మంది సైనికులను రష్యాకు పంపనుందని వివరించింది. నిఘా సమాచారం మేరకు 10 వేల మంది ఉత్తరకొరియా సైనికులు రష్యా తరపున యుద్ధంలో పాల్గొననున్నట్లు తనకు తెలిసిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ గురువారం ప్రకటించడం గమనార్హం. ఉత్తరకొరియా మొత్తం 12 వేల మందిని కదనరంగానికి పంపనుందని దక్షిణకొరియా మీడియా తెలిపింది. ఉత్తరకొరియా చోంగ్‌జిన్ పోర్టులో రష్యా నావికాదళం నౌకలు మోహరించడం, ఉసురియిస్క్, ఖబరోస్క్‌లలో ఉత్తరకొరియా సైనికులు గుమిగూడిన ఉపగ్రహ చిత్రాలను ఎన్ఐఎస్ తమ వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. విదేశీయుద్ధంలో ఉత్తరకొరియా నేరుగా పాల్గొనడం ఇదే తొలిసారి. ప్రపంచంలోనే అతిపెద్ద సైనిక బలగాల్లో ఉత్తరకొరియా ఒకటి. మొత్తం 12 లక్షల మంది సైన్యం ఉంది. ఈ ఏడాది జూన్‌లో ఉత్తరకొరియా అధ్యక్షుడు కింగ్ జోంగ్ ఉన్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల మధ్య సైనిక ఒప్పందం కుదిరింది. ఇరుదేశాల్లో దేనిపై దాడి జరిగినా.. మరో దేశం సైనికంగా సాయపడాలని నిర్ణయించుకున్నాయి. మరోవైపు దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సక్ యోల్ శుక్రవారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి భద్రతపై సమీక్షించారు. అంతర్జాతీయ సమాజం అందుబాటులో ఉన్న అన్ని మార్గాల ద్వారా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

10 వేల మంది ఉత్తరకొరియా సైనికులు చేరొచ్చు: జెలెన్‌స్కీ

బ్రస్సెల్స్: పదివేల మంది ఉత్తరకొరియా సైనికులు రష్యా సైన్యంలో చేరవచ్చని తమకు నిఘా సమాచారం ఉందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు. వీరిని రష్యా ఆక్రమిత ఉక్రెయిన్ భూభాగంలో మోహరించనున్నారని తెలిపారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో మూడోదేశం జోక్యం చేసుకుంటే అది ప్రపంచయుద్ధంగా మారుతుందని హెచ్చరించారు.

విజయనగర రాజ్య స్థాపకులది ఓరుగల్లే!

పద్మనాయకులు ఒక శతాబ్దం పాటు తెలంగాణను దాటకుండా బహమనీలకు అడ్డుగా నిలిచారు. వీరి పతనం తర్వాతే మిగతా తెలుగు ప్రాంతం కూడా బహమనీల వశమైంది. దక్షిణ భారతదేశంలోని చాలా భూ భాగాలకు ముస్లిం రాజుల ప్రవేశానికి మార్గం సుగమమైంది. పద్మనాయకుల చివరి దశలోనూ, అనంతరం కొంతకాలం తెలంగాణలోని కొన్ని ప్రాంతాలు గజపతుల ఆధిపత్యంలో ఉన్నట్లు ఆధారాలున్నాయి. బహమనీ చివరి పాలకుడైన మహమూద్‌షా 1518లో మరణించాడు. దీంతో బహమనీల రాజ్య భాగాల్లో ఒకటైన గోలకొండ పాలకుడు కులీ కుతుబ్ ఉల్‌ముల్క్ స్వాతంత్ర్యం ప్రకటించుకొని కుతుబ్‌షాహీ వంశాన్ని స్థాపించాడు.

కాకతీయానంతర యుగం

పద్మనాయకులు

పద్మనాయక పాలకుల్లో గొప్ప పరాక్రమవంతుడైన లింగమనీడు విజయనగర రాజ్య భాగాలైన కర్నూలు, నెల్లూరు సహా పరిసర దుర్గాలను ఆక్రమించాడు. చివరగా 1437లో కంచిని ఆక్రమించాడు. దీనికి సింగమనాయకుడు తోడ్పడ్డాడు. లింగమనీడు ఈ యుద్ధాల్లో మునిగి ఉన్న సమయంలో అతడి రాజ్య ఉత్తర భాగాన్ని బహమనీయులు ఆక్రమించుకునే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో బహమనీల మధ్య అంతఃకలహాలు మొదలయ్యాయి. అహ్మద్‌షా అనంతరం 'రెండో అహ్మద్‌షా'గా పిలిచే అల్లావుద్దీన్ (1436-1458) బహమనీ రాజయ్యాడు. ఇతడి సోదరుడైన మహమ్మద్‌ఖాన్ తిరుగుబాటు చేసి రాయచూర్, షోరాపూర్, బీజాపూర్ దుర్గాలను ఆక్రమించి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. నిజామాబాద్ జిల్లాలోని బాలకొండ సామంతుడైన సికిందర్‌ఖాన్ కూడా స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. ఇతడు మహమ్మద్‌ఖాన్‌తో కలిసి సబ్బి రాష్ట్రం (కరీంనగర్), భువనగిరి ప్రాంతాన్ని ఆక్రమించుకున్నాడు.

సింగమనాయకుడు 1444లో కపిలేశ్వర గజపతి సహాయంతో రాచకొండ రాజ్యాన్ని తిరిగి ఆక్రమించడానికి ప్రయత్నించి విఫలమైనట్లు తెలుస్తోంది. రెండో అహ్మద్‌షా అనంతరం హుమాయూన్ రాజ్యానికి వచ్చిన సందర్భంలో (1457) సికిందర్‌ఖాన్ చేసిన తిరుగుబాటును ఆసరాగా చేసుకొని తెలంగాణ ప్రాంతాన్ని తిరిగి జయించడానికి పద్మనాయకులు ప్రయత్నించారు. హుమాయూన్ సికిందర్‌ఖాన్‌ను సంహరించి, దేవరకొండపైకి నిజాం-ఉల్- ముల్క్, ఖ్వాజీ జహాన్ అనే సేనానులను పంపించి, తాను ఓరుగల్లుపై దండెత్తాడు. కపిలేశ్వర గజపతి కుమారుడైన హంవీరుడి సహాయంతో సింగమనాయకుడు వారిని ఓడించాడు. ఇతడు ఖమ్మం, భువనగిరి, ఓరుగల్లును జయించాడు. ఆ తర్వాత సింగమనాయకుడి తమ్ముడు ధర్మానాయకుడు ఓరుగల్లు పాలకుడైనట్లు 1462-64 నాటి శాయంపేట శాసనం ఆధారంగా తెలుస్తోంది. నిజాంషా (1461-63) కాలంలోనూ బహమనీలు తెలంగాణను జయించడానికి మళ్లీ ప్రయత్నించారు. గజపతుల సహాయంతో పద్మనాయకులు వారిని ఓడించారు.

1468లో కపిలేశ్వర గజపతి మరణించిన తర్వాత అతడి కుమారులు హంవీరుడు, పురుషోత్తమ గజపతి మధ్య వారసత్వ పోరు మొదలైంది. దీనివల్ల పద్మనాయకులకు మళ్లీ కష్టాలు వచ్చాయి. తనకు సహాయం చేస్తే తెలంగాణను జయించి స్వాధీనం చేస్తానని హంవీరుడు మూడో మహమ్మద్‌షా (1463-1482)కు కబురు పంపాడు. ఇదే అదనుగా సుల్తాన్ తెలంగాణను ఆక్రమించడానికి నిజాం-ఉల్-ముల్క్ బహ్రీని పంపాడు. ఈ సమయంలో పద్మనాయకులు అటు గజపతులతో, ఇటు బహమనీలతో పోరాడాల్సి వచ్చింది. 1475 నాటికి తెలంగాణ ప్రాంతమంతా బహమనీల వశమైంది. పద్మనాయకుల రాజ్యం అంతరించింది. పద్మనాయకులు విజయనగర రాజుల కొలువులో చేరారు. ఈ కాలంలో విజయనగర పాలకులు, గజపతులు, బహమనీల సామ్రాజ్య దాహంతో తెలంగాణ తల్లడిల్లింది. 1481 నాటికి నిజాం-ఉల్-ముల్క్ బహ్రీ, ఆజంఖాన్ తెలంగాణలో బహమనీల రాజప్రతినిధులయ్యారు. సింగమనాయకుడు, లింగమనీడు అనంతరం లింగమనీడు కుమారుడు దేవరకొండకు నామమాత్ర పాలకుడిగా మిగిలాడు. ఆ తర్వాత వీరి వంశం దేవరకొండను 16వ శతాబ్దం చివరి వరకు పాలించినట్లు తెలుస్తోంది.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

లింగమనీడు కళింగ, విజయనగర రాజ్యాలపై దండయాత్రలు చేసిన సందర్భంలో అతడి వెంట వెళ్లిన కొంతమంది పద్మనాయకులు ఆ తర్వాతి కాలంలో బొబ్బిలి, పిఠాపురం, వెంకటగిరి, పాల్వంచ సంస్థానాలను స్థాపించినట్లుగా తెలుస్తోంది. విజయనగర రాజ్య ప్రాంతాలకు వెళ్లినవారు తిరిగి తెలంగాణకు వచ్చి మహబూబ్‌నగర్ జిల్లాలో జటప్రోలు (కొల్లాపురం) సంస్థానాన్ని స్థాపించినట్లు భావిస్తున్నారు.

కళింగ గాంగులు

ఈ వంశ పాలకులు నేటి ఒడిశాలోని బరంపురం తదితర ప్రాంతాలతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లా ప్రాంతాలను సుమారు క్రీ.శ. 5వ శతాబ్దం నుంచి 15వ శతాబ్దం వరకు పాలించారు. కాకతీయుల కాలంలో వీరితో యుద్ధాలు జరిగాయి. కాకతి గణపతి దేవుడు వీరి పాలనలో ఉన్న కొన్ని ప్రాంతాలను ఆక్రమించాడు. రుద్రమదేవి కూడా గోదావరి నది వరకు జయించారు.

కళింగ గాంగ రాజైన నాలుగో వీరనరసింహదేవుడి కాలంలో (1378-1424) రేచర్ల పద్మనాయక అనపోతనాయకుడు కళింగను ముట్టడించాడు. వీర నరసింహదేవుడు ఓటమి పాలై తన కూతురును అనపోత నాయకుడి మనవడైన కుమార అనపోత నాయకుడికి ఇచ్చి సంధి చేసుకున్నాడు. నాలుగో భానుదేవుడి (1424-1434)తో ఈ వంశం అంతరించింది.

విజయనగర రాజ్యం

కాకతీయుల అనంతరం ముసునూరు, పద్మనాయక, రెడ్డి రాజ్యాలతోపాటు స్థాపించిన మరో రాజ్యం విజయనగర సామ్రాజ్యం. ఈ రాజ్య స్థాపకులైన హరిహరరాయలు, బుక్కరాయలు ఓరుగల్లుకు చెందినవారు. ధర్మపురికి చెందిన విద్యారణ్య స్వామి వీరికి ప్రేరకుడు. కంపరాయల భార్య గంగాదేవి కూడా తెలంగాణ ఆడబిడ్డే. పిల్లలమర్రి పినవీరభద్రుడు కొన్నేళ్లు విజయనగర రాజుల ఆశ్రయం పొందాడు. అలంపురం లాంటి ప్రాంతాలు స్వల్పకాలం వీరి ఆధిపత్యంలో ఉన్నాయి. వీరి రాజ్యమంతా కృష్ణానది దక్షిణానికే పరిమితం.

సంగమ వంశం (1333-1485)

హరిహరరాయలు (1336-1356), బుక్కరాయలు (1356-1377) సంగమ వంశానికి చెందినవారు. వీరు కాకతి ప్రతాపరుద్రుడి భాండాగారికులుగా ఉన్నట్లు కొంతమంది చరిత్రకారులు భావిస్తున్నారు. కాకతీయుల పతనానంతరం వీరు ఆనెగొంది ప్రభువైన జంబుకేశ్వరుడి వద్ద మంత్రులుగా చేరారు. ఢిల్లీ సైన్యం 1334లో ఆనెగొందిని ముట్టడించి వీరిద్దరినీ బంధీలుగా తీసుకెళ్లి ముస్లింలుగా మార్చి కొంతకాలం తర్వాత మళ్లీ ఆనెగొందికి పాలకులుగా పంపించారని, విద్యారణ్యుడి ప్రేరణతో వీరు స్వమతంలోకి మారి 1336 ప్రాంతంలో విజయనగర రాజ్యాన్ని స్థాపించారని తెలుస్తోంది.

హరిహరరాయల కాలంలో తెలంగాణలో కొంత భాగాన్ని ముసునూరి వంశం పాలించింది. బుక్కరాయల కాలంలో రేచర్ల పద్మనాయకులు తెలంగాణకు అధిపతులయ్యారు. తర్వాత రెండో హరిహరరాయలు 1377 నుంచి 1404 వరకు పాలించాడు. ఇతడి ఆజ్ఞతో యువరాజైన రెండో బుక్కరాయలు రెండుసార్లు పద్మనాయకులపై దండెత్తాడు. కానీ విజయం సాధించలేదు. తండ్రి మరణానంతరం రాజైన రెండో బుక్కరాయలను తొలగించి విరూపాక్షుడు అధికారాన్ని చేపట్టాడు. రెండో బుక్కరాయలు తిరిగి అతడిని తొలగించి 1404 నుంచి 1406 వరకు పాలించాడు. ఇతడిని తొలగించి మొదటి దేవరాయలు (1406-1424), తర్వాత ప్రౌఢ దేవరాయలుగా పిలిచే రెండో దేవరాయలు (1406-1446) రాజులయ్యారు. ప్రౌఢ దేవరాయల కాలంలో రెడ్డి రాజ్యం సింహాచలం వరకు అతడికి సామంత రాజ్యంగా ఉంది. ఆ తర్వాత మల్లికార్జున రాయలు (1446-1465), రెండో విరూపాక్ష రాయలు (1465-1485) పాలించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని అలంపురం తదితర ప్రాంతాలు మల్లికార్జున రాయల ఆధీనంలో ఉండేవి. ఈ వంశ పాలకుల అసమర్థత వల్ల సామంత రాజైన సాళువ నరసింహరాయలు సింహాసనాన్ని ఆక్రమించాడు.



సాళువ వంశం (1486-1506)

సాళువ నరసింహరాయలు (1485-1490) తీరాంధ్రను కృష్ణానది వరకు జయించాడు. తెలంగాణపై దాడిచేసి బాలకొండ వద్ద ముస్లిం సైన్యాన్ని ఓడించాడు. ఇతడి మరణానంతరం ఇతడి కుమారులు చిన్నవాళ్లు కావడంతో సేనాధిపతి తుళువ నరసానాయకుడు తన పెద్ద కుమారుడైన తిమ్మరాజును, అతడు మరణించాక రెండో కుమారుడైన రెండో నరసింహరాయలను రాజులను చేసి రాజ్యాధికారం నెరిపాడు. రెండో నరసింహరాయలను హతమార్చి తుళువ వంశాన్ని ప్రారంభించారు.

తుళువ వంశం (1505-1570)

వీర నరసింహుడు (రెండో నరసనాయకుడు) 1505 నుంచి 1509 వరకు పాలించాడు. ఇతడు మరణించిన తర్వాత సోదరుడు శ్రీకృష్ణ దేవరాయలు (1509-1529) రాజయ్యాడు. ఇతడు తూర్పు దండయాత్రలో చితాబ్‌ఖాన్ పాలనలో ఉన్న తెలంగాణలోని అనంతగిరి, ఉంద్రకొండ, జల్లిపల్లి, కందికొండ, దేవరకొండ, నల్లగొండ, కనకగిరి, శంకరగిరి, ఖమ్మం ప్రాంతాలను ఆక్రమించాడు. సింహాచలం దాకా గజపతుల ఆక్రమణలో ఉన్న తీరాంధ్ర కూడా ఇతడి వశమైంది. ప్రతాపరుద్ర గజపతి తన కుమార్తెను ఇతడికి ఇచ్చి ఇరు రాజ్యాల మధ్య కృష్ణానది సరిహద్దుగా ఉండే విధంగా సంధి చేసుకున్నాడు. శ్రీకృష్ణ దేవరాయలు తెలంగాణతో పాటు కృష్ణానది ఉత్తర భాగాలను గజపతికే ఇచ్చేశాడు.

కృష్ణదేవరాయల తర్వాత అతడి సోదరుడు అచ్యుత దేవరాయలు (1530-42) అధికారంలోకి వచ్చాడు. అచ్యుత దేవరాయల తర్వాత రాజైన అతడి కుమారుడు వెంకటరాయలను హత్య చేసి సలికం తిరుమలరాయలు రాజయ్యాడు. ఇతడిని తుదముట్టించి అళియ రామరాయలు (కృష్ణదేవరాయల అల్లుడు) అచ్యుత రాయల అన్న కొడుకైన సదాశివరాయలను (1543-76) రాజుగా చేసి అధికారం చెలాయించాడు. ఇతడి కాలంలో ముస్లిం పాలకులు ఏకమై విజయనగరంపై దండెత్తారు. దీన్నే రక్కస తంగడి (తళ్లికోట) యుద్ధంగా పేర్కొంటారు. రామరాయల తర్వాత అతడి సోదరుడు తిరుమలరాయలు ఆరవీటి వంశ (1569-1578) పాలన ప్రారంభించాడు. విజయనగరం తన ప్రాభవాన్ని తిరిగి పొందలేదు. మూడో శ్రీరంగరాయల (1665-1680) మరణంతో ఆరవీటి వంశం, విజయనగర సామ్రాజ్యం అంతమయ్యాయి. ఈ సామ్రాజ్యంలోని కొంత భాగాన్ని గోల్కొండ సుల్తాన్‌లు ఆక్రమించగా, మరికొంత భాగం మధుర, తంజావూర్, మైసూర్ నాయక రాజుల వశమైంది.

విజయనగర రాజులకు బహమనీ సుల్తాన్‌లతో, కుతుబ్‌షాహీలతో కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ప్రదేశంలో నిరంతరం యుద్ధాలు జరిగేవి. అందువల్ల అలంపురం తదితర ప్రాంతాలు నిరంతరం చేతులు మారాయి. మల్లికార్జున రాయలు, కృష్ణదేవరాయలు, అచ్యుత దేవరాయల హయాంలో కొంతకాలంపాటు 'అలంపురం' విజయనగర పాలకుల ఆధీనంలో ఉన్నట్లు తెలుస్తోంది.

కళింగ గజపతులు


గాంగ వంశ రాజైన నాలుగో భానుదేవుడి పై అతడి మంత్రి కపిలేశ్వర గజపతి 1434లో తిరుగుబాటు చేసి గజపతి వంశాన్ని స్థాపించాడు. ఈ వంశ పాలకులు 1434 నుంచి 1538 వరకు ఒడిశా తదితర ప్రాంతాలతో పాటు తెలుగు ప్రాంతాలను కూడా పాలించారు. వీరికి విజయనగర రాజులు, కొండవీటి రెడ్డి రాజులు, పద్మనాయకులు, తెలంగాణను ఆక్రమించిన బహమనీ సుల్తాన్‌లతో యుద్ధాలు జరుగుతుండేవి.

బహమనీ పాలకుడైన హుమాయూన్ 1458లో తెలంగాణను ఆక్రమించి మాలిక్‌షాను సుబేదారుగా నియమించాడు. సికిందర్‌ఖాన్ పద్మ నాయకులతో కలిసి సుల్తాన్లపై తిరుగుబాటు చేశాడు. ఈ తిరుగుబాటును అణిచివేసి సుల్తాన్‌లు పద్మనాయక రాజధానుల్లో ఒకటైన దేవరకొండను ముట్టడించారు. ఈ సమయంలో పద్మనాయక లింగమనీడి అభ్యర్థన మేరకు కపిలేశ్వర గజపతి ఆదేశంతో 'హంవీరుడు' లింగమనీడికి బాసటగా నిలిచి సుల్తాన్లను తరిమేశాడు.

కపిలేశ్వర గజపతి అనంతరం అతడి కుమారులైన పురుషోత్తమ గజపతి (1468-97), హంవీరుడి మధ్య వారసత్వ తగాదా తలెత్తింది. హంవీరుడు బహమనీ సుల్తాన్లను ఆశ్రయించి తనకు రాజ్యం ఇప్పిస్తే తీరాంధ్ర, తెలంగాణను ఇస్తానని చెప్పాడు. సుల్తాన్‌లు అతడికి సహాయపడి తీరాంధ్ర, అతడి ఆధీనంలోని తెలంగాణను వశపరుచుకున్నారు. పురుషోత్తమ గజపతి తర్వాత సింహాసనాన్ని అధిష్ఠించిన అతడి కుమారుడు ప్రతాపరుద్ర గజపతి (1497-1538) బహమనీలు ఆక్రమించిన తెలంగాణ భూభాగాలను తిరిగి కైవసం చేసుకున్నాడు. ఇతడికి సహకరించిన చిత్తాఫ్‌ఖాన్ (చితాబ్‌ఖాన్)ను ఖమ్మం, ఓరుగల్లు ప్రాంతాలకు సామంతుడిగా నియమించాడు. ప్రతాపరుద్ర గజపతి కొండపల్లి, ఉర్లుగొండ, చిట్యాల, అనంతగిరి, అరువపల్లి, నల్లగొండ, సిరికొండ దుర్గాలను పాలించడానికి సేనానులను నియమించాడు. 1512లో దిగ్విజయ యాత్ర ప్రారంభించిన విజయనగర పాలకుడు శ్రీకృష్ణ దేవరాయలు కళింగ గజపతులతో ఉన్న పూర్వ వైరాన్ని దృష్టిలో ఉంచుకొని 1515లో ప్రతాపరుద్ర గజపతి ఆధీనంలో ఉన్న కొండవీడు, కొండపల్లి, అనంతగిరి, చిట్యాల, నల్లగొండ, ఉర్లుగొండ, అరువపల్లి మొదలైన దుర్గాలను జయించాడు. చితాబ్‌ఖాన్‌ను ఓడించి ఖమ్మం, ఓరుగల్లు ప్రాంతాలను జయించాడు. తర్వాత 1516లో గజపతుల కటకం దాకా పురోగమించాడు. ప్రతాపరుద్ర గజపతి తన కూతురు తుక్కాదేవిని కృష్ణదేవరాయలకు ఇచ్చి సంధి చేసుకొని తిరిగి ఈ ప్రాంతాలను పొందాడు. ఉభయ రాజ్యాలకు కృష్ణానది సరిహద్దుగా ఉండే విధంగా ఒప్పందం కుదిరింది.

శ్రీకృష్ణ దేవరాయలు తన రాజ్య విస్తరణలో భాగంగా ప్రతాపరుద్ర గజపతి రాజ్య భాగాలపై 1524లో దండెత్తడం, 1530లో కొండపల్లి దుర్గాన్ని వశపరచుకోవడాన్ని బట్టి తెలంగాణ మొత్తం అతడి ఆధీనంలోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ఎనిమిదేళ్లకు ప్రతాపరుద్ర గజపతి మరణించడంతో ఆ వంశం అంతరించింది.

రాజ్‌ఘాట్ అనేది ఏ రకమైన ఆధారం?



టెట్/డీఎస్సీ ప్రత్యేకం

మెథడాలజీ

ప్రాజెక్టు పద్ధతి/ ప్రకల్పన పద్ధతి / ఉద్యమ పద్ధతి

- జాన్ డ్యూయి ప్రతిపాదించిన వ్యవహారిక సత్తావాదం తత్ఫలితమే ప్రాజెక్టు పద్ధతి.
- ప్రాజెక్టు పద్ధతిని అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన కిల్ ప్యాట్రిక్ ప్రతిపాదించారు.
- ప్రాజెక్టు పద్ధతిని జె.ఎ.స్టీవెన్‌సన్ ఒక బోధన పద్ధతిగా రూపొందించారు.
- ప్రాజెక్టు పద్ధతి సంప్రదాయ బోధన పద్ధతులపై తిరుగుబాటు వంటిది.
- ప్రాజెక్టు పద్ధతిపై జరిగిన చర్చ మరే ఇతర పద్ధతులపై జరగలేదు.
- ప్రాజెక్టు పద్ధతిలో జీవించడం కోసం కాకుండా, పనిచేస్తూ, జీవిస్తూ నేర్చుకోవడం ముఖ్యమైన అంశం.

నిర్వచనాలు

- **కిల్‌ప్యాట్రిక్:** 1918లో కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన కిల్‌ప్యాట్రిక్ 'సాంఘిక పరిసరాల్లో హృదయపూర్వకంగా, ఉద్దేశపూర్వకంగా కొనసాగే కార్యకలాపమే ప్రాజెక్టు' అని నిర్వచించారు.
- **స్టీవెన్‌సన్ :** సహజమైన సన్నివేశంలో పూర్తి చేసిన సమస్యాత్మక కృత్యమే ప్రాజెక్టు.
- **బైనింగ్ అండ్ బైనింగ్:** నిజ జీవిత సన్ని వేశంలో పథకం విద్యార్థులు సాధించిన లక్ష్యాత్మక కృత్యమే ప్రాజెక్టు.
- **బెల్లార్డ్:** పాఠశాల వాతావరణంలోకి తీసు కొని వచ్చిన నిజజీవిత అంశమే ప్రాజెక్టు.

ప్రాజెక్టు సూత్రాలు

- **ఉద్దేశ సూత్రం:** ప్రాజెక్టు మంచి ఉద్దేశంతో కూడుకొని ఉండాలి.
- **వాస్తవికత:** విద్యార్థులు వాస్తవ జీవిత సన్నివేశాల్లో పనిచేయగలిగి ఉండాలి.
- **అనుభవ సూత్రం:** విద్యార్థి వ్యక్తిగతంగా పనిచేయడానికి ప్రాజెక్టు తోడ్పడాలి.
- **స్వేచ్ఛ సూత్రం:** విద్యార్థులను స్వేచ్ఛా యుత వాతావరణంలో అభ్యసించేటట్లు చేయాలి. ఉపాధ్యాయుల నిర్బంధం వారి పై ఉండకూడదు.
- **కార్యకలాప సూత్రం:** విద్యార్థులు వివిధ కార్యకలాపాల్లో పాల్గొనాలి.
- **ఉపయోగిత సూత్రం:** కార్యక్ర మాల ద్వారా పొందిన జ్ఞానం విద్యార్థుల కుఉపయోగపడాలి.

ప్రాజెక్టులు- రకాలు

కిల్‌ప్యాట్రిక్ ప్రాజెక్టులను నాలుగు రకాలుగా వర్గీకరించారు.

1. **ఉత్పత్తిదారుని రకం:**
ప్రాజెక్టు ద్వారా వస్తువు లను ఉత్పత్తి చేస్తే దాన్ని ఉత్పత్తిదారుని రకం అంటారు.
ఉదా: బొమ్మలు తయారుచేయడం, కూరగాయలు పండించడం, నమూనాలు తయారుచేయడం
2. **వినియోగదారుని రకం:** ప్రాజెక్టు ద్వారా విద్యార్థులు ఆనందాన్ని పొందగలిగితే దాన్ని వినియోగదారుని రకం అంటారు.
ఉదా: నాటకీకరణం (నమూనా పార్లమెంట్).
3. **సమస్య రకం:** ప్రాజెక్టు ద్వారా సమస్య పరిష్కార మార్గాన్ని కనుక్కోగలిగితే అది సమస్య రకం.
ఉదా: కాలుష్యానికి కారణాలు తెలుసుకోవడం.
4. **తర్ఫీదు రకం:** ప్రాజెక్టు ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించగలిగితే దాన్ని తర్ఫీదు రకం అంటారు.
ఉదా: విద్యార్థుల్లో మ్యాప్‌లను గీసే నైపుణ్యాన్ని పెంపొందించడం.

ప్రాజెక్టులు తిరిగి రెండు రకాలు

1. **వ్యక్తిగత ప్రాజెక్టులు:** ఒక విద్యార్థి మాత్రమే నిర్వహించే ప్రాజెక్టులను వ్యక్తిగత ప్రాజె క్టులు అంటారు.
2. **సమిష్టి ప్రాజెక్టులు:** ఐదుగురు విద్యార్థులు ఒక బృందంగా ఏర్పడి నిర్వహించే వాటిని సమిష్టి ప్రాజెక్టులు అంటారు.

ప్రాజెక్టు పద్ధతి సోపానాలు

1. **సన్నివేశాలను ఏర్పరచడం:** ఉపాధ్యాయుడు చర్చలు, సంభాషణల ద్వారా వివిధ ప్రాజెక్టుల గురించి విద్యార్థులకు పరిచయం చేయడం.
2. **ప్రాజెక్టు ఎంపిక:** విద్యార్థులు తమకు ఇష్ట మైన ప్రాజెక్టును ఎంపిక చేసుకొంటారు.
3. **ప్రణాళిక రచన:** విద్యార్థులు ప్రాజెక్టును ఎలా నిర్వహించాలో ప్రణాళిక తయారుచేసుకుంటారు.
4. **ప్రణాళికను నిర్వహించడం:**
ప్రాజెక్టు పద్ధతి సోపానాల్లో అతి ముఖ్య మైంది, సుదీర్ఘమైంది ప్రణాళికను నిర్వహించడం.
5. **మూల్యాంకనం/ఉపయుక్తత:** విద్యార్థులు నిర్వహించిన ప్రాజెక్టును సమీక్షిస్తారు.
6. **నమోదు చేయడం:** విద్యార్థి ప్రాజెక్టుకు సంబంధించిన అభ్యసన కార్యకలాపాలన్నింటినీ పుస్తకంలో నమోదు చేస్తారు.

ప్రయోజనాలు

- మనోవైజ్ఞానిక సూత్రాలకు అనువైంది.
- విద్యార్థులకు స్వేచ్ఛ ఉంటుంది.
- శ్రమ గౌరవాన్ని సమర్థిస్తుంది.
- ప్రాజెక్టు పద్ధతి ద్వారా పాఠ్యవిషయాల పట్ల సహసంబంధం ఏర్పరచవచ్చు.
- జీవితంలో వాస్తవిక పరిస్థితులకు అనుగుణంగా విద్యను బోధించవచ్చు.
- వెనుకబడిన విద్యార్థులు కూడా ప్రాజెక్టు కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటారు.
- ప్రజాస్వామ్య జీవన మార్గానికి శిక్షణ ఇస్తుంది.
- కంఠత, జ్ఞాపకంతో పనిలేదు.

పరిమితులు

- పాఠశాల కార్యక్రమాలను తారుమారు చేస్తుంది.
- కచ్చితమైన కాల నిర్ణయ పట్టికను అను సరించడానికి సాధ్యం కాదు.
- విద్యార్థి తాను పొందిన జ్ఞానం క్రమంగా ఉండక అస్తవ్యస్తంగా ఉందని భావిస్తాడు.
- ప్రాజెక్టు పద్ధతి ద్వారా బోధించే పాఠ్యాంశాలు ఉన్న పాఠ్యగ్రంథాలు అందుబాటులో లేవు.
- కాలయాపనతో కూడుకుంది.
- ఖర్చుతో కూడింది.
- ఈ పద్ధతి ద్వారా సిలబస్ పూర్తిచేయడం కష్టం
- ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్నప్పుడు ఈ పద్ధతి ఉపయోగించడం కష్టం.

ప్రాజెక్టు పద్ధతి ద్వారా బోధించే పాఠ్యాంశాలు

- బడి తోట
- రోడ్డు భద్రత, విద్య (విద్యార్థులను నాలుగు రోడ్ల కూడలిలో ఉంచి ట్రాఫిక్‌ను నియంత్రించడం)
- పాఠశాల బ్యాంక్
- గృహ బడ్జెట్‌ను తయారుచేయడం
- స్థానిక స్వపరిపాలన (విద్యార్థులకు ఎన్ని కలు నిర్వహించడం)
- నిరక్షరాస్యత, అధిక జనాభా, సమాజంలో స్త్రీల స్థాయి మొదలైన సమస్యలపై సామాజిక సర్వే
- వ్యవసాయం (ఆహార పంటలను పండించడం.
- కో-ఆపరేటివ్ స్టోర్స్
- హిందూ-ముస్లిం, క్రిస్టియన్, బౌద్ధ, జైనమతం పండుగలు పాఠశాలలో నిర్వహించడం.
- పౌరసత్వ శిక్షణ శిబిరాలు
- కుటీర పరిశ్రమలు
- మృత్తికలను సేకరించడం.

మాదిరి ప్రశ్నలు

1. తరగతిలో వెనుకబడిన విద్యార్థుల్లో కుతూహలం కలిగించే బోధన పద్ధతి?
   1) ఉపన్యాస పద్ధతి
   2) సామాజికీకృత కథనం
   3) మూలాధార పద్ధతి
   4) సమస్యా పరిష్కార పద్ధతి
2. విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు పెంపొందించడం అనే ఆశయాన్ని సాధించడానికి అనువైన బోధన పద్ధతి?
   1) మూలాధార పద్ధతి
   2) పర్యవేక్షిత అధ్యయనం
   3) సామాజికీకృత కథనం
   4) సమస్యాపరిష్కార పద్ధతి
3. సాంఘిక అధ్యయనాల పాఠ్యపుస్తకం ద్వారా ఏ పద్ధతిని ఉపయోగించడం కష్టం?
   1) ఉపన్యాస పద్ధతి
   2) మూలాధార పద్ధతి
   3) ప్రకల్పన పద్ధతి
   4) సామాజికీకృత పద్ధతి
4. పాఠ్యపథకంలోని సామాన్యీకరణం అనే సోపానాన్ని బోధించడానికి అనువైన బోధన పద్ధతి?
   1) చర్చా పద్ధతి
   2) మూలాధార పద్ధతి
   3) ఉపన్యాస పద్ధతి
   4) కథా పద్ధతి
5. మంచి బోధన ఉపగమానికి ఉండవలసిన లక్షణం కానిది?
   1) వివిధ స్థాయిల వారికి అనుగుణంగా ఉండాలి.
   2) ఎక్కువ పరిమాణంలో జ్ఞానం అందించాలి.
   3) విద్యార్థి క్రియాశీలక పాత్ర పోషించాలి
   4) ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య అనుబంధాన్ని ఏర్పరచాలి.
6. ఛాత్రోపాధ్యాయుల బోధన నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమం?
   1) బృంద బోధన 2) స్థూల బోధన
   3) సూక్ష్మబోధన 4) నమూనా బోధన

సమాధానాలు

1) 3 2) 3 3) 3
4) 3 5) 2 6) 3



గతంలో అడిగిన ప్రశ్నలు

1. ప్రాజెక్టులను సమస్యారకం, తర్ఫీదురకం, వినియోగదారుని రకం, ఉత్పత్తిదారుని రకాలుగా సూచించినవారు? (డీఎస్సీ - 2004)
   1) బెల్లార్డ్ 2) కిల్‌ప్యాట్రిక్
   3) స్టీవెన్‌సన్ 4) జాన్ డ్యూయి
2. బోధనలో ఏ పద్ధతి సిద్ధాంతాలు, సూత్రా లు రూపొందించేందుకు అనువుగా ఉంటుంది? (డీఎస్సీ - 2004)
   1) కథన పద్ధతి 2) సమస్యా పద్ధతి
   3) యూనిట్ పద్ధతి 4) సామూహిక పద్ధతి
3. అన్ని బోధన పద్ధతుల్లో వీటిని ఉపయోగించడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చు? (డీఎస్సీ -2004)
   1) మూలాధారాలు 2) వార్షిక పథకాలు
   3) చర్చలు 4) పాఠ్యపుస్తకాలు
4. రెండు వరుస పీరియడ్ల పథకంలో మేబెల్. ఐ.సింప్సన్ ప్రకారం నియోజిత అధ్యయనం అనే కార్యకలాపానికి కేటాయించిన కాల వ్యవధి? (డీఎస్సీ-2006)
   1) 35 ని॥ 2) 25 ని॥
   3) 20 ని॥ 4) 30 ని॥
5. లోక్ అదాలత్‌లు - న్యాయ పరిష్కారాలు అనే అంశం పట్ల అవగాహన కోసం ఈ యుక్తి ఉపయోగించడం ఉత్తమమైంది? (డీఎస్సీ-2006)
   1) వర్క్‌షాప్ 2) సందర్శన
   3) స్వయం అధ్యయనం 4) సెమినార్
6. రాజ్‌ఘాట్ అనేది ఏ రకమైన ఆధారం? (డీఎస్సీ-2006)
   1) తృతీయ 2) చతుర్థ
   3) ప్రాథమిక 4) ద్వితీయ
7. 9వ తరగతి విద్యార్థులకు గ్రామీణ స్వపరిపాలనా సంస్థలు అనే పాఠ్యాంశ బోధనకు ఉత్తమమైన బోధన పద్ధతి? (డీఎస్సీ-2006)
   1) మూలాధార
   2) ప్రాజెక్టు పద్ధతి
   3) ఉపన్యాస ప్రదర్శన పద్ధతి
   4) సమస్యా పద్ధతి

సమాధానాలు

1) 2; 2) 2; 3) 3; 4) 1;
5) 2; 6) 3; 7) 2.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

లుకేమియా వ్యాధి చికిత్సలో వాడే రేడియోధార్మిక ఐసోటోపు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ సైన్స్

రేడియో ధార్మికత

ఏ మూలక పరమాణువులోనైనా ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు, న్యూట్రాన్లు ఉంటాయి. వీటిని ఉప పరమాణు కణాలు (Sub Atomic Particles) లేదా మూల కణాలు (Fun-damental Particles) అంటారు. ఆవర్తన పట్టికలో అత్యంత తేలికైన, మొదటి మూలకమైన హైడ్రోజన్‌లో మాత్రం న్యూట్రాన్లు ఉండవు. ప్రోటాన్లు, న్యూట్రాన్లు కేంద్రకంలో ఉండటం వల్ల వీటిని కేంద్రక కణాలు అంటారు. సూర్యుని నుంచి వెలువడే ఫోటాన్లు (కాంతి కణాలు), న్యూట్రినోలను కూడా ఉప పరమాణు కణాలుగా పరిగణిస్తారు. వీటిలో ఎలక్ట్రాన్లు రుణావేశ పూరిత కణాలు. ప్రోటాన్లు ధనావేశపూరిత కణాలు. న్యూట్రాన్లు ఆవేశ రహిత కణాలు. న్యూట్రినోలు అస్తిత్వం లేని కణాలు. సాధారణంగా ఇవి సూర్యునిలో జరిగే 'కేంద్రక సంలీన' ప్రక్రియలో విడుదలై, భూమికి చేరతాయి. వీటి ద్రవ్యరాశి చాలా తక్కువ (శూన్యం కాదు). పరమాణు సంఖ్య పెరుగుతున్నకొద్దీ కేంద్రకంలో ప్రోటాన్ల సంఖ్య పెరగడం వల్ల వాటి మధ్య వికర్షణ కూడా పెరుగుతుంది (ధనావేశాలే కాబట్టి). అందువల్ల న్యూట్రాన్ల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది.

ఉదా: హీలియంలో రెండు ప్రోటాన్లు, రెండు న్యూట్రాన్లు ఉండగా.. యురేనియం- 235లో 92 ప్రోటాన్లు, 143 న్యూట్రాన్లు ఉంటాయి. ఇలాంటి భారీ కేంద్రకాలు సహజంగా ఆల్ఫా (α), బీటా (β), గామా (γ) లాంటి కిరణాలను ఉద్గారం చేస్తాయి. ఈ విషయాన్నే సహజ రేడియో ధార్మికత (Natural Radio activity) అంటారు. ఈ విషయాన్ని హెన్రీ బెక్వరల్ అనే శాస్త్రవేత్త యాదృచ్ఛికంగా కనుగొన్నాడు. తర్వాత వీటిపై నోబెల్ బహుమతి గ్రహీతలైన క్యూరీ దంపతులు (మేరీ, పియరీ క్యూరీ) పరిశోధన చేశారు. వీరు రేడియం, పొలోనియం అనే కొత్త మూలకాలు కనుగొన్నారు.

α - కణాలు: వీటికి రెండు యూనిట్ల ధనావేశం ఉంటుంది. ఇవి హైడ్రోజన్ కంటే నాలుగు రెట్లు బరువైనవి. వీటిని హీలియం కేంద్రకాలుగా పరిగణిస్తారు. వీటి వేగం సుమారు 16000 Km/sగా ఉంటుంది. ఇవి ప్రయాణిస్తున్నప్పుడు వాయుకణాలను అయనీకరణం చెందిస్తాయి (ఎలక్ట్రాన్లను వేరు చేస్తాయి). జింక్ సల్ఫైడ్ తెరపై స్ఫుర దీప్తిని కలుగజేస్తాయి.

β - కిరణాలు: ఇవి అతివేగంగా చలించే ఎలక్ట్రాన్లు. వీటికి రుణావేశం ఉంటుంది. కాంతివేగం కంటే కొద్దిగా తక్కువ వేగంతో చలిస్తాయి. వీటికి చొచ్చుకుపోయే సామర్థ్యం α - కణాల కంటే ఎక్కువ ఉంటుంది.

γ - కిరణాలు: ఇవి కాంతివేగం (3×10^8 m/s)తో చలించే శక్తివంతమైన విద్యుదయస్కాంత వికిరణాలు. సాధారణంగా ఒక కేంద్రకం α - కణాలను ఉద్గారం చేసినప్పుడు ఉత్తేజిత స్థాయికి చేరుతుంది. అది భూస్థాయికి వచ్చినప్పుడు శక్తిని γ - కిరణాల రూపంలో విడుదల చేస్తుంది. ఈ గామా కిరణాలను క్యాన్సర్ చికిత్సలో (రేడియో థెరపీ), కూరగాయల, ధాన్యాలను క్రిమిరహితం చేసి, వాటి నిల్వ కాలాన్ని (Shelf life) పెంచడానికి ఉపయోగిస్తారు. దీని కోసం సాధారణంగా కోబాల్ట్ - 60 అనే మూలక కేంద్రకాన్ని ఉపయోగిస్తారు.

సాధారణంగా రేడియో ధార్మిక వికిరణాలు లెడ్ లోహం ద్వారా చొచ్చుకొని పోవు. కాబట్టి లెడ్ (Pb)ను రక్షక కవచంగా వాడతారు.


కాస్మిక్ కిరణాలు: ఇవి అత్యంత శక్తివంతమైన, ప్రమాదకరమైన విద్యుదయస్కాంత వికిరణాలు. ఇవి దాదాపుగా భూమిని చేరే లోపే క్షీణించిపోతాయి.

రేడియో ధార్మికత అనువర్తనాలు

రేడియో ధార్మికతపై పరిశోధనలో భాగంగా న్యూట్రాన్లు, పాజిట్రాన్లు, ఆల్ఫా కణాలు లాంటి ఉపపరమాణు కణాలను కనుగొన్నారు. వీటి ఆవిష్కరణ మూలకాల పరివర్తన (ఒక మూలకం నుంచి మరో మూలకానికి మార్పు)లో ఒక ముఖ్య ఘట్టంగా నిలిచింది. పరమాణు సంఖ్య 92 తర్వాత వచ్చే మూలకాలన్నీ కృత్రిమంగా కనుక్కున్నవే.

రేడియోధార్మిక ఐసోటోపులు (ఒకే మూలకానికి చెందిన ద్రవ్యరాశి భిన్నంగా ఉన్న కేంద్రకాలు) వ్యవసాయంలో, వైద్యశాస్త్రంతోపాటు ఇతర శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి.

రేడియో కార్బన్ డేటింగ్: కార్బన్‌కు 12, 13, 14 ద్రవ్యరాశి సంఖ్యలున్న ఐసోటోపులు ఉంటాయి.



వీటిలో C-14కు రేడియో ధార్మికత ఉంటుంది. ఇది β - కిరణాలను ఉద్గారం చేసి, నైట్రోజన్‌గా పరివర్తనం చెందుతుంది. మొక్కలు, జంతువుల శిలాజాల్లోని C-14తోపాటు C-14ను కలిగిన CO_2 వాతావరణంలో స్థిరంగా ఉంటుంది. చనిపోయిన మొక్కలు CO_2ను తీసుకోలేవు కాబట్టి శిలాజాల్లోని C-14 పరిమాణం క్రమంగా తగ్గుతుంది. ఎందుకంటే అది β - కిరణాలను ఉద్గారం చేస్తూ, నైట్రోజన్‌గా మారుతుంది. ఈ విఘటనం చెందే రేటు ఆధారంగా శిలాజాల వయసును అంచనా వేస్తారు. దీన్నే 'రేడియో కార్బన్ డేటింగ్' అంటారు. ఇదేవిధంగా యురేనియం - 226 ఆధారంగా శిలల వయసును నిర్ధారిస్తారు. ఈ పద్ధతిని 'రేడియో యురేనియం డేటింగ్' అంటారు.

- రేడియో ధార్మిక కేంద్రక విచ్ఛిత్తి ఆధారంగానే అణు విద్యుత్ శక్తి ఉత్పత్తి అవుతుంది.
- రేడియోధార్మిక కోబాల్ట్-60 నుంచి వచ్చే గామా కిరణాలను క్యాన్సర్‌ను నయం చేయడానికి (రేడియోథెరపీ) ఉపయోగిస్తారు.
- అయోడిన్-131ను థైరాయిడ్ సమస్యల నిర్ధారణ, చికిత్సలో (**ఉదా:** గాయిటర్ వ్యాధి) వినియోగిస్తారు. దీన్ని మెదడులోని కణితులను (బ్రెయిన్ ట్యూమర్లు) గుర్తించడానికి కూడా ఉపయోగిస్తారు.
- రక్తహీనతను అధ్యయనం చేయడానికి రేడియో ధార్మిక ఐరన్ (Fe-59)ను ఉపయోగిస్తారు.
- రేడియో ధార్మిక సోడియం (Na-24)ను రక్త ప్రసరణలోని లోపాలను గుర్తించడానికి ఉపయోగిస్తారు.
- P-34ను ఉపయోగించి ఎముకల్లో పగుళ్లను గుర్తిస్తారు. దీని ద్వారా ఎముకలు ఫాస్ఫరస్‌ను శోషించుకుంటున్నాయో లేదో తెలుసుకుంటారు. మొక్కల్లో జరిగే జీవక్రియల అధ్యయనానికి కూడా దీన్ని ఉపయోగిస్తారు.
- యాంటీమొని (Sb-124)ను ఉపయోగించి పెట్రోలియం పైపుల్లో లీకేజీని గుర్తిస్తారు.
- α - కిరణాలను ఉపయోగించి క్రిమికీటకాలను నిర్వీర్యం చేయవచ్చు.
- ఆలుగడ్డలు, ఉల్లిగడ్డలు లాంటివాటిని ఎగుమతి చేయడంలో, వాటి నిల్వ సామర్థ్యం పెంచడంలో గామా కిరణాలను ఉపయోగిస్తారు.
- రేడియో ధార్మిక ఆక్సిజన్ (O-18)ను ఉపయోగించి అనేక రసాయన చర్యలను అధ్యయనం చేస్తారు.
- రేడియో ధార్మికతను కనిపెట్టినందుకు హెన్రీ బెక్వరల్‌కు, దానిపై మరిన్ని పరిశోధనలు చేసినందుకు క్యూరీ దంపతులకు 1903లో భౌతికశాస్త్రంలో సంయుక్తంగా నోబెల్ బహుమతి అందజేశారు.
- రేడియం, పోలోనియం మూలకాలను కనుగొన్నందుకు మేడమ్ క్యూరీ 1911లో రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్నారు.
- కృత్రిమ రేడియోధార్మికతను కనుక్కున్నందుకు మేరీ క్యూరీ కూతురు ఐరీన్ క్యూరీ, అల్లుడు ఫ్రెడరిక్ జూలియట్ క్యూరీకి 1935లో రసాయన శాస్త్రంలో సంయుక్తంగా నోబెల్ ప్రైజ్‌ను అందజేశారు.

మాదిరి ప్రశ్నలు

1. వివిధ వికిరణాల చొచ్చుకుపోయే క్రమాన్ని గుర్తించండి?
 1) $\alpha<\beta<\gamma$ 2) $\alpha<\gamma<\beta$
 3) $\gamma<\alpha<\beta$ 4) $\gamma<\beta<\alpha$
2. రేడియో ధార్మిక పదార్థం నుంచి ఉద్గారితమైన ఆల్ఫా కిరణాలు: (గ్రూప్-1, 2007)
 1) రెండింతలు అయనీకృత హీలియం పరమాణువులు
 2) రుణావేశిత కణాలు
 3) అయనీకృత హైడ్రోజన్ కేంద్రకాలు
 4) ఆవేశం లేని కణాలు
3. రేడియో ధార్మికతలో వెలువడే విద్యుదయస్కాంత వికిరణాలు?
 ఎ) α బి) β సి) γ సి) X - కిరణాలు
 1) ఎ, బి 2) బి, సి, డి
 3) ఎ మాత్రమే 4) సి మాత్రమే
4. అస్థిర పరమాణువు నుంచి β - కణాలు ఉద్గారం అయితే దాని ద్రవ్యరాశి:
 1) తగ్గుతుంది 2) పెరుగుతుంది
 3) మారదు
 4) తగ్గవచ్చు లేదా పెరగవచ్చు
5. β - కణ ఉద్గారం జరిగినప్పుడు మూలక పరమాణు సంఖ్య:
 1) తగ్గుతుంది 2) పెరుగుతుంది
 3) మారదు 4) చెప్పలేం
6. జతపరచండి.
 ఎ) α-కణం ( ) 1. అనావేశపూరితకణం
 బి) β- కణం () 2. ధనావేశిత కణం
 సి) γ- కణం () 3. రుణావేశిత కణం
 డి) ఐసోటోప్ () 4. ఒకే పరమాణు సంఖ్య
 5. ఒకే ద్రవ్యరాశి

	ఎ	బి	సి	డి
1)	1	2	3	4
2)	2	3	4	1
3)	3	2	1	5
4)	2	3	1	4

7. విద్యుత్ క్షేత్రంలో ధనావేశిత పలకదిశగా వంగే కణాలేవి?
 1) α 2) β 3) γ 4) ఏవీకావు
8. ప్రణాళికా సంఘం భారతదేశంలోని న్యూట్రినో అబ్జర్వేటరీని 11వ పంచవర్ష ప్రణాళికలో మెగా సైన్స్ ప్రాజెక్టుగా చేర్చింది. దీనికి సంబంధించి సరైన వాక్యాన్ని/ వాక్యాలను గుర్తించండి.
 ఎ) న్యూట్రినోలు, కాంతివేగానికి సమాన వేగంతో ప్రయాణించగలిగే నిరావేశ కణాలు
 బి) బీటా క్షయానికి చెందిన కేంద్రక చర్యల్లో న్యూట్రినోలు ఉద్భవిస్తాయి.
 సి) న్యూట్రినోలకు విస్మరించదగిందే అయినప్పటికీ శూన్యంకాని ద్రవ్యరాశి ఉంటుంది.
 డి) మానవశరీరంలో ప్రతి సెకండ్‌కి ట్రిలియన్ల న్యూట్రాన్లు పయనిస్తూ ఉంటాయి.
 1) ఎ, సి మాత్రమే
 2) ఎ, బి, సి మాత్రమే
 3) బి, సి, డి 4) ఎ, బి, సి, డి
9. ఏ వ్యాధి నిర్ధారణలో అయోడిన్-131ను వాడతారు?
 1) గాయిటర్ 2) రక్తహీనత
 3) రేచీకటి 4) ఆర్థరైటిస్
10. జతపరచండి.
 ఎ) రక్తహీనత ()1. సోడియం-24
 బి) రక్తప్రసరణ లోపాలు () 2. ఐరన్-59
 సి) క్యాన్సర్ చికిత్స () 3. కార్బన్-14
 డి) చెట్ల వయసు () 4. కోబాల్ట్-60
 5. ఫాస్ఫరస్-34


	ఎ	బి	సి	డి
1)	2	1	4	3
2)	2	4	5	1
3)	3	2	1	5
4)	2	3	1	4

11. పరమాణు కేంద్రకానికి సంబంధించి కిందివాటిలో సరైన వాక్యం ఏది?
 ఎ) కేంద్రకంలో ధనావేశాలు (ప్రోటాన్లు) ఉంటాయి.
 బి) కేంద్రక పరిమాణాన్ని 'ఫెర్మి' యూనిట్లలో కొలుస్తారు.
 సి) ఒక ఫెర్మి అంటే సుమారు 10^{-13} సెం.మీ.
 డి) పరమాణు పరిమాణం 10^{-8} సెం.మీ. కాగా, కేంద్రక పరిమాణం సుమారు 10^{-13} సెం.మీ.
 1) ఎ మాత్రమే 2) ఎ, బి మాత్రమే
 3) ఎ, బి, సి మాత్రమే 4) ఎ, బి, సి, డి
12. రేడియో ధార్మికతకు ప్రమాణం ఏది?
 1) క్యూరీ 2) రూథర్‌ఫర్డ్
 3) బెక్వరల్ 4) పైవన్నీ
13. కేంద్రకం కిందివాటిలో ఏ కణాలను ఉద్గారం చేసినప్పుడు కొత్త మూలకాలు ఏర్పడతాయి?
 ఎ) α - కణాలు బి) β - కణాలు
 సి) γ - కణాలు
 1) ఎ మాత్రమే 2) ఎ, బి
 3) బి, సి 4) ఎ, బి, సి
14. లుకేమియా వ్యాధి చికిత్సలో వాడే రేడియోధార్మిక ఐసోటోపు ఏది?
 1) ఫాస్ఫరస్-32 2) కార్బన్-14
 3) అయోడిన్-132 4) ట్రీటియం
15. హైడ్రోజన్ రేడియోధార్మిక ఐసోటోపు ఏది?
 1) ప్రోటియం 2) డ్యుటీరియం
 3) ట్రీటియం 4) 2, 3
16. ఏ ప్రక్రియలో X - కిరణాలు ఉద్భవిస్తాయి?
 1) α - ఉద్గారం 2) β - ఉద్గారం
 3) పాజిట్రాన్ ఉద్గారం
 4) ఎలక్ట్రాన్ల పరిగ్రహణ
17. β - కణాల ఉద్గారానికి సంబంధించి సరైన వాక్యాలు ఏవి?
 ఎ) పరమాణు బాహ్య కక్ష్య నుంచి ఉద్గారమవుతాయి
 బి) ప్రోటాన్లు న్యూట్రాన్లుగా మారతాయి
 సి) న్యూట్రాన్లు ప్రోటాన్లుగా మారతాయి
 1) ఎ, బి 2) బి, సి
 3) సి మాత్రమే 4) ఎ మాత్రమే
18. క్యూరీ దంపతులుగా ప్రసిద్ధి చెందిన మేరీ క్యూరీ, పియరీ క్యూరీలకు నోబెల్ బహుమతి సంపాదించి పెట్టిన పరిశోధన ఏ అంశానికి సంబంధించింది?
 1) కాంతి విద్యుత్ ఫలితం
 2) రేడియోధార్మికత
 3) కిరణజన్య సంయోగక్రియ
 4) జీన్ థెరపీ

సమాధానాలు

1) 1; 2) 1; 3) 4; 4) 3; 5) 2; 6) 4; 7) 2; 8) 4; 9) 1; 10) 1; 11) 4; 12) 4; 13) 2; 14) 1; 15) 3; 16) 4; 17) 3; 18) 2;

Rising rental rates force the middle class..



Model Questions

Directions (Q. No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. As more and much people invest their money in savings certificates or money-market funds (1)/ in order to earn higher interest, (2)/ they are abandoning traditional low-interest investment havens (3)/ such as passbook accounts and life insurance policies. (4)/ No error. (5)
2. Rising rental rates force the middle class to use (1)/ far more than the standard 25 percent of their incomes (2)/ for housing, leaving them with know equity (3)/ or tax write-offs to offset the expenditures. (4)/ No error. (5)
3. Astronomers studying(1)/ the newly discovered star (2)/ said that it provides clues about (3)/ our galaxy's origin. (4)/ No error. (5)
4. According to some economists, (1)/ the June decrease in unemployment suggest (2)/ that the gradual improvement (3)/ in the job market is continuing. (4)/ No error (5)
5. The qualities of a great leader are (1)/ coolness in the face of danger, (2)/ an excellent sense of strategy, (3)/ and a ability to plan in minute detail. (4)/ No error. (5)

Directions: (Q. No. 6-10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase given **bold** in the sentence to make it grammatically correct? Mark (5) "No correction required" as your answer, If there is no error.

6. Aging **is a property** of all animals that reach a fixed size at maturity.
 1) was a property
 2) had been a property
 3) was being a property
 4) is being a property
 5) No correction required
7. All-terrain vehicles have allowed vacationers to reach many previously inaccessible areas, but they **have been blamed** for causing hundreds of deaths.
 1) have also been blamed
 2) have been also blamed
 3) have been blamed also
 4) have been blaming
 5) No correction required
8. Although fruit can no longer grow once it is picked, it continues for some time to respire, **taking in oxygen and giving often** carbon dioxide.
 1) taking in oxygen and giving of
 2) taking in oxygen and giving always
 3) taking in oxygen and giving off
 4) taking out oxygen and giving off
 5) No correction required
9. Amateur astronomers with good telescopes **should been able to** see the comet within the next few weeks.
 1) should be able
 2) would be abled
 3) should being able
 4) should belonging
 5) No correction required
10. As the price of oil rises, the prices of bread and livestock feed **sure to increases.**
 1) are sure to increased
 2) are sure to increasing
 3) are sure to be increase
 4) are sure to increase
 5) No correction required

Directions (Q. No. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. The coordination of monetary policy can help ____ the orderly financing of _____imbalances.
 1) facilitate; existing
 2) felicitate; exciting
 3) fend; many
 4) fetch; permanent
 5) promote; promotional
12. __ the objects found in the excavated temple ___ small terra-cotta effigies left by supplicants.
 1) Below; wear
 2) Amongst; where
 3) Between; below
 4) Among; were
 5) Above; was
13. An array of tax incentives ___ to a boom in the construction of new buildings.
 1) have lead 2) has led
 3) have been lead
 4) has been leading
 5) had leads
14. The yellow jacket can sting ____ without dying and ___ potent venom that can cause intense pain.
 1) repeatedly; carries
 2) repetition; carried
 3) repeat; carry
 4) repeats; carrier
 5) repeating; career
15. As envisioned by researchers, commercial farming ____ lobsters will enable fisheries to sell the shellfish year ____.
 1) from; threw 2) of; round
 3) off; through 4) with; around
 5) among; always

Directions (Q. No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. The purpose was twofold: political control and religious communication. Experts believe that there were three types of human sacrifice practiced by the Shang.

B. Finally, in internment sacrifices, young girls were sacrificed. Unlike the first two, they were buried in the standard burial position and their bodies were kept intact.

C. In pit sacrifices, young men were sacrificed. Their bodies were dismembered and they were buried without their personal possessions. In foundation sacrifices, children and babies were used.

D. The practice of human sacrifice was very common in ancient China, particularly during the Shang Dynasty-the first Chinese dynasty with written records.

E. Archaeological evidences show that these human sacrifices experienced violent deaths, and they too were buried without possessions.

F. In fact, archaeological evidence suggests that human sacrifice was practiced on a grand scale during the Shang dynasty.

16. What is the FIRST sentence after rearrangement?
 1) C 2) B 3) D 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
 1) A 2) B 3) D 4) F 5) C
18. What is the FOURTH sentence after rearrangement?
 1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIFTH sentence after rearrangement?
 1) B 2) C 3) D 4) E 5) F
20. What is the SECOND sentence after rearrangement?
 1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. No. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Dwarf planet Ceres continues to ___ (21) scientists as NASA's Dawn spacecraft gets closer to being captured into orbit around the object. The ___ (22) images from Dawn, taken nearly 29,000 miles (46,000 kilometers) from Ceres, reveal that a bright spot that stands out in previous images ____ (23) close to yet another bright area. As scientists receive better and _____ (24) views of the dwarf planet over the next 16 months, they hope to gain a deeper understanding of its origin and evolution _____ (25) studying its surface. The intriguing bright spots and other _____ (26) features of this captivating world will come into ____ (27) focus. Dawn visited the giant asteroid Vesta ____ (28) 2011 to 2012, delivering more than 30,000 images of the body along with many other measurements, and providing insights about its composition and geological history. Vesta has an average diameter of 326 miles (525 kilometers), while Ceres has an average diameter of 590 miles (950 kilometers). Vesta and Ceres are the ___ (29) most massive bodies in the asteroid belt, located _____ (30) Mars and Jupiter.

21. 1) puzzle 2) question 3) answer 4) doubt 5) propose
22. 1) later 2) latest 3) recently 4) frequently 5) presently
23. 1) lay 2) lain 3) lies 4) lays 5) laid
24. 1) batter 2) good 3) best 4) better 5) bought
25. 1) for 2) from 3) with 4) among 5) by
26. 1) interesting 2) annoying 3) disturbing 4) distributing 5) presently
27. 1) sharer 2) sharper 3) shaver 4) sharp 5) severe
28. 1) with 2) by 3) from 4) for 5) above
29. 1) to 2) too 3) toe 4) two 5) type
30. 1) beyon 2) besides 3) in front of 4) in addition to 5) between

Directions (Q. No. 31-35): Choose the word which is wrongly spelt from the five options given.

31. 1) misanthrope 2) misogynism 3) misappropriation 4) mismatch 5) mistake
32. 1) commission 2) apportion 3) succesion 4) concession 5) profession
33. 1) adjudicte 2) judicious 3) combat 4) demur 5) elope
34. 1) flamboyant 2) genuine 3) hinderance 4) innocuous 5) germane

Answers

1) 1; 2) 3; 3) 3; 4) 2; 5) 4; 6) 5; 7) 1; 8) 3; 9) 1; 10) 4; 11) 1; 12) 4; 13) 2; 14) 1; 15) 2; 16) 3; 17) 1; 18) 2; 19) 4; 20) 5; 21) 1; 22) 2; 23) 3; 24) 4; 25) 5; 26) 1; 27) 2; 28) 3; 29) 4; 30) 5; 31) 2; 32) 3; 33) 1; 34) 3;